శ్రీఅవధూతాయ నమః

అధ్యాయము

# 1 సా ధ న ర హ స్య ము

ఎక్కువ ప్రాధాన్యము ఐహికాని కివ్వాలా, లేక పరమార్థాని కివ్వాలా? అనే ప్రశ్న జీవితములో ఆస్తికు లందఱికి కల్గుతుంది. పరిస్థితులకు లొంగి ఐహికానికే ప్రాధాన్య మిచ్చేవారు తాము బంధాలలో చిక్కుకుంటున్నా మని బాధపడతారు. ముసలితన మొచ్చాక పరమార్థము సాధించుకోవచ్చునుకున్నవారికి నానాటికీ బలపడిన వాసనలు వృద్ధాప్యంలో పరమార్థ సాధనకు అడ్డువస్తాయి. మొదటినుండే పరమార్థానికి ప్రాముఖ్య మివ్వజూచేవారు తమ లౌకికి బాధ్యతలు మరచి, బాధలకు గురియై భార్యబిడ్డలు అడ్డమొస్తున్నా రని భ్రమిస్తారు. వారిని క్రమశిక్షణ పేరిట హింసించడమో, వైరాగ్యముపేరిట పట్టించుకోకపోవడమో చేస్తారు. ఇదొక జీవిత సమస్య. ప్రతి వ్యక్తి తన బాధ్యతను గుర్తించి, సాటివారి శ్రేయస్సుకు తగినట్లు తమ యిష్టాయిష్టాలను ధర్మంచేత కట్టుబాటు చేసుకోవాలని సమాజము నిర్భందిస్తుంది. కానీ వ్యక్తులు తమ యిష్టాయిష్టాలకు ప్రాముఖ్య మివ్వజూస్తారు. ఇందువలన యేర్పడే సంఘర్షణ జీవితంలో యెదురయ్యే మఱొ సమస్య.

ఈ సమస్యలకు పరిష్కారమే సంస్కృతి యనే జీవనకళ. ప్రతీ జీవికి జన్మతః వుండే శారీరక, మానసిక సామర్థ్యాలు సంపూర్ణముగా వికసించడము, అట్టి వికాసము పొందిన సంతతిని జాతియొక్క పురోగమనంకోసము అర్పించడమే ప్రకృతియొక్క లక్ష్యము. ఈ సత్యాన్ని గుర్తించి కృషిచేయకుంటే వ్యక్తి, సమాజంకూడ తారుమా రవుతాయి. విశేషమైన సహజ ప్రతిభ వలన అట్టి వికాసము చెందిన మహనీయుల నుండి అట్టి అవగాహన, క్రమశిక్షణ ప్రతివారూ పొందవల్సినదేనని అన్ని మతాలూ చెబుతాయి. దీనినే ధర్మ మని హిందూమతం, శీల మని బౌద్ధ - జైనమతాలు, మార్గము అని క్రైస్తవము మఱియు తావో మతాలు, షరియత్ అని ఇస్లాము వ్యవహరించాయి.

ఇట్టి క్రమశిక్షణ నిచ్చే జీవిత విధానమే మహర్షు లేర్పరచిన బ్రహ్మచర్యము మొదలగు 4 ఆశ్రమాలు. అపుడు ఐహికము, పారమార్థికము పరస్పర విరుద్ధా లవవు. పరమార్థానికి సాధనంగా ఐహిక జీవితాన్ని, జాతి యొక్క ఐహిక జీవితాన్ని వుత్తమంగా తీర్చిదిద్దగల పథకంగా ఆధ్యాత్మిక జీవితమూ నిలిచాయి. అందుకే చరిత్రలోని ప్రాచీన నాగరికత లన్నీ నశించినా, భారతీయ సంస్కృతి మాత్రము యెన్నో సంవత్సరాలనుండి నిర్దుష్టంగా నిలిచింది. పూర్ణజ్ఞాను లైన 'గురువు' లేక 'ఆచార్యు' లను ఆశ్రయించి క్రమశిక్షణ పొందే సంప్రదాయం శిథిల మయ్యాకనే మన సంస్కృతి యొక్క పతన మారంభమైనది. సమైక్యమైన జ్ఞానదృష్టికి బదులు వ్యక్తిగతమైన దురభిమానాల వలన విభిన్న సంప్రదాయా లేర్పడి మతం పేరిట యెంతో వినాశకాండ జరిగింది.

ఒకేకాలంలో యెందఱో జ్ఞానులైన గురువు లున్నా, వారి శిష్యుల మధ్య యెట్టి వైరుధ్యాలూ ప్రాచీన కాలంలో రాకపోవడమే ఆశ్చర్యము. ఒకానొక ఉత్తమ సాంప్రదాయమే యిందుకు కారణము. తేనెటీగ వేఱువేఱు పువ్వుల నుండి తేనె గ్రహించినట్లు జ్ఞానప్రియుడైన శిష్యుడుగూడ అనేకమంది గురువుల నుండి జ్ఞాన మార్జించాలని గురుగీత చెబుతుంది. ప్రతిజ్ఞానీ తన శిష్యులను యితఱ గురువుల నుండిగూడ జ్ఞానమార్జించాలని ఆదేశించేవారు. శ్రీకృష్ణుడు అర్జునుణ్ణి గీత (4:34)లొ అలానే ఆదేశించాడు. రఘువంశానికి గురువైన వశిష్ఠుడు శ్రీరాముణ్ణి విశ్వామిత్రునితో పంపమని దశరథుణ్ణి ఆదేశించాడు. వ్యాసుడు శుకుణ్ణి జనకమహారాజు వద్దకు పంపాడు. రాముడు అరణ్యములోని ఋషు లందఱినీ సేవించాడు. భాగవతం 11వ స్కంధములో అవధూత 24 మంది గురువులనుండి జ్ఞాన మార్జించాడు. ఇందువలన వేఱ్వేఱు గురువుల రూపాలు, విధానాలు వేఱు జాతుల పువ్వుల లాగా స్థూలదృష్టికి భిన్నంగా కనిపించినా వారందఱిలో వున్న జ్ఞాన మనే తేనె ఒక్కటే నన్న వివేకం శిష్యులకు కల్గుతుంది. అపుడే సంప్రదాయ భేదాలు, తగువులూ వుండవు. ' ఆనోభద్రా క్రవతోయన్తు విశ్వతః ' అనగా ఉత్తమమైన భావాలు మాకు అన్ని దిక్కులనుండి లభించుగాక! అన్నదే ఋషుల ప్రార్థన.

ఇలా అనేకమంది మహనీయులను సేవించగల్గా లంటే మొదట యీ సూత్రమెంత ప్రశస్తమైనదో తెలిసి, దానిపట్ల అత్యంత శ్రద్ధ కలగాలి. తరువాత పూర్ణులైన మహనీయు లెలా వుంటారో తెలుసుకోగలగాలి! లేకుంటే ఆధ్యాత్మవిద్యపై ఆశతో మహనీయుల మని చెప్పుకొనే ప్రతివారినీ నమ్మి సేవించి అన్నివిధాలా ప్రక్కదారిపట్టే ప్రమాద ముంటుంది. అందుకే మనలో యిలాంటి సంస్కారము దృఢంగా నాటుకోడానికి వ్యాసుడు 'భాగవతం' లో అనేకమంది మహనీయుల చరిత్రలను పొందుపఱిచాడు. తమిళదేశంలో 'పెరియపురాణ' మనే గ్రంథంలో అఱువైమూర్గురు శైవసిద్ధుల గురించి భక్తులు చదువుతారు. అలాగే 'ఆళ్వారులు' అనే 12మంది మహాత్ముల చరిత్రలు పారాయణ చేస్తారు. మహనీయులు మరణానికి అతీతులు గనుక వారి చరిత్ర భక్తితో పారాయణ చేసేవారికి వారి అనుగ్రహంగూడ నేటికీ లభిస్తుంది. ఇక యేడురోజులలో

మరణించనున్న పరీక్షిత్తుకు అందుకే శుకయోగి వేఱొక సాధన చెప్పక భాగవత శ్రవణంమాత్రమే చేయించారు. విజయానందు డనే సన్యాసి మరణించనున్న రోజులలో శిరిడీసాయి కూడా ఆతని తరింపుకు భాగవత పారాయణ చేయించారు.

ఈ వుత్తమ సత్యాన్ని గుర్తించకుంటే శుకుడు, సాయిబాబాల కంటే మనకు యెక్కువ తెలుసునని భ్రమించి అనేకమంది మహాత్ముల చరిత్ర పారాయణ మనే సాటిలేని సాధనమును మనము అలక్ష్యము చేస్తున్నాము. మహాత్ముల చరిత్రలు మఱియు బోధనలు శ్రద్ధతో పారాయణ చేయడం వారి ప్రత్యక్ష సాన్నిధ్యంతో సమాన మని శ్రీరమణమహర్షిగూడ చెప్పారు. వెంకయ్యస్వామి కూడా శ్రీపోతులూరి వీరబ్రహ్మంగారి చరిత్ర వంటివి చదవమని ఒక భక్తునితో చెప్పారు. వీరబ్రహ్మంగారు గూడ తాము దత్తావతారమని 'కాలజ్ఞానం'లో వ్రాశారు. రెండవ దత్తావతారమైన శ్రీనృసింహసరస్వతీస్వామి తమగురించి 'శ్రీగురుచరిత్ర' గ్రంథ రూపంలో తామే వుంటా మని, అది పారాయణ చేసినవారికి ఇహపర శ్రేయస్సు, తమ అనుగ్రహము తప్పక కల్గుతాయని ప్రమాణము చేసి చెప్పారు. ఇతఱ మతాలలోగూడ యీ సాంప్రదాయమే వున్నది. బైబిల్ మఱియు ఖురాన్‌లలో యెక్కువ భాగము ఆయా జాతులలో వెలసిన 'ప్రవక్తలు' అనబడు మహనీయుల చరిత్ర లుంటాయి. అందుకే ఆయా మతస్థులు వాటిని శ్రద్ధతో చదవాలని విధించారు.

కానీ యీనాడు వివిధ మహాత్ములను సేవించే భక్తుల మధ్య వైషమ్యా లేర్పడుతున్నాయి : కారణము? కలి ప్రభావంవలన యీ కాలంలో ఆత్మజ్ఞానం లేకనే ధనము, కీర్తి మొదలగునవి ఆశించి యెందఱో గురువులుగా చెలామణి అవుతారని పురాణాలన్నీ హెచ్చరించాయి. అట్టివారికి తమ వ్యక్తి ప్రాముఖ్యతే లక్ష్యము. అందుకే వారు తమ 'శిష్యులను' యితఱ మహాత్ములను దర్శించ రాదని, సిసలైన మహాత్ము లెలా వుంటారో తెలిపే చరిత్ర గ్రంథాలను చదువ రాదనీ ఆదేశిస్తున్నారు. వారివారి పత్రికలలోనూ, గ్రంథాలలోనూ వారుదప్ప దేశంలో మహాత్ములేలేనట్లు, వారి గురించేతప్ప సమకాలికులైన యితఱ మహనీయులగురించి ప్రచురించరు. ఇందువలన అటువంటి 'గరుభక్తుల' మధ్య పోటీలు, పంతాలు పెరిగి సంకుచిత తత్త్వము నాటుకొంటున్నది. నిజమైన సద్గురువులు అలాగాక యీనాటికీ సనాతన సాంప్రదాయాన్ననుసరిస్తున్నారు. శ్రీసాయిబాబా జీవిత చరిత్ర చూస్తే యెందఱు మహనీయులు తమ శక్తులను సాయిబాబా వంటి యితఱ మహనీయుల వద్దకు పంపేవారో తెలుస్తుంది. ఆంధ్రదేశంలో మన కీనాడు యెదురౌతున్న సంకుచితత్త్వము అందుకే మహారాష్ట్రలో కనిపించదు. అక్కడ తమోగుణంతో గూడిన పరస్పర ద్వేష భావానికి బదులు సాత్వికమైన సమభావము కనిపిస్తుంది. సద్గురువు లందఱి రూపాలలోను త్రిమూర్తులు మఱియు పరబ్రహ్మముమాత్రమే వున్నాయని గురుధ్యానశ్లోకం తెలిపే సత్యం వారి హృదయాలకు హత్తుకున్నది.

అందఱి యెడలా సమానమైన ప్రేమ, వేర్వేఱు సిద్ధాంతాలపట్ల సమన్వయదృష్టి, సాధుసజ్జను లందఱి యందు పూజ్య భావమూ, సర్వజీవుల హితము కోరి కృషి చేస్తుండటము- ఇవన్నీ సత్త్వగుణ ప్రధానమైన దైవీసంపదలో ముఖ్యాంశాలు. అట్టి దైవీసంపద లేకుంటే మనము చేసే యజ్ఞదానతపఃకర్మలు సరియైన ఫలితమివ్వజాలవని భగవద్గీత చెబుతుంది. అటువంటప్పుడు 'శ్రీఅవధూత వెంకయ్యస్వామి వారి చరిత్రలో యితఱ మహాత్ముల ప్రస్తావన చేయకూడదని స్వామి సమాధి వద్ద ' గురుచరిత్ర ' 'శ్రీసాయిబాబా జీవితచరిత్ర' వంటివి పారాయణ చేయకూడదని వారిగూర్చి భజన చేయకూడదని యిటీవల శ్రీవెంకయ్యస్వామి ఆశ్రమంలో కొందఱు రేకెత్తించిన అభిప్రాయము ఆధ్యాత్మికంగా యెంత దుష్టమైనదో చరిత్ర పొడుగునా మన ప్రాచీన సంస్కృతికి యెంత హాని చేసిందో అందఱూ గనించాలి. పరస్పర విరుద్ధమైన యిట్టి భావాలమధ్య వూగులాడుతున్న ఒక ఆశ్రమ నిర్వాహకునికి 'నీవు ఒంగోలుకు వెళ్లు!' అని స్వామి స్పష్టంగా ఆదేశించారట. ఈ విషయములో పైన వివరించిన సనాతన సిద్ధాంతాన్ని స్వామిగూడ బలపర్చారన్నమాట.

అంటే యీ గ్రంథ రచనావిధానాన్ని, ఈ ఆధ్యాత్మసూత్రాన్ని అంగీకరించమని స్వామి ఆదేశించారన్న మాట, మొదట అందుకే విరుద్ధమైన భావాన్ని ఆమోదించి, 'అవధూతలీల' గ్రంథాన్ని అట్టి పొరపాటు రీతిన యితఱ మహాత్ముల ప్రస్తావనలు ఆ గ్రంథమునుండి తొలగించి తిరిగి వ్రాయమని పెసల సుబ్బరామయ్యను ఒక ఆశ్రమ నిర్వాహకుడు కోరి, 'నీకట్టి స్ఫూర్తి నిమ్మని స్వామిని ప్రార్థించాను' అని చెప్పాడు. సుబ్బరామయ్య అట్టి ప్రయత్నము చేయడానికి అంగీకరించిన క్షణమునుండి అతని ఆరోగ్యము దెబ్బతిని 4 రోజులు నిద్రాహారాలు గూడా అసాధ్యమయ్యాయి. ' నేను తిరిగి రాయాలని మీ సంకల్పమైతే నేటిరాత్రి నా బాధ తగ్గి నిద్రపట్టాలి' అని అతడు ప్రార్థించినా స్వామి పల్కలేదు. అంతటితో సంప్రదాయానుసారము నేనీ గ్రంథము తిరిగి వ్రాసే పద్ధతిని స్వామి సంపూర్ణంగా ఆమోదించి, దీనిని వ్యతిరేకించిన అభిప్రాయాన్ని అంగీకరించలేదని స్పష్టమైనది. అట్టి స్వామి అభిప్రాయాన్ని వేదవాక్కుగా తలచి మనము అమలు చేయకుంటే మనము స్వామి భక్తులమే గాదు; మన దురహంకారానికి, విద్యా గర్వానికి, మౌఢ్యానికి మాత్రమే దాసులమన్నమాట! మనలోని రాజసికము, తామసికమూ అయిన ఆసురీ సంపదలకే దాసులమన్నమాట. స్వామి సన్నిధిలో మనముండటము, 'ఆలయంలో దేవుడు', 'ఆలయంపై కోతులు', 'దీపం చుట్టూ వెలుగు', 'దీపం క్రింద చీకటి', 'ఎక్కడనుంచో వచ్చిన తేనెటీగ తామరపువ్వులోని తేనె త్రాగిపోతుంటే దాని క్రిందనే వుండే గోదురుకప్ప పురుగులకోసం నాలుక చాస్తుంది' అన్న నానుడులు మన విషయములో సార్థకమౌతాయి.

ఇక మనము బాగుపడేదెలా? మనమెలా వున్నా స్వామి సన్నిధే మనల్ని బాగుచేస్తుంది అనుకోవడము భ్రమ. 'పోయేవారిని పోనిచ్చేదే గదయ్యా!' అన్నదే స్వామి పద్ధతి. ఇట్టి జాగ్రత్తలతో మనకు మనమే

వుద్ధరించుకోవాలి. అటువంటి శ్రద్ధ కలిగినవారికే జ్ఞానము లభిస్తుంది అని, అట్టివారికి మాత్రమే ఆధ్యాత్మిక రహస్యము బోధించాలని భగవద్గీత స్పష్టంగా చెబుతుంది. సాయిబాబాగూడ 'నేను ఒకటి రెండుసార్లు హెచ్చరిస్తాను; వినకుంటే నీ కర్మకు నిన్ను విడుస్తాను' అన్నారు. ఇలా శ్రద్ధతో గురువు ననుసరించగలవారు మాత్రమే పాడుగునా చెట్టునంటిపెట్టుకొని వున్న మామిడికాయ వలె పండి పరమార్థము పొందుతారని మిగిలినవారు మధ్యలో రాలిపోయే పిందెలు మఱియు పూతల్లాగా విఫలులౌతారనిగూడా ఆయనే చెప్పారు. మన మెంతకాలము వారి సన్నిధిలో వున్నా; ఈ సూత్రము తెలియకుంటే స్వామికూడ మన మెట్టి శ్రేయస్సు పొందలేకున్నా మన్నది స్పష్టమేగదా'!

మహాత్ము లందఱికీ పరస్పరము యెంత ప్రేమ వుంటుందో తెలిస్తే యితఱ మహాత్ములపట్ల మనము అసహనము వహించినప్పుడు మహాత్ములకు మనపై యెంత అసహ్యం కలుగుతుందో వూహించుకోవచ్చు. ఈ విషయము శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర చదివితే స్పష్టంగా తెలుస్తుంది. సరియైన భావంతో మన సద్గురువును సేవిస్తూవుంటే మహాత్ము లందఱి ఆశీస్సులూ మనకు లభిస్తాయి. మానవజన్మ, బుద్ధి, ధర్మము, భక్తి, మహాత్ముల సాన్నిధ్యము లభించడ మెంత కష్టమో తెల్పే స్వామి వాక్యము యీ గ్రంథంలో చూస్తాము. ఇవన్నీ లభించినా, స్వామి అభీష్టం ప్రకారము నడుచుకొనక మహాత్ములందఱి పట్లా సంకుచితబుద్ధి వహిస్తే అంతా వ్యర్థమైపోతుందని గుర్తించాలి. ఇట్టి అసద్భావమే కలి ప్రభావము. దానికి లొంగినవారు దాని రూపాలే అవుతారు.

పూర్ణులైన మహాత్ముల మధ్య నుండే ప్రేమ, వారి భక్తుల పట్లగూడా వారికి వుంటుంది. ఎప్పుడూ తెల్లని కోరావస్త్రములే ధరించే సాయి ఒకరోజు భక్తులతో 'మేమీరోజు కాషాయం ధరిస్తాము' అన్నారుగాని వాళ్ళు సమర్పించిన కాషాయం ధరించలేదు. కాసేపటికి గురుఘోలవ్ స్వామి యనే మహాత్మునికి శిష్యుడైన మూలేశాస్త్రి వచ్చాడు. కానీ అతడు సాయి ముస్లిం అని శంకించాడు. అపుడు సాయి అతనికి కాషాయధారి యైన అతని గురువు రూపంలో దర్శనమిచ్చి, అతని మనస్సును సంస్కరించి అనుగ్రహించారు.

గురుసిద్ధారూఢులు మొదలయిన మహాత్ముల శిష్యులు శిరిడీ వచ్చినపుడు భక్తులందఱికీ సాయి పండ్లు పంచి, ఆ భక్తుని చూపి 'ఇతడు ఒక గొప్ప మహాత్ముని దర్బారుకు చెందినవాడు' అన్నారు. వారి సమకాలికుడైన అక్కల్‌కోటస్వామి, తాజుద్దీన్‌బాబా, హజరత్ బాబాజాన్, నరసింగ్‌మహరాజ్ వంటి మహాత్ముల గురించి ఆయనెంత ప్రీతితో, గౌరవంతో మెసిలేవారో! అక్కల్‌కోటస్వామి శిష్యులైన ఒకరు ఆనందనాథ్, దేవీదాసు, జానకీదాసు, గంగగిర్, హజరత్ బన్నేమియా, షంసుద్దీన్‌మియా, అమీరుద్దీన్‌గార్లు, రామ్‌మారుతీ మహరాజ్, గజానన్ మహరాజ్, ధునీవాలా దాదా మొదలైన మహాత్ములూ సాయిని ప్రేమతో దర్శించారుగూడా! మహాత్ములకు పరస్పరం వుండే ప్రేమ, సాయిపై వారికి గల గౌరవమూ అలాంటివి. ఈ సూత్రము నేటికీ నిత్యసత్యమే.

అవధూతలు చివటం అమ్మ, వెంకయ్యస్వామి, మాయీ అమ్మ, రామిరెడ్డి తాత, అనసూయమాత, పూండీ, చీరాల, కడప, కాళహస్తిలలోని అవధూతలు, శ్రీగులవణి మహరాజ్, శ్రీగజాననమహరాజ్, రంగన్నబాబు, పాలకపాటి గురువుగారు మొదలయినవారు సాయి నెలా ప్రశంసించారో, ఆయనను సేవించే నన్ను, సాటి సాయి భక్తులనూ యెలా ఆదరించారో, 'శ్రీసాయిబాబా జీవిత చరిత్ర'లో చూడవచ్చు. అత్తార్ అను సూఫీ మహాత్ములు అలానే ఆ సాంప్రదాయములోని మహాత్ముల చరిత్రలు వ్రాశారు.

ఈ విషయంలో వెంకయ్యస్వామి ఆచరించి చూపిన యీ ఆధ్యాత్మికసూత్రాన్ని కొంచెం ఆలోచించడము సముచితము. అది వారు విద్యానగర్ సాయిబాబా మందిరానికి రావడమే. ఆ వివరము మీరు యీ గ్రంథంలో చదువబోతారు.

సాయిబాబాపట్ల భక్తి, 'శ్రీగురుచరిత్ర', 'శ్రీసాయిబాబా జీవిత చరిత్ర' ల పారాయణలే చి. సుబ్బరామయ్యకు శ్రీస్వామివారి సన్నిధిలో స్థిరంగా వుండి సేవ చేసుకునే అవకాశము, స్వామిలీలలు సేకరించే మహాభాగ్యము గూడా అతనికి ప్రసాదించాయి. వాటినిగూర్చి యిట్టి ఆధ్యాత్మిక రహస్యాలతో కలిపి యీ గ్రంథము వ్రాసే అవకాశము సాయి సేవకుడనైన నాకు అనుగ్రహించడములో తమ భక్తులుగూడ అనేకమంది మహాత్ముల చరిత్రలు, బోధలూ పఠించి వుత్తమ సంస్కారాన్ని పొందాలనే స్వామి సంకల్పమై వుండాలి. లేకుంటే అదీ నాకే యెందుకు అనుగ్రహించాలి? ఇతఱ మహాత్ములపట్ల సంకుచితదృష్టి, మౌఢ్యం గలవారికే యిట్టి అవకాశము కల్పించి యుండవచ్చు గదా! ఆయన ఒక్కరేగాదు. శ్రీఅక్కల్‌కోటస్వామి, హజరత్ తాజుద్దీన్‌బాబా, శ్రీగజానన్ మహరాజు, చివటం అమ్మ మొదలైన మహనీయులుగూడ తమ చరిత్రలను వ్రాసే భాగ్యము నాకు ప్రసాదించడములో గల కారణమిదే.

శ్రీసాయికి, శ్రీస్వామికి గల సన్నిహితమైన అనుబంధము మఱియు ఆదరణ లెరిగిన ఆనాటి స్వామిభక్తులు తమకై తామే శ్రీసాయిబాబా చిత్రపటము తెచ్చి ఆనాడు స్వామిసన్నిధిలో కుటీరంలో వుంచారు. వారు మహాసమాధి చెందాకగూడ వారి సమాధివద్ద వారి పటంతోపాటు సాయిపటంగూడా నాటి భక్తులే పెట్టుకున్నారు. ఆ సన్నిధిలో యెందఱో భక్తులు 'శ్రీసాయిబాబా జీవిత చరిత్ర', 'శ్రీగురుచరిత్ర' పారాయణ చేసుకునేవారు. కానీ వారిలో యెక్కువమందికి స్వామి ప్రసాదించిన యిట్టి విశాలదృష్టి, సత్యం, కల్పమూ పైపూతగా మాత్రమే అలవడిందిగాబోలు. అందుకే అది సంకుచితదృష్టి ప్రభావం వలన చెదిరిపోయింది. వీరు ' తిరుపతిలో శ్రీవేంకటేశ్వరుణ్ణి ఆ పేరుతో పిలుస్తాముగాని 'సాయి' 'దత్త' అని పిలువముగదా! నిన్ను నీ పేరుతో పిలిస్తే పలుకుతావుగాని మఱొ పేరుతో పలుకవుగదా!' అని అంటారు. తిరుపతిలో నిత్యమూ వేంకటేశ్వరస్వామిని మేల్కొలిపేటప్పుడు మొదట 'కౌసల్యా సుప్రజారామా!' అని శ్రీరాముని పేరుతో సంబోధిస్తారు.

అది విన్నాకగూడ వీరికెందుకు కనువిప్పు కల్గదో! ఇందుకు కారణముగూడా వీరికి తెలియదు, అజ్ఞులైన మానవులు తమ నామరూపాలే తామని భ్రమిస్తారు గనుకనే వారి పేరుతో పిలిస్తేనే పలుకుతారు. స్వామిగూడ అలాంటివారేనని యీ భక్తాగ్రేసరుల అభిప్రాయం! స్వామి భగవంతుడన్న విశ్వాసముగూడ వీరికి లేదు. లేకుంటే భగవంతునికి నామమే లేదు. అనంతకోటి నామాలు వున్నాయి గదా! ఋషులు భగవంతుణ్ణి సహస్రనామాలతో కీర్తించారుగదా! సాయి అన్న నామము గూడ భక్తులు ఆ మహనీయునికి పెట్టుకొన్నదే. వారికసలు పేరే లేదని చరిత్ర చూస్తే తెలుస్తుంది. ఆ పేరుకు మహాత్ముడు, తండ్రీ అని మాత్రమే అర్థము, ఇది యే మహాత్ముడికైనా వర్తించేదేగదా! అపుడు స్వామిని సాయి, దత్త అన్న నామాలతో కీర్తిస్తేనేమి? ఇట్టి సంకుచితదృష్టితో చూస్తే వెంకయ్యస్వామి భూమిమీద అవతరించిననాడే ఆయనకు తల్లిదండ్రులు వెంకయ్య అని శ్రీవేంకటేశ్వరుని పేరుపెట్టారు. స్వామి సన్నిధిలో ఆ పేరు స్మరించినా తిరుపతి వేంకటేశ్వరుని స్మరించినట్టేగదా!

భగవంతుని సంపూర్ణంగా విశ్వసించి నిరంతరమూ గుర్తుంచుకొని మన జీవిత మంతటినీ ఆయనకు తృప్తికరమైన రీతిన గడుపుకోవడమే సర్వమతాల సారమున్నూ. దీనిని సంపూర్ణంగా సాధించినవారే మహాత్ములు. ఆ స్థితి సాధించాకనే దుఃఖము శాశ్వతంగా అంతమొందగలదని అన్ని మత గ్రంథాలేగాక, మహాత్ము లందఱూ చెబుతున్నారు. ఎట్టి దుఃఖము, అసంతృప్తి లేకుండా వుండగల్గాలనే జీవులన్నీ కోరేది. కానీ దానిని సాధించే మార్గమెంతో సూక్ష్మమైనది. అది తెలియాలంటే దానిని తెలిసి సాధించిన వారిని ఆశ్రయించాలి. కానీ వారినాశ్రయించినా వారు మన కివ్వదలచినదంతా మనము పొందగలగాలంటే వారిని సేవించే పద్ధతికూడా తెలియాలి. అదిగూడా పూర్ణుడైన గురువును సరియైన పద్ధతిన సేవించి వారి అనుగ్రహంతో ఆత్మజ్ఞానము పొందిన మహాత్ములే మనకు తెల్పాలి. అది తెలియకుంటే చెట్లకు పూచినపూతలో యెక్కువ భాగము రాలియిపోయినట్లే మనకు లభించిన సద్గురువు నుండి మనముకూడా మధ్యలో రాలిపోతాము. అంటే మన సేవతో మన మాశ్రయించిన మహాత్ముడు సంప్రీతుడు కాలేదన్నమాట.

సాధకుడు సద్గురువు నాశ్రయించడము యెంత ముఖ్యమో గమనించాము. ఈ కలికాలంలో ధనము, కీర్తి మొదలయినవి ఆశించి ఆత్మజ్ఞానము పొందకనే సద్గురువులుగా ప్రకటించుకొనే వారెందరో వుంటారని పురాణాలన్నీ హెచ్చరించాయి. ఒకవేళ పూర్వపుణ్యంవలన సద్గురువు దర్శనము లభించినా ఆయన మన పూర్వజన్మ సంస్కారానికి తగివుంటేనే వుత్తమ ప్రయోజనము కల్గుతుంది. ఈ సద్గురువులలోగూడా వుత్తమోత్తమశ్రేణికి చెందినవారు మాత్రమే సాధకునితో 'నీ గురువు ఫలానావారు. నీవు వారిని ఆశ్రయించాలి' అని నిర్దుష్టంగా చెప్పగలరు. ఉదా॥ అక్కల్‌కోట స్వామి కొందరు భక్తులను సాయిబాబా నాశ్రయించమని,

కొందఱిని శ్రీరామమారుతీమహరాజ్‌ను ఆశ్రయించమనీ ఇలా చెప్పేవారు. శ్రీతాజుద్దీన్‌బాబా తమను దర్శించిన బాపూసాహెబ్ బూటీతో ' నీ గురువు శిరిడీలో వున్నారు. త్వరగా వెళ్లు. నీ విషయములో కలుగజేసుకోవడానికి నేనెవరిని?' అన్నారు. ఇలాంటి సద్గురువులుగాని, లేక యిష్టదైవం సాక్షాత్కరించి గాని మనమెవరిని ఆశ్రయించాలో చెబితేగాని పూర్వసంస్కారానికి తగిన సద్గురు వెవరో మనము తెలుసుకోలేము. శ్రీరామకృష్ణపరమహంస తనకు అద్వైతానుభూతి ప్రసాదించమని తమ యిష్ట దైవమైన కాళికామాతను ప్రార్థిస్తే ఆమె 'నీకోసమే తోతాపురి యనే వేదాంత గురువును యిక్కడకు రప్పించాము. నీవు ఆయన వద్ద దీక్ష తీసుకో!' అని చెప్పింది. తోతాపురి వద్ద దీక్ష తీసుకోగానే పరమహంసకు మూడురోజులపాటు వుత్తమమైన నిర్వికల్పసమాధి అనుభవమైంది. కానీ పామరులైన మనకు యిష్టదేవతా సాక్షాత్కారము పొందడానికి గూడ సామర్థ్యము లేదు. గత జన్మలలోనే యెంతో సాధన చేసి వుంటేగాని యీ జన్మలో అది సాధ్యపడదు. ఉదా : ఏడు సంవత్సరాల బాల్యంలోనే శ్రీరామకృష్ణపరమహంస ఒకరోజున ఆకాశంలో కారుమేఘాలు, వాటిక్రింద తెల్లని కొంగలబారు చూచాడు. కారుమేఘం శ్రీకృష్ణుడుగాను, ఆ కొంగలబారు ఆయన మెడలో ముత్యాలహారంగాను తోచి సమాధిస్థితి కల్గింది. అంతటి సంస్కారవంతుడికే 12 సంవత్సరాలు నిరంతరము కృషిచేస్తేనేగాని కాళీమాత దర్శనము కాలేదు.

మనవంటి పామరులు ' శ్రీగురుచరిత్ర' పారాయణ చేస్తూ తగిన సద్గురువును ప్రసాదించమని ప్రార్థిస్తుంటే శ్రీదత్తాత్రేయుడు స్వప్నదర్శన మిచ్చి మన మాశ్రయించవల్సిన గురువును మనకు తెలుపుతారు. ఉదా॥ 'శ్రీగురుచరిత్ర' పారాయణ చేసిన యెందరికో శ్రీఅక్కల్‌కోటస్వామి, శిరిడీసాయిబాబా మొదలైన సద్గురువులను ఆశ్రయించమని దత్తస్వామి ఆదేశించారు. మహారాష్ట్రలోని మాణ్గాంకు చెందిన వాసుదేవశాస్త్రితో ఆయన 'నీవు నరసోబావాడిలో వున్న గోవిందస్వామిని ఆశ్రయించు' అని చెప్పారు. ఈ వాసుదేవశాస్త్రి సద్గురు కృపవలన మహాత్ములయ్యాక శ్రీరంగావధూతవంటి వారెందఱో 'శ్రీగురుచరిత్ర' పారాయణ చేస్తుంటే శ్రీవాసుదేవానంద సరస్వతిస్వామిని ఆశ్రయించమని దత్తస్వామి చెప్పారు. ఇట్టి దివ్య సందేశాన్ననుసరించి సద్గురువును ఆశ్రయించిన వారందఱూ మహాత్ములయ్యారు. కారణము యీ గ్రంథ పారాయణవలన అట్టి సద్గురువును సేవించే విధానము, సేవించగల సామర్థ్యంగూడా మనలో కల్గుతుంది. ఈ పద్ధతి ననుసరించిమాత్రమే సద్గురువు నెన్నుకోవడము వుత్తమము. మన కట్టి భాగ్యము కలిగేలోపల మహాత్ముల దర్శనంవలనగూడా యెంతో మేలు జరుగుతుంది.

మహాత్ములను సేవించడ మెలాగో తెలుసుకోకుంటే మనము రెండువిధాల పొరబడతాము. 1. మనమెల్లకాలము మహాత్ముల దయవలన మన కోర్కెలన్నీ తీర్చుకుంటూ వుండవచ్చుని, కష్టా లన్నీ

తొలగించుకోవచ్చనీ అంతకుమించి వారినుండి జ్ఞానము సంపాదించి దాని నాచరించనక్కఱ్లేదనీ భ్రమస్తాము. మనము చేసే పుణ్యపాపాలవలన పుణ్యాలు, పాపాలు చేస్తాము. అందఱిలోను అన్నింటిలోను ఒకే భగవంతుడున్నాడని గుర్తించలేనందువల్ల కొన్నింటిపై ద్వేషము, కొన్నింటిపై రాగము వహిస్తాము. అంటే జ్ఞానమువలన రాగద్వేషాలు వాటివలన పుణ్యపాపాలు, వాటివలన జన్మల పరంపర, ప్రతి జన్మలోనూ సుఖదుఃఖాలు కల్గుతాయి. అజ్ఞానంవలన సుఖము కలిగినపుడు గర్వించి మఱిన్ని పాపాలు చేస్తాము. కనుక క్రమంగా పుణ్యం నశిస్తూ పాపం పెరుగుతూంటుంది. వేటికవే అనివార్యంగా అనుభవమౌతాయి. మనము మహాత్ముల నాశ్రయిస్తే వారు మఱొక జన్మలో మన మనుభవించవల్సిన పుణ్యఫలాన్ని కొంత యీ జన్మకూ, ప్రస్తుతమున్న దుఃఖాన్ని కొంత మఱొక జన్మకూ తరలించి మనకు వుపశాంతి చేస్తారుగాని శాశ్వతంగా దుఃఖము లేకుండా వుండాలంటే మనము పుణ్య పాపాలు చేయడానికి కారణమైన అజ్ఞానాన్ని నశింపజేసుకోవాలి. పైన దెల్పిన రీతిన తాత్కాలికంగానైనా మన దుఃఖాలు తొలగించి సుఖాలను ప్రసాదించినందుకు కృతజ్ఞతతో మనము వారిని మఱింత శ్రద్ధాభక్తులతో సేవించి వారు బోధించినది ఆచరించగలగాలనే మహాత్ములు అలా చేస్తారు. అలా చేస్తే భక్తులు, బాధ్యత యెరిగిన బిడ్డలు తండ్రికి సంతోషం కల్గించినట్లు సద్గురువుకు ప్రీతిపాత్రులౌతారు. లేనివారు బాధ్యత తెలియని పిల్లలలాగా వారి ప్రీతికి పాత్రులు కాలేరు. అందుకే 'నేను ఒకటి రెండుసార్లు హెచ్చరిస్తాను. వినకుంటే నీ కర్మకు నిన్ను విడుస్తాను' అన్నారు శిరిడీసాయి.

శ్రీ అవధూత వెంకయ్యస్వామిగూడా 'పోయేవారిని పోనిచ్చేదేగదయ్యా!' అన్నారు. 'ఎద్దల్లే తిని మొద్దల్లే పడుకుంటే దేవుడు కనిపించడు' అన్నారు అవధూత పిచ్చమ్మగారు.

గురువును సేవించవల్సిన పద్ధతి తెలుసుకొనకుంటే మన మింకొక లాగగూడ పొరబడతాము. భగవంతుడు నామరూపాలే లేక యెప్పుడూ సర్వత్రా వున్నాడు. నామరూపాలనుమాత్రమే గుర్తించగల మనకు ఆ భగవంతుడు నామరూపాలతో సద్గురువుగా దర్శనమిస్తాడు. దానిని గురుతత్త్వమంటాము. ఆ గురుతత్త్వమే శ్రీదత్తాత్రేయుడు. ఆయన అవతారాలైన శ్రీపాదశ్రీవల్లభుడు, శ్రీనృసింహసరస్వతి, శ్రీమాణిక్యప్రభువు, శ్రీఅక్కల్‌కోటస్వామి, శ్రీశిరిడిసాయిబాబా. ఎప్పుడూ భూమిమీద మానవులకు లభించే సద్గురువులందఱూ శ్రీదత్తాత్రేయుని రూపాలే. ఇలా భక్తులకు నామరూపాలతో ప్రకటమైనా నిజానికి తాము వాటికి పరిమితులుగారనీ అంతటా నిండియున్న దైవమే తామనీ వారు తమ లీలలద్వారా తెలుపుతారు. ఇది గుర్తించకుంటే మన వలెనే ఆ గురువుకూడా వారి నామరూపాలు మాత్రమేనని భ్రమించి యితఱ మహనీయులపట్ల సంకుచితంగా అసహనాన్ని వహిస్తాము. అంటే మహాత్ము లందఱి రూపంలోనూ ప్రకటమయ్యే దైవాన్నే నిరాకరిస్తాము. అపుడు మన సద్గురువు యొక్క నిజతత్త్వమునుకూడ మనము నిరాకరిస్తాము.

ఈ పొరపాటు జరుగకుండా వుండాలంటే కొంతమంది సద్గురువుల చరిత్రలు, బోధలు చదవాలి. అనేకమంది సద్గురువులను దర్శించాలి. దైవ మనే బంగార మెలా వుంటుందో తెలియనిదే మన సద్గురువనే బంగారు వుంగరంయొక్క విలువను మనము గుర్తించలేము. తేనెయొక్క విలువను తెలిసి గుర్తించగల తేనెటీగమాత్రమే తేనెగల పువ్వులన్నింటినీ గుర్తించి ఆశ్రయించగలదు. ఆ పువ్వుయొక్క నామరూపాలు పట్టించుకొనకుండా దానిలో దాగి యున్న తేనెను గ్రహించగలదు. అలాగే మన మాశ్రయించిన సద్గురువు యొక్క భౌతికమైన రూపము, లౌకికమైన నామముల మాటున దాగియున్న దైవత్వాన్ని గుర్తించగల్గాలంటే సద్గురువు లందఱి రూపాలలోనూ ఒక దైవ మెలా ప్రకటనమయ్యాడో వారి చరిత్రలనుండి గమనించాలి, వారు మనకు తెలిపిన సద్గురు సేవా విధానము తెలుసుకొని మన మనుసరించాలి. భాగవతం ఏకాదశస్కంధంలో అవధూత గూడా తాను 24 మంది గురువులవద్దనుండి జ్ఞానం ఆర్జించామని చెప్పారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు కూడా తత్త్వదర్శులైన గురువులను శరణు పొంది సేవించి చక్కగా ప్రశ్నించమని అలా చేస్తే అట్టి గురువులు జ్ఞాన ముపదేశిస్తారనీ అర్జునుడితో బహువచనంగానే చెప్పారు. ఇందులో యింకొక్క సూత్రం యిమిడి యున్నది. ఎందఱు గురువులను మహనీయులనూ దర్శించినా వారి దర్శన ఆశీస్సులన్నీ మొదట మన మాశ్రయించిన సద్గురువు యొక్క కృపవల్లనే లభిస్తాయి. నాగపూర్ వాస్తవ్యుడైన బాపూసాహెబ్‌బూటీ చిరకాలం సాయిబాబాను సేవించాడు. ఒకప్పుడు బాబా అతనితో ' నా కృప మీకు సోదరుడు గజానన్ రూపంలో లభిస్తుంది' అన్నారు. నిజంగానే తర్వాత కొంతకాలానికి షేగావ్ నివాసియైన గజానన్ మహరాజ్ నాగపూర్‌లోని అతనింటికి వేంచేసి ఒకటి రెండు మాసాలు అతనికి సేవ అనుగ్రహించారు. అలాగే రేగే అనే సాయి భక్తుడు హజరత్ తాజుద్దీన్ బాబాగారిని దర్శించాలని నాగపూర్ వెళ్లాడు. ఆరోజులలో ఆయన రాజుగారి అంతఃపురంలో నివసిస్తుండడం వలన వారి దర్శనము లభించడ మెంతో కష్టతరమయ్యేది. దానికి తోడు వేలాది జనం రాజభవనం ముంగిట తోటలో వారి దర్శనంకోసము వేచియున్నారు. నాటి సాయంకాలం 4 గంటలకు రేగే రైలు యెక్కవలసి వుండటంవలన మధ్యాహ్నము 3 గంటలవఱకు మాత్రమే వారి దర్శనంకోసము వేచియుండదలిచాడు. ఆ గడువు కొద్ది నిముషము లుండగా ఒక భక్తుడు వచ్చి రేగేను శ్రీతాజుద్దీన్‌బాబా ప్రత్యేకంగా రమ్మన్నారని చెప్పి దర్శనానికి తీసుకువెళ్లాడు. మఱొకపుడు పూణేలో ఒక కుటుంబం కాకామహరాజు అను మహాత్ముని దర్శించి తమ యింటికి రమ్మని ఆహ్వానించారు. కానీ ఆయన అంగీకరించలేదు. వారు అంతకుముందునుండీ కొలుస్తున్న సాయిని దర్శించి ఆయనతో చెప్పుకుంటే ఆయన 'చింతపడకండి. కాకామహరాజ్ మీ యింటికి వస్తారు' అని ఆశీర్వదించారు. తర్వాత చిత్రంగా శ్రీకాకామహరాజ్ ఆ భక్తుల యింటికి వచ్చి 3 రోజులున్నారు. సాధకులు యీ విషయము మరువకూడదు. ఉత్తమురాలైన యిల్లాలిని యెందఱు గౌరవించి ఆదరించినా అందుకు

కారణము ఆమె పాతివ్రత్యమే గదా! ఈ సూక్ష్మము తెలియకుంటే, గుర్తుంచుకోకుంటే అనేకమంది మహనీయులను దర్శించినాగూడ చిత్తచాంచల్యమే కలుగుతుంది. ఆత్మజ్ఞానులైన సద్గురువులు అందఱినీ తమ రూపాలుగానే చూచుకుంటారు. గనుక తాము గురువులమనీ, మనము శిష్యులమనీ భావించరు. అందువలన మనము వానినెలా సేవించవల్సినదీ వారుగా మనకెన్నడూ చెప్పరు. ఎప్పుడైనా వారికి అర్హులైన భక్తులు దొరికితే వారితోమాత్రము తాము తమ గురువును యెలా సేవించినదీ చెబుతారు. అదే మనకు మార్గదర్శకము. అదే వారి కృపను పొందటానికి యేకైక మార్గము. మహాత్ము లందఱి చరిత్రలూ చదవడము సాధ్యంగాదు. గనుక కనీసము 'శ్రీగురుచరిత్ర', 'శ్రీసాయిబాబా జీవితచరిత్ర', 'శ్రీసాయిప్రబోధామృతము' అయినా చూస్తే సద్గురు సేవా విధానము తెలుస్తుంది. వంట, పూజ యెలా చేయాలో తెలియకుంటే సద్గురువునకు నైవేద్యము, సేవ అర్పించడము తెలియనట్లే. సద్గురు సేవా విధానము తెలియక మన భక్తి సఫలము కాదు. రాజుకు కొడుకై జన్మించినా బాధ్యత యెరుగని రాజకుమారుడు ఆయన నుండి రాజ్యం పొందలేక అందఱు తండ్రుల బిడ్డలవలెనే మహారాజునుండి తిండి, గుడ్డవంటి అత్యల్పమైన లాభంమాత్రము పొందగలుగుతాడు, రాజ్యార్హతగల అంటే బాధ్యత యెరిగిన మఱొక రాజకుమారుడు రాజ్యాన్ని పొందినట్లే, గురువును సేవించే విధానము తెల్సినవారుమాత్రమే ఆయననుండి వుత్తమ ఫలితము పొందుతారు.

గొలగమూడి దర్శించినపుడు స్వామి సన్నిధిలో కాలము వృథా చేసుకొనక యీ చరిత్ర గ్రంథ పారాయణ, అచటి ధునికి, సమాధి మందిరానికి ప్రదక్షిణలు చేసుకోవాలి. ఇంటివద్దకూడా స్వామి పుణ్యతిథికి పూర్తయ్యే లాగునగాని, నాటితో ఆరంభించిగాని సప్తాహం పారాయణ చేసుకొనడము వుత్తమము. దీనికి తోడుగా గురుపూర్ణిమకు పూర్తయ్యేలాగున 'శ్రీగురుచరిత్ర', విజయదశమికి పూర్తయ్యేలాగున 'శ్రీసాయిబాబా జీవిత చరిత్ర' గూడ పారాయణ చేయడము శ్రేష్ఠము.

*సాధక ప్రియాయ నమః ॥*

శ్రీఅవధూతాయ నమః

## అధ్యాయము - 2

# అ వ ధూ త ద ర్శ న ము

అదొక మారుమూల పల్లెటూరు. ఊరు చివఱిలో పాతకాలంనాటి ఆంజనేయస్వామి ఆలయము ప్రక్కనే నేలపై వెలుగుతున్న అగ్నిహోత్ర మున్నది. దాని ప్రక్కనే చిన్న ఈతాకు చాపమీద స్వామి కూర్చుని వున్నారు. చూడటానికి 70 లేక 80 సంవత్సరముల వయస్సు గల వృద్ధులుగా వున్నారు. ఎంతో కష్టమ్మీద గాని లేవలేనివారి వలె కన్పించారు. గుండు తల, యెక్కడో లోతుగా చూస్తూ చిత్రంగా వెలిగే కళ్లు, కదలాడే బోసి నోరు, వుండివుండి మూలుగుతున్నట్లు అస్పష్టంగా ఆ నోటినుండి వెలువడే మాటలు-అప్పుడప్పుడు ఆయన తన గుండునూ, మూతినీ చేత్తో వ్రాసుకుంటున్నారు. ఎండనక, వాననక వెలిగే ధుని సెగకు కాబోలు కాగి కాగి, రాగి కాగులా తయారయింది- ఆయన శరీరచ్ఛాయ. వారి మొలకొక గోచీ మాత్రమున్నది. కొంచెము దూరాన ఒక కుటీరంలో ఒకరిద్దఱు సేవకులు పనిచేసుకుంటున్నారు. ఆయన ప్రక్కనే నేలబారుగా చిన్న చక్రాలు గల చెక్కతో చేసిన తోపుడుబండి వున్నది. వారు నీరు త్రాడానికి కాబోలు, ఆప్రక్కనే తాటియాకుతో చేసిన దొన్నె లాంటిది ఒకటున్నది. ఆయనతోపాటు యెప్పుడూ నలుగురు వ్యక్తులు తోడుగా వుంటారని, వారు రాత్రంతా ఆయనతోపాటే మేల్కొనవల్సిందేననీ, ఆయన తనను యెప్పుడు యెక్కడికి తీసుకువెళ్లమంటే అక్కడకు వాళ్ళాయనను తీసుకువెళ్తారనీ, చి. రామకృష్ణారెడ్డి చెప్పాడు. అపుడు ఆయనను ఒక వెదురుకఱ్ఱకు వూయలతో కట్టిన గోనెపట్టాలో పడుకోబెట్టి ఆయన ఆగమన్నదాకా ఆగకుండా ఆయన చెప్పిన దిక్కుకే వారు మోసుకువెళుతుంటారనీగూడా చెప్పాడు. వారెక్కడున్నా, ప్రక్కనే అతి దగ్గఱిలో అగ్ని అలానే వెలుగుతూంటుంది. ఒక పాత చాప, ఒకపాత గుడ్డలమూట, రెండు పాత దిండ్లు, ఒకటి రెండు అల్యూమినియం పాత్రలు తప్పవారి వద్ద యింకేమీ లేవు. స్వామి అమిత నిరాడంబరులు. నేను మొదటిసారి స్వామిని దర్శించినపుడు చూసిన దృశ్య మిది.

ఆరోజులలో స్వామి దర్శనానికి యెక్కువమంది వచ్చేవారుగాదు. చదువుకున్న వారసలే లేరని చెప్పవచ్చు. పశువులు కనిపించలేదని, జబ్బుపడ్డాయని, వాటినిగురించి ప్రశ్న చెప్పించుకోవడానికి కొందఱు మాత్రం వచ్చి పోతూండేవారు. 'శ్రీసాయిబాబా జీవిత చరిత్ర', 'శ్రీగురుచరిత్ర' పారాయణ చేయడంవలనమాత్రమే నాకు వారి దర్శనము లభించింది. వారి సాన్నిధ్యంలోని పవిత్రత, వారిలోని అవధూత లక్షణాలు చూచాక ఆ ప్రాంతంనుండి నా దగ్గఱకొచ్చే వారందఱికీ స్వామిని దర్శించమని చెబుతుండేవాణ్ణి. ప్రశ్నలు చెప్పుకొనే ఆ పిచ్చాయనను దర్శించమని నేను చెప్పడ మేమిటా అని మా సత్సంగంలో మేధావు లనుకొనేవారికి విడ్డూరంగా తోచేదిగూడ. కానీ శ్రీసాయి అనుగ్రహంతో లభించిన దర్శనము వ్యర్థ మెన్నటికీ కాదని చరిత్ర నిరూపించింది.

అయితే యిక్కడొక సూక్ష్మ మున్నది. ఎక్కువమంది ప్రత్యేకంగా మహాత్ముల దర్శనము లభించాలని మాత్రమే 'సాయిబాబా జీవిత చరిత్ర' మొదలయిన గ్రంథాలు పారాయణము చేయకుండటము మంచిది. మనస్సు మొదట ఆ సద్గురునిమీద స్థిరంగా నిలిచి యెప్పుడూ ఆయనే గుర్తొస్తుండేలా సాయిబాబా జీవిత చరిత్ర చదువుతూండాలి. అపుడు సకాలంలో అంటే మన ఆత్మవికాసానికి నిజంగా అవసరమైపుడు తగిన మహాత్ముల దర్శనము అదే కల్గుతుంది. అపుడే చక్కని ప్రయోజనము నెరవేఱుతుంది. నిజంగా శరీరానికి అవసరమైనపుడుమాత్రమే నీరు, ఆహారము తీసుకొంటుంటే ఆకలిదప్పులు సవ్యంగా వుండి ఆరోగ్యాన్ని, పుష్టిని యిస్తాయి. కేవలము ప్రక్కవారు వాటిని సేవించడము చూచి జిహ్వాచాపల్యంవల్లనో లేక అదొక సభ్యత లేక గొప్ప అన్న భావనతోనో వాటిని సేవిస్తే జీర్ణకోశము చెడిపోతుంది. అలాగే యిదీను. సాయిబాబా జీవిత చరిత్ర పారాయణ అట్టి నిజమైన ఆకలిని కల్గిస్తుంది. అంతేగాదు, సరియైన ఆధ్యాత్మ పోషణగూడ అందిస్తుంది. ఆ పారాయణ చేయకుంటే దానితోపాటు యిట్టి జాగ్రత్తలు తీసుకోకుంటే అదొక బలహీనతగా మారి సాధువేషం ధరించిన ప్రతివారినీ పిచ్చిగా నమ్మి, ప్రక్కదారిపడతాము. జిహ్వాచాపల్యమునకు లోనైతే యుక్తాయుక్త విచక్షణ లేకుండా కనిపించినదల్లా తినాలనిపించినట్లు.

ఇక అలనాడు అలా అతి నిరాడంబరంగా దర్శన మిచ్చిన ఆ స్వామి రూపంమాటున యెంత ఆధ్యాత్మిక సంపద దాగియున్నదో కాలాంతరములో స్పష్టమైనది.

నెల్లూరు జిల్లా ఆత్మకూరు తాలూకాలోని నాగులవెల్లటూరులో సోంపల్లి పెంచలయ్య-పిచ్చమ్మ అను దంపతు లుండేవారు. వారి ప్రథమ సంతానమే శ్రీవెంకయ్యస్వామి. ఆయన జనన తేదీ మాత్రము స్పష్టంగా తెలియడంలేదు. 'పెద్దగాలివాన' నాటికి వీరికి సుమారు 30 సంవత్సరాలుంటాయట. మఱొక భక్తుడు చెప్పిన దానినిబట్టి 'ధాతనామ సంవత్సరంలోని కరువు' నాటికి స్వామికి 13 ఏండ్లట. వెంకయ్య చిన్నప్పుడు కొద్దికాలం తక్కిన పిల్లలలాగే రాత్రిపూట ఒకరిద్దఱి వద్దకెళ్లి చదువుకునేవాడు. అప్పుడప్పుడు అతడు చెప్పే మాటలు

సాటివారికి అంతుపట్టేవిగావు. ఆడుకోవడానికి పిలిచినపుడు సాటి పిల్లలతో ' నేను దొంగతనము చేసి వచ్చాను. పోలీసు లొచ్చి నన్ను పట్టుకుంటారు. నాతో వుంటే మిమ్మల్ని గూడ పట్టుకుంటారు పోండి' అనేవాడు. అలా అందఱినీ తరిమివేసి ఒక్కరే తలుపుచాటున కూర్చునేవాడు. యుక్తవయస్సులో అందఱిలాగే అన్ని పనులూ చేసుకునేవాడు. కట్టెలు కొట్టి బండిలో తీసుకెళ్లి నెల్లూరులో అమ్ముకొచ్చేవాడు. ఆకులతో దొన్నెలు చేసి అమ్మేవాడు. పొలం పనులకు వెళ్లినా, కూలీకి వెళ్లినా యెంతో కష్టపడి పనిచేసేవాడు. అలా సంపాదించిన గింజలు యింట్లో యిచ్చేసేవాడు. అతడు దున్నినచోట నాగటిచాలులో ఒకవైపు కోడిగ్రుడ్డు పెట్టి, మఱొక వైపునుండి చేస్తే కనిపించేటంత చక్కగా వుండేదట. అతడొక్కడే యిద్దఱు మనుషుల పనిచేసేవాడు. ఎంత చిన్న పనైనా చాలా శ్రద్ధగా చేసేవాడు. సాయిబాబాగూడా తామొకప్పుడు గుడ్డలు నేశామనీ, వారి సాటి మఱొకడు రోజుకు రూ॥50, యింకొకడు రూ॥ 100, మఱొకడు రూ॥ 150 విలువగల గుడ్డలు నేస్తే, తామొక్కఱే 600రూ॥లు విలువ చేసే గుడ్డలు నేసి తమ యజమాని మన్ననలు పొందామనీ చెప్పారు. దీనినే పెద్దలు యింట గెలిచి, రచ్చగెలవడమన్నారు. అవధూతలైన చివటం అమ్మ, మాల పిచ్చమ్మగార్లుకూడా యిలానే చేసేవారు.

వారందఱిలాగే వెంకయ్యకుగూడా అబద్ధమాడటమంటే గిట్టేదికాదు. ప్రక్కవారి కష్టాన్ని చూస్తూ వూరుకోలేడు. ఒకరోజు బిచ్చగాడొస్తే స్వామి తల్లి పిచ్చమ్మ యింట్లో గింజలు లేవు పొమ్మన్నది. కానీ వెంకయ్య 'అరగంట ఆగి వచ్చావంటే పాతరనుండి గింజలు తీస్తారు. అపుడువచ్చి పెట్టించుకో' అని చెప్పి తర్వాత గింజలు పెట్టి మఱీ అతనిని పంపించారు. గడ్డి కోసుకొచ్చి ఆకలిగొన్న పశువులకు పెట్టేవాడు. చిన్నప్పటినుండీ వెంకయ్య వుత్తమ సంస్కారవంతుడు. తన చెల్లెలిని 'అమ్మాయి' అని పిలిచేవాడేగాని ఏకవచన ప్రయోగము యెన్నడూ చేసేవాడుగాదు. సాటి పిల్లలతోపాటు చెల్లెలుగూడ తనను పేరుపెట్టి పిలిస్తే 'అలా కాదు, అన్నా అని పిలవాలి' అని అనునయంగా చెప్పేవాడు. సాటి పిల్లలందఱికీ అతనే నాయకుడు. ఇలా వెంకయ్యకు 20వ సంవత్సర మొచ్చింది. ఒకసారి తీవ్రమైన జ్వరంతో వారంరోజులుపైగా అన్నం తినకుండా మంచంలో వున్నాడు. ఒకరోజు తల్లిదండ్రులతో మన ఇల్లు వేలం వేయబోతున్నారు. మీరెక్కడుంటారు? అన్నాడు వెంకయ్య. నిజానికలాంటి పరిస్థితేమీ లేదు. అతనికి పైత్యం కమ్మిందని తలచి చికిత్సలు చేశారు. ఏమడిగినా ' ఊ...ఆ....' అనితప్ప మఱేమి మాట్లాడేవాడు కాదు. చివఱి కతనికి దయ్యం పట్టిందని తలచి యెన్నో క్రొత్త వైద్యాలు చేయించారు. ఒక నెల తర్వాత 'చాకలియోగం'- 'జక్కలయోగం'- 'మంగలియోగం' అని అఱుస్తూ వూరంతటా పరిగెత్తి రెండుమూడురోజులు యేకాంతంగా గడిపి యెప్పుడో తనకు తోచినపుడు యింటికి వచ్చేవాడు. ఒకప్పుడు యింట్లో కట్టివేస్తే అన్నమూ, నీళ్లూ అడుగకుండా కూర్చోవడంతో అతనిని స్వేచ్ఛగా వదలివేశారు. ఇలా ఒక సంవత్సరము గడిచింది. గ్రామస్థులంతా అతనిని 'పిచ్చి వెంకయ్య' అని వ్యవహరించనారంభించారు. ఈ

దశలో జరిగిన ఒక సన్నివేశంగురించి ఒకప్పుడు స్వామి స్వయంగా నారాయణయ్య అనే సేవకునితో యిలా చెప్పారు. 'నాకు 19, 20 సంవత్సరముల వయస్సులో ఒకరోజు పాము నా కాలిపై కాటేసి పడగవిప్పి నా యెదుట నిలిచింది. దానిని మళ్ళీ కఱ్ఱతో కొట్టబోయాను. కానీ అది కరిచేసిందిగదా అనీ కొట్టిమాత్రము లాభమేమిటని ఆలోచించి యింటికి వచ్చేశాను. కానీ నాకు విషము యెక్కలేదు. మామూలుగా భోజనము చేసి నిద్రపోయాను. తర్వాత మూడునెలలపాటు పెంచలకోనలో యేకాంతంగా గడిపి తర్వాత నాగులవెల్లటూరు వచ్చాడు వెంకయ్య. కానీ అప్పటినుండి యింటికి రాకుండా చేలల్లోను, దొడ్లల్లోను తిరుగుతూ యెవఱి దగ్గఱుంటే వారి దగ్గఱ అన్నం తినేవాడు. అతని వంటిమీదనున్న గుడ్డలు బాగా చినిగిపోయివుండేవి. అటుతర్వాత రాజపద్మాపురంలో తన చెల్లులు మంగమ్మగారింట భోజనము చేస్తూ చాలాకాలం ఆ ప్రాంతంలో తిరిగాడు. అందఱూ అతనిని పిచ్చివెంకయ్య అంటారేగాని అతడెవఱినీ తిట్టేవాడుగాదు, కొట్టేవాడుగాదు. ఆకలి వేసినపుడు పెట్టేవారి దగ్గఱ చేయి చాపి మిగిలిన సమయమంతా ఒంటరిగా తిరుగుతూండేవాడు.

క్రమంగా సన్నిహితులు ఆయనలో పొడచూపుతున్న మహత్తులు చవిచూడసాగారు. మంగమ్మ ఒకరోజు తన బిడ్డకు జ్వరం తగ్గలేదని యేడుస్తూ వుంటే వెంకయ్య 'ఎందుకమ్మా యేడుస్తావు? బిడ్డకు జ్వరం తగ్గిపోతుంది, భయంలేదు' అని చెప్పి బిడ్డను చేతితో తాకాడు. నాల్గవనాటికల్లా యెట్టి వైద్యమూ లేకనే ఆ బిడ్డకు స్వస్థత చేకూరింది. పిచ్చి వెంకయ్య క్రమంగా 'వెంకయ్యస్వామి'గా రూపొందుతున్నారు. ఆయనలోయిట్టి మార్పు కలగడంగురించి భక్తులు రెండువిధాలుగా చెప్పుకుంటారు. ఒకసారి అతడు పొలం దున్నుతూ ఎద్దు మొండికేసి సరిగా నడవకపోయేసరికి దానినెంతో తీవ్రంగా కొట్టాడు. అది విలవిల తన్నుకొని పడిపోయేసరికి తీవ్రమైన పరితాపము చెంది తీవ్రవైరాగ్యంతో పెంచెలకోన వెళ్లాడని, అక్కడొక గొప్ప మహాత్ముని దర్శనంవలన జ్ఞానోదయమైందనీ కొందఱు చెబుతారు. కొందఱు యింకొకలా చెబుతారు. ఒకసారి యెవఱో సాధుపుంగవుడొచ్చి పాలు అడిగినపుడు వెంకయ్య ఆయనకు పాలు సమర్పించాడట. అపుడా సాధువు కరుణించి అతని నాలుకమీద యేదో మంత్రం వ్రాసి వెళ్లిపోయాడట. ఆ సాధువు శిరిడీ సాయినాథుడే అయివుండాలని సోదరులు మాకాని వెంట్రావుగారు వ్రాశారు. ఈ యిద్దఱి మహాత్ముల జీవితవిధానాలకు, లీలలకు, బోధలకూ గల సన్నిహితమైన పోలికలనుబట్టి యిది నిజమే అయివుండవచ్చు. ఈ ప్రాంతంలో యెరుగని యింకొక మహాత్మునిగూర్చి ప్రస్తావించని స్వామి ముందుముందు శిరిడీసాయిబాబాగురించి మాత్రమే తమ అన్నగారని వ్యవహరించడాన్నిబట్టి యీ వాదం బలీయమౌతుంది. చిత్రమేమిటంటే సాయిబాబాకూడా తన శిష్యులను 'తమ్ముడా!' అని పిలిచేవారు.

వెంకయ్య హృదయంలో జ్ఞానజ్యోతి వెలిగింది. అది గుర్తించక యింటిలోనివారు అతని పిచ్చి కుదరటానికి పెండ్లి ప్రయత్నము చేయబోతే యిల్లు విడిచి పెంచెలకోనకు వెళ్లిపోయాడని కొందఱంటారు. పెంచెలకోనకు

వెళ్లి అక్కడొక రాత్రి చీకట్లో దారి తెలియక వెంకయ్య అటుయిటు తిరుగుతూవుంటే ఒక జంగందేవర వచ్చి అతనికి క్షణకాలంలో మనోవేగంతో దేవస్థానం వద్దకు తీసుకెళ్లాడట. తర్వాత అక్కడ అతడొక బిలంలో ప్రవేశించి, అక్కడ తపస్సు చేసుకుంటున్న మహనీయు లెందఱినో దర్శించాడట. వారిలో కణ్వమహర్షి గూడ వున్నాడట. అక్కడ 101 మంది సాధవులను దర్శించి మూడున్నరరోజులు సేవించాడుట. నాల్గవరోజుకు వెంకయ్యస్వామికి స్పృహవచ్చేసరికి ఆయన మద్రాసు హైకోర్ట్ మెట్లమీదున్నాడుట. ఈ వివరాలు స్వామిని కొంతకాలంగా సేవించిన సోదరులు మాకాని వెంట్రావుగారు సేకరించి వ్రాశారు. సాధకుడు తానాశ్రయించిన సద్గురువు యొక్క ఆదేశాన్ననుసరించి అనేకమంది మహాత్ములను దర్శించడము సాయి సాంప్రదాయము. దత్తాత్రేయ సంప్రదాయముగూడా అని వుపోద్ఘాతంలో గమనించాము. అక్కడ వెంకయ్యస్వామి వేరుశనగపప్పుమాత్రమే తింటూ కొంతకాలముండి వూర్లు తిరుగుతూ దుత్తలూరు, నఱ్ఱవాడ గ్రామాలమీదుగా కోటితీర్థం, పెన్నబద్వేలు ప్రాంతం చేరారు.

పై రెండు కథలలో యేది నిజమైనా సన్నిహితులైన భక్తులు చెప్పే వివరాలను బట్టి చూస్తే ఆయన కొక సద్గురువు లభించి వుండాలని, వారి అనుగ్రహంతోనే పిచ్చి వెంకయ్య 'వెంకయ్యస్వామి'గా రూపొంది యుండాలనీ తోస్తుంది. ఆయన సమాధి చెందే ముందటిరోజంతా 'సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురుసేవ' అని కేకలేశారు. అంటే అది వారి సాంప్రదాయమన్నమాట. మానవాళికి ఆయ నిచ్చిన చరమోపదేశ మదే. ఈ వుపదేశాన్ని రెండువిధాలుగా వివరించవచ్చు.

మానవుడు మొదట దైవీసంపదను సాధించాలి. అదే ఆయన చెప్పిన 'సంపన్నత్వం', దైవీసంపద అంటే భగవద్గీత యిలా చెబుతుంది. నిర్భయము, సాత్వికమైన చిత్తశుద్ధి, జ్ఞానయోగంలో స్థిరత, దానము, ఇంద్రియనిగ్రహము, నిష్కామమైన యజ్ఞము, ఆత్మవిచారము మఱియు గురువువద్ద నేర్చిన ఆధ్యాత్మిక సూత్రాలను మననము చేయడము, తపస్సు, ఋజుత్వము, అహింస, సత్యము, క్రోధము లేకుండుట, త్యాగము, శాంతి, కొండెములు చెప్పకుండుట, సర్వభూతములయెడ దయ, ఇంద్రియ విషయాలపై వ్యామోహము వుండకుండుట, ధర్మవిరుద్ధమైన కార్యాలపట్ల లజ్జ, చాంచల్యం లేకుండుట, బ్రహ్మతేజస్సు, ద్వంద్వాలపట్ల సహనము, చెక్కు చెదరని ధైర్యము, శుచి, ద్రోహము మఱియు గర్వము లేకుండుట. అది సాధించకుంటే సాధకులు చేసే యజ్ఞము, దానము, తపస్సు, కర్మలనే సాధనలు వారిలోని రజోగుణ తమో గుణాలకు లోబడి విఫల మౌతాయని భగవద్గీత హెచ్చరిస్తుంది. స్వామి చెప్పిన రెండవ పదం 'సాధారణత్వం', అంటే దైవీసంపద సాధించాక సాధకు డందుకు గర్వించకూడదు. లోకం దృష్టిలో సంపన్నత్వం కావచ్చుగాని అతనికది సాధారణ మవ్వాలి. అంటే అతడు లోకం దృష్టిలో సాధారణంగా జీవించాలి. అయినప్పటికీ

సద్గురువునుండి అతడు నేర్చిన దానిని హృదయంలో నిరంతరమూ 'ధారణ' చేస్తూనే వుండాలి. అదే సాధారణత్వం. ఈ రెండూ 'సద్గురుసేవ' వలన మాత్రమే సాధ్యమౌతాయని స్వామి బోధించారు. అలాగాకుంటే పవిత్ర గ్రంథాలు చదివేవారందఱూ ఆత్మజ్ఞాను లయ్యేవారేగదా! వారికి సద్గురుసేవ లభించనందున, లభించినా సద్గురువు నెలా సేవించాలో తెలియనందువలన, సంపన్నత్వమూ, సాధారణత్వమూ సాధించలేకపోతున్నారు. ఎవరెంత వేదాంతం నేర్చినా చివఱికి సాధించి తీరవల్సినవి యీ మూడేనని స్వామి మనందఱికి తెలిపారు. సద్గురు వంటే యెలాంటివారో, ఆయనను యెలా సేవించాలో, ఆయన కృపకు యెలా పాత్రులు కావాలో తెలియకుంటే మనకు సద్గురువు లభించినా గుర్తించలేము. ఆయన బోధను మనస్సులో ధారణ చేయలేక మనలోని సంకుచితత్త్వమును, మౌఢ్యాన్ని, ధారణ చేస్తుంటాము. స్వామిగూడ 'పొయ్యేవారిని పోనిచ్చేదేగదయ్యా!' అని వూరుకుంటారు. సద్గురు వెలా వుంటాడో, ఆయనను యెలా సేవించాలో తెలియనిదే నిజమైన కృప వెంకయ్యస్వామినుండి కూడా పొందలేమని వారి చివఱి వుపదేశము మనలను హెచ్చరిస్తోంది. ఈ భావాన్నే శ్రీశిరిడీ సాయిబాబాగూడ 'మహారాజైగూడా పేదవానిలా జీవించేవాడే గొప్పవాడు' అన్నారు.

ఈ మాటలే స్థూలంగా మఱొవిధంగా కూడా అర్థము చేసుకోవాలి. మానవుడు త్రికరణశుద్ధిగా ధర్మబద్ధంగా శ్రమించి సంపన్ను డవ్వాలి. తర్వాత దానిని దానధర్మాలకు వినియోగిస్తూ సామాన్యంగా జీవించాలి. అటువంటివాడు ముముక్షువైతే సద్గురు సేవ సకాలంలో దానికై అదే లభిస్తుంది. పైజెప్పిన సాయిసూక్తినిగూడా స్థూలంగా యిలానే అర్థము చేసుకోవాలి.

స్వామికి నిశ్చయంగా ఒక గురువున్నారని తెల్సే ఒక సంఘటన వున్నది. ఒకప్పుడు దశయ్య అనే సేవకుడు 'స్వామి! మీకు యెవఱో ఒక ఋషి కనబడి నాలుకమీద బీజాక్షరం వ్రాశారని చెబుతున్నారు. నిజమేనా?' అని అన్నాడు. అపుడు స్వామి 'మైసూరు మహారాజు త్రోవన పోతుంటే చూచినంతమాత్రాన మనకేమి వస్తుంది? మనము చేసుకున్నదేగదా మనకు!' అన్నారు. ధర్మాచరణతో, వినయవిధేయతలతో మహారాజును మెప్పించిన రాజకుమారునికే పట్టాభిషేకమై రాజ్యపదవి లభిస్తుందిగాని, ఆ వేడుకంతా చూచి ఆనందించేవారికి యేమి వొరగదు. అయితే మనము చేసుకున్నదేగదా మనకు! అన్న మాటలు బాగా గమనించాలి. మనమేమి చేస్తే దైవనిర్ణయంగా మనకు సద్గురువు లభిస్తాడో అలా చేసి ఆయనను సేవించి ఆత్మజ్ఞాన మనే సామ్రాజ్యాన్ని మానవుడు పొందాలి. అదెలాగో తెలిపేది 'శ్రీగురుచరిత్ర', 'శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర' ల పారాయణయే. ఆలాటిదేమి చేసుకోకుండా స్వామివంటి మహాత్ములను చేరేవారందఱూ కేవలం పూర్వజన్మ ఋణానుబంధంవలన, పుణ్యంవలన చేరేవారే. ఆ ఋణానుబంధం, పూర్వపుణ్య మున్నంత వఱకే వారినుండి ఐహికమైన సుఖశాంతులుమాత్రము పొందుతారు. అటుతర్వాత ఆ మహాత్ముడితో వారికిగల

ఆధ్యాత్మికమైన సంబంధము యేకొద్దిమందికో గాని మిగలదు. ఈ జన్మలో ఆయన కేదో ఒకవిధమైన సేవ చేసుకున్నవారు, వారితో గల గత ఋణానుబంధాన్ని పూర్తిగా తీర్చుకోనివారూమాత్రమే శ్రీస్వామి మళ్ళీ అవతరిస్తే కలుసుకుంటారు.

నిజానికి స్వామిని తగురీతిన ఆశ్రయించినవారే లేరని స్వామి చెప్పారు. 'కొండలుకొండలుగా డబ్బులున్నా ఒక్కరుగూడా అడుగరేమయ్యా? కొండలు పొర్లి జాఱి వచ్చేస్తున్నాయయ్యా!', 'ఏడుకొండలు వేలానికొచ్చాయి, పాటపాడుకునేవాళ్లుంటే కొనవచ్చయ్యా!' 'నల్లకొండలు వేలానికొచ్చాయి, కొనేవాడేలేడే!' అని అనేక సందర్భాలలో స్వామి అన్నారు. అలా అయితే నిజానికి మనమెవ్వఱమూ ఆయన నుండి వుత్తమ ఫలితము పొందలేదన్నమాట. దానిగురించి ఒక భక్తుడు 'మాకేమైనా బోధించండి స్వామి' అని అడిగితే ఆయన 'బోధించేందుకేముందయ్యా? చూచి నేర్చుకుండేదేగదయ్యా!' అన్నారు. ఆయనను చూచి వారు నేర్చుకోమన్నదేమిటి?

1. మొదటగా వారిలోని వుత్తమ గుణాలను, పనిలో త్రికరణశుద్ధి, సాటి జీవులపై ఆదరణ.

2. పూర్ణుడైన సద్గురువును ఆశ్రయించి సేవించడ మెలాగో మహాత్ముల చరిత్రనుండి తెలుసుకోవాలి.

3. దివ్యమైన రీతిన మనకు భగవంతుడు ఆదేశించిన సద్గురువును అంటిపెట్టుకోవాలి.

4. వారి అనుగ్రహంతో అనేకమంది పూర్ణపురుషులను అహోబిలంలో స్వామి దర్శించినట్లే దర్శించాలి.

5. వారందఱివద్దా సేకరించిన సత్యాలను మన సద్గురువు చెప్పినదానితో సమన్వయపఱచుకొని, ఆయన ఆదేశించిన సాధన యెక్కడ వుండైనా చేసుకోవచ్చు. అందుకే ఒక భక్తుడు 'స్వామి! నన్ను సాధన చేసుకుంటూ యెక్కడ వుండమంటారు?' అని అడిగినపుడు ఆయన 'ఒంటిదూలపు యిల్లు వేసుకుని యెక్కడైనా వుండవచ్చు' అని చెప్పారు. ఇవన్నీ మనకు స్వామి చేసి చూపినవే.

ఇలాగాక భగవదాదేశంగా వారిని గురువుగా పొంది, గురుసేవా విధానము తెలుసుకొని ఆప్రకార మాయనను యెట్టి లౌకికమైన కోరికలూ లేకనే కేవలము మోక్షేచ్ఛతో సేవించినవారు మాత్రమే ముక్తి పొందేవఱకూ వారితోపాటు జన్మించి సేవిస్తూ వుంటారు. స్వామి ఒకప్పుడు 'వెయ్యి గొఱ్ఱెలలో మన గొఱ్ఱె యెక్కడున్నా నేరుగా కాలుపట్టి లాక్కురావచ్చుగదయ్యా!' అని చెప్పినది కేవలము లౌకికమైన కోరికలతో వారిని సేవిస్తూ వాటిని నెరవేర్చిన స్వామి మహిమకు అబ్బురపడే పామరులైన భక్తులను గొఱ్ఱెలతో పోల్చారు. కారణము వారికి మోక్షము, గురుశుశ్రూష తెలియవు. శైవసాంప్రదాయ గ్రంథాలలోగూడ ముముక్షువులుగాని పామరజనాన్ని 'పశువులు' అని భగవంతుణ్ణి పశుపతి యనీ అంటారు.

శ్రీస్వామి పెంచెలకోనలో తాము చేసిన తపస్సుగురించి నారాయణయ్య అనే సేవకునితో ఒకనాడిలా చెప్పారు. 'ఒక్కొక్కప్పుడు పెంచెలకోన అడవులలో మూడురోజులు రాత్రింబవళ్ళు గడిపేవాడిని. ఒక్కొక్కప్పుడు లోకమే తెలిసేదిగాదు. అన్నము, నీరు సంగతిగూడా తెలిసేదిగాదు. లోకము తెలిసినపుడు మాత్రము గోనుపల్లెకు వచ్చి యెవఱినైనా అడిగి అన్నము పెట్టించుకుని తినేవాడిని'. ఇట్టి స్థితిలో పెంచెలకోనలో వారికి సద్గురువు దర్శనము, సేవలవలన కలిగిందని తలచవచ్చు. కారణము అట్టి అదృష్టవంతులకుమాత్రమే అలాంటి స్థితి కలుగుతుంది. శ్రీసాయిబాబా ఒకప్పుడు తమ గురుసేవా వృత్తాంతము చెబుతూ యిలా అన్నారు. 'ఇక్కడే చావడిలో నా గురువును చూచాను. ప్రశాంతము, గంభీరము అయిన ఆయన ముఖంలోని నిత్యసంతుష్టి నన్ను ముగ్ధుణ్ణి చేసింది. నా దృష్టి ఆయన ముఖమ్మీద నిలిచిపోయేది. ఆయన సన్నిధిలో నాకు ఆకలిదప్పులు తెలిసేవిగావు'.

శ్రీవెంకయ్యస్వామికి వారి గురువు ఒక వింతైన సాధన విధించినట్లు తఱ్వాత ఆయన దానిని సాధ్యమయినంతవఱకూ నలుగురి దృష్టిలో పడకుండా కొంతకాలం కొనసాగించినట్లు తోస్తుంది. స్వామి వున్మత్తావస్థలో వుండగా ఒక కపిలబావిలోకి వాలియున్న చెట్టుకొమ్మలకు తమ కాళ్లు పెనవేసి తలక్రిందులుగా వ్రేలాడేవారు. కాళ్లు పట్టుతప్పి బావిలో పడిపోతే ఆయన మరల బావినుండి యెక్కి వచ్చి మఱలా అలానే వ్రేలాడేవారట. ఒక్కొక్కప్పుడు రెండెడ్ల బండిపోతూ వుంటే స్వామి ఆ బండి వెనుకగా వచ్చి యెక్కి కూర్చునేవారు. తఱ్వాత కాళ్లు బండిపైన తల మఱియు శరీరరము క్రిందకు వ్రేలాడుతుండేవి. ఎవరైనా చూస్తే ఆయన వెంటనే లేచి మామూలుగా కూర్చునేవారు. శ్రీసాయిబాబాకూడా తమ గురుసేవగురించి యిలా చెప్పారు. 'నా గురువు నన్ను ఒక చెట్టుకొమ్మనుండి బావిలోకి తలక్రిందులుగా వ్రేలాడదీశారు. నా తల నీటికి మూడడుగుల యెత్తునున్నది.... నన్ను అలా వదిలేసి ఆయన యెటొ వెళ్లిపోయారు. ఆయన 5 గంటల తర్వాత వచ్చి 'ఎలా వున్నారు?' అన్నారు. నేను 'పరమానందంలో తేలిపోతున్నాను' అన్నాను. ఆయనెంతో సంతోషంతో నన్ను కౌగలించుకుని నా దేహాన్ని నిమిరారు. శిష్యుడుగా అంగీకరించారు. నా దృష్టిని ఆయనమీద లగ్నము చేశాను. నా ధ్యానమూర్తి ఆయనే. నిజానికి యిట్టి వింతైన యోగసాధన ఒకటున్నది. గణేశపురి వాస్తవ్యులైన శ్రీనిత్యానందపరమహంస యిలాటి సాధన చేశారు. ముస్లిం మహాత్ములలో గూడా బాబాఫరీద్‌గంజ్‌షక్కర్ అను మహాత్ముడు 40 రోజులు యిలాంటి తపస్సు చేశారు.

ఒకరోజు చలమానాయుడు స్వామితో 'స్వామి! రాముడు, కృష్ణుడు మొదలగువారికి కూడా గురువున్నారు. మఱి మీకు గురువు లేడేంటి?' అన్నాడు. స్వామి 'చలమానాయుడా! నీకు పిచ్చా యేమి? ఇది పదోచూపు. నీవెరుగవులే! నీకు యేమన్నా కోరుకో. వాటంతటవే వస్తాయి. నాకు గురు వెందుకయ్యా, నా నెత్తిన మఱలా?'

అన్నారు. ఈ మాటలు సరిగా అర్థము చేసుకోకుంటే స్వామి తమకు గురువే లేడని చెప్పినట్లు తోస్తుంది. తెలియనివారికి అదెంతో గొప్పదనిపించవచ్చుగాని, తెలిసినవారికి అదెంతో హీనమనిపిస్తుంది. రాముడు, కృష్ణుడు సాక్షాత్తు భగవదవతారాలైనా తమకెట్టి  గురువూ అవసరము లేదని విఱ్ఱవీగలేదు. నిజానికి పసితనంలోనే తల్లికి తన నోట పదునాలుగు భువనాలు దర్శన మిచ్చిన కృష్ణునికి గురు వెందుకు? భగవద్గీతలో ఆయన తనకు ముల్లోకాలలోనూ ప్రయత్నించి సాధించుకోవల్సిన దేమి లేదని స్పష్టంగా చెప్పారు. అయినప్పటికి శ్రేష్ఠులైనవారు యెలా నడుచుకుంటారో దానినే లోకులందఱూ అనుసరిస్తారు. కనుక వారికి కర్తవ్యము బోధించడానికి రాముడు, కృష్ణుడు గూడా గురువుల నాశ్రయించి, యెంతో కాలము సేవించారు. విశ్వగురుడైన దత్తాత్రేయుడు బ్రహ్మ, విష్ణు, శివాత్మకుడు, సాక్షాత్తు పరబ్రహ్మమే అయివుండిగూడా అవధూతగా భూమిపై అవతరించినపుడు తాను 24మంది గురువులను సేవించి, ధ్యానించి జ్ఞానము పొందినట్లు చెప్పాడు. శిరిడీలో సాయిబాబా అవతరించినపుడు గూడా ఆ దత్తాత్రేయస్వామి తనొక గురువును సేవించినట్లే చెప్పారు. శిరిడీలో జరిగిన చరిత్రనుబట్టి చూస్తే అట్టి గురుసేవా వృత్తాంతము నిజంగా జరిగి వుండటానికి అవకాశమే లేదు. 16 సంవత్సరాల యువకుడుగా ఆయన మొదట ప్రకటమయ్యేసరికి ఆయన పూర్ణుడుగా వున్నాడు. అంతకుముందు 12 సంవత్సరాలు ఆ వేపచెట్టు క్రింద భూగృహంలో వున్నారు. అంటే వారికి 4వ యేటనే సద్గురువు లభించారన్నమాట. అదెలా సంభవము? దీనినిబట్టి ఆయన శిరిడీ గ్రామానికి చెందిన పిల్లవాడై యుండాలి. కానీ ఆ గ్రామంలో ఆనాడు అలాంటి పిల్లవాడు లేడు. ఆయన 16 వ శతాబ్దికి చెందిన హుమాయూన్ చక్రవర్తికి అక్బరును కొడుకుగా ప్రసాదించామని చెప్పారు. తామే కబీరుననిగూడ చెప్పారు. తామే అక్కల్కోట స్వామి నన్నారు. 20వ శతాబ్దానికి చెందిన అక్కల్కోటస్వామియే 13వ శతాబ్దానికి చెందిన రెండవ దత్తావతారమైన శ్రీనృసింహసరస్వతీస్వామి. ఈ స్వామియే 1340వ సంవత్సరంలో పిఠాపురంలో అవతరించిన శ్రీపాదవల్లభుడు. అందుకే సాయిబాబా తమ వయసు లక్షల సంవత్సరాలు అని చెప్పారు. ఈ చర్చయొక్క పర్యవసాన మేమిటి? ఉత్తములైన సద్గురు వెన్నడూ తనకు గురువే లేడని చెప్పరు. ఇలా చెప్పినవారు ఆశ్రయించదగని నిషిద్ధ గురువని ఆధ్యాత్మ సాంప్రదాయము. కనుక వెంకయ్యస్వామి చెప్పిన యీ మాటలను ప్రత్యేకంగా అర్థము చేసుకోవాలి. ‘ నానుండి నీకేమి కావాలో దానిని పొందు. అంతేగాని నాకు గురు వున్నాడో లేదో, వారెవఱో, యివన్నీ నీకెందుకు?’ అని వారి మాటల కర్థము. తామే యిప్పుడు గురు వనబడు స్థితిలో వున్నారుగదా-దానిని వినియోగించుకుంటే చాలునని వారి భావము. ఆయన ‘మాది పదవచూపు’ అన్నారు. ఒక అధ్యాత్మ సంప్రదాయము ప్రకారము సాధకునిలో షట్చక్రా లనబడే ఆయా యోగశక్తి కేంద్రాలేగాక, భృకుటిలోని ఆజ్ఞాచక్రానికి, తలపైనుండే సహస్రారానికీ మధ్య మఱి మూడు యోగ కేంద్రా లున్నాయి. ఈ తొమ్మిదిటి పైనా

'పదవచూపు యైన సహస్రారచక్రము వుంటుంది. దాని మధ్యనే గురుపాదాలు లేక 'గురుపదము' లేక సద్గురు వనబడే ఆధ్యాత్మస్థితి వుంటాయి. మఱొక ఆధ్యాత్మిక సంప్రదాయము ప్రకారము మూలాధారమునుండి సహస్రారంవఱకు తొమ్మిది చక్రాలు. అటుతర్వాత సాధకుని కుడిరొమ్ములో అనుభవమయ్యే హృదయ స్థానమైనదే పదవచూపు. కొందఱు మహాత్ముల వలె స్వామి చెంతనగూడ నిరంతరము ధుని లేక నిరతాగ్నిహోమంగూడా వారికొక గురువుండి తీరాలన్న దానికి మఱొక గుర్తు. శిరిడీసాయిబాబా, శ్రీధునీవాలాదాదాల వలె స్వామిగూడా నిరంతరమూ అగ్నిహోత్రము చేసేవారు. ఆ మహాత్ములవలెనే స్వామిగూడ నైష్ఠికబ్రహ్మచారి, అంటే ఆజన్మబ్రహ్మచారి. నైష్ఠికబ్రహ్మచారి తన జీవితపర్యంతమూ తన గురువు చెంతనే వుండాలి. ఆ గురువు సమాధి చెందినా లేక అదృశ్యము, దివ్యము అయిన సూక్ష్మరూపంలో వున్నా, వారికి ప్రతిరూపంగా అట్టి సచ్ఛిష్యుడు నిరంతరమూ అగ్నిని వ్రేల్చి దానినే సేవిస్తూ వుండాలని శాస్త్రము. ఈ మహనీయు లందఱూ యీ సాంప్రదాయము పాటించినవారే. అందుకే స్వామి అగ్నినిగురించి 'ఇక్కడ జరిగేది కోటిలింగాల పూజ గదయ్యా!' అన్నారు. తిరుపతిలో జరిగిన ఒక యజ్ఞముగురించి ఒక భక్తుడు ఆయనతో చెబితే ఆయన 'అయ్యా! అక్కడ నలభైరోజులు జరిగే ఫలితము యిక్కడ నాలుగు గంటల్లో వస్తుండ్లా?' అన్నారు. అక్కడ తిరుపతిలో చేసే యజ్ఞంలో ఆరాధించబడే అగ్ని కేవలము ఒక దేవతయే. సాయిబాబా, వెంకయ్యస్వామి సేవించిన అగ్ని సకలదేవతా స్వరూపము, త్రిమూర్త్యాత్మకము, పరబ్రహ్మస్వరూపము అయిన సద్గురువే. అందుకే స్వామి 'స్వామి గుండం వేసుకోవడానికి 4 అంగుళాల దూరంలో తలవుంచి పడుకోవడము చూశాను. ఆ సెగకు మనమైతే ఓర్చుకోలేము' అని స్వామి సేవకులు చెప్పారు.

*శ్రీదత్తాయ గురవే నమః*

శ్రీఅవధూతాయ నమః

అధ్యాయము - 3

# అ వ ధూ త చ ర్య

మహాత్ము లందఱిలోనూ అవధూతలే అగ్రశ్రేణికి చెందినవారు. నాశము లేకుండుట (అక్షరత్వము), మహోన్నతస్థితి(వరేణ్యత్వము), లేశమైనా పాపము లేకుండుట(ధూతకల్మషత్వము), బ్రహ్మజ్ఞానము కలిగియుండుట - యివి అవధూత లక్షణాలని శాస్త్రము చెబుతుంది. వీరు పసిపిల్లలు, పిచ్చివారు లేక పిశాచగ్రస్తులవలె కన్పిస్తారని ఆదిశంకరులు చెప్పారు. వారికి తామే దేహ మన్న భ్రాంతి వుండదు. సర్వజీవులలోనూ వున్న ఆత్మే తామై వుంటారు. ఈ అవధూత సాంప్రదాయానికి మూలపురుషుడు- శ్రీదత్తాత్రేయుడు. అవధూత లందఱిలోని ఆత్మజ్ఞానమే ఆయన. స్నానఘట్టా లెన్ని వున్నా గంగానది ఒక్కటే, ప్రపంచములో యెందఱు తల్లులున్నా వారిలో మాతృత్వమొక్కటే. అలానే శ్రీదత్తస్వామి అవధూతలందఱి రూపాలలోను వుంటారు. అట్టివారిలో శ్రీవెంకయ్యస్వామి ఒకరు.

సద్గురు కృప వలన వెంకయ్యలో వచ్చిన పరివర్తన క్రమంగా ప్రజలు గుర్తించసాగారు. ఈ విశాల ప్రపంచమే తమ యిల్లుగా గల ఆయన ఫలానాచోట వున్నారని తెలిసి, తల్లిగారు ఆయనకోసము తినుబండారాలు తీసుకుపోయేది. ఆయన వాటిని తమతోకూడ వున్న వారందఱికీ సమానంగా పంచమని చెప్పి చివఱకు తాముగూడ తీసుకునేవారు. అందులో కొంచెము త్రుంచి చీమలకు వేసి, తర్వాత చాలా స్వల్పంగా మాత్రమే ఆయన తినేవారు. ఆయనొకరోజు తమ చెల్లెలి యింట్లో భోజనము చేశాక, కొద్దిసేపట్లో మళ్లా వెళ్లి అన్నం పెట్టమన్నారు. అన్నం లేదంటే రెండుశేర్లు రాగులు పెట్టించుకుపోయి చీమలకు పోశారు. వాటి ఆకలిగూడ తీరితేనే వారి ఆకలి తీరినట్లు. శిరిడీసాయిబాబాకు వలె ఆయనా యీ యింటివారి శ్రమగూడ ఆయ నెన్నడూ వుచితంగా తీసుకునేవారుగాదు. సాయంకాలం దాకా చేలలోను, అడవిలోను తిరిగితిరిగి వచ్చేటప్పుడు రెండు శేర్లు గుత్తివేరు మూటకట్టుకొచ్చి తమ చెల్లి కిచ్చేవారు.

ఆయన అలా వున్మత్తావస్థలో తిరుగుతున్నప్పుడు ఒకచోట దొంగతనము జరిగింది. దొంగలకోసం వెతుకుతున్న పోలీసులు స్వామిని అనుమానించి రెండురోజులు పోలీసుస్టేషన్‌లో వుంచారు. వెంటనే ఆయన రాజపద్మాపురంలో తన చెల్లెలి దగ్గఱకెళ్లి చెప్పుకొని యెంతగానో యేడ్చారట. ఆమె 'నిన్ను బంధించినవారిని తీసుకొచ్చి కొడతాంలే'! అని ఓదార్చాక వూరుకున్నారు. ఇటువంటి బాల్యచేష్టతోపాటు వారిలో యెంతో నిర్దుష్టమైన ఆధ్యాత్మదృష్టిగూడ తొంగిచూచేది. వారి తల్లి చనిపోయినదని చెబితే ' అమ్మవుండ్లా? చావలేదు' అన్నారు. అన్నగారు చనిపోయినపుడుగూడ శోకించేబదులు 'చచ్చిపోలేదు, వున్నాడు, వస్తాడులే!' అన్నారు. మరణించేవి శరీరాలే, జీవుడు తిరిగితిరిగి పుడుతూనే వుంటాడు.

స్వామి చర్యలు యెవఱికీ అర్థమయ్యేవిగావు. బద్వేలు వద్ద పెన్నానదికి స్వయంగా యిసుక మోసి ఐదడుగుల యెత్తున కట్టవేసేవారు. అలా నిలిచిన నీటిని చిన్న కాలువలు ద్వారా నదీ ప్రవాహాని కెదురుగా కొంత దూరము పాఱించి, తిరిగి ప్రవాహంలో కలిపేవారు. అది నదిలో కలిసే చోట నీటిపై కంపతుక్కు వేసి దానికి నిప్పు పెట్టేవారు. అపుడు మనుష్యు లెవ్వఱినీ దగ్గఱకు రానిచ్చేవారుకాదు. ఈ నీటిని ముంతతో తీసుకొని మంటకు రెండువైపులా తిరగబోస్తుండేవారు. 'ఎందుకు స్వామి యిదంతా?' అంటే 'పెద్దవారు, ధూమాలు పాపం తగ్గేందుకయ్యా!' అనేవారు. సాయినిగూడ, ధునిని వెలిగించడ మెందుకు? అని అడిగితే 'మీ పాపాలు దహించడానికి' అన్నారు. అలానే కోటితీర్థం దగ్గఱ పెన్నానదిలో చాలా పెద్ద దూలం కొట్టుకొచ్చింది. దానిని మోసుకుపోలేక యెందఱో తిరిగిపోయారు. కానీ స్వామి ఒక్కరే దానిని తెచ్చి తన అగ్నిగుండంలో వేశారు. బంగారం లాంటి దూలాన్ని ఆయన పాడుచేశారని కోపించి ఒకడు ఆయన చెంపమీద కొట్టాడు. అతడు తిరిగి యిల్లు చేరేసరికి అతని యిల్లు తగలబడుతోంది. ప్రక్క యిండ్లవారు మొరపెట్టుకుంటే స్వామి 'పాపమున్నంతవఱకూ కాలిపోతుంది. మిగిలినది నిలుస్తుంది' అన్నారు. నిజానికి ఆ కొట్టినవాడి యిల్లు ఒక్కటే తగలబడింది.

మఱొకరోజు ముదిగేడులో ఒకరింటికి వెళ్లి ఆ యిల్లాలిని పిలిచి 'నేనమ్మా పిచ్చోడ్ని, అంత ముద్ద పెడతావని వచ్చాను' అన్నారు. అన్నం పెట్టిన తరువాత 'నాలిక్కాడకు యేమైనా అంత వేయమ్మా!' అన్నారు. ఆమె విసుక్కుంటూనే అంత పచ్చడి వేసింది. ఆయన 'అంత ధారవేయమ్మా!' అన్నారు. ఆమె కోపగించుకొని నెయ్యి లేదన్నది. ఆయన వినిపించుకోకుండా 'ఉట్టి పైన దుత్తలో వుంది వెయ్యమ్మా!' అన్నారు. కానీ ఆమె కసిరికొట్టింది. వెంటనే వుట్టి తెగి క్రిందిపడి నెయ్యంతా నేలపాలైంది.

ఆరోజుల్లో చల్లాసుబ్బమ్మ ఒకసారి కచేరి దేవరాయపల్లెలో వేణుగోపాలస్వామి ఆలయ శంఖుస్థాపనకు జ్వరంతోనే వెళ్లింది. అక్కడ భక్తులు తండోపతండాలుగా చేరారు. ఆ మహాజనంలో పుట్టగోచి పెట్టుకొని

ఒళ్ళంతా మసి పూసుకొని పిచ్చివానిలా వున్న ఒక వ్యక్తి ఆమెను పలకరించి 'ఈ విభూతి నోట్లో వేసుకొని మెడకు, బొడ్డుకు పూసుకో! బాగైపోతుంది' అన్నాడు. ' నీవెవఱు?' అని అడిగితే ' నేను అడవులలో వుంటాను, ఊళ్లోకి రాను. ఈయన జాబురాస్తే వచ్చా' అని వేణుగోపాలస్వామి ఆలయము చూపాడు. ఆ విభూతిని తినగానే ఆమెకు జ్వరం తగ్గిపోయింది. ఆమె ఆశ్చర్యంతో 'నీవెక్కడుంటావు?' అంటే 'కోటితీర్థం దేవాలయంలో! శుక్రవారం వచ్చి దేవాలయంమీద చూడు!' అన్నారు. ఆతర్వాత ఆయనే వెంకయ్యస్వామి యని తెలిసి కోటితీర్థము దేవాలయానికి వెళ్లింది. నాటిరాత్రి ఆమెకు మెలకువగా వుండగానే చెప్పలేని సౌందర్యంతో పార్వతీదేవి దర్శన మిచ్చింది. దేవాలయం పైన ఆమెకు ఒక దివ్యమైన వెలుగుగూడా కనిపించింది. అది మొదలు ప్రతి శుక్రవారము స్వామిని సేవిస్తూ వారికి నూతన వస్త్రములు, ఆహారమూ 3 నెలలపాటు సమర్పించింది. అప్పట్లో స్వామి పెన్న నీటికి కట్టలేస్తుండేవారు. వారి దగ్గఱ పనిచేసేవారికి గూడ యీమె అన్నం పెట్టేది. భక్తులు సమర్పించే దక్షిణ అంతా స్వామీ పనివారికిచ్చేవారు. ఒకరోజు ఆమె 'స్వామి! నా దగ్గఱ బంగార మున్నది. ఇక్కడ భద్రత లేదు. రాత్రికి వూళ్లోకిపోయి పడుకుంటాను' అంటే ఆయన 'అమ్మా! దొంగలు రారు, వస్తే పోరు' అన్నారు. ఆమె ధైర్యంగా అక్కడే పడుకొన్నది. ఆమెకు రాత్రి మెలకువ వచ్చి చూస్తే స్వామి నిలువెత్తు మంటలలో వున్నారు. దొంగలు ఆయనను కొట్టి మంటలలో పడేసివుంటారని భయపడి ఆమె ఆ ప్రక్కనున్న దేవాలయంలో దాక్కొన్నది. కొద్దిసేపయ్యాక స్వామి ఆమె దగ్గఱకు వచ్చి, 'కొంచెము పుగాకు పెడతావమ్మా!' అని అడిగారు. ఆయనను చూచాక ఆమె ప్రాణం కుదుటపడింది. ఆమె చూచిన విషయంగురించి అడిగితే స్వామి యేమీ చెప్పలేదు.

ఆరోజులలో పసుపులేటి లక్ష్మమ్మ తరచుగా వచ్చి స్వామి సన్నిధిలో భజన చేసుకున్నది. ఆయ నెన్నడూ 'ఇంకొన్నాళ్లు వుండి భజన చేసుకో. నాకు కోట్లు లాభమొస్తుంది' అనేవారు. ఒకసారి ఆయన స్వప్నంలో కన్పించి, 'ఒక నెలా రెండు రోజులు భజన చేసుకుంటే నిన్ను దేవుని లెక్కలో వేస్తారు' అన్నారు. ఆ కలను ఆమె పట్టించుకోలేదు. పదిహేనురోజుల తర్వాత ఆమె మఱలా స్వామిని దర్శించి భజన చేశాక ఆయనకు భిక్షాన్నం తెచ్చిస్తూండేది. కొద్దిరోజులయ్యాక ఆమె తల్లికి జబ్బుచేసిందని తెలిసి సెలవు అడిగితే స్వామి రోజు వాయిదా వేస్తున్నారు. చివఱికి ఆమె చలమానాయుడు చేత అడిగించింది. స్వామి అర్ధరూపాయిస్తే యెవతైనా వాళ్ల అమ్మకు సేవచేస్తారు. ఈమెకు కోట్లు లాభమొస్తుంటే పోగొట్టుకొమ్మని చెప్పమంటావా? ఇంకొకవారం వుండమను' అన్నారు. ఆమెను తీసుకువెళ్లడానికి ఆమె అన్నగారు వచ్చినా స్వామి అలానే చెప్పి పంపేశారు. లక్ష్మమ్మ మళ్లీ అడిగిస్తే 'ఆమె కాళ్లకు కురుపులు లేచి యిక్కడ పడివున్నది' అని వాళ్లింటికి కబురు చేయమన్నారు. ఆమె స్వామి అబద్ధం చెప్పి పంపారేమో అనుకున్నది. తెల్లవారేసరికి ఆమెకు చీలమండలపై నిమ్మకాయంత

కురుపులు లేచాయి. స్వామికి చెబితే చలమానాయుడుతో 'చలమయ్యా! చూడవయ్యా, భోజనము చేసుకుంటూ యిక్కడ పడివుండమంటే యీమె దుర్బుద్ధి మాటలు మాట్లాడుతున్నది' అన్నారు. మొదట్లోనే స్వామి మాటలు విననందుకు పశ్చాత్తాపపడిందామె. ఆ సాయంకాలమే స్వామి 'ఏమమ్మా! కురుపులు లేచాయా? పోతాయిలే' అని ఆమె పాదాలు తన చేత్తో నిమిరారు. రెండురోజులలో కురుపులు పోయాయి. స్వామి స్వప్నంలో చెప్పిన తమ ఆదేశాన్ని ఆమెచేత పాటింపజేసి అపారమైన పుణ్యం ఆమెకు యిచ్చారు. మఱురోజు ఆమె సెలవు అడిగితే సంతోషంగా చీటీ వ్రాయించి ఆశీర్వదించి వెళ్లమన్నారు. ఆమె 'స్వామి! నెలా రెండురోజులు భజన చేస్తే లెక్క సరిపోతుందన్నారే. ఆతర్వాత సంగతేమిటి?' అంటే స్వామి 'అంతవఱకు ఒక మెట్టు యెక్కావు. ఆ తర్వాత యింకా వున్నది' అన్నారు. ప్రస్తుతం ఆమె స్వామి సన్నిధిలో వుంటే ఆరోగ్యంగా వుంటుంది. ఇంట్లో వుంటే అనారోగ్యంతో బాధపడుతుంది.

తరచుగా స్వామి సోమశిల దగ్గఱ కొండ మీద చిన్న గుడిసె వేసుకొని ఒక నూనెదీపం దగ్గఱ రాత్రంతా తంబూర మీటుతుండేవారు. ఒకనాటి సాయంకాలం సేవకుడు చలమానాయుడితో 'అయ్యా! మఱొ యిద్దఱు మనుష్యులకు అన్నం తీసుకొనిరా!' అని చెప్పి తెప్పించారు. నాటి రాత్రి దారితప్పి యెన్నో అవస్థలుపడి యిద్దఱు భక్తులు స్వామి దర్శనానికి వచ్చారు. వారికి ముందే స్వామి భోజనం యేర్పాటు చేశారన్నమాట. అప్పుడప్పుడూ సేవకులతో స్వామి, 'ఊరిలోకి పోయి యెవఱినైనా అడిగి ప్రాతగుడ్డలు తీసుకురావయ్యా! మనకు పనీ గడుస్తుంది! వాళ్లకూ జబ్బులు పోతాయి' అనేవారు. తమకు పరిచర్య చేసేవారిలో పరదూషణ, కోపము వంటి లోపాలు యేమాత్రమున్నా వారి సేవను స్వీరించేవారుగారు. ప్రతిదినము ఆ సేవకునిచేత పొగాకు చేతిలో పెట్టించుకొనే స్వామి, అలాంటి సమయాలలో 'క్రిందవేయి, తీసుకుంటాను' అనేవారు. ఎవఱివద్ద నైనా చిగిపోయిన ప్రాతగుడ్డలు తీసుకొనేవారుగాని, విలువైన గుడ్డలు స్వీరించేవారుగారు.

ఒకప్పుడు ఒక శ్రీమంతుడు ఖరీదైన దుప్పటి ఒకటి బలవంతంగా స్వామి చెంతన వుంచి వెళ్లిపోయాడు. దానిని సేవకులు తీసుకున్నారు. స్వామి దానిని యెఱుగనట్లు 'అయ్యా! ఒక క్రొత్త దుప్పటి కావాలి' అని స్వీకరించి దానిని జానెడు పీలికలుగా చింపియిచ్చి, 'ఇవి యిస్తే జబ్బులవాళ్లకు జబ్బులు పోతాయి' అన్నారు. మఱొకప్పుడు ఒక చినిగిపోయిన పాతబ్యాగ్‌ను స్వామి చెంతవుంచి వెళ్లాక అర్ధరాత్రి అందఱూ నిద్రలో వుండగా స్వామి దానిని ధునిలో కాల్చిపారేశారు. ధనికులొచ్చి ధనం కుమ్మరించనంతమాత్రాన వారికి ప్రశ్నలు చెప్పేవారుకారు. పైవాళ్లు ఒప్పుకోలేదనిగాని మాటరాలేదనిగాని చెప్పిపంపేసేవారు. భక్తిశ్రద్ధలు గలవారికి వారు అడగకుండానే తమ ఆశీస్సుల చీటీ వ్రాయించి యిచ్చేవారు. కోరికలు తీరిన భక్తులు సంతర్పణ చేసిన

పండుగనాడుగూడ వారు మాత్రము భిక్షాన్నం మాత్రమే తినేవారు. అయ్యా! వీరు పెట్టారుగదా' అని మనము భిక్షకుపోకుంటే ఱేపు మళ్లీ వెళ్లినా పెట్టరయ్యా' అనేవారు.

స్వామి తమలో వచ్చిన పరివర్తనగురించి చెప్పిన వాక్యాలలో సాయికీ వారికీగల పోలిక చక్కగా ప్రతిబింబిస్తుంది. 'అయ్యా! నేను అందఱిలాగా పిచ్చమ్మ, పెంచలచాయుడికి పుట్టాను అనుకుంటున్నావా?' అనేవారు. ఒక భక్తుడు 'మీరు కొండలలో కోనలలో తిరుగుతుంటే మాకు మీ దర్శనము దొరకడం లేదు. ఎలా స్వామి?' అంటే, 'అబ్బే, ఎక్కడ తల్చుకుంటే అక్కడే వుండ్లేదయ్యా!' అన్నారు. రాఘవరెడ్డి పెద్దజబ్బుతో స్వామివద్దకు వచ్చి తన జబ్బు నయంచేస్తే చాలా డబ్బు యిస్తామని చెప్పాడు. సేవకులతో స్వామి 'ఏమిటయ్యా ఆయన అనేది. అందఱికి మన మిస్తుంటే ఆయనేంది మన కిచ్చేది?' అన్నారు. మఱొకసారి 'స్వామి! మీరు కొండల్లో గుట్లలో తిరుగుతుంటే దర్శించడ మెలా?' అన్నారొకరు. 'అదేముందయ్యా? కొండమీదకు యెక్కి, బెత్తడేగదయ్యా' అన్నారు. కొండంటే తల, మనస్సును అద్దంలా శుభ్రంగా, నిశ్చలంగా నిలిపితే స్వామి యెక్కడున్నా మనోనేత్రంతో చూడగలమని వారి భావము. 'బోటుఱాయి' అంటే మాడు, దానిపై సహస్రార మనే ఒక యోగ కేంద్ర ముంటుంది, దానిలోనే శ్రీగురుచరణా లుంటాయి. అందుకే స్వామి, 'మీకు మాకూ బెత్తడే కదయ్యా!' అన్నారు. మఱొకసారి మీరు మమ్మల్ని చూస్తే మేము మిమ్మల్ని చూస్తుండ్లా? అన్నారు. సద్గురువుపై భక్తిశ్రద్ధలతో మన దృష్టి నిలిపితే వారి కృపాదృష్టి మనకు లభిస్తుంది. అందుకే సాయిబాబా 'నీ దృష్టి నాపై నిలుపు, నా దృష్టీ నీపై నిలుపుతాను' అన్నారు. మఱోసారి 'అయ్యా! వెంకయ్య పేరుమీద పిడికెడు మెతుకులు పెట్టినవారికి, వానిని తెచ్చినవారికి మంచిచెడ్డలన్నీ మనము సరిచేయవద్దయ్యా?' అన్నారు. స్వామి చివఱిదశలో సేవకులు 'స్వామి! మీరుపోతే మాకు దిక్కెవఱు?' అంటే, 'పోయే దెక్కడికయ్యా! సూర్యచంద్రు లున్నంతవఱకూ వుండేదేకదా' అనేవారు. అంతేగాదు. ఒకప్పుడు ఆయన అన్నారు : 'ఇప్పుడేముందయ్యా! వెంకయ్య చాటుకు పోయినతర్వాతగదా వుండేది?' ఇక్కడ నెల్లూరు రంగనాయకస్వామి గరుడసేవ జరిగినట్లు జరుగుతుంది. పూర్తి విశ్వాసంతో యిక్కడకు వచ్చి యే పని అనుకుంటే అది అయ్యేదేగదయ్యా' అన్నారు.

చలమానాయుడు, పోలిరెడ్డి మొదలగు సేవకులతో కలసి స్వామి నెల్లూరు ప్రాంతంలోని గ్రామాలలో సంచరిస్తూ అపుడపుడు అగ్నిని కూడా సేవించేవారు. భక్తులకు సిరాతో కాగితాలపై తమ వేలిముద్రలు వేసి ప్రసాదంగా యిచ్చేవారు స్వామి. అందుకే రోజూ యెన్ని కాగితాలయినా, యెంత సిరా అయినా సరిపోయేవి కావు. వారి కృపవలన తమ వ్యాధులు, పశువులు, ఆపదలు తొలగినవారు స్వామికి కాగితాలు, సిరాబిళ్లలు బస్తాలకొద్ది సమర్పించేవారు.

స్వామి భోజనము చేసే పద్ధతి చిత్రంగా వుండేది. మొదట ఆయన విస్తరినిండా అన్నం పెట్టించుకొని మజ్జిగ పోయించుకొని తినేవారు. తర్వాత విస్తరిచుట్టూ కట్టలా వున్న అన్నమంతా యే వైపుది ఆ వైపుకు నేలపై చల్లేవారు. ఆయన మామూలుగా భోజనము చేసే వేళలో పళ్లెము నిండుగా మూడు విస్తర్లకు సరిపోయే అన్నం ఒక్కసారిగా బోర్లించాలి. మొదట ఆ సిరా చేత్తోనే అన్నదాతకు ఒక విస్తరి సరిపడా ప్రసాదం యిచ్చేవారు. రెండవ విస్తరినిండా వడ్డించిన దానిని పెద్ద ముద్దలు చేసి విస్తరిచుట్టూ పెట్టి వాటి చుట్టూ చిన్న ముద్దలు పెట్టి, మాఱు వడ్డించుకొనకుండా మిగిలిన అన్నమే తినేవారు. ఒక్కొక్కప్పుడు పండుమిరపకాయలు, ఉప్పు, ఎఱ్ఱుల్లిపాయ అన్నంలో కలుపుకుని తినేవారు. అరుదుగా కొంచెము బెల్లమో లేక కరివేపాకు, చింతాకు, ధనియాలు వేసిన కారప్పొడి అడిగి పెట్టించుకొనేవారు. ఒకప్పుడు తమ నడినెత్తిన త్రాకిన తమ చేతిని ముమ్మారు అన్నానికి అద్ది ఒక భక్తునికిచ్చి 'అందఱికీ పెట్టయ్యా, జబ్బులు పోతాయి' అన్నారు. వారు అలాగే చేశారు. ఒక్కొక్కప్పుడు ఆయన ఆకు, వక్క పెట్టమని యెంతో తొందరపెట్టేవారు. అది తిని 'చప్పగా వున్నదయ్యా, కారంగా చేసి యింకొంచము పెట్టు' అనేవారు. ఈసారి సున్నం కాస్త యెక్కువ పెడితే, 'తినమ్మా, ఇది బాగుంది, తిను' అని యెవఱో అదృశ్యశక్తితో అన్నట్లు చెబుతూ తినేవారు. తర్వాత 'ఆమెను పొమ్మని చెప్పయ్యా, అంతా నేను చూచుకుంటాను' అనేవారు.

స్వామికి నిత్యము యే సేవైనా ఒక్కరే చేయాలి. ఇలా జావ పోసేపని రోశిరెడ్డి చేసేవాడు. ఇంకెవఱు పోసినా త్రాగేవారు కాదు. ఆయన జావమాత్రమే త్రాగే రోజులలో అప్పుడప్పుడు తెల్లగడ్డలు వుడకపెట్టిగాని, కాల్చిగాని యిమ్మని అడిగి చప్పరించి మ్రింగేవారు. ఒకరోజు వేఱొకరు అన్నం పెట్టబోతే వారిని పొమ్మని చెప్పి, రోశిరెడ్డిని పిలచి 'అన్నం నీవు పెడితే పెట్టు లేకుంటే నన్ను బండిలో వుంచి ఆశ్రమంలోంచి లాగేయ్' అన్నారు.

కట్టెలు కొట్టి తెచ్చే రమణయ్యతో ఒకరోజు స్వామి 'ఈరోజు యిక్కడే వుండి, నీళ్లు, నిప్పు చూడయ్యా!' అన్నారు. అతనికి అర్థంగాక కట్టెలు కొట్టడానికి వెళ్లి చెట్టుమీదనుండి క్రిందపడ్డాడు. భుజం దగ్గఱ యెముక విరిగింది. కానీ అతడు ప్రక్కనే బెత్తెడు దూరంలో వున్న బండలమీద పడివుంటే మరణించేవాడే. ఆ సంగతి చెబితే స్వామి, 'ఆయనకు ఆసుపత్రే దిక్కు' అని చీటీ వ్రాయించారు. ఆయన మాట వింటే ఆయనే దిక్కు, విననివారికి ఆసుపత్రే దిక్కు. ఆయన పద్ధతి మాత్రం 'పోయేవారిని పోనిచ్చేదేగదయ్యా' అన్నదే.

సామాన్యంగా అగ్నిగుండాన్ని యే సేవకులు సవరిస్తున్నా ఆయన అడ్డుచెప్పేవారుగారు. కానీ ఒక్కొక్కప్పుడు దానిచెంతకు యెవఱినీ రానిచ్చేవారుగారు. 'అబ్బో! ఇపుడు తాకవచ్చా?' అనేవారు. ఒకసారి బొంతజెముడు కట్టెలు మండుతుంటే స్వామి పకపకా నవ్వుతూ, 'బొంతలు పోట్లాడుకుంటున్నాయయ్యా!'

అన్నారు. అగ్నిగుండాన్ని యెవ్వఱినీ తాకనీయని రోజున ఒక వ్యక్తి అక్కడ నుంచొని వెనకాడుతుంటే స్వామి 'ఏమయ్యా! బీడీ కాల్చుకుంటావా, కాల్చుకో!' అని ఆ నిప్పుతో అతనిని బీడీ అంటించుకోనిచ్చారు.

ఇక స్వామి పడుకునే విషయము గమనిద్దాము. మొదట ఆయనను వరిగడ్డిపై ఈత లేక తాటాకు చాపవేసి దానిపై గోనెపట్టా కప్పి కూర్చోబెట్టేవారు. ఆయన దానిపైనే పడుకోనేవారు. వక్కెమ్మ అను సేవకురాలు ఒకసారి ప్రోగచేసిన దొండపొట్టుతో పరుపు తయారుచేసి వేసింది. అది చినిగిపోయాక భక్తులు దూదిపరుపులు వేశారు. మహాసమాధికి 3 సంవత్సరాలముందునుండి ఆయన సమాధిస్థితిలో వుండేవారు. 'రాత్రిపగలు తెలియట్లేదయ్యా, ఇపుడు పొద్దెంతో అనేవారు. అలానే 'ఇది యే వూరయ్యా' అని అడుగుతుండేవారు. ఆత్మనిష్ఠలో సూర్యచంద్రుల గమనమే తెలియదని శాస్త్రములు చెబుతూన్నాయి. అందుకే భక్తులు వారికి పరుపువేసినా ఆయనెట్టి అభ్యంతరము చెప్పలేదు. ఒక్కొక్కపుడు రెండేసిరోజులపాటు తెంపులేకుండా 'బండి ఆపండయ్యా అని అఱుస్తూ కదలక ఒకే ఆసనంలో కూర్చునేవారు. తర్వాత రెండురోజులు యోగనిద్రలో వుండేవారు. అలాంటి సమయములో 1979 ప్రాంతంలో ఒకరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆయన లేచి కూర్చొని, అపుడే వచ్చిన పెసలసుబ్బరామయ్యకు చీటీ వ్రాయించి యిచ్చి ఆశీర్వదించి, మళ్లీ నిద్రపోయారు. భక్తులు జావ త్రాగమని పిలిచినా వినిపించుకోలేదు. కొద్ది నిముషాలలో సుబ్బరామయ్య అమ్మమ్మగారు మరణావస్థలో వున్నారని కబురొచ్చింది. వెంటనే అతడు యిల్లుచేరి స్వామి పాదతీర్థము, విభూతి ఆమె నోట్లో వేస్తే ఆమె త్రాగింది. మందుమాత్రము త్రాగలేదు. మరుక్షణమే ఆమె ప్రాణం విడిచి సద్గతి పొందింది. అంటే అంత నిద్రలోనూ స్వామికి తమ ఆశీస్సులకోసము సుబ్బరామయ్య వస్తున్నాడని, మఱికొంతసేపటికి అతని అమ్మమ్మ మరణిస్తుందనీ తెలుసన్నమాట. అక్కల్కోటస్వామిగూడ యెంత గాఢనిద్రలోనయినా లేచి, భక్తుల మనస్సులోని భావాలకు సమాధానము చెప్పి నిద్రపోయేవారు. సాయిబాబా కూడా రాత్రి సమయములో యెక్కడెక్కడ ఆర్తులను తాము యెలా ఆదుకున్నదీ చెబుతూండేవారు.

స్వామి తిరిగేరోజుల్లో కూడా చెప్పులు వేసుకొనేవారుకారు. ముళ్లు గ్రుచ్చుకుంటే తీసుకునేందుకు మల్లెముళ్లు, సూదీ, దబ్బనం, చాకు తమతో యెప్పుడూ వుంచుకొనేవారు. వారి కాళ్లనుండి భక్తులు పెద్దముళ్లు కూడా తీస్తుండేవారు. తర్వాత భక్తులతో కలసి తిరిగేరోజుల్లోకూడా ఆయన చెప్పిన వెంటనే సేవకులు అందఱూ బయలుదేరవల్సిందే. చార్జీలకు డబ్బు లేదని భక్తులంటే 'అదే వస్తుంది కదలండయ్యా!' అనేవారు. భోజన సమయమైనా కూడా ఒక్కొక్కపుడు అన్నం తినేవఱకుకూడా ఆయన ఆగేవారుకారు. భోజనం సంగతి యెత్తితే 'అన్నం వస్తుందిలే పదండయ్యా!' అనేవారు. ఒకసారి అలానే అకస్మాత్తుగా అందఱూ బయలుదేరి తలుపూరు బస్టాండ్‌కు చేరారు. మొదటి బస్సు రాగానే స్వామి 'ఇది కాదు, తర్వాత బస్సుకు పోదాం' అన్నారు. ఇంతలో

పొట్టిపాలెం ఆదిలక్ష్మమ్మగారు కారులో స్వామి దర్శనానికి వచ్చి గంపతో దోసెలు, వడలు, పొంగలి, పులిహోర తెచ్చి అందఱికీ పెట్టి, వారి అవసరానికి మించిన పైకము దక్షిణ సమర్పించింది. స్వామి బయలుదేరదీసిన అనేకసార్లు యిలానే జరిగింది.

స్వామి తిరిగేరోజులలో మోపూరి దశయ్య, వెంకటయ్య వంటి సేవకులు కట్టెలు, బొంతజెముడు చెట్లు కొట్టుకొని వచ్చేవారు. వారితోకూడ స్వామి వెళ్లి, కొన్ని చెట్లును చూపి వాటినే కొట్టమనేవారు. ఆలోగా ఆయన కొంతదూరంలో యేకాంతంగా తిరుగుతుండేవారు. రమణయ్య ఆ కట్టెలు బండిలో ఆశ్రమానికి తోలేవాడు. ఇలా కొన్ని మైళ్లవఱకూ చెట్లులేకుండా పోయాయి. స్వామి 'ఇదంతా పంటచే లవుతాయయ్యా!' చిన్నచిన్న పంటలు పండుతాయి' అనిగాని, ఇక్కడంతా వూరవుతుంది, గోవుపాదమంత స్థలముకూడా చిక్కదు అని గాని అనేవారు. అదంతా యీనాడు నిజమైనది.

స్వామి వృద్ధులై నడవలేకుండా వచ్చాక ఒక ముంతలో మూత్రవిసర్జన చేస్తే తీసేసేవారు. మలవిసర్జనకు వూరుబయట యేకాంత ప్రదేశానికి తమను తీసుకువెళ్లమనేవారు. అక్కడ గడ్డీ లేక ఆకులు పఱచి దానిపై ఈతచాపవేసి పడుకోబెట్టి దూరంగా వస్తే మలమూత్ర విసర్జన చేసేవారు. వెంటనే వేడినీటి స్నానము చేసేవారు. మహాసమాధికి ఒక సంవత్సరము ముందు ధ్యాననిష్ఠలో బాహ్యప్రజ్ఞ లేక మలమూత్ర విసర్జన పరుపుమీదనే చేసేవారు. స్నానానికి పెట్టిన నీరు కొంచెము యెక్కువ వేడి వుంటే 'అబ్బా, అబ్బా!' అంటూ స్నానం చేసేవారు. వేడి చాలకుంటే 'చలి చలి' అనేవారు. వేడి సరిపోతే 'అది అదీ' అంటూ స్నానం చేసేవారు. ఒక్కొక్కపుడు 'ఇంకచాలమ్మా' అనేవారు. స్వామిని తుడిచి ప్రక్కపై పడుకోబెట్టాక, వారి కౌపీనం పిండిన నీటిని సేవకులు తీర్థంలా స్వీకరించేవారు. అందువలన వానికి యెన్నో బాధలు, రోగాలు తగ్గేవి. సాయిబాబా భక్తుల అనుభవంకూడా యిట్టిదే. స్వామి సబ్బు రుద్దనిచ్చేవారు కారు. సీకాయపొడి వంటివే వాడవలసివచ్చేది. ఒక్కొక్కపుడు ఆయన అడిగి, నువ్వులనూనెతో మర్దన చేయించుకునేవారు. అలాంటప్పుడూ, స్వామి కాళ్లల్లో ముళ్లు తీసేటప్పుడు భక్తులకు వారి స్పర్శ లభించేది.

స్వామి తమ శరీరానికి యెట్టి సుఖమూ అంగీకరించేవారుగారు. మంచుపడుతుందని పందిరి వేస్తే ఆయన ఆఱుబయటకుపోయి పడుకునేవారు. భక్తులు దోమతెర కడితే దాన్ని పీకిపారేసేవారు. చివఱిరోజుల్లో వారు కదల్లేనపుడుమాత్రమే భక్తులు యిటువంటి సేవలు చేయగలిగారు. ఈ విషయంలో స్వామి సాయిని యెంతగానో పోలియున్నారు.

ఇలా స్వామిని సన్నిహితంగా సేవించినవారి దివ్యానుభవాలు యెన్నో! ఒకరోజు రోశిరెడ్డితో స్వామి 'కుడిచేత్తో రెండుపుడిసెళ్లు నీళ్లు త్రాగు' అన్నారు. నాటినుండి అతనికి దాహమే నశించింది. ఒకరోజు స్వామి

'ఈరోజు యెవఱూ మాట్లాడకూడదు. వక్కమ్మను తీసుకొని సముద్రస్నానానికి పోవాలి' అన్నారేగాని ఆయన వెళ్లనేలేదు. ఆరోజు వక్కమ్మకు సముద్రస్నానం చేసినట్లు కలొచ్చింది. రోశిరెడ్డి స్వామి మంత్రాన్ని రోజు ఔషధంగా స్వీకరించేవాడు. సర్వరోగాలనుండి అతడు విముక్తు డయ్యాడు. నేటికీ అతనికి కంటిచూపు లేకున్నా, అన్నం మానివేసి అటుకులు, ద్రవాహారంతో జీవిస్తున్నాడు. స్వామి ఆదేశాన్ని అనుసరించి భిక్షకు వెళ్లి భక్తులకోసం భిక్షాన్నం తెస్తున్నాడు. ఇతఱులు స్వామికి సేవ చేస్తే అతడు స్వామి సేవకులకు సేవ చేస్తున్నాడు.

ఒకసారి నెల్లూరు పొట్టిపాలెం వద్ద స్వామి ఒక ఇసుకతిన్నెపై గుండం వేసుకొని మకాం చేశారు. అక్కడ పుచ్చపాదులు పెట్టిన రైతులు తమ తోటలకు కాపలాకు లోపముండదని సంతోషించారు. ఒకరోజు వర్షమొచ్చి యేరు పొంగుతున్నది. రైతులు 'ముసలాయనా! ఏటికి నీరెక్కువ వస్తున్నది. ఊర్లోకి పోదాం రావయ్యా!' అన్నారు. కానీ స్వామి కదల్లేదు. తర్వాత యేరు గట్లు తన్నుకొని సుమారు 20 అడుగులు లోతున పారినట్లు గట్టున వున్న వేపమానులకంటుకున్న యల్లవ తుట్టులు చెబుతున్నాయి. మూడవరోజు రైతు లొచ్చి చూచేసరికి స్వామి యథాస్థానంలో వున్నారు. ఆయన చుట్టు 10 గజాలవఱకు ఇసుక పొడిగా వుండటము చూచి రైతులు ఆశ్చర్యపోయి స్వామికి ప్రణమిల్లారు.

రాజపద్మాపురంలో ఒకడు ఒక బక్కయెద్దును చేనుకు తోలుకొస్తున్నాడు. అది ఒకచోట నడవలేక పడిపోయింది. దానిని అతడు లేవమని కొడుతున్నాడు. అక్కడికి కొంతదూరంలో వున్న స్వామి ఒక సేవకుని పిలిచి 'అయ్యా! ఈ దారినేపోయి యెద్దును కొట్టే ఆయనతో కొట్టవద్దని చెప్పు' అన్నారు. సేవకుడు తిరిగివచ్చి తాను యెంత చెప్పినా ఆ వ్యక్తి వినడంలేదని చెప్పాడు. స్వామి స్వయంగా వెళ్లి యెద్దును తాకి 'లేయ్!' అన్నారు. దానికంత శక్తి యెలా వచ్చిందోగాని చివుక్కున లేచింది. అపుడు స్వామి 'అయ్యా! 4 రోజులు బండి కట్టమోకు. తర్వాత బాగనే సేద్యము చేస్తుంది' అన్నారు.

స్వామి రాజపద్మాపురంలో ఒకరింటికి వెళ్లి 'తినడానికి యేమైనా పెట్టమ్మా!' అన్నారు. ఆరోజు వారింట్లో తినేందు కేమి లేదు. లేదని స్వామికి చెప్పవలసివచ్చిం దని ఆ యిల్లాలు వెనుకాడుతుంటే స్వామి 'కొంచెము కారప్పొడి పెట్టమ్మా!' అన్నారు. అప్పుడు వారింట్లో అదొక్కటే వున్నది. ఆమె వెంటనే ఒక గ్లాసెడు మిరప్పొడి ఒక పళ్ళెంలో పోసిచ్చింది. ఆయన వెంటనే అదంతా తినేసి ఆశీర్వాదంగా ఆమెకు చీటీ వ్రాయించిచ్చి వెళ్లారు.

ఒకరోజు స్వామికి కాళ్లు, చేతులు కాలాయి. వారికి అప్పుడప్పుడూ మూర్ఛ వలె వచ్చేది. అట్టిస్థితిలో వారు మంటలో పడితే కాలిందని అనుకున్నారు. కానీ వారిని అడిగితే 'అయ్యా పైవాళ్లు వచ్చి ద్రావకము పోసిపోయారయ్యా' అన్నారు. ఆ గాయాలు మానుతుంటే స్వామి వాటి పైచెక్కు పెరికేసేవారు. ఇలా మూడు నెలలు ఆయన కోరి బాధ తెచ్చుకున్నారు. అవి యెవఱు అనుభవించవల్సిన బాధలో!

స్వామికి ఒకనాడు నాగజెముడు ముల్ల గ్రుచ్చుకున్నది. సేవకులు వారి పాదం కుట్టి గాయము చేశారేగాని ముల్లు తీయలేకపోయారు. అయినా స్వామి కాలైనా కదల్చలేదు. చివఱకు యెలాగో కోడూరి వెంకమ్మ ఆ ముల్లు తీసింది. స్వామి ఆమెకు, ఒక మల్లెముల్లు, సూదీ, బ్లేడూ బహూకరించారు.

స్వామి యథేచ్ఛగా సంచరిస్తుండే రోజుల్లో అడవిలో ఆయ నేమి చేస్తారో చూడాలని యెవరైనా వెంబడిస్తే ఆయన ముండ్లలో అడ్డదిడ్డంగా నడిచి చిక్కకుండా వెళ్లిపోయేవారు. సాయిబాబా వలె స్వామిగూడ పండ్లు తోముకునేవారుగాదు. చప్పరిస్తున్న పొగాకును వుమ్మివేసి గంజి త్రాగేవారు. ఒక నియమం లేకుండా బుద్ధిపుట్టినపుడు క్షౌరము చేయించుకునేవారు. అందఱూ మంగలికి 50 పైస లిస్తే స్వామి రూపాయో, లేక రెండు రూపాయలు యిచ్చేవారు. 1980 వ సంవత్సరము తర్వాత ఆయన కోరకున్నా సేవకులు అపుడపుడు మీసాలు, గుండూ చేయించేవారు. బరిగెల నాగయ్య స్వయంగా తనే ఆ సేవ చేసేవాడు. గిరజాలు, మీసాలు గల ఆయన 'మంగలియోగం, చాకలియోగం, డుబ్‌డుక్ డుబ్ డుక్' అంటూ అరుస్తూ వుండేవారు. సాయిబాబా కూడా మొదట గిరజాలు, మీసాలు పెంచుకొని కొంతకాలం సంచరించాక శిరిడీలో స్థిరంగా నిలిచిపోయినట్లే గొలగమూడిలో స్వామి స్థిరంగా నిలిచిపోయారు. సాయి అప్పుడప్పుడు రహటా, నీమ్‌గామ్, రూయీ, పుంతంబా మొదలైన ప్రాంతాలలో సంచరించినట్లే స్వామిగూడ తలుపూరు, గోనుపల్లి మొదలైన గ్రామాలలో సంచరించారు. ఒకనాటికి ఈయనగూడ సాయి వలె మోకాళ్ల క్రిందివఱకూవుండే బారయిన చొక్కా ధరించారు. తీవ్రంగా ఆకలి అయినపుడు భగవంతుడు చూపిన యింటికి వెళ్లి, వాళ్లు పెట్టినది తిని వెళ్లిపోయేవారు. ఎవరైనా అన్న ముంచుకొని లేదని చెప్తే, వారింట్లో ఫలానాచోల అన్నము, కూర దాచివుంచినట్లు స్వామి చెప్పేవారు. ఆయన సామాన్యులు గారని గుర్తించి గృహస్థులు అన్నము పెట్టేవారు. తర్వాత వారికి యెంతో మేలు జరిగేది.

ఒక్కొక్కపుడు స్వామి తమకూ, యితఱులకూ సంబంధించిన పూర్వజన్మ వృత్తాంతాలు చెప్పేవారు.

ఆయన ఒకరోజు రోశిరెడ్డితో, 'అయ్యా! పోయిన జన్మలో నీవు సుబ్బయ్య అనే బ్రాహ్మణుడవు. నాకు చదువు చెప్పిన గురువువు' అని చెప్పి ఒక పంచెలజత, పదిరూపాయలు గురుదక్షిణగా సమర్పించారు స్వామి.

ఒకసారి చలమానాయుడుతో, వెనుకటి జన్మలో వెంకటగిరిరాజా గారింట్లో నేను గవర్నరు కోర్సు, నీవు జడ్జీకోర్సు చదివాము. మనిద్దఱికీ ఇపుడు పెండ్లి లేదు. ఇపుడు పూరింటిలో వుంటున్నాము, మేడలు కావాలంటే యెప్పుడూ వస్తాయా? ఆతర్వాత పిఠాపురం రాజు గారింట్లో వుండి యిపుడు నాగులవెల్లటూరు వచ్చినాము' అన్నారు. అలానే ఒకరోజు, 'గురవయ్య బెంగుళూరు దక్షిణవీధిలో ఒక కంసాలి యింట, తర్వాత కోమటి యింట, తర్వాత మైసూరు మహారాజు యింట్లోనూ పుట్టాడు. అటుతర్వాత నేను వెంకటగిరిరాజాగారి ఇంట్లోనూ, గురువయ్య వారి మామ గారింట్లోనూ పుట్టాము' అన్నారు స్వామి. ఒకప్పుడు స్వామి కాళ్ళు స్వాధీనము

లేకుండాపోయాయి. పూర్వము నేనొక ఆవును కొట్టాను. ఆ దోషము నేను అనుభవించి పోగొట్టుకోవాలి గనుక నేను మందు తీసుకోను' అని ఖండితంగా చెప్పారు. భక్తుల బాధలను తమపై తీసుకొనే సాయిబాబా ఒక్కొక్కపుడు స్వయంగా మందు తయారుచేసుకుని సేవించేవారు. ఒక్కొక్కపుడు ఆ భక్తుని బాధ ఎవఱోవొకరు అనుభవించవల్సినదిగా వున్నప్పుడు యే మందూ తీసుకొనక ఓరిమితో వూరుకునేవారు. అది చూడలేక భక్తులు బాధపడుతుంటే 'ఇది భగవంతు డిచ్చినది, ఆయనయే తగ్గిస్తాడు' అనేవారు.

స్వామి తమ భక్తులకు ప్రశ్నలుకూడా చెప్పేవారు. వివాహానికి సంబంధాలు చూస్తూ ఏ సంబంధము మంచిదని భక్తులు స్వామిని అడిగేవారు. అపుడు వారు చూచిన ఒక్కొక్క సంబంధానికి ఒక్కొక్క ఱాయి చొప్పున వరుసగాపెట్టించి తంబుర మీటి, తూర్పునుండి రెండవది అనో లేక పడమరనుండి మూడవది అనో చెప్పేవారు. అంటే ఆ ఱాయిచేత సూచించబడిన సంబంధమే మంచిదని స్వామి భావము.

పెన్నబద్వేలు విడిచిన తర్వాత స్వామి కొన్ని సంవత్సరాలు కోటితీర్థం వద్ద ఆలయంలో వున్నారు. ఆకాలంలో ఆయన తంబుర ముందుపెట్టుకొని రాత్రింబవళ్ళు ఈతపుల్లలతో నాదం మీటుతూ, ఓం నారాయణ ఆది నారాయణ అని పెద్దగా వుచ్చరించేవారు. క్రమంగా ఆయన పరిసరాలను మరచి ఆ నామంలో లీన మయ్యేవారు. తంబుర తీగలు తెగినా గుర్తించక పుల్ల ఆడిస్తూ ఆ నామం చెబుతూనే వుండేవారు. బాహ్య స్పృహ కల్గినపుడు తీగలు మఱలా ముడివేసేవారు. అపుడపుడు అగ్ని కూడా ప్రేల్చేవారు. చలమానాయుడు మొదలైన సేవకులు వారికి భిక్ష తెచ్చేవారు. ఈ చర్యలు చూస్తే పెంచలకోనలో వీరికి లభించిన గురువు వైష్ణవులని, వీరికి వారు వుపదేశించినది రామభక్తి యనీ తోస్తుంది. కారణము వారు చొక్కాపై రామనామము ముద్రించబడి యుండేది. వారి యిష్టదైవం తిరువళ్ళూరు వీరరాఘవస్వామి. అందుకే ఆయన తమ నాశ్రయించిన భక్తులను గూడా తిరువళ్లూరు వీరరాఘవస్వామి రక్షిస్తారనో, కంచి వరదరాజస్వామి రక్షిస్తారనో యెక్కువగా చెబుతుండేవారు. ఒకసారి 'మిమ్ములను తెలుసుకొనే దెలా?' అని అడిగితే ఆయన భద్రాచలం పోయి గర్భగుడి తెరచి చూడు, తెలుస్తుంది' అన్నారు. అపుడపుడు తిరుపతి వేంకటేశ్వరస్వామి రక్షిస్తారు అనికూడా అంటుండేవారు. దీనికి తోడు వీరి ప్రధాన సాధనలలో ఒకటి నాదోపాసన అనిగూడా తోస్తుంది. ఈ సంప్రదాయం వారు సామాన్యంగా తంబురతో నాదం చేస్తూ దానినే వింటూ, ఆ నాదంతో భగవన్నామము జోడించి, ధ్యానిస్తారు. తమ భక్తుల భవిష్యత్తు తెలుసుకోడానికి కూడా స్వామికి యిట్టి ఉపాసనయే యెక్కువ కాలం వుపయోగపడేది. తరచుగా భక్తులకు చీటి వ్రాయించి యిచ్చే ముందు ఆయన తంబుర మీటేవారు. సాయికి, వీరికి గల మఱొక భేద మిదే. భక్తుల భూత భవిష్యత్తులు తెలుసుకోడానికి సాయికి ఎన్నడూ యెట్టి సాధనము అవసరము లేదు. చివరిరోజులలో స్వామిగూడ అలాగే చెప్పేవారు.

అటుతర్వాత స్వామి వేలిముద్రలు వేయడము తగ్గించి రాత్రింబవళ్ళు అగ్నిని సేవించేవారు. అప్పటినుండి సామాన్యంగా యెవరికీ అర్థంకాని రీతిన మాట్లాడేవారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో తమ తలపై ఎండ పడకుండా, ఒక కఱ్ఱ నాటి, దానికి తాటిమట్ట తగిలించేవారు. అగ్నిని సేవించడంలో మైమరచి అటుతర్వాత నీడ ప్రక్కకు తొలగి తమ మీద ఎండబడుతున్నా లెక్కించేవారుగారు. చొక్కా వేసుకోవడం మాని కేవలం కౌపీనమో లేక మొలకు ఒక వస్త్రమో చుట్టుకోవడం ఆరంభించారు. తర్వాత గొలగమూడి చేరి సుమారు 8 సంవత్సరాలు ఒకేచోట అగ్నిగుండం వేసుకొనియున్నారు. ఇప్పుడు ఆ స్థలంలోనే వారి సమాధి మందిరము వున్నది. ఆయన నడవలేకుండా వచ్చాక ఒకేచోట వుండేవారు. ఒకరోజు రోశిరెడ్డితో, 'నన్ను తాటాకు మీద కూర్చోబెట్టి కొంతదూరం లాక్కోనిపోయ్యా!' అన్నారు. అతడు అలానే చేశాడు. అటుతర్వాత ఒక చిన్న చక్రాలబండి చేయించి దానిపై స్వామిని వారు కోరిన చోటుకు తీసుకుపోయేవారు. ఆ బండి గతుకుల్లోబడి స్వామికి బాధ కలుగుతుండేది. అందువలన స్వామిని భక్తులు డోలీలో తీసుకువెళ్ళనారంభించారు. ఈ రీతిన స్వామివారి మహాసమాధికి సంవత్సరం ముందువఱకూ ఆయనను నెల్లూరు ప్రాంతంలోని గ్రామాలకేగాక, తిరుపతి, కంచి, తిరువంగలేడు, తిరువళ్లూరుగూడా తీసుకువెడుతుండేవారు.

శ్రీసాయిబాబా లాగే స్వామివారు యేనాడు యెవఱి యిండ్లలోనూ తలదాచుకొనక దేవాలయము, పాడుబడ్డ యిళ్ళు, గ్రామచావడి, పాఠశాల వేపచెట్టువంటి వాటినే ఆశ్రయించేవారు. అరుదుగా యెవఱింటికైనా వెళ్లినా, ఆయన వారింటి బయట చెట్టు నీడన, వరండాలోను, కొట్టాల్లోనూ మాత్రమే వుండేవారు. వర్ష మొచ్చినా చూరు క్రిందకు ఒదిగేవారుగాని, ఇంట్లోకి వెళ్లేవారుగారు. ఆయన ఎవఱింట్లో కైనా వెళ్లి ధుని వెలిగిస్తే అది వారి మహాభాగ్యము. ఒక్కొక్కపుడు స్వామి ఒకే వూర్లో రెండు మూడు మకాములు మార్చేవారు. వారు యే వైపుకు పొమ్మంటే భక్తులు వారిని అటు తీసుకుపోవల్సిందే. ఆ మార్గం ఎంత కష్టమైనా, ఎండైనా, వానైనా సరే.

ఒకసారి సిద్ధలయ్య కొండశిఖరం పైకి తమను తీసుకుపొమ్మన్నారు స్వామి. అక్కడకు డోలీ వెళ్లే మార్గమే లేదు. అపుడు ఒక సేవకుడు స్వామిని వీపుమీద యెక్కించుకొని కొండపైకి చేర్చాడు. అపుడు ఆయన మూరకు మూడువేలు రాసుకోయ్యా అన్నారు. అంటే అతడు స్వామిని మోసిన ఫలితము మూరెడు దూరానికి పుణ్యఫలం అపారమన్నమాట. అలాగే 'స్వామి పొమ్మంటే ఆయనపై భారం వేసి ముండ్లమీద నడిచినా మాకు ఒక్క ముల్లుగూడా గ్రుచ్చుకొనేది కాదు. ఎంతటి ఎండలో నైనా ఆగకుండా మూడుగంటలు నడిచినా మాకు అలుపు, బడలిక వుండేవి కావు. స్వామి అయ్యా మీరు మోసినందుకు నాచేత మీకు 30 కోట్లు పుణ్యం జమ కట్టించి రసీదు తీసుకుపొయ్యారు అనేవారు' అంటాడు సేవకుడు బరిగెల నాగయ్య.

సాయిబాబా వలె భోజనము విషయంలో వైరాగ్యము కనిపించేది. ఎవరేమి పెట్టినా రుచిభేదం లేకుండా అన్నీ ఒక కుండలో వేసి కలిపి అచ్చటివారందఱికీ పెట్టి సాయి రెండుమూడు ముద్దలు మాత్రమే తినేవారు. స్వామికూడా భక్తులు లడ్డు పెట్టినా వద్దనేవారు కాదు, గాని కొంచెము కారం పచ్చడి కలుపుకొని తినేవారు. ఒకప్పుడు భక్తులు శెనగపప్పు, బెల్లం, కొబ్బరిపొడి చేసి డబ్బాలో వేసివుంచితే స్వామి తీసుకొని తినేవారు. భక్తులు ఒకరోజు పొరపాటున దానికిబదులు సీకాయడబ్బా వుంచారు. స్వామి అదే తినేశారు. ఆయన మంచినీరు త్రాగి 15 సంవత్సరాలయ్యిందట. వేడినీటిలో చక్కెర వేసిస్తే త్రాగేవారు. రాగి అంబలి, వెల్లుల్లి, మిరపపొడి యిదే ఆయన ఆహారము. స్వామి తన పాదాలు యెవఱినీ త్రాకనిచ్చేవారుకారు. పూజచేయనిచ్చేవారుగారు. వారికి ప్రదక్షిణ చేస్తే ఒకటి చాలని చెప్పేవారు. ప్రదక్షిణ మంటే అచంచలమైన శ్రద్ధాభక్తులతో మన మనస్సు దైవం చుట్టూ లేక గురువు చుట్టూ పరిభ్రమించుటగదా!

వచ్చిన దక్షిణంతా స్వామి తన సేవకులకు వారివారి కష్టము, అవసరాలకు తగినట్లు యిచ్చేవారు. పండుగలప్పుడు భక్తులు అర్పించిన ప్రసాదాలను యెప్పటికప్పుడు పంచేయమనేవారు. కష్టించి తమ సేవ చేసే దశయ్య, రమణయ్య, రోశిరెడ్డి మొదలైనవారికి కొన్ని తినుబండారాలు దాచిపెట్టి ప్రత్యేకంగా యిచ్చేవారు. వారిని పూరిపాక వెనుకకుబోయి తినమనేవారు. గురవయ్య యెప్పుడూ స్వామి చెంతనేవుండి ఆయన అరుపులకు వంతపాడుతుండేవాడు. ఇవన్నీ శ్రీసాయి చర్యల కెంతగానో పోలియున్నాయి.

**శ్రీఅవధూతాయ నమః**

## శ్రీఅవధూతాయ నమః

## అధ్యాయము - 4

# య జ్ఞ ఫ ల ము

ప్రజలలో భగవంతునిపట్ల శ్రద్ధాభక్తులు, సాటిజీవులపట్ల ప్రేమ, సాటివారిపట్ల ధర్మాచరణ లోపించినపుడు అనావృష్టి వంటి అరిష్టాలు యేర్పడుతాయని శాస్త్రము. అటువంటప్పుడు మహాత్ములు చేసే యజ్ఞాలు, తపస్సుల వలన కొంత పాపము నశించి ప్రకృతి కరుణిస్తుందనిగూడా ఋషులు చెప్పారు. కారణము సద్గురువు సకలదేవతా స్వరూపము. దేవత లందఱూ వారి కధీనులే. అందుకే ఒకసారి సాయిబాబా కేకలు వెయ్యగానే గాలి, వానా ఆగిపోయాయి. ఆయన మందలించగానే వువ్వెత్తున లేచిన అగ్ని వుపశమించింది. ఆయన ఆగమని చెప్పగానే కూలిపడనున్న మసీదు కప్పు నిలిచిపోయింది. అలాంటి లీలలు స్వామివద్దకూడా జరిగేవి.

ఒకసారి తలుపూరులో మబ్బుపట్టి బాగా వర్షము పడబోతున్నది. అపుడు స్వామి సేవకులు 'ఇక్కడ యిల్లుగూడా లేదే, మన వస్తువులన్నీ తడిసిపోతాయి' అన్నారు. వెంటనే స్వామి కొంతసేపు తంబురమీటి 'వీరరాఘవా! ఇక్కడ మేమున్నామని తెలియదా! మేము మా సామనూ యేమైపోవాలి?' అని దబాయించారు. ఐదు నిమిషాలలో మేఘాలు చెదిరిపోయాయి. అలానే ఒకప్పుడు మద్రాసు రాష్ట్రానికి చెందిన భక్తులు రెండు సంవత్సరాలుగా తమ ప్రాంతంలో వర్షాలు లేవని స్వామికి చెప్పుకున్నారు. 'భగవంతునికి అర్జి వ్రాయించం డయ్యా!' అని చీటి వ్రాయించి, తొడ క్రింద పెట్టుకొని 5రోజులు నిద్రాహారాలు మాని కూర్చున్నారు స్వామి. ఐదవరోజున ఆ ప్రాంతంలో వర్షంపడి చెఱువులు నిండాకనే స్వామి గంజి త్రాగారు ఒకసారి కలిచేడులో అనావృష్టి వలన పశువులకు గడ్డి లేక చిత్తుకాగితాలు, యెండుటాకులు తింటున్నాయి. స్వామి రెండురోజులు నీరైనా ముట్టక, 'ఒరేయ్, బండ్లు నిలపండి. పిల్లకట్టంతా వెళుతున్నారే, నాకు కోపమొస్తే జరిమానా వేస్తాను' అని అఱుస్తూ కూర్చున్నారు. మూడవరోజున ఆయన స్నానం చేసి గంజి త్రాగగానే వర్షము కుఱిసి చెఱువులు నిండాయి. తలుపూరు శివాలయంలో స్వామి వుండగా ఒకనాడు దట్టంగా మబ్బులు కమ్మి వుఱుములు,

చినుకులు ప్రారంభమయ్యాయి. ఆయన వద్దనున్న సేవకుడు స్వామిని లోపలకు తీసుకువెళ్లడానికి తోడు యెవఱూ లేరు అని విన్నవించుకున్నాడు. స్వామి తమ ముందు చాప వేయించి, 'ఉండయ్యా మబ్బు కట్టాలి' అని కొంతసేపు మబ్బుకేసి చూశారు. ఆ మేఘాలు, ఫుఱుములు, చినుకులు పోయాయి. సంవత్సరము 1977లో ఒకరోజు నాగయ్య 'స్వామి! వాన యెప్పుడు కుఱుస్తుంది?' అని అడిగాడు. స్వామి 'ఈ సంవత్సరము ఒకటిన్నర నెలకు ఒకసారి, రెండునెలలా యిరవైరోజుల కొకసారి, మూడునెలలా ఐదురోజులకు ఒకసారి. పైవారు కుఱిపించే వాన అంతేనయ్యా' అన్నారు. అలా అయితే గొడ్డుపిల్లా చచ్చిపోతారే- అన్నాడు నాగయ్య. అలా అయితే మనమన్నా కష్టపడి కుఱిపించుకో వద్దయ్యా! అన్నారు స్వామి. అతను గంజి త్రాగుతుంటే, 'అనుకున్న పని అయితే గదయ్యా నీరు త్రాగాలి?' అని ఆయన ఆఱురోజులు నిద్రాహారాలు మాని 'బండి ఆపండయ్యా!' అని అఱుస్తూ ఆసనమైనా మార్చకుండా కూర్చున్నారు. ఆఱవరోజు ఆయన కోరికమేరకు వారిని స్నానము చేయించి కూర్చోబెట్టగానే ఆయన పకపక నవ్వుతూ, 'గడ్డా పెళ్లగించుకున్నదయ్యా!' అన్నారు. తక్షణమే కుంభవృష్టి ప్రారంభమయ్యింది. ఫిబ్రవరి 1984లో నెల్లూరుజిల్లా అంతటా అతివృష్టివలన చేలలోని కుప్పలుగూడా కొట్టుకొనిపోయి అపారమైన నష్టము కల్గింది. కానీ స్వామి వేంచేసిన గొలగమూడిలో పెద్దగా వర్షము పడలేదు. ఆ గ్రామంలో ప్రజలు చేసే నిరతాన్నదానం, వారి భక్తిశ్రద్ధలే అందుకు కారణము.

వర్షాలే కాదు, పంచభూతాలుగూడ మహాత్ముల ఆదేశాలకు కట్టుబడతాయి. సాయిబాబా నీటితో దీపాలు వెలిగించారు. శిరిడీలో ఒక నీటికుండను తట్టి, వందలమైళ్ల దూరాన వున్న నాగపూర్‌లో నిప్పంటుకున్న కుటీరాన్ని ఆర్పివేశారు. తమ ఆశీర్వాదబలంతో ఇమాంభాయి అనే భక్తుణ్ణి వరదలో నిండుగా పాఱుతున్న నదిమీదుగా నడిపించి అవతలిగట్టుకు చేర్పించారు. అలానే బోయినపల్లి గ్రామంవద్ద కొందఱు భక్తులు స్వామిని 'బ్రహ్మంగారి భార్య గోవిందమ్మ నీటితో దీపాలు వెలిగించిందట' అన్నారు. ఆయన చెంబుతో వారికి నీరిచ్చి 'మీరుగూడా వెలిగించుకోండి' అన్నారు. ఆ నీటితో దీపాలు వెలిగాయి. ఒకసారి స్వామి కలిచేడులో నరసారెడ్డిగారింటికి వచ్చి వంట వసారాకు రేకులు వేయించమన్నారు. తనకు ఆర్థికంగా శక్తి లేదని ఆ యిల్లాలు చెప్పుకుంటే ' పైవాండ్లు చూచుకొంటార్లే' అని అన్నారు ఆయన. ఐదురోజుల తర్వాత ఆ యిల్లాలు వంట చేస్తుండగా నూనె బాండలీకి చిల్లిబడి నూనె పొయ్యిలోకి కారుతున్నది. అయినా ఆమె ఒక బేసిన్ తెచ్చి ఆ బాండలిలోకి నూనె పోసుకునేదాక పొయ్యిలో మంటలు లేవలేదు. నరసాపురంలో ఒక రైతు తన పొలంలో బావి త్రవ్విస్తే నీళ్లు పడలేదు. అతడు స్వామిని తీసుకువెళితే ఆయన బావిలో టెంకాయకొట్టి కొద్దిగా త్రవ్వించి వచ్చారు. తెల్లవారేసరికి బావినిండా నీరు వూరింది. నాగులవెల్లటూరులో రామానాయుడు బావి త్రవ్విస్తుంటే 18 అడుగులలో బండపడింది. ఆ ప్రాంతంలో 30 అడుగులు త్రవ్వితేగాని నీరుపడదు. స్వామికి చెబితే

'నాలుగురోజులు పని ఆపి చూడు' అన్నారు. ఎనిమిదవరోజు పనిమొదలుపెడితే బండ మెత్తగా తెగిపోయింది. కల్లూరు రాజుపాళెంలోని యెఱుల రాజుగారి బావిలో వేసవికాలం నీరుండదు. వర్షాకాలం నీరు పురుగులు పట్టి వాసన కొడుతుంది. ఒకరోజు స్వామి ఆ బావిలో మునిగివచ్చారు. అప్పటినుండి అందులో తరుగులేకుండా మంచినీరున్నది.

పాలకొండి సుబ్బారెడ్డి ఒక జమ్మిమాను కొట్టేశాడు. అదెంతో బరువుగా వున్నా స్వామి ఆదేశించిన ప్రకారం అతడు దానిని నెత్తికెత్తుకున్నాడు కానీ కృంగిపోతున్నాడు. స్వామి దానిని దింపించి తమ చేతికఱ్ఱతో పదిసార్లు పొడిచాడు. 'ఇప్పుడెత్తుకో!' అన్నారు. ఈసారి అదెంతో తేలికగా వున్నది. అలానే ఒకరోజు స్వామిని డోలీలో మోస్తున్నారు. ఎప్పుడూ యెంతో తేలికగా వుండే ఆయన ఆనాడు అమిత బరువుగా వున్నారు. ఆశ్చర్యంతో సేవకులు ఆయనను చూచేసరికి ఆయన నవ్వారు. మరుక్షణమే డోలీ యెంతో తేలికైపోయింది.

ఇట్టి మహాత్ములు జనన మరణ రహితులు. వారికి మృత్యు భయము వుండదు సరిగదా; భక్తులనుగూడా మృత్యువునుండి రక్షించగలరు. ఒకనాటి మధ్యాహ్నము 'తోటిబొరుగు' అనే విషసర్పం స్వామివారి తొడ క్రిందకు వచ్చింది. భక్తులు కేకలేశారు. స్వామి, 'అదేమి చేస్తుందిలే, దానిని మీరేమి చెయ్యవద్దు' అన్నారు. తర్వాత అది దానంతటదే వెళ్లిపోయింది. ఒకనాటి రాత్రి రోశిరెడ్డిని పాము కఱచింది. స్వామి అతని వ్రేలును తమ తొడపై అయిదు నిముషాలు అదిమి పెట్టి, 'నీ ఒళ్లు సంజీవమైంది పో' అన్నారు. అదిమొదలు యే విషజంతువు కఱిచినా రోశిరెడ్డికి విషమెక్కేది కాదు.

ఒకప్పుడు ఎర్లపాడు గ్రామంలో మనుషులు నిష్కారణంగా చనిపోతున్నారు. గ్రామంలో యేదో దుష్టశక్తి ప్రవేశించిందని భయపడి ప్రజలు ప్రతిదినము ప్రొద్దుగుంకగానే తలుపులు మూసుకుని యిండ్లలో కూర్చుంటున్నారు. కొందఱు స్వామిని ఆ గ్రామానికి తీసుకువెళ్లారు. ఆ రాత్రి భయపడి యెవఱూ తలుపులు తీయలేదు. ఎలాగో ఒక ముసలమ్మ చూచి అందఱికీ చెప్పగానే అందఱూ ఆయన చుట్టూ పోగయ్యారు. స్వామి కొద్దిరోజులు ఆ గ్రామంలో వున్నారు. ఆ తర్వాత ఆ వూరిలో ఒక్కరుగూడా మరణించలేదు.

1976వ సంవత్సరములో స్వామి, 'నీకు సంవత్సరం నాలుగు నెలలా ఆఱు రోజులకు గండ మున్నది. తిరువళ్లూరు వీరరాఘవస్వామి తప్పిస్తారు' అని చీటి వ్రాయించి చెర్లోపల్లి శేషమనాయుడుకు యిచ్చారు. తర్వాత ఒకరోజు అతడు పొలానికి నీళ్లుపెట్టి, దుక్కి దున్నడానికై యెద్దులను తోలాడు. పొలంలో దిగంగానే ఒక యెద్దు క్రిందబడి తన్నుకొంటున్నది. దానిని ప్రక్కకు లాగబోగా చేలో కరెంటుఎర్త్ అయినట్లు గుర్తించి మొయిన్ ఆపించాడు. తర్వాత చీటీ చూచుకుంటే స్వామి చెప్పిన గడువు తీరింది. అందుకే తనకు మరణం తప్పిందని అతడు గుర్తించాడు.

ఒకనాడు సిద్ధులయ్య కొండ దగ్గఱ వెంకయ్య అనే భక్తునికి మునికన్యలు కనిపించి స్వామికి మించిన గురువును చూపుతామని పిలిచారు. అప్పటినుండి తరచూ అతనిని అలాగే వేధిస్తుండేవారు. ఒకరోజు అతడు స్వామి సన్నిధిలో వుండగాగూడ అలానే పిలిచారు. వెంటనే స్వామి అతనిని పిలిచి అతని గుండెపై చఱచి, 'నీ కిక వాటి బాధలేదు ఫో!' అన్నారు. అటుతర్వాత ఆ మునికన్యలు అతని చెంతకు రాలేదు.

శ్రీగురవే నమః

శ్రీఅవధూతాయ నమః

అధ్యాయము - 5

# భ క్త బాం ధ వు డు

గోపారంలో కుక్క ఒక రైతుకు వున్న గొఱ్ఱెలను చంపి తింటున్నది. అతడు కడుపుమండి ఆ కుక్కను నరికేశాడు. ఆ తర్వాత అతనికి పుట్టిన ప్రతిబిడ్డా కుక్కలా అఱచి చనిపోయేవాడు. అతడు స్వామితో మొరపెట్టుకుంటే ఆయన పుడతాడు అని ముమ్మారు అన్నారు. తర్వాత అతనికి ముగ్గురు పిల్లలు జన్మించారు.

దారా చిన్నమ్మ కంటి శస్త్రచికిత్స చేయించుకొని తనకు చూపు వస్తుందో లేదో అని భయపడి స్వామిని ప్రార్థించింది. ఆయన స్వప్నంలో కనిపించి, 'భయపడకు! శస్త్రచికిత్స చేసినంతసేపూ నేను అక్కడే వున్నాను' అన్నారు. ఆమెకు చూపు వచ్చి ఇపుడు బాగా తిరుగుతున్నది.

కృష్ణారెడ్డి ఒక వినాయకచవితికి గొలగమూడి వచ్చి ఒక కేజి గుగ్గిళ్లు, రెండుకేజీల పొంగలి, ఒక కేజీ వడలు చేయించారు. మామూలుగా భిక్షాన్నం తెచ్చే మనిషికి బస్సు అందక అతడు రాలేదు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో స్వామి కొంచెము తిని ప్రసాదమిచ్చారు. ఆ ప్రసాదము 25మంది తిన్నాకగూడ తెల్లవారి యింకా మిగిలింది. స్వామి ప్రసాదం అక్షయమే.

ఒకసారి ఈశ్వరమ్మను స్వామికి దూరంగా వుండమని శిష్యులు గదమాయించారు. ఆమె మనస్సు నొచ్చుకున్నది. వెంటనే స్వామి తమ కాల్లో ముల్లు గ్రుచ్చుకున్నదని దాన్ని తీయమని ఆమెతో చెప్పారు. ఎంత వెదికినా ఆయన కాలులో ముల్లు లేదు. ఆమెకు ఆరీతిన ఆయన తమ పాదస్పర్శ అందించారు. ఒకప్పుడు యీమె క్రొత్త యిల్లు కట్టుకొని స్వామిని ఆహ్వానించింది. ఆయన వస్తాను అన్నారుగాని మూడునెలలపాటు రానేలేదు. ఆమె గృహప్రవేశం చేయకుండా పట్టుదలగా వేచియున్నది. స్వామి ఆ ప్రక్క గ్రామానికి వచ్చి 'రేపు సూర్యోదయకాలం బాగున్నది. నేను వస్తాను, గృహప్రవేశం చేయి' అన్నారు. అంత కొద్ది వ్యవధిలో అది సాధ్యపడదని ఆమె భయపడుతుంటే, 'అన్నీ అవే వస్తాయి పో' అన్నారు. ఆరాత్రి ఆమెకు యెన్నాళ్లుగానో

బాకీవున్నవాళ్లు పదికిలోల బియ్యము, కొంత పైకమూ యిచ్చిపోయారు. స్వామి తన శిష్యులతో కలసి నడచి వేకువఝామున 3 గంటలకు ఆమె యింటికి వచ్చి కర్పూరము వెలిగించి పొయ్యిలో వేశారు. ఒక స్నేహితురాలు యిచ్చిన 200 విస్తరాకులూ భోజనానికి ఖర్చయ్యాయి. ఆమె, స్వామి పొంగలి మాత్రమే తిన్నారు. పదికిలోల బియ్యం 200 మంది తిన్నారంటే అది కేవలం స్వామి మహిమేగదా! అన్నది.

స్వామిని సేవించే తూపిలి పిచ్చమ్మకు ఒకసారి యెన్నో చిక్కులు వచ్చాయి. స్వామిని దర్శిస్తే ప్రభుత్వము డబ్బిస్తుంది, ఇల్లు వేసుకుంటారు అన్నారు. కొద్దికాలంలో గాలివాన సహాయంగా ప్రభుత్వము డబ్బిచ్చింది. కానీ వారు కొన్న స్థలంలో  దయ్యా లున్నాయని ప్రతీతి. ఆమె కొట్టం వేసుకొని స్వామి పాదం పెడితే అన్నీ పోతాయని నమ్మి ఆయనను ఆహ్వానించింది. సేవకులు అంగీకరించలేదు. కానీ ఐదవరోజున స్వామి 'నన్ను క్రొత్త యింటికి తీసుకొనిపోండయ్యా!' అని చెప్పి, ఆమె యింటికి తీసుకువెళ్లేసరికి పిచ్చమ్మ చాకిరేవులో వున్నది. ఆమె తిరిగి వచ్చాక తన యింట్లో స్వామి వుండటము చూచి తన కళ్లను తానే నమ్మలేకపోయింది.

తూపిలి పిచ్చమ్మ కుమార్తె ఉమామహేశ్వరికి వివాహమయ్యాక భర్త యేలుకోలేదు. చివఱకు ఆమె విసిగిపోయి విడాకులు వ్రాసిచ్చి, మంగళసూత్రం తీసివేసి ఒక సంవత్సరము స్వామి సేవ చేసింది. ఎవరెంత చెప్పినా మంగళసూత్రం వేసుకోలేదు. తులశవ్వ దానిని తెప్పించి స్వామి ఆసనం క్రింద వుంచింది. క్రమంగా ఆ దంపతుల మనస్సులు మారి భర్త పిలిస్తే కాపురం చేస్తానని ఆమె, ఆమె వస్తే యేలుకుంటానని అతడు కబుర్లు పంపుకున్నారు. చివఱికి యెవఱి  ప్రయేయమూ లేకుండానే ఆమె ఒకరోజు మంగళసూత్రం ధరించి భర్త వద్దకు వెళ్లిపోయింది. ఇపుడు వారు చక్కగా కాపురం చేసుకుంటున్నారు.

స్వామి ముదిగేడు గ్రామంలో మొదటిసారి కాలుపెడుతూనే ఒక యింటికి వెళ్లారు. ఆ ఇంటి యజమాని స్వామిని ఆహ్వానించాడు. ఆతర్వాత ఆతడు యెన్ని చికిత్సలకూ లొంగకుండా బాధిస్తున్న గవదకురుపు స్వామికి చూపాడు. దానికి అడ్డం పెట్టిన గుడ్డ తీస్తే చీము కారుతూనే వుండేది. స్వామి 'అయ్యా! కడికెడంత లావు వుండే చిటికేసరం చెట్టు రెమ్మలు మూడు, చేతి పొడవున కొట్టుకొచ్చి, వాటిని యెండుగడ్డి, యెంటిచుట్టి, కంపవెంబడి మూడుచోట్ల నాటి, నీళ్లు పోస్తూండు. నీ కురుపు పోతుంది' అన్నారు. అతను అలానే చేశాడు. నెలరోజుల్లో ఆ కొమ్మలు చిగురుపెట్టేసరికి ఆ గాయం మానడం ప్రారంభించింది. ఆ కొమ్మలు పెరిగినకొద్దీ ఆ కురుపు మానుతూవచ్చింది.

ఒకరోజు రోశిరెడ్డితో 'నీ చిన్న కుమారుని పేరు వ్రాసివ్వు' అని చెప్పి తీసుకొని తన తొడక్రింది పెట్టుకుని కూర్చున్నారు. కారణము తెలియలేదు. మూడవరోజున ఆ అబ్బాయి స్వామిని దర్శించి అసలు విషయము

బయటపెట్టాడు : సరిగా అదేరోజున అతడు తోలుతున్న మామిడికాయల బండి రాజంపేట వద్ద కొండపైకి యెక్కుతూ దొర్లి 40 అడుగుల లోతు లోయలో పడిపోయింది. అయినా ఎద్దులకుగాని, బండికిగాని, అతనికిగాని యేమి దెబ్బలు తగలలేదు.

ఒకరోజు ఈశ్వరమ్మ స్వామికోసము గుగ్గిళ్లు తెచ్చేసరికి రాత్రి 9 గంటలు అయ్యింది. అందఱూ నిద్రపోతున్నారని తెలిసి యెంతో బాధపడింది. వెంటనే స్వామి లేచి తమకు పెసల గుగ్గిళ్లు పెట్టమని రమణయ్యను అడుగుతున్నారు. తెల్లవారగానే చేయించి పెడతానని రమణయ్య యెంత చెప్పినా స్వామి వినలేదు. ఈ సంభాషణ వింటున్న ఈశ్వరమ్మ సంతోషంగా స్వామికి గుగ్గిళ్లు సమర్పించింది.

1969లో భాగవతుల రఘురామయ్య గూడూరులో బ్రాందీ దుకాణము పెట్టి పూర్తిగా నష్టపోయాడు. ఎవరైనా ప్రశ్న చెప్పేవారి దగ్గఱకు వెళ్లాలనుకుంటూ స్వామిని గురించి తెలిసి ఒక మిత్రునితో కలసి దర్శనానికి వెళ్లాడు. స్వామి 'ఈయనకు ఆయుష్షే లేదు. అర్ధాయుష్షు 38 సంవత్సరములు. వెంకయ్య ఆయుష్షు 42 సంవత్సరములు ఆయనకు వేసి, అతని ఆయుష్షును 80 సంవత్సరాలు అని వ్రాయి. ఈయన సంగతంతా మనమే చూసుకుంటాములే. మన దగ్గరకు వస్తాడు. ఈయనకు ఒక అబ్బాయి, ఇద్దఱు అమ్మాయిలు. వాళ్ల విషయంగూడా మనమే చూస్తామని వ్రాయి. అబ్బాయి బాగా చదువుతాడు. జడ్జిగాని, మెజిస్ట్రేటుగాని లేకుంటే జిల్లాఅధికారిగాని అవుతాడు. పోయిన జన్మలో మేమంతా వెంకటగిరి రాజాగారి యింట్లో వుండేవారము. మఱల అప్పటి సంబంధము యిపుడు కల్గుతుంది' అని వ్రాయిస్తున్నారు. కానీ ఆయన తన వ్యాపారం సంగతి యేమీ చెప్పలేదని అతడు అనుకోగానే స్వామి 'ఇవన్నీ చెప్పినా అతనికి తృప్తిలేదు. ఆయనకు కావల్సింది వేఱే వున్నది. అది చెప్పందే అతనికి తృప్తి వుండదు. అన్ని ఖర్చులుపోనూ రోజుకు రూ॥50 ఆదాయము మిగులుతుంది. ఇక నష్టమనేది ఈయనకు లేదు అని చెప్పి వ్రాయించారు. తర్వాత అతడు ఆయన మాటను పరీక్షించాలని దుకాణమునకు వచ్చి డబ్బంతా ఖర్చు చేసేవాడు. కానీ రాత్రి 11 గంటల ప్రాంతంలో అతని తాలూకు దుకాణములో యెవఱో ఒకఱు వచ్చి అక్కడ నిలువ 50 రూపాయలకు తగ్గకుండా యిచ్చి పోతూండేవారు. ఇలా కొన్నాళ్లు జరిగాక స్వామి మాటయందు విశ్వాసము కుదిరింది.

1979వ సంవత్సరంలో మేలో యితడు ప్రయాణము చేస్తున్న జీపు తలక్రిందులై అతని రొమ్ముమీద పడింది. మిగిలినవాళ్లు స్పృహ లేకుండా పడిపోయారు. అతడుకూడా ఆ నిర్మానుష్యమైన ప్రదేశంలో వూపిరాడకుండా చనిపోయేవాడిలా వున్నాడు. అప్పుడు యెవఱో ముగ్గురు వచ్చి 'ఏమి చేయమంటావు?' అని అడిగి అతడు సైగతో చెప్పినట్లే జీపును ప్రక్కకు తొలగించి అదృశ్యమయ్యారు. రోడ్డున పోతున్న రిక్షా సహాయంతో అతడు నెల్లూరు హాస్పిటల్‌లో చేరాడు. ఆఱుమాసాలైనా అతని కాలులో యెముక అతుక్కోకపోయేసరికి

చికిత్సకోసం బొంబాయికి వెళ్లదలచాడు. నాటిరాత్రి స్వామి వైద్యుని వేషంలో దర్శన మిచ్చి, అతని కాలుకోసి క్రొత్తకాలు అతికించి కుట్లువేశారు. అందువలన అతడు తన బొంబాయి ప్రయాణము మానుకున్నాడు. కాలు మూడువారాలలో బాగయింది. స్వామి చెప్పిన 38 సంవత్సరములకు అంతమొందవల్సిన అతని జీవితము రక్షింపబడినది. 1930వ సంవత్సరములో స్వామి 'అయ్యా! ఇప్పటికే సారాయి పాపం పెరిగిపోయింది. ఇక దానిని ఆపవయ్యా!' అన్నారు. అలా చేస్తే తనకు రావల్సిన బాకీలు లక్షలకొద్దీ రావు. అతడలా అనుకోగానే స్వామి 'ఆ లెక్కలన్నీ నేను చూసుకుంటానులేవయ్యా. భూదేవిని నమ్ముకుంటే నీకన్నీ వస్తాయి' అన్నారు. అతడు వెంటనే ఆ వ్యాపారం మానివేశాడు. స్వామి దయవలన అతని మైకాగని రాణింపుకు వచ్చింది.

లలితమ్మగారికి బిడ్డలు లేరు. ఒంట్లో చాలా బాధగాకూడా వుండేది. మందులు వుపకరించకపోయేసరికి ఆమె స్వామిని దర్శించిది. ఆమె యేమీ చెప్పుకొనక మునుపే స్వామి 'ఆమెకు జబ్బయ్యా, పోతుందిలే. గూడూరు కరణము చనిపోయాడు. ఆయనను ఈమె కడుపున వేశాను' అని చెప్పి వేలిముద్రలు కాగితము, దారమూ యిచ్చి పంపారు. ఏ మందూ వాడకనే ఆమెకు ఆరోగ్యము చేకూరి సంవత్సరము లోగా మగబిడ్డ కలిగాడు.

ఒకరోజు రోశిరెడ్డికి పురుగు కఱచి కాలు వాచింది. అతడు స్నానానికి వెళ్లి స్వామిని స్మరించి, ఏటి ఇసుకలో కాలురుద్ది కడిగివేశాడు. ఆరాత్రి స్వామి అతనితో 'స్నానానికి పోయిన దగ్గఱ చూసుకో అర్థమౌతుంది'అన్నారు. ఏటివొడ్డున తాను చేసిన ప్రార్థన వారికి వినిపించింది.

బుజ్జయ్య చెల్లులు పద్మమ్మ పెళ్లి నిశ్చయమయ్యింది. కంచి వరదరాజస్వామి సన్నిధిలో వివాహము చేయమని చెప్పి స్వామి స్వయంగా వెళ్లి మంగళసూత్రము, తలంబ్రాలు తాకి ఆశీర్వదించి దగ్గఱుండి వివాహము జరిపించారు. తమ డబ్బుతో ఒక రూపాయికి కర్పూరము తెప్పించి వెలిగించి తమ ప్రక్కనే పెట్టుకున్నారు. పెళ్లివారందఱినీ పంపివేసి మూడవరోజు గంజి త్రాగారు. స్వామి యింకెవఱి వివాహానికి వెళ్లలేదు. ఒకనాడు పద్మమ్మతో ఆయన 'అమ్మా! ఎన్ని కష్టాలు వచ్చినా కంటతడి పెట్టకూడదు సుమా' అన్నారు. ఆమెకు యెన్నో కష్టాలు వచ్చాయి. కానీ స్వామి దయవలన అన్నీ తొలగిపోయాయి.

ఒకసారి స్వామి తలుపూరునుండి వస్తూ నెల్లూరు చేరగానే 'అయ్యా! మనము ఆస్పత్రికి పోవాలి' అని చెప్పి చేతితో త్రోవకూడా చూపారు. ఎప్పుడూ వైద్యశాలకు పోని స్వామి యిలా యెందు కన్నారో యెవఱికీ తెలియలేదు. అందఱూ ఆసుపత్రికి చేరేసరికి అక్కడ బుజ్జయ్య, అనారోగ్యంగా వున్న వారి చెల్లెలు స్వామిని స్మరించుకుంటూ వున్నారు. స్వామి కొంతసేపు వుండి, 'ఇక్కడ లెక్కసరిపోయింది. మనము పోదాము పదండి' అన్నారు. కొద్దిరోజులలో ఆమె ఆర్యోగము చక్కబడింది.

నమ్మినవారికి నమ్మినంత! గొడ్డటి శేషయ్య తన ఆరోగ్యము బాగలేదని చెప్పుకుంటే స్వామి 'గుంటగలగరాకు వ్రేళ్లపైనున్న తాటనూరి మూడుపూటలా మ్రింగు' అన్నారు. అతడు మ్రింగబోతూ 'దీనికి తగ్గుతుందా?' అని అనుమానిస్తూనే మ్రింగాడు. తర్వాత స్వామి 'అయ్యా, దీనికి తగ్గదుగాని మందు తీసుకో' అన్నారు.

నెల్లూరులో ఒకరికి ముగ్గురు ఆడపిల్లలు కలిగారు. నాల్గవ కానుపు ముందు స్వామిని మగబిడ్డను ప్రసాదించమని కోరారు. ఆయన 'అర్ధరాత్రి యే దేవాలయంలో నైనా రోజుకు మూడు ప్రదక్షిణాలు చొప్పున మూడురోజులు చేస్తే కల్గుతాడు' అన్నారు. కానీ వారు నవమాసాలు నిండాక బిడ్డ యెలా మారుతుందని శంకించి ఆయన చెప్పినట్లు చెయ్యలేదు. వారికి ఆడపిల్లే పుట్టింది.

స్వామితో కలిసి వేలూరు సుబ్రమణ్యం తిరువళ్లూరు వెళ్లాడు. ఒకచోట స్వామి నేలమీదనున్న రూపాయిబిళ్లను పుల్లతో త్రోసి, 'దీనితో కర్పూరం కొని స్వామికి వెలిగించు' అన్నారు. అతడు దానిని జేబులో వేసుకున్నాడు. తర్వాత 10 రూపాయల నోటుకు చిల్లరిమ్మని అడిగిన తులశవ్వగారికి ఆ రూపాయి యిచ్చాడు. ఆ సాయంత్రము స్వామి 'కర్పూరం వెలిగించావా?' అంటే 'వెలిగించాను' అన్నాడు. తులశవ్వ ఖర్చు పెట్టినది దేవుడికే గదా అని సరిపెట్టుకున్నాడు. 3 నెలల తర్వాత ఒకనాటి రాత్రి అతనికి కలలో పెద్ద కర్పూరం గడ్డ మండుతూ కనిపించి భయమేసింది. వెంటనే తిరువళ్లూరు వెళ్లి, క్షమాపణ చెప్పుకొని కర్పూరం సమర్పించాడు.

మందల వెంకయ్యకు 1956లో ఒకరోజు వుదయము స్వామి దోవలో యెదరై తలగీరుకుంటూ 'నీకో మాట చెప్పాలి. తర్వాత కనిపించు' అని చెప్పి వెళ్లిపోయారు. తర్వాత స్వామి అతనింటికి వచ్చి, 'ఇక్కడ మనము చూడవల్సినది యేమీ లేదు. అన్నీ బాగానే వున్నాయి. ఇతను తెల్లని యిల్లు కడతాడు.' అని నేలమీద హద్దు గీసి చూపారు. తర్వాత వారింట్లో ఈశాన్యం మూల గుంట త్రవ్వించి అందులో పాలు పోశారు. అవి ఈశాన్యం వైపు పారాయి. స్వామి అంతా బాగున్న దని చెప్పి వెళ్లిపోయారు. నాటి మధ్యాహ్నం వెంకయ్య ప్రార్థించగా స్వామి వారింట భోజనము చేశారు. కొన్నాళ్లకు అతడు పొలం కొనడమేగాక మిద్దెయిల్లుగూడా కట్టుకున్నాడు. వాస్తు వాళ్లందఱూగూడా స్వామి చెప్పిన హద్దువఱకు యిల్లు కట్టేందుకు నిశ్చయించడమే చిత్రము.

దేవుడయ్య బీదవాడయినా స్వామి బృంద మంతటికి అతిథ్యము యిచ్చేవాడు. స్వామి ఒకనాడు రాగి అంబలి కాయించి అతని యింట్లో ఈశాన్యదిశలో గజం లోతులో పూడిపించారు. నాటినుండి వారి యింటిలో సిరిసంపదలు, దానధర్మాలకు కొదవలేదు.

సుబ్బారావు కుమారుడు పరీక్షకు వెళుతూ స్వామిని దర్శిస్తే 'పరీక్షలో వుత్తీర్ణుడవౌతావు' అని చీటి వ్రాయించారు. కానీ ఫలితాలు ప్రకటించాక అతని నెంబరు కనిపించలేదు. అతని తల్లి స్వామి నడిగితే ఆయన వుత్తీర్ణుడైనాడులేమ్మా అన్నారు. మార్కుల జాబితాలో అతడు వుత్తీర్ణుడైనాడని వ్రాశారు.

పి బోడెయ్య టైఫాయిడ్‌తో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వున్నాడు. అతని రక్తము మార్చనిదే బ్రతకడని గనుక రాయవేలూరు వెళ్లమన్నారు. అందుకతనికి శక్తి లేనందున తనను రక్షించమని స్వామిని ప్రార్థించాడు. స్వామి అతనికి భౌతికంగా దర్శన మిచ్చి నీకేమీ పర్వాలేదు. మూడురోజులలో బాగుంటావు అని అభయ మిచ్చి వెళ్లిపోయారు. పద్దెనిమిదిరోజుల నుండి ఆహారము లేకుండా నీరసించి మంచము నుండి లేవలేని బోడెయ్యకు వెంటనే యెంత బలమొచ్చిందో చెప్పలేముగాని ఆరాత్రికి రాత్రి వైద్యుడు చెప్పకుండానే తమ సామానంతా ఆస్పత్రిలో వదిలేసి 18 మైళ్లు నడచి తన స్వగ్రామము చేరుకున్నాడు. ఏ మందూ మాకూ లేకుండానే స్వస్థుడై స్వామి సమాధిని దర్శించి కృతజ్ఞత తెలుపుకున్నాడు.

ఒక రైతు క్రొత్తగిత్తను బండి కట్టడానికి అలవాటు చేస్తుంటే అది బెదిరి చాలా బాధపెడుతున్నది. స్వామి అటుగా బోతూ, 'అయ్యా! బండికట్టి నన్ను ఆ యేరు కాస్త దాటించు' అన్నారు. ఆ రైతు స్వామి ఈ ఎద్దు యింకా కాడికలవాటు పడలేదు. బెదురుతున్నది. నా కింకొక యెద్దు లేదు అని మనవి చేశాడు. బాగానే లాగుతుందిలేవయ్యా! నీకెందుకూ, బండికట్టు అన్నారు స్వామి. అతడు బండి కడితే మోకాటిలోతు బురదలోకూడా సునాయాసంగా లాగడమేకాక తర్వాత అలవాటుపడిన యెద్దులా సేద్యపు పనులన్నీ చేయసాగింది. స్వామి కార్యానికి శ్రమపడినందుకు రైతుకు శ్రమ, ఎద్దుకు దెబ్బలు తప్పిపోయాయి.

ఒకప్పుడు మంగుపల్లెలో కలరావ్యాధివలన యెందఱో చనిపోతున్నారు. ఏరు గట్లనిండుగా ప్రవహిస్తుండటంవల్ల ఆ గ్రాస్థు లెవ్వఱు స్వామి వద్దకు రాలేకపోయారు. అయితేనేమి? స్వామి కాగడా చలమానాయుడి కిచ్చి, 'ఎటూ  చూడకుండా నీ దృష్టి కాగడాలపై పెట్టి నడు' అని చలమానాయుణ్ణి నదిలో నడిపించి ఆ గ్రామము చేరారు. ఏటినీరు వారికి మోకాళ్లవఱకు వచ్చాయి. స్వామి వూరివెలుపల ఒక కఱ్ఱ నాటి, ఒక చీటి వ్రాయించి దానికి కట్టి తిరిగి వచ్చేశారు. అటుతర్వాత ఆ గ్రామంలో ఒక్కఱుకూడా చనిపోలేదు.

పోలు మస్తానయ్య మొదట నాస్తికుడు. స్వాము లంటేనే యేవగించుకునేవాడు. అతడింట్లో లేనపుడు 1981 లో నాలుగువేల రూపాయలు విలువగల బఱ్ఱెకు, ప్రమాదంగా జబ్బుచేసి నీళ్లు, మేత తీసుకోవడములేదు. వెటర్నరీ కాంపౌండరు వూరిలోగూడా లేడు. ఆ వ్యాకులతతో రాత్రి 10 గంటలకు మస్తానయ్య అన్నం తినకుండా దిగులుతో పడుకున్నాడు. ఇంతలో అతని తమ్ముని కొడుకు, ఎనిమిదేళ్లవాడు వచ్చి, 'వెంకయ్యస్వామి విభూతి బఱ్ఱెకు పెడతాను నాయన' అన్నాడు. మస్తానయ్య చికాకుగా 'నీకు నమ్మకముంటే పెట్టుకో ఫో' అని కసురుకొని

నిద్రపోయాడు. మఱికొద్దిసేపట్లో నిద్రలో స్వామి వచ్చారని కలవరిస్తున్నాడు. మఱికొద్దిసేపట్లో యింట్లోవాళ్లు మస్తానయ్యను నిద్రలేపి చూచేసరికి బఱ్ఱె లేచి గడ్డి తింటోంది. నా నాస్తిక భావాలన్నీ క్షణంలో యేమయ్యాయోగాని తెల్లవారకముందే బయలుదేరి మూడుమైళ్లు నడిచి గొలగమూడి చేరాను. నేను నోరు మెదపకముందే స్వామి 'నీ గొడ్డు బాగుండ్లాయ్యా!' అన్నారు. ఆయన ఒక్కమాటా అనకుంటే నాలో చాలా అనుమానాలు రేకెత్తుతాయని ఆయనకు తెలుసు. నాటినుండి నేను స్వామిని ఆరాధిస్తూ ఆయన రక్షణ పొందుతూ దైవచింతనతో జీవిస్తున్నాను అంటాడు మస్తానయ్య.

కూచి పట్టాభిరామయ్య ఐదవ సంవత్సరమువఱకూ యెప్పుడూ చలి, జ్వరము, విరేచనాలతో బాధపడుతుండేవాడు. వైద్యాలు, యంత్రాలు, మంత్రాలు వృధా అయినాయి. అపుడు బద్వేలు తిప్పమీద నున్న స్వామివద్దకు అతనిని తీసుకువెళ్లారు. స్వామి, 'అబ్బో, ఆయన కేమయ్యా, మిద్దెమీద మిద్దె కడతాడు. బావుంటాడులే' అని అతడిచేత పచ్చివేరుశనపప్పు తినిపించి గుడ్డతో మంత్రించి పంపేశారు. నాటితో ఆ బాధలన్నీ పోయి పుష్టిగా పెరిగాడు. నాకిప్పుడు 40 ఏళ్లు. ఈనాటికీ తలనొప్పిమాత్ర వేసుకొనే అవసరంగూడా రాలేదు' అంటాడు.

ఈయన 1971లో కట్టిస్తున్న మిద్దెపని ఆగిపోయింది. పరిస్థితులు అడ్డం తిగిరి 8 నెలలు గడిచినా స్లాబుగూడా పోయించలేకపోయాడు. స్వామి కృపవలన అతని బుద్ధి మేల్కొని స్వామిని దర్శించి, స్వామి తమరి అనుమతి లేకుండా మిద్దెపని ప్రారంభించాను. పని నిలచిపోయింది, దయచూడండి అని విన్నవించుకున్నాడు. స్వామి అయ్యా! అది పీనుగుల మిట్ట! ఆ స్థలం వదిలి 4 మూరలు దక్షిణం - పడమరల వైపు జరిపి కట్టుకో అంతా బాగుంటుంది' అన్నారు. పూర్తి విశ్వాసంతో 10 వేల రూపాయల ఖర్చుతో కట్టిన గోడలన్నీ పగులగొట్టించి మళ్ళా కట్టుబడి ప్రారంభిస్తే యే ఆటంకమూ లేకుండా పనిపూర్తి అయ్యింది. అతని వివాహ విషయంలో కూడా స్వామి వద్దన్న సంబంధాలు మానేసి ఆయన అనుమతించిన అమ్మాయినే వివాహమాడాడు. పిల్లాపాపలతో కులాసాగా వున్నాడు.

పోర్లపల్లి వేంకటేశ్వర్లుకు చెందిన మేకలు 1970లో జబ్బుచేసి చనిపోతుంటే స్వామి ఆశీస్సులకోసము చిలకమఱ్ఱి వెళ్లాడు. స్వామి చుట్టు భక్తులెక్కువమంది వుండటంవలన అతనికి అవకాశమేలేక దూరంగా వున్నాడు. స్వామి శిష్యుడొచ్చి బొమ్మవరం అబ్బాయిని స్వామి పిలుస్తున్నారు అని కేకవేసి అతనిని పిల్చుకువెళ్లాడు. అతడిని చూస్తూనే స్వామి 'ఇక నీ జీవాలు నష్టంకావు. అన్నీ బాగుంటాయి' అని చీటీ వ్రాయించిచ్చారు. తర్వాత ఒక్క మేకగూడా చనిపోలేదు. అలానే 1978లో తుఫాన్‌వలన అతని గొఱ్ఱెలన్నింటిని కొండకు తోలివేశారు.

అవి తిరిగి వస్తాయన్న ఆశలేదనుకుంటే స్వామి కలలో 'మన జీవాలన్నీ బాగుండాయిలేయ్యా!' అన్నారు. గ్రామంలో అందఱి జీవాలు చాలాభాగం చనిపోయాయి. ఇవిమాత్రము చనిపోలేదు.

**శ్రీభక్తభారభృతాయ నమః**

## శ్రీఅవధూతాయ నమః

## అధ్యాయము - 6

# భిషగ్వరేణ్యుడు

ఊహలన్నీ మనసుయొక్క రూపాలే అయినట్లు యీ విశ్వంలోని రూపాలన్నీ దివ్యశక్తి రూపాలే.అది మన శరీరంలో సక్రమంగా పనిచేయడమే ఆరోగ్యము, తారుమారవడమే రోగము. ఈ శక్తి మహనీయులలో తపస్సువలన తీవ్రమైన దివ్యలీలల రూపంలో ప్రకృతినిగూడా శాసిస్తుంది. ఈ శక్తి పూర్తిగా వికసిస్తే యెలా పనిచేయగలదో 'శ్రీగురుచరిత్ర', 'అక్కల్కోటస్వామిచరిత్ర', 'సాయిబాబా జీవిత చరిత్ర' లలో సంపూర్ణంగా చూడవచ్చు. వారు దుస్సాధ్యమైన రోగాలనుకూడ శాసించి భక్తివిశ్వాసాలద్వారా మనలను ఆత్మపథంలో నడిపించగలరు.

ఒకరోజు ఒకరు తేలుకుట్టి విపరీతమైన బాధలో స్వామివద్దకు వచ్చారు. స్వామి అదేమి చేస్తుందయ్యా పోతుంది అనగానే ఆ బాధ అదృశ్యమయ్యింది. అందువల్లనే యెక్కడైనా పశువులకు, మనుష్యులకు అంటువ్యాధులు వస్తే ఆ గ్రామము తరుపున ఒకరిద్దఱు వచ్చి స్వామికి చెప్పేవారు. ఆయన సాంబ్రాణి, దారమూ యిచ్చి పశువు లన్నింటికి పొగవేయించి ఆ దారం పశువుల దొడ్డికి కట్టించేవారు. ఇక ఆ గ్రామంలో యే ప్రాణికీ భయ ముండేది కాదు. వారి దయవలన తేళ్ళు, పాముల బాధలనుండి విముక్తులయినవారి సంఖ్య చెప్పనలవి గాదు. నేటికీ స్వామివారి సమాధి ప్రదక్షిణము చేతనే అట్టి బాధలు తొలగుతున్నాయి.

ఓబయ్య స్వామికి చిన్ననాటి స్నేహితుడు. ఆయన చాలాకాలం వుబ్బసంతో బాధపడి స్వామివద్దకు వచ్చాడు. స్వామి తమ చేత్తో అతని శరీర మంతా రుద్దినప్పటినుండి మళ్ళీ ఆ బాధ కల్గనేలేదు.

నర్సారెడ్డిగారి యెద్దుకు పాము కఱచి, కడుపువుబ్బి మేత తినక చొంగ కారుస్తున్నది. దానిని తీసుకురాగానే స్వామి ఆ గాయంలో చేయిపెట్టి శ్వాస గట్టిగా పీల్చి వదిలారు. ఎద్దు వెంటనే లేచి పేడవేసి గడ్డి తినసాగింది. మఱొకసారి 'నర్సారెడ్డికి పాము గండ మున్నది. వీరరాఘవస్వామి రక్షిస్తారు' అని స్వామి చీటీ వ్రాయించారు.

తర్వాత ఒకరోజు ఆయన వడ్లకోసము గాదెలో దిగేసరికి కాలికేదో మెత్తగా ఐదారుసార్లు తగిలింది. లాంతరు తెప్పించి చూస్తే అది పెద్ద త్రాచుపాము. అతడొక్కసారిగా బయటకు వచ్చి పామును కొట్టేశాడు. స్వామి రక్షణ వుండబట్టే అది కఱవలేదు.

వక్కెమ్మకు పురుగుకుట్టి వంటిపై పొడ, దురదవచ్చి యే వైద్యాలకు, మంత్రాలకూ తగ్గలేదు. ఆమె స్వామిని దర్శించి సుమారు 6 గంటలు ఆయన చెంత వున్నది. కానీ యేమి చెప్పుకోలేదు. స్వామి 'సంగతేమిటో అడుగయ్యా!' అని సేవకునితో చెప్పి మరుక్షణము ఆయన 'వక్కెమ్మకు పురుగు కాటేగదయ్యా, దెబ్బకుపోదా యిది?' అన్నారు. చిత్రమేమంటే ఈమె సేవకులకుకూడా తెలియదు. ఆక్షణంనుండి మూడురోజులలోగా బాధ తగ్గిపోయింది. అదిమొదలు ఆమె స్వామి సేవలో యెక్కువ గడిపేది.

ఒకప్పుడు ఒక పాపకు పొట్టలో గడ్డలేచి విపరీతంగా వుబ్బిపోయి యే వైద్యాలకూ లొంగలేదు. స్వామి చెంతకు తీసుకొనిరాగానే ఆయన బిడ్డను ఒక దిగుడుబావిలోనికి తీసుకొనిపోయి నీటిమీద బోర్లాపడేశారు. తర్వాత గట్టుమీదకు తెచ్చి పొట్టమీద కాలువేసి మెల్లగా త్రొక్కారు. చీమూ నెత్తురూ నోటిగుండా, ఆసనంగుండా బయటకు వచ్చాయి. పాప కొద్దిరోజులలో ఆరోగ్యవంతురాలయ్యింది.

గుత్తానర్సమ్మ స్వామి సన్నిధి విడిచి వెళ్ళలేకపోయేది. మఱొకవంక యింటికి వెళ్లి బంధువులను చూడాలనిపించేది. ఒకనాడు స్వామి 'తులశమ్మ, నరసమ్మ చనిపోయారు' అని చీటి వ్రాయించి ఆమె కిచ్చారు. అటుతర్వాత ఆమెను మమకారాలు బంధించలేదు. ఇంటికి వెళ్లాలనే ధ్యాసే లేదు. ఒకప్పుడు యీమెకు మోకాలు నొప్పిచేసి కాలు మడవలేకపోయింది. స్వామికి చెపితే, 'ఇంకెప్పటికీ రాకుండా చీటీ వ్రాసివ్వండయ్యా!' అన్నారు. అలా చేయగానే ఆమె బాధ తొలగిపోయింది.

ఈశ్వరమ్మకు కడుపులో గడ్డలేచి తొమ్మిదినెలల గర్భము వలె వున్నది. వైద్యులు శస్త్రచికిత్స చేయాలని అన్నారు. ఆమె స్వామితో చెప్పుకుంటే ' నీవు 100 రూపాయలు కడితే జేపీపాటికి నీ బాధ తగ్గుతుంది' అన్నారు. ఆమె యింటికికూడా పోకుండా వూరిలో అప్పు తెచ్చి వెంటనే సమర్పించింది. నాటిరాత్రి స్వామి శస్త్రచికిత్స చేసినట్లు స్వప్నం వచ్చింది. త్వరలో ఆమెకు ఆరోగ్యము చేకూరింది.

ఒక పిచ్చివాడిని 1975లో త్రాళ్లతో కట్టి స్వామివద్దకు తెచ్చారు. అతనికి గుండంవద్ద పొగపట్టమని స్వామి చెప్పారు. నలుగురుమనుష్యులు అతడిని పట్టుకుని గంటన్నరసేపు పొగపెట్టారు. క్రమేణా వారంలోగా అతనికి పిచ్చి తగ్గింది. అలాగే 1979 లో పెద్ద గోపారంనుండి ఒక యువకుడిని తెచ్చారు. అతనికి 2 సంవత్సరాలుగా మతిస్థిమితము లేదు. స్వామి అతడిని ఆశ్రమంలో వుంచమన్నారు. క్రమేణా అతనికి పిచ్చి తగ్గింది.

ఒకప్పుడు కుష్టురోగి ఆశ్రమంలో వుండగా స్వామి బాధతో మూలుగుతున్నారు. రోశిరెడ్డి పాదాలు వత్తబోయి పట్టుకోగానే 'అబ్బో, అబ్బో తాకవద్దయ్యా!' అన్నారు స్వామి. గంట తర్వాత రోశిరెడ్డికి కాలిబొటనవ్రేలి క్రింద చిట్లి కుష్టు ప్రకటమయ్యింది. ఆ రోగియొక్క బాధను స్వామి తీసుకొనియుండగా తాకిన ఫలితమని గుర్తించి అతడు నాలుగురోజులు గురుస్మరణ చేశాడు. అపుడు ఆ వ్యాధి తగ్గింది. ప్రారబ్ధము అనుభవించక తప్పదన్నప్పుడు భక్తుడు అనుభవించలేకుంటే సాయిబాబా వలె స్వామికూడా బాధను తాను తీసుకుని అనుభవించేవారు.

శకుంతలమ్మ చాలాకాలం వుబ్బసంతో బాధపడింది. వేలకొద్ది డబ్బు ఖర్చుచేసి చికిత్స చేయించినా తగ్గలేదు. అపుడు స్వామితో చెప్పుకుంటే 'అనికేపల్లి విడిచివచ్చి యిక్కడే స్థిరపడండి. నేను చెప్పినదాకా గట్టి యిల్లు కట్టవద్దు. 10 రోజులలో నయమౌతుంది అన్నారు స్వామి. అలానే చేయడంవలన స్వామి చెప్పిన గడువులోపల ఆమె బాధ అదృశ్యమయ్యింది. కానీ 1981లో తుఫానువల్ల వారి పాక కూలిపోయింది. ఇల్లు వేసుకునేదాక అనికేపల్లిలో వుండాలని పోయేసరికి వెంటనే మఱలా జబ్బు చేసి శస్త్రచికిత్స చేయవల్సి వచ్చింది. తిరిగి అనికేపల్లిలోని వారి యిల్లు వదిలి గొలగమూడిలో కాపురము పెట్టగానే జబ్బు తగ్గిపోయింది.

తాళ్ళూరు శ్రీనివాసులుకు గుండెనొప్పి, రక్తపోటు, భయము వుంటే కేవలము స్వామి దర్శనముచేతనే అవన్నీ తగ్గిపోయాయి. అందుకే తరచు స్వామి సమాధిని దర్శిస్తూంటాడు. సొంతఖర్చుతో స్వామి వుత్సవాలలో తన బృందాన్ని తెచ్చి మేళం వాయిస్తాడు. ఒకప్పుడు ఇతనికి చేయి విపరీతంగా నొప్పిపుడుతుంటే ఆసుపత్రికి వెళ్లాడు. అతడు 'నాకు మందులు పనిచేయవు. స్వామివద్దకు పోతాను' అన్నాడు. అతడు గొలగమూడి బండి యెక్కగానే నొప్పి తగ్గిపోయింది. ఒకసారి పెసల సుబ్బరామయ్యకు నెలరోజులుగా బాధిస్తున్న దగ్గు, చలి స్వామివద్దకు బయలుదేరగానే పోయాయి.

ఒకరోజు స్వామి తనకు మంత్రించమని గోలచేశారు. ఆరోగ్యము వున్న ఆయన అలా యెందుకు అన్నారో యెవఱికీ తెలియలేదు. కొద్దిసేపటికి తూపిలి పిచ్చమ్మకు పాము కఱచిందని తీసుకువచ్చారు. స్వామి విభూతి పెట్టగానే తగ్గిపోయింది. ఆయన మంత్రించమన్నది ఆమెకోసము.

వల్లపురెడ్డి తులశమ్మకు క్యాన్సర్ వస్తే నెల్లూరు అమెరికన్ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యురాలు బేరమ్మ రోగి మరణిస్తుందని, తీసుకుపొమ్మనీ చెప్పారు. ఆమెను స్వామివద్దకు తీసుకొచ్చారు. 'ఆమెను మూడురోజులు యింట్లో వుంచి తీసుకురండి' అన్నారు స్వామి. అలా చేయగానే ఆమెకు రోగము తగ్గింది. ఆమె 20 సంవత్సరములు స్వామి సేవకు అంకితమయ్యింది. ఆమెను స్వామి 'అమ్మా' అనేవారు. 'అయ్యా! అమ్మ బొమ్మపాటునకదా వుండేది' అనేవారు. అమ్మ అంటే ప్రకృతి లేక మాయ. బొమ్మ అంటే బ్రహ్మము.

మఱొకసారి అమ్మ తమకు నాలుగు జన్మలనుండి అన్నం పెడుతుందయ్యా! అన్నారు. కొన్ని జన్మలు యథాశక్తి సేవచేశాకనే యీ జన్మలో నిరంతర సద్గురుసేవ, సాన్నిధ్యమూ లభిస్తాయి. బద్వేలు బాపనపల్లి నుండి తీవ్రమయిన చలిజ్వరంతో బాధపడుతున్న ఒక వ్యక్తి వచ్చి స్వామిని ఆశ్రయించాడు. స్వామి అతడిచేత దోశెడు వేరుశెనగకాయలు తినిపించి ముంతనిండా పుల్లనీరు త్రాగించారు. తర్వాత ఆ ప్రక్కనున్న నదిలోని యిసుకలో అతనిని మెడలోతున పూడ్చి అరగంట తర్వాత తీసుకురమ్మన్నారు. అలా చేయగానే జబ్బు తగ్గిపోయింది. అతను మామూలుగా భోజనము చేశాడు. ఇటువంటి లీలలు దత్తసాంప్రదాయానికి సహజమే. అందుకే సాయిబాబా జీవిత చరిత్రలో కూడా  యిలాంటివి కోకొల్లలుగా కనిపిస్తాయి.

స్వామి ఆజ్ఞ అనుల్లంఘనీయము, అమోఘము. మామూలుగా బొంతజెముడు పాలు ఒంటిమీద పడితే చర్మము పొక్కిపోతుంది. కళ్లలో పడితే కళ్లుపోతాయి. కానీ స్వామి ఆదేశానుసారము నాటినుండి నేటివఱకూ మల్లిక వెంకటయ్య ఒంటిమీద, కళ్లలోను అవి యెన్నిసార్లు పడినా యేమి అవలేదు. అతడు వాటిని కొట్టి స్వామివారి గుండంకోసం సిద్ధము చేస్తూనే వున్నాడు. ఒకసారి స్వామి ముదిగేడులో వున్నప్పుడు తీవ్రమయిన తెల్లబట్టతో బాధపడుతున్న ఒకామెను ఆయన వద్దకు తీసుకొచ్చారు. మూడురోజులు యేమీ చెప్పకపోయేసరికి వారి సన్నిధిలో మరణించినా మేలేనని ఒకనాటిరాత్రి ఆమె గుండంలో దూకింది. ఆమెకు కించిత్తయినా కాలలేదు సరికదా, నాటితో ఆమె బాధ తొలగిపోయింది.

**శ్రీగురుదేవదత్తాయ నమః**

## శ్రీఅవధూతాయ నమః

## అధ్యాయము - 7

# సం క ట హ రు డు

ఒకరోజు స్వామి తన అరచేయి చూపుతూ 'పుల్ల గ్రుచ్చుకుందయ్యా' అన్నారు. నిజానికి స్వామికి యేమీ గ్రుచ్చుకోలేదు. తర్వాత తెలిసింది. అదే సమయములో అరమైలు దూరంలో నున్న బుజ్జయ్యకు అరచేతిలో తేలుకుట్టింది. అలాగే గొలగమూడి చెత్తయ్యకు బురదలో వున్న తేలు అరికాలులో కుట్టింది. అతడు కాలు గట్టిగా పట్టుకొని స్వామిని తలచుకోగానే బాధ తగ్గి మళ్ళీ యథాపూర్వము పనిచేసుకోసాగాడు.

స్వామి సేవకుడు రోశిరెడ్డికి కన్ను శస్త్రచికిత్స అయి నొప్పిగా వున్నది. స్వామి, 'నీవు 40 లక్షలు కడితే దారిలో రామలక్ష్మణులు రక్షిస్తారు. ఊరికిపోతే దారిలో అమ్మణ్ణి కాపాడుతుంది. రేపు నాకు చెప్పకుండా వూరికి వెళ్లి మఱలా వచ్చేయి' అని చీటి వ్రాయించారు. అతడలాగే వెళ్లి రాత్రి రాజంపేట రైల్వేస్టేషనులో కళ్లు కనిపించక ఫ్లాట్‌ఫారంనుండి పట్టాలమీద పడ్డాడు. అయినా యేమీ దెబ్బ తగల్లేదు. తర్వాత వరుసగా నాలుగురోజులు గ్రామదేవత ఎల్లమ్మ అతనికి దర్శనమిచ్చింది.

అనంతసాగరం కరణంగారికి యిద్దఱు బిడ్డలుపుట్టి పోయారు. మూడవసారి భార్య గర్భవతికాగానే స్వామిని దర్శించాడు. స్వామి 'బిడ్డ బ్రతుకుతుందిగాని పాపకు 3వ యేట గండమున్నది. నేనున్నాను. పర్వాలేదు' అన్నారు. సరిగా 3వ యేట అలానే పాప బండినుండి పడి, తలపై చక్రంపోగా తలచీలింది. అయినా స్వామి దయవలన బ్రతికింది.

స్వామి సేవకులకు తూపిలి వెంకయ్య శ్రద్ధతో గుడ్డలు వుతికేవాడు. ఒకనాటిరాత్రి మెలకువొచ్చి యింట్లో చూస్తే నట్టింట దొంగ కూర్చుని వున్నాడు. వెంకయ్య అరవడంతో అందఱూ లేచి దొంగను కట్టేశారు. అందఱూ ప్రశ్నించినమీదట దొంగ యిలా చెప్పాడు. 'నే నింట్లోకి వస్తుంటే యెవఱో వీపున చఱచినట్లయి నిస్సత్తువై

పోయింది. ఎలాగో వస్తువులు మూటగట్టుకున్నాగాని, ఎక్కడివక్కడ పెట్టేయ అని యెవఱో గద్దించినట్లు వున్నది. ఇక కండ్లు కనిపించక కూలబడ్డాను. లేకుంటే మీరందఱు ఒక దెబ్బకు చాలుతారా? అన్నాడు.

గొట్టేటి శేషయ్య తన బఱ్ఱెకు జబ్బుగా వుంటే స్వామి దగ్గఱకు వచ్చాడు. అపుడు స్వామి గంజి త్రాగుతున్నారని, అపుడు ఆయనతో చెప్పుకోవడం వీలుగాదని సేవకు లన్నారు. ఇంతలో స్వామి అతనిని చూచి, 'అయ్యా! నీవు పోయేసరికి బఱ్ఱెకు బాగుంటుంది ఫో' అన్నారు. సరిగా అలానే జరిగింది.

మాకాని వెంకట్రావు యెపుడు వూరికి వెళుతున్నా 'బంగారంగా పోయిరమ్మను' అనేవారు స్వామి. కానీ ఒకరోజు 'తిరువళ్లూరు వీరరాఘవస్వామి, కంచి వరదరాజస్వామి నిన్ను రక్షిస్తారు ఫో' అన్నారు. మద్రాసులో వెంకట్రావు ఫుట్‌బోర్డుమీద కాలువుంచగానే బస్సు కదిలింది. అతను క్రిందకు వ్రేళ్లాడుతున్నాడు. వెనుకవాళ్లు అరుస్తున్నారు. డ్రైవరుకు వినబడలేదు. అందఱూ అతనికి ప్రాణాపాయము తప్పదనుకున్నారు. వెంటనే ముందర టైరు పగిలి బస్సు ఆగిపోయింది.

ఒకసారి జయరామరాజు యెద్దులను మేతకు అడవికి తోలుకుపోయాడు. వాటిని తోలేసి రమ్మని స్వామి పిలవడంతో అతడు వాటిని పశువులకాపర్లకు వప్పజెప్పి ఆయన దగ్గఱ కూర్చున్నాడు. కొంతసేపటికి స్వామి ఒక్కసారిగా లేచి కఱ్ఱ తీసుకొని దేనినో అదిలిస్తున్నట్లు కొద్దిదూరం వెళ్లి, తిరిగి వచ్చి కూర్చున్నారు. అతడు ఆశ్చర్యంతో కారణమడిగితే 'నీ ఎద్దులేదయ్యా' అని మాత్రము అన్నారు. తెల్లవారాక పశువులకాపర్లు అతనితో 'నిన్న చిఱుతపులి మీ యెద్దు మీదకు పోయింది. ఆ వేలిముద్రల స్వామి కఱ్ఱ తీసుకుని తరమకుంటే యెద్దు చచ్చిపోయేది' అన్నారు.

ఒకరోజు గొలగమూడి ఆశ్రమంలో స్వామి ప్రమాదం అని కేకలుపెట్టి పట్టపగలే దీపారాధన చేయించారు. అదేరోజు గొలగమూడి కరణంగారి కుమారుడు నెల్లూరులో రొడ్డున వెడుతుంటే వెనుకనుండి ఒక ట్రాక్టరు అతనిని గుద్దింది. దాని ముందు చక్రము అతనిపైకి యెక్కడంతో ప్రక్కటెముక విరిగింది. ఆస్పత్రిలో వైద్యులు 3 నెలలకుగాని అతడు లేవలేడన్నారు. మఱురోజు స్వామి చర్యకు అర్థము అందఱికీ తెలిసింది. 15 రోజులలో అతడు లేచి తిరుగుతాడని స్వామి చీటి వ్రాయించి, దానితోపాటు తన కౌపీనం అతని ప్రక్కమీద పఱచమని పంపారు. అంతా ఆయన చెప్పినట్లే జరిగింది.

ఒకసారి శ్రీహరినాయుడుగారి భార్యతో స్వామి 'అమ్మా! నీ పసుపుకుంకుమకు గండ మున్నది. వీరరాఘవస్వామి తప్పిస్తారు' అని చెప్పి వారింటికి వెళ్లి ధుని వెలిగించారు. అదేరోజు శ్రీహరినాయుడు మేత వెయ్యబోగా సాధుజంతువైన యెద్దు అతనిని పొడిచి యెత్తిపడేసింది. అతని పొట్టలో ఆఱుంగుళాల గాయమై ఆస్పత్రిలో కుట్లువేశారు. అతని ప్రాణము దక్కింది. అప్పటినుండి అతడు స్వామి సేవకు అంకితమయ్యాడు.

తులశవ్వ స్వామి సేవలో వుండగా ఒకసారి ఆమె కుమారుడు నారాయణరెడ్డికి క్షయవ్యాధి ముదిరి ప్రమాదంలో వున్నదని తెలిసింది. అతనిని చూడటానికి ఆమె బయలుదేరుతుంటే స్వామి 'ఆయనకేమమ్మా! బాగుంటాడు. నీవు పోవద్దు' అన్నారు. అలానే అతడు పూర్తి ఆరోగ్యవంతుడై ఈనాడు ఆశ్రమానికి యెంతో సేవ చేస్తున్నాడు.

ఒకసారి ఒక ప్రభుత్వోద్యోగి యొక్క అవినీతి ఋజువై అతనికి శిక్ష తప్పేలా లేదు. భయంతో అతడు స్వామిని ఆశ్రయించాడు. స్వామి 'అతనికి చాకలిమూటంత పాపమున్నది, ఆయన యిక్కడుంటే మనకూ నష్టమే. వెళ్లిపొమ్మనండి' అన్నారు. అతడు ప్రాధేయపడగానే 'నీ చిరునామా వ్రాసి యిచ్చిపో, చీటి వ్రాయించి పంపుతాను' అని అభయమిచ్చారు. అతనికి సస్పెషన్ తప్పిబదలీమాత్రము అయ్యింది.

ఒక భక్తుని చెల్లెలు వివాహము స్వామి స్వయంగా కంచిలో జరిపి ధుని, కర్పూరము వెలిగించారు. ఆయన వద్దన్నా వినకుండా అతని బావమఱిది అంగడి పెట్టాడు. తర్వాత తగాదా వచ్చి తమ్ముడు అన్నను పొడిచి చంపాడు. తర్వాత అతడుకూడా యెండ్రిన్ త్రాగబోయాడు. సాటివారు అడ్డుపడ్డారు. అతడు స్వామిని ఆశ్రయిస్తే అతనికి అభయమిచ్చారు. ఆ కేసు విచారణ అయిన రోజునే మఱి 3 కేసులలో ముద్దాయిలకు మరణశిక్ష పడినా, ఇతనికిమాత్రము 4 నెలలు జైలుశిక్షమాత్రము పడింది. అలానే యెన్నో కోర్టు వ్యవహారాలతో కలతచెందిన బుజ్జయ్యతో 'చింతపడకు, ఇంటికి ఫో, అన్నీ నేను చూసుకుంటాను!' అన్నారు స్వామి. త్వరలో అతని చిక్కులన్నీ తొలగిపోయాయి.

కొల్లా జయరామరాజుగారు చెల్డీ, చలిజ్వరాలతో బాధపడుతున్నాడు. స్వామి అతనిచేత ఒక శేరు పచ్చిశెనగకాయలు తినిపించి, మజ్జిగ త్రాగించి యేట్లో మునిగి రమ్మన్నారు. అలా చేసిన మరుక్షణమే జబ్బుపోయింది. ఇలాగే బాబాకూడా ఒక టైఫాయిడ్ రోగికి పిస్తాపప్పు, పాయసము తినిపించి, విరేచనాల రోగికి వేరుశనగకాయలు, నీరు సేవింపచేసి రోగము తగ్గించారు.

బొడ్డు నరసయ్య పారపని చేసినపుడల్లా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడేవాడు. ప్రేగు పొక్కిందనీ, శస్త్రచికిత్సకు వీలులేదనీ వైద్యు లన్నారు. స్వామి అతనికి వారంరోజులు గుడ్డతో మంత్రించమని చెబుతూ తుంబుర మీటుతూ 'ఈ నాటితో నీ కర్మ పోయింది' అన్నారు. నాటినుండి ఆ బాధే లేదు.

మునికూటి రామయ్య కడుపునొప్పి, దవడ, ఒళ్లునొప్పులతో బాధపడుతున్నాడు. ఆ బాధలు వైద్యులకు లొంగలేదు. అపుడు స్వామిని దర్శించుకొమ్మని యెవఱో చెప్పారు. నాటిరాత్రి స్వామి కలలో కనిపించి, 'నేను పెన్న బద్వేలులో వున్నాను. నా దగ్గఱకు రా, నయము చేస్తాను' అన్నారు. మఱురోజు అతడు వారిని దర్శించి,

తనకు కలలో కనిపించినది వారేనని గుర్తించి ఆశ్చర్యపోయాడు. స్వామి అతన్ని ఒక నెల తమ దగ్గఱ వుండమన్నారు. అలా చేయగానే ఆరోగ్యము చేకూరింది. అతడు తన యింటి దగ్గఱ స్వామికని ఒక పాకవేయించి ఆయనకు ఆతిధ్యము తరుచుగా యిస్తుండేవాడు. ఒకరోజు స్వామి బియ్యము తెప్పించి మంచినీళ్ల బావి దగ్గఱ వేయించి, ‘ ఇది మిద్దెయిల్లు అవుతుంది’ అన్నారు. త్వరలో అతడు శ్రీమంతుడై నిజంగానే మిద్దెయిల్లు కట్టుకోగలిగాడు.

పల్లంరెడ్డి కృష్ణారెడ్డికి వున్న ఒక బఱ్ఱె కడుపు వుబ్బి చావుబ్రతుకుల మధ్య వున్నది. అతడు స్వామిని నమ్ముకుంటూ యీ ఒక్క బఱ్ఱెను చంపేస్తున్నాడే అనుకుంటూ నిద్రపోయాడు. కలలో స్వామి బఱ్ఱె దగ్గఱ కూర్చుని కనిపించారు. మెలకువవచ్చి చూచేసరికి బఱ్ఱె మేస్తున్నది. దానిని లేవగొట్టగానే బక్కెడు మూత్రం విసర్జించింది. కడుపు వుబ్బు తగ్గిపోయింది.

ఒకసారి తలుపూరుమీదుగా వారి గని దగ్గఱ విడిదిచేశారు స్వామి. తర్వాత అచటనుండి బయలుదేరి గూడ స్వామి ‘నొప్పివచ్చింది, పోయేందుకు లేదు’ అని చెప్పి ఆగిపోయారు. ఒకగంటలో యెవఱో కడుపునొప్పితో మెలికలు తిరిగిపోతున్న ఒక పిల్లను యెత్తుకొని వచ్చారు. స్వామి చీటీ వ్రాయించి యివ్వగానే ఆ బిడ్డకు బాధ తగ్గిపోయింది. తర్వాత స్వామి బయలుదేరారు. నెలలతరబడి జిలతో బాధపడుతున్న గోను పెంచలమ్మను స్వామి రూపాయలు 1000 గుండంలో వెయ్యమన్నారు. ఆమె తనవద్ద అంత పైకం లేదంటే స్వామి 10 రూపాయలు వెయ్యమన్నారు. ఆమె తన వద్ద 10పైసలు కూడా లేవని బాధపడింది. అయితే 5 నిముషాలు నా యెదుట నిల్చోమను అన్నారు స్వామి. అలా చేయగానే ఆమె బాధ తొలగిపోయింది. మఱొకప్పుడు యీమె ఆయాసము, దగ్గుతో బాధపడుతుంటే స్వామి 6 రూపాయలు దక్షిణ పెట్టమన్నారు. ఆమెవద్ద పైకము లేక మౌనంగా నిల్చున్నది. ఈసారి స్వామి 1000 రూపాయలు గుండంలో వేస్తే పోతుంది అన్నారు. మఱురోజు ఆమె 5 రూపాయలు సమర్పించగా స్వామి, నేనుగాదు అమ్మ బాగుచేస్తుంది అని ఆమెను తులశవ్వ దగ్గఱకు పంపారు. తులశవ్వ నవ్వి, ఆయనే నీ జబ్బు పోగొట్టారు ఫో అన్నది. రెండువారాలలో క్రమేణా ఆమె బాధ తగ్గిపోయింది.

శ్రీరాములుసెట్టి కుష్టురోగి. అతడు స్వామిని ఆశ్రయించాడు. స్వామి అతని వంటికి నూనె రుద్దేవారు. అప్పుడప్పుడు అతనింట భిక్షచేసేవారు. కొన్నాళ్లకు అతని వ్యాధి తగ్గిపోయింది. తర్వాత అతడు స్వామి చెప్పిన నియమము తప్పాడేమో, మళ్లీ వ్యాధి వచ్చింది.

పాతిక సంవత్సరముల వయస్సు గల కోడూరు వెంకమ్మ నీరసించి మంచము పట్టింది. ఆమెకు ఆహారము చూస్తేనే వాంతి వచ్చేది. స్వామికి చెబితే ఆమెను పెన్నబద్వేలు తీసుకువచ్చి తనవద్ద వుంచమన్నారు. ఆమె అక్కడకు చేరి స్వామిని చూచినదిమొదలు విపరీతమైన ఆకలి మొదలై రెండుసార్లు బియ్యం వండినా తినేసేది. రాత్రింబవళ్లు ఆమెను నిద్రపోనీయక తమ వద్దనుంచుకొని స్వామి వేలిముద్రలు వేస్తుండేవారు. మూడవరోజు స్వామి ఆమెను బొత్తిగా అన్నం తిననీయక, రాత్రి ఒక అరటిపండు, పిడికెడు పేలపిండి మాత్రము తినిపించారు. అంతటితో ఆమె ఆరోగ్యము చక్కబడింది. అందుకే ఆమె స్వామి సమాధికి నేటికీ సేవచేస్తున్నది.

ఒకసారి రామానాయుడుతో స్వామి 'అయ్యా! నీ వూపిరితిత్తులలో చిన్న డబ్బు వెడల్పు మచ్చలు వున్నాయి. అవేమీ చేయవు. నీవు మద్రాసుకు వెళ్లనక్కర్లేదు. బొంతజెముడు పాలు త్రాగు, పోతుంది' అన్నారు. నిజమే! అతడు వైద్యులెవ్వరికి లొంగని క్షయవ్యాధితో బాధపడుతున్నాడు. అందరూ బొంతజెముడు పాలు త్రాగితే చస్తావని చెప్పారు. కానీ అతడు స్వామి చెప్పినట్లు చేయగానే జబ్బు తగ్గిపోయింది. ఇప్పటికీ ఆరోగ్యముగా వున్నాడు.

ప్రతిమానవుడు స్థిరమైన శాంతి, తృప్తి కోరుతాడు. అది లభించక తాత్కాలికమైన విలాసాలతో చింతలు మరచిపోచూస్తాడు. కొందరు వ్యసనాలకు లోనై ఆరోగ్యము, శాంతి కోల్పోతారు. అట్టివారి జీవితాలుగూడా మహాత్ముల దయవలన చక్కబడతాయి. కానీ అట్టి పరివర్తనము హృదయపూర్వకంగా కోరనివారికి ఫలితము వుండదు. కారణము మనస్ఫూర్తిగా కోరితేనే మహాత్ములు అనుగ్రహిస్తారు.

త్రాగుడుకు లోనైన జయరామనాయుడు స్వామి పాదాలు పట్టుకొని 'ఈ (ఆధ్యాత్మికమైన) నిషా యిలా యెప్పుడూ వుండేలా చేయండి' అని చెప్పి యెవరెంత చెప్పినా వినలేదు. చివరకు స్వామి అలాగేపోయ్యా అన్నారు. నాటితో అతనికున్న త్రాగుడూ, ముక్కోపమూ తొలగిపోయాయి.

ఒకరోజు స్వామి చీటీలు వ్రాయించి భక్తులకు యిస్తుండగా పట్టుచీరలు కట్టుకొనిన ముగ్గురు స్త్రీలు వచ్చారు. స్వామి యెంత చెప్పిన వినకుండా వారిలో యిద్దరు మట్టి అంటుతుందని తాటి మట్టలమీద కూర్చోలేదు. ఒకామె కూర్చున్నది. ఆమెకుమాత్రము స్వామి చీటీ యిచ్చి, స్వామి పైవాళ్లు ఒప్పుకోలేదు అనిచెప్పి మిగిలిన ఆ యిద్దరికి చీటి వ్రాయించి యివ్వలేదు.

ఒకరోజు గుండానికి కట్టెలు తోలే దున్నపోతులు ఒకరి చేలో పడ్డాయి. స్వామిగాని, స్వామి సేవకులుగాని యెంత వారించినా వినకుండా ఆ రైతు దున్నపోతులను బందిలదొడ్డికి తోలుకుపోతున్నాడు. స్వామి తీక్షణంగా చూస్తూ నిలపమని సైగ చేయగానే ఆ మనిషి, దున్నలు ఒక్కరుగూడా కదలలేకపోయారు. స్వామి 'ఇదేమీ నా సొంత పని కాదు. లోకం పని, కావాలంటే గుండంలో చీటి వ్రాయించుకో! ఇలా యెప్పుడూ చేయవద్దు.

అమ్మను అడిగి అన్నం తిను' అన్నారు. ఆ త్రాగుబోతు వెంటనే దున్నలను ఆశ్రమానికి తోలుకొచ్చి యిచ్చివేసి రోజూ స్వామికి సేవ చేస్తూండేవాడు.

తూపిలి వెంకయ్య కోడిపందాలు, త్రాగుడుతో యిల్లుగుల్ల చేసేవాడు. స్వామి సేవకురాలయిన ఆయన భార్య యెన్నిసార్లు విన్నవించుకున్నా స్వామి వినిపించుకోలేదు. ఒకసారి ఆమె యింట్లో పనిబడి నిత్యమూ స్వామికి సమర్పించుకొనే పాలు ఆమె భర్త ద్వారా పంపింది. స్వామి అవి త్రాగి కోడికూసినట్లు అఱిచారు. అది విని అందఱూ నవ్వారు. కానీ అది వినిన తర్వాత వెంకయ్య తన వ్యసనాలన్నీ వదులుకున్నాడు.

కారి రామస్వామి గొఱ్ఱెలు కొని కసాయిలకు అమ్ముతుండేవాడు. స్వామి తరచుగా గొఱ్ఱెలను మేపడం పాపమని చెబుతుంటే విని ఆయనపై విశ్వాసంతో ఆ వ్యాపారము వాని స్వామి సేవలో 15 సంవత్సరాలు వున్నాడు. అందువల్ల అతని కుటుంబానికి 36,000 రూపాయలు అప్పయ్యింది. అతడు పొలం అమ్మి అప్పు తీరుస్తానని స్వామికి విన్నవించుకున్నాడు. ఆయన 'అయ్యా! పొలం యివ్వవద్దు, అమ్మితే నీ పిల్లలు యేమి తింటారు? నీవు పొదలకూరులోకూడా పొలం కొంటావు. మిద్దె కడతావు. నీవు మునుపటి వ్యాపారము చేస్తే అప్పు తీరి నీకు అన్నీ సమకూరుతాయి' అన్నారు. అది పాపమంటిరి గదా? అన్నాడు అతను. స్వామి 'అయ్యా, నీవు పదిమందిలో పదకొండోవాడివిగదా, గొఱ్ఱెల యజమాని, మేపినవాడు, అమ్మినవాడు, తోలినవాడు, కోసినవాడు, తినినవాడు, వీరిలో నీవొకడివి. ఒక సంవత్సరము వ్యాపారం చేస్తే అన్నీ చక్కబడతాయి' అన్నారు స్వామి. అతడు ఆ వ్యాపారం చేస్తే అధిక లాభము వచ్చి అప్పు తీరిపోయింది.

ఒకరోజు స్వామి అతని పొలంలో ఒకచోట కఱ్ఱనాటి గుర్తుపెట్టి అక్కడ 30 అడుగులు అడ్డు కొలతలు గల బావి త్రవ్వించారు. బావి త్రవ్విస్తూండగా 9 అడుగులలో బండ పడిందని విన్నవించుకుంటే 'బండ పగలగొడితే ఇక బావిలొ నీళ్లు పడతాయయ్యా?' అన్నారు. ఆ బండను మందుపెట్టి పేలుస్తుంటే యిళ్లమీద ఱాళ్లు పడుతున్నాయని గ్రామస్తులు అభ్యంతరము చెప్పారు. ఆ మాట స్వామితో చెబితే బోరు వేయిస్తే 23 అడుగులలో ప్రక్క పొలాలకుకూడా సరిపడేంత నీరు పడుతుందని, దానిక్రింద బండ వుందనీ అటుతర్వాత నీరే లేదని స్వామి చెప్పారు. వసతి లేక 20 సంవత్సరాలపాటు బోరువేయించలేకపోయాడు. తర్వాత ప్రభుత్వము సహాయంతో 1987వ సంవత్సరములో బోరు వేయిస్తే స్వామి చెప్పినట్లే 23 అడుగులలో ప్రక్కపొలానికి కూడా సమృద్ధిగా నీరుపడింది. ఆ పైన 90 అడుగులలో త్రవ్విచూస్తే నీరు లేదు. ఇతడే ఒకప్పుడు వ్యవసాయానికని అనేకచోట్ల బండ్లు చూచి వచ్చి స్వామితో చెప్పేవాడు. స్వామి ఒకసారి ఇరుసులో కోడిపుంజులు పోట్లాడుతున్నాయి. అది వద్దు అన్నారు. ఇంకొకసారి ఆడవాళ్ళకి జబ్బు లొస్తాయి. ఆ బండి వద్దు అన్నారు. మఱొక బండి గురించి

పిల్లకాయలకు జబ్బులొస్తాయి, వద్దు అన్నారు. బండ్ల విషయము తేల్చుకోవాలని ఒకరోజు అతడు ఆయనవద్దకు వెళ్లగానే ఆయనకై ఆయనే రాజుపాలెంలో 400 రూపాయలకు బండి యిస్తారు. తెచ్చుకో. దాన్ని సోమవారం వుదయానికి ముందే బండి తోలుకొని ఆ వూరు వదిలి వచ్చేయ్. మీ వూర్లో రాములవారి దేవాలయంలో 3 నిద్రలు చేయించి మీ పిల్లకాయలను దానిమీద యెక్కించుకుని వూరంతా తిప్పుతూ శెనగలు బొరుగులు పంచుతూ బండిని యింటికి తోలుకుపో' అన్నారు. అతడు రాజుపాళెం చేరగానే ఆగిన ఒక బండిమీద కూర్చొని మాట్లాడుకుంటున్న పరిచయస్థులు అతడిని పలుకరించారు. చివఱకు ఆ బండి 400 రూపాయలకు తీసుకోమని చెప్పి అతనికి అమ్మారు. అతడంతా స్వామి చెప్పినట్లే చేశాడు. అది 25 సంవత్సరాలుగా చెక్కుచెదరకుండా పనిచేస్తున్నది. తర్వాత స్వామి చెప్పినట్లే పొదలకూరులో ఒకరు 'పొలం తక్కువ ధరకు యిస్తాము. తీసుకో' అన్నారు.  అతడి దగ్గఱ పైకం లేదంటే ఒక మిత్రుడు అప్పిస్తానన్నాడు. అప్పటికి స్వామి సమాధి చెందారు. అతడు స్వామికి చెప్పుకుంటే ఆయన కలలో కనిపించి కొనయ్యా, ఒక సంవత్సరములో అంతా తీరిపోతుంది అని చెప్పారు. అలానే జరిగింది.

స్వామి ఒకసారి అతనితో 'అయ్యా! నీకు ఆఖరిపట్లు రాస్తాను, 1100 రూపాయలు కట్టాలి' అన్నారు. అతడు తన వుంగరము, వాచీ ఆయన చేతిలో వేశాడు. స్వామి వాటిని త్రిప్పి చూచి, ఇవి అంత చేయవయ్యా అన్నారు. అతడు మిగిలిన డబ్బు కడతానన్నాడు. స్వామి అతడిచ్చిన సామాను ఆసనం క్రింద పెట్టుకున్నారు. సాయంత్రం స్వామి అవి తీసిచ్చి తర్వాత కడుదువులే అని చెప్పి సుమారు ఒక దస్తా కాగితాలనిండా వారి పరిభాషలో పెద్ద చీటీ వ్రాయించి యిచ్చి ఇదే నీకు ఆఖరిపట్టు. నీకేది కావాలనుకొన్నా చీటీ వ్రాయిస్తే నేను చూసుకుంటాను అన్నారు. అదిమొదలు అతడు అలాగే చేస్తున్నాడు.

**ఆపద్బాంధవాయ నమః**

## శ్రీఅవధూతాయ నమః

## అధ్యాయము - 8

# త్రి కా ల జ్ఞు డు

శ్రీవెంకయ్యస్వామి వద్దకు సామాన్యంగా గ్రామస్థులు తమగ్రహబాధలు, లౌకిక సమస్యలుగురించి ప్రశ్న చెప్పించుకోవడానికి యెక్కువగా వస్తుండేవారు. పట్టణవాసులు, చదువుకున్నవారు అంతగా వెళ్లేవారుగాదు. మొలకొకనార మొలత్రాడు, ప్రాతగుడ్డ గోచీ, ఈతచాప, కొన్ని ప్రాతగుడ్డలు, దుప్పటి, రెండు దిండ్లు, ఆనపకాయతో చేసిన ఏకతార(తంబుర), భోజనపాత్రగా వాడే తాటి దొన్నె - యిది సామాన్యంగా స్వామివారి వేషము. ఆయన తామున్న పరిసరాలలోని చెట్లు కొట్టి ధునిలో వేస్తుండేవారు. ధుని చుట్టూ తొమ్మిదికుండలలో పెన్నినీరు నింపివుంచేవారు. రాత్రంతా ఏకతార మీటుతూ కూర్చునేవారు. తరచుగా పెన్ననీటిలో కాలువలు త్రవ్వి, వాటిలో నీరు నదీ ప్రవాహానికి యెదరుగా మరల్చి తిరిగి ప్రవాహంలో కలుపుతుండేవారు. ఆ పనిలో సహకరించినవారితో 'దేవుని సేద్యం చేస్తే ఆయనే అన్నం పెడతాడు' అనేవారు. చిత్రంగా ప్రతిరోజు పనయ్యేసరికి యెవఱో ఒకరు గంపలతో అన్నం తెచ్చి పనిచేసిన వారందఱికీ పెట్టేవారు. కపిలమోకులు ముక్కలు చేసి ఒక చివర వెలిగించిన ఒక ముక్కను కాగడాగా పట్టుకొని రాత్రు లంతా ఆ పరిసరప్రాంతాలలో తిరిగేవారు. తమ దర్శనానికి వచ్చినవారికి 'కోట్లు, మణిగలు, పడగలు, జీవాత్మ, సృష్టి' వంటి పరిభాషలో చీటిలు వ్రాయించి యిచ్చేవారు. కాగితాలపై సిరాతోనూ లేక నూనె కలిపిన మసితోనూ తమ వేలిముద్రలు వేసి, వాటితోపాటు నూలు వుండలు, దుఃఖార్తులకు యిచ్చేవారు. భయంకరమైన వ్యాధులు శోకినవారికి, జబ్బుపడిన పశువులకు సాంబ్రాణి మంత్రించి యిచ్చేవారు. సామాన్యంగా యెవరింటికి వెళ్లేవారుగాదు, అరుదుగా వెళ్లినా వారింట ధుని వెలిగించేవారు.

ఒకసారి స్వామితో కలసి పంచలింగాల కోనకు వెళుతున్న శిష్యులు దారిలో ఒక బండపై కూర్చున్నారు. స్వామి 'అక్కడ అపాయం. కూర్చోవద్దు' అని చెప్పి, వారి నక్కడినుండి లేవగొట్టారు. కొద్దిసేపట్లోనే ప్రక్కనున్న

కొండపై అంచు విరిగి, అంతుకుముందు వారు కూర్చున్న చోట పడింది. ఒక్కొక్కప్పుడు ఆయన తన శిష్యులను తిరుపతికి గాని లేక తిరువళ్ళూరుకుగాని అకస్మాత్తుగా బయలుదేరదీసేవారు.

చార్జీలకు సైతం సొమ్ములేక వారు ఆందోళన చెందుతుంటే యింతలో యెవఱో పిలిచినట్లు కారులో వచ్చి ఆయనను, శిష్యులను, ఆ స్థలానికి చేర్చేవారు. స్వామి ఒకరోజు నారాయణరెడ్డి కారులో తలుపూరు వెళుతూ 'అయ్యా! గొంతు కోయవల్సి వస్తుంది' అని కేకవేశారు. చిత్రంగా బ్రేకు వేయకున్నా కారు ఆగిపోయింది. మరుక్షణమే ఒక మేక కారుముందుగా దారికడ్డంగా పరుగెత్తింది. స్వామిపట్ల యెట్టి విశ్వాసము లేని డ్రైవరు మస్తానయ్యకు నాటితో విశ్వాసము కుదిరింది.

మైకాగనిలో సర్వేయరుగా పనిచేసే పోలిరెడ్డిగారికి స్వామి ఒకరోజు 'నీవు పాతాళానికి అధిపతివౌతావు' అని వ్రాయించి యిచ్చారు. కొద్దిరోజులలో అతడు భూగర్భగనికి మేనేజరు అయ్యాడు. అలాగే ఒకనాడు స్వామి ఒంటరిగా యెక్కడికో వెళ్లివస్తే భక్తులు, 'ఎక్కడికి వెళ్లారు స్వామి' అనడిగారు. స్వామి వారి కొక స్థలము చూపి ఇక్కడొక దేవస్థానం కట్టబోతారు, దానికి గుర్తుపెట్టి వచ్చాను అన్నారు. అదే నేడు సోమశిల ప్రాజెక్టు దగ్గఱ నిర్మించబడిన పెంచలస్వామి ఆలయము.

రామస్వామికి ముక్కునుండి, నోటినుండి రక్తము పడేసరికి వైద్యు లెవ్వఱూ నయము చేయలేకపోయారు. అతడు స్వామిని దర్శించాడు. ఆయన 'ఢోకా లేదు, ఎల్లుండికి పోతుంది. 44 రోజులలో నీకు గండ మున్నది. అదిగూడా తొలగిపోయింది. నీవు తిరుపతి, కంచి, తిరువళ్లూరు పోయి ప్రతిచోటా స్నానం చేసి టెంకాయ కొట్టి నిద్రచేసి రావాలి' అని చీటీ వ్రాయించి యిచ్చారు. స్వామి చెప్పినట్లే రెండవరోజుకు అతని వ్యాధి తగ్గిపోయింది. అతడా క్షేత్రాలు దర్శించి రాగానే స్వామి నిన్నటితో నీ 44 రోజుల గండము గడిపోయింది గదా! అన్నారు.

కృష్ణారెడ్డి తన పొలంలో పదిపుట్లు పండితే స్వామికి 100 రూపాయలు యిస్తానని మ్రొక్కుకున్నాడు. అలానే పండింది. 100 రూపాయలు తీసుకుని అతడు స్వామి దర్శనానికి వెళ్లాడుగాని చార్జీలకుపోగా 70 రూపాయలు రహస్యంగా స్వామి చాపక్రింద పెట్టాడు. 'అనుకున్నదంతా యివ్వలేదు. ఇంకా 30 రూపాలు యివ్వాలి. అది తీయమను' అన్నారు స్వామి. అతడు తర్వాత యిస్తాడని సేవకులు చెబితే స్వామి ఆయన యివ్వడు. ఆ బాకీ నీవు ఒప్పుకుంటే తీసుకుంటాను అని చెప్పి అతను ఒప్పుకున్నాక తీసుకున్నారు. స్వామి చెప్పినట్లే కృష్ణారెడ్డి ఆ 30 రూపాయలు యివ్వనేలేదు. ఒకరోజు మునిరెడ్డిగారికి స్వామి '21వ రోజున దొమ్మి జరుగుతుంది, గాని నిన్ను అదేమీ చేయదు' అని చీటీ వ్రాయించి యిచ్చారు. అలానే దొమ్మీ జరిగి అతనిని

ఖూనీ చేస్తారనుకున్న పరిస్థితులలోకూడా యేమీ జరుగలేదు. అలానే పాలకొండ సుబ్బారెడ్డికి, 'మీ గ్రామానికి, ప్రక్కగ్రామానికి పెద్ద తగువు జరుగుతుంది. నీవు పోయి ఒక్కమాట చెబితే సరిపోతుంది' అని చీటీ వ్రాసిచ్చారు. ఆయన వ్రాసిచ్చిన గడువు ప్రకారమే ప్రొద్దుగుంకాక ఆ రెండువూళ్ల జనం కత్తులు, కట్లార్లు తీసుకొని తగువుకు సిద్ధమయ్యారు. స్వామిని స్మరించి అతడు 'ఒకరికి చెప్పవలసిన పెద్దలు మీరే యిట్లా తయారయితే యెట్లాగయ్యా' అని ఒక్కమాట చెప్పగానే అందఱూ శాంతించి తిరిగి వెళ్లిపోయారు.

ఒకరోజు యిద్దఱు గర్భిణులైన స్త్రీలతో స్వామి 'మీకిద్దఱికీ మగపిల్లలే పుడతారు' అని చెప్పారు. వారిద్దఱికి మగపిల్లలే పుట్టారు. జూలై 13.1979న అమెరికావారు ఆకాశంలోకి పంపిన అంతరిక్షనౌక స్కైలాబ్ ఆకాశంనుండి క్రింద పడుతుందని అది మనదేశంలో యెక్కడైనా పడవచ్చునీ శాస్త్రజ్ఞులు ప్రకటించారు. ఆ విషయమై భయపడుతున్న భక్తులతో స్వామి 'అదెక్కడో సముద్రంలో పడుతుందిలేయ్యా' అన్నారు. అలానే జరిగింది.

ఒకనాడు కోడూరు వెంకమ్మగారింట్లో అందఱూ భోంచేశాక స్వామిని పిలిచారు. అది వారి నియమము. స్వామి '40 మంది అన్నానికి వస్తారు. ఏర్పాట చేసుకోమ్మా!' అన్నారు. కొద్దిసేపట్లో నిజంగానే 40 మంది వచ్చారు. అప్పటికప్పుడు అందఱికి వంటచేయవల్సి వచ్చింది. స్వామి ఒకసారి ఉప్మా కొంచెము తిని, మిగిలినది కుక్కకు వేయమని వరుసగా 4 రోజులు మల్లిక వెంకయ్యకు చెప్పారు. కానీ అది గురుప్రసాదమని తలచి చాటుగా అతనే తినేశాడు. 5వ రోజున స్వామి కుక్కకు మించిన రెండుకాళ్ల కుక్క కాజేస్తున్నది అంటూ ఉప్మా వెంకయ్య చేతికివ్వక గుండంలో వేశారు. నెల్లూరులో ఒక చిన్నపిల్లకు నోటరక్తము పడుతుండేది. వైద్యులెవ్వఱూ తగ్గించలేకపోయేసరికి స్వామి వద్దకు తీసుకొచ్చారు. వారు దక్షిణగా 250 రూపాయలు సమర్పించినా స్వామి స్వీకరించక, 4 నెలల తర్వాతిస్తే తీసుకుంటానని చెప్పారు. సరిగా 4 నెలలకు బిడ్డ మరణించింది. వారు స్వామికి దక్షిణ సమర్పించనేలేదు. ఒకప్పుడు బుజ్జయ్య ఆర్థికయిబ్బందివలన తన గొఱ్ఱెలను కసాయికి అమ్మాలనుకున్నాడు. నాటిరాత్రి స్వామి స్వప్నంలో అది పాప మని హెచ్చరించారు. అయినా అతడు యిబ్బందులవలన గొఱ్ఱెలను నెల్లూరు తీసుకుపోయినా వాటిని యే కసాయి కొనలేదు. ఇంతలో యెవఱో వచ్చి వాటిని మేపుకుంటామని చెప్పి కొనుక్కున్నారు.

తుఫానువలన దివితాలూకాలో వినాశకాండ జరిగినపుడు స్వామి మద్రాసు మహారాష్ట్రంలోని మన్నారుకండ్రిగలో వున్నారు. నెల్లూరుజిల్లాకు గూడా తుఫాను ప్రమాద ముండవచ్చని రేడియోలో విని భక్తులు భయపడుతుంటే స్వామి అయ్యా, మన గుండాలు కాపలాకదా, మనకేమీ నష్టము లేదు, కానీ సంవత్సరము ఆఱుమాసాల పన్నెండురోజులకు నెల్లూరుకు గాలివాన ప్రమాదమున్నది అన్నారు. అక్షరాలా అంతా అలానే

జరిగింది. ఒకసారి సుబ్బన్న అనే 5 సంవత్సరముల చిన్నపిల్లవాడు, వాళ్లన్న 7 సంవత్సరముల పిల్లవాడు సరదాగా నీరు త్రాగడానికి దిగుడుబావిలో దిగారు. సుబ్బన్న కాలుజారి నీళ్లలోపడిపోయాడు. వాళ్లన్న కేకలు విని తండ్రి వచ్చి చూచేసరికి బిడ్డ 50 అడుగుల లోతునున్న నీటిలో నీరుకూడా త్రాగకుండా నీటిపై తేలివున్నాడు. ఒకప్పుడు స్వామి వ్రాయించిన చీటీ చూస్తే అందులో సుబ్బన్నకు నీటిగండమున్నది. వీరరాఘవస్వామి రక్షిస్తాడు అని వున్నది.

ఒకసారి ఒక తహసిల్దారు స్వామిని దర్శించి యేదన్నా మాహాత్మ్యము చూపమని కోరాడు. స్వామి ప్రక్కవారితో 'ఈయనకు మధ్యాహ్నం అన్నం లేదు' అని వ్రాయించి యిచ్చారు. అతడింటికి వెళ్లేసరికి అతని భార్య యిల్లు తాళంపెట్టి ఆస్పత్రికి వెళ్లింది. అతడు మధ్యాహ్నం 3 గంటలవఱకు వెతికి, చివరికి పలహారం తిని టీ త్రాగవల్సివచ్చింది. అలానే యిల్లు విడిచి వెళ్లిపోయిన ఒక వృద్ధునిగురించి అడగటానికి ఒకఱు స్వామివద్దకు వచ్చారు. అతడేమీ చెప్పకముందే 'గుడ్డలమూట నెత్తిన పెట్టుకొని ఫలానారోజు వస్తాడు ఫో' అన్నారు. కచ్చితంగా అదేరోజు ఆ వృద్ధు డలానే వచ్చాడు. దశరథరామయ్య బడిలో చదువుకునే రోజుల్లో అతనిని స్వామి సబ్ఇన్స్పెక్టర్ అవుతావులే అన్నారు. కాలాంతరములో అతడు సైన్యంలో చేరాడు.

ఒకరోజు యెవఱో దంపతులు వచ్చి టెంకాయ కొట్టి ధునిలో వేశారు. స్వామి వాటిని తీసివేయమని సేవకులతో చెప్పి, 'వాటిని కుక్కలుగూడా తినవు' అన్నారు. తీసిపారేసిన కొబ్బరిచిప్పలను కుక్కలుగూడా ముట్టుకోలేదు.

రమణమ్మ స్వామిని దర్శించాలని అనుకొన్నది. ఒకనాడు స్వామి నెల్లూరు ఆసుపత్రి యెదుటనున్న ప్రదేశంలో విడిదిచేశారు. అప్పట్లో అక్కడ యే భవనాలూ లేవు. కొందఱు స్నేహితులు రమణమ్మను స్వామి దర్శనానికి రమ్మన్నారు. బయలుదేరాక వాళ్లు, మేమంతా భోజనము చేశాము, నీవుకూడా చేస్తే బాగుండేది అన్నారు. స్వామి నాకు అన్నం పెట్టడా అన్నదామె. స్వామి బృందము 12 గంటలకే భోజనము చేస్తారు. అన్నము వుండదు అని వాళ్లన్నారు. నాటి వుదయమే స్వామి మఱొకచోటుకి మకాము మార్చాలనుకున్నారు. అందఱూ భోజనము చేశాక స్వామిని బయలుదేరమంటే ఆయన నవ్వుతూ బిడ్డలు రావద్దా, బిడ్డలు యిక్కడుంటే మనము పోతే యెలా అన్నారు. అంతలో రమణమ్మవాళ్లు మధ్యాహ్నం 2 గంటలకు అక్కడికి చేరారు. అందఱికీ ఆశీస్సులు వ్రాయించి రమణమ్మను చూచి ఈమె మనం బువ్వపెడతామని వచ్చిందయ్యా అన్నారు స్వామి. నిజానికి వాళ్లు ఖాళీపాత్ర కడుగకుండా వుంచారు. స్వామి చెప్పారుగదా అని చూస్తే అందులో యిద్దఱు మనుష్యులకు సరిపడే అన్న మున్నది. ఆమె భోజనము చేశాక సాటివారుకూడా ప్రసాదము తిన్నారు. స్వామి ఈమె సామాన్యమైనదిగాదు, పదవచూపు మనిషి అని ఆమెకు చీటీ వ్రాయించిచ్చారు.

ఒక భక్తుడు స్వామితో స్వామీ హస్తకార్తెలో జొన్న వేస్తాను అన్నారు. స్వామి ఊళ్లో జొన్న లన్నీ నీకేకదయ్యా అన్నారు. దాని అర్థమేమిటో అతడు ఆయనను అడుగలేదు. గ్రామమంతటిలో తన ఒక్కడికే పండుతుందనుకొని జొన్న పైరు వేశాడు. అతడికి మాత్రమే గింజకూడా పండకుండా తక్కిన రైతులందఱికి బాగా పండింది. అతడు సంవత్సరం పొడుగునా అడిగినవాళ్లను అడక్కుండా గ్రామస్థులందఱిని జొన్నలడిగి తెచ్చుకున్నాడు. ఊళ్లోని జొన్నలన్నీ అతనివే అన్న స్వామి మాటలకు అర్థము వివేకము చెబుతుంది కానీ ఆశ చెప్పలేదు.

నాగలేటూరులో రైతులు స్వామిని దర్శించి స్వామి జొన్నపైరు పెట్టుకున్నాము. బాగా పండుతుందా? అన్నారు. కఱ్ఱకు యిద్దఱుకదయ్యా అన్నారు స్వామి. పదిరోజులలో కఱ్ఱకు రెండు పురుగుల చొప్పున పడి అందఱి పైరు పాడయిపోయాయి.

ఎస్. మస్తాన్ తండ్రి బయటికెళ్లాక బ్రహ్మాండమైన వర్షము కుఱిసి వెల్లువలై పాఱింది. ఆ వృద్ధుడు మూడురోజులయినా రాకపోయేసరికి యెక్కడెక్కడో వెతికించారు. కనిపించకపోయేసరికి స్వామిని అడిగారు. ఆయన వేషము మార్చుకున్నాడుగదయ్యా ఱేపు పంజరము తెస్తాడు అన్నారు స్వామి. తెల్లవారి ఆ వూరి చెఱువులో శవము తేలింది. దాని మాంసమంతా చేపలు తినగా కేవలము అస్థిపంజరము మిగిలింది. దానిపైనున్న బట్టలనుబట్టి శవాన్ని గుర్తుపట్టారు. శరీరము నశించినా అతడు మళ్ళీ జన్మించాడని స్వామి సూచించారు.

ఒకరోజు ఋషీకేశ్‌లోని శివానందాశ్రమంనుండి చిదానందస్వామి, దేవానందస్వామి, మాధవానందస్వామి - స్వామి దర్శనానికి వస్తున్నారని తెలిసి వారిని చూడటానికి జనము తండోపతండాలుగా వచ్చారు. సాయంత్రము 4.30గంటలయినా స్వాములు రాలేదని జనమంతా నిరుత్సాహపడుతుంటే స్వామి 'వస్తున్నారయ్యా, ఇంకా గంటలు కాలేదు' అన్నారు. కొద్దిసేపట్లో వాళ్లు కార్‌లో వచ్చి స్వామికి నమస్కరించి తాము తెచ్చిన తీపిపదార్థము తినమని ప్రార్థించారు. స్వామి, 'అయ్యా! అది తింటే విషము తిన్నట్లేగదయ్యా! ఇంతమంది యిక్కడున్నారు. వీరందఱికి పెడితే నాకు పెట్టినట్లే' అన్నారు. ఆ మాట వింటూనే చిదానందస్వామి నమస్కరించారు. స్వామి, 'త్వరలో సముద్రము దాటిపోతావు' అన్నారు. తర్వాత చిదానందస్వామి తమ ఆశ్రమము చేరేసరికి ఆమెరికానుండి ఆహ్వానం వారికోసము యెదురుచూస్తున్నది.

ఒకసారి స్వామి వేఱే గ్రామాలకు వెళ్లారు. తూపిలిపిచ్చమ్మ ఆశ్రమములో భజన యేర్పాటు చేసుకున్నది. స్వామి తన సేవకులతో ఆశ్రమంలో భజన భలే జరుగుతుండ్లాయ్యా! అక్కడికి పోవద్దా? అని బయలుదేరి భజన రోజుకు ఆశ్రమము చేరారు.

కాటంరెడ్డి సుబ్బారెడ్డి అతని భార్య చనిపోయాక మతిస్థిమితం లేక బాధపడ్డాడు. అప్పు డతని స్నేహితుడు అతడిని స్వామివద్దకు తీసుకొచ్చాడు. అతడికి అక్కడ శాంతి కలిగి తరచూ స్వామిని దర్శించేవాడు. ఒకరోజు

అతడు గుండానికి టెంకాయ కొట్టబోతే స్వామి అయ్యా, అతనికి అంటు, అక్కడ కొట్టకూడదు అన్నారు. అతడికి యేమీ అర్థము కాలేదు. కొద్దిసేపట్లో ఆయన కోడలు చనిపోయినట్లు తెలిసింది. మఱొకసారి యితడే యింటికి వెళ్లడానికి సెలవు కోరినపుడు స్వామి, 'అయ్యా! ఎట్లాపోయినవాడివి అట్లాగే రావాలి. ఆ కంటతడి పెట్టకూడదు' అన్నారు. అతడికేమి అర్థము కాలేదు. ఇల్లు చేరిన 2 గంటలలో అతని కొడుకు చనిపోయాడు.

ఒకప్పుడు ఈయన కొడుకు సుబ్బారెడ్డి వివాహమై 8 సంవత్సరాలు గడిచినా సంతతి కలుగలేదని స్వామిని దర్శించాడు. స్వామి మొదట అతనికి సంతానము లేదని చెప్పారు. కానీ తర్వాత అతని తమ్ముడు, మఱదలు చనిపోయాక వాళ్లిద్దఱూ సుబ్బారెడ్డికి పుడతారని చెప్పారు. పూర్వము ఆయన చెప్పినదానికి భిన్నంగా యిప్పుడు చెప్పడంవలన అతనికి స్వామిపై విశ్వాసము తొలగి, ఆయనను విమర్శించేవాడు. ఆయన రెండవసారి చెప్పినట్లు పిల్లలు కలిగినా అతని మనస్సు సమాధానపడలేదు. ఒకరోజు ఇతని తండ్రితో స్వామి, 'అయ్యా! నీ కొడుకు నెత్తిన దబరుతో కూలోళ్లకు అన్నం తీసుకొని చేలోకి పోతున్నాడు' అని చెప్పారు. తర్వాత ఆయన విచారిస్తే తన యింటివద్ద ఆ సమయానికి అలానే జరిగిందని తెలిసింది. సద్గురువులు యెప్పుడూ మనలను మరువరు. వానిని మనము గుర్తుపెట్టుకోలేకనే యిన్ని బాధలుపడేది. సుబ్బారెడ్డికి భక్తి లేదని అతని తండ్రి వివరిస్తే స్వామి 'అతను నీకంటే గొప్పవాడవుతాడులేయ్యా!' అన్నారు. సుబ్బారెడ్డికి చేతికి అధికార మొచ్చాక అతడు 22 ఎకరాల మెట్ట భూమి అమ్మదలచానని చెబితే స్వామి, 'వచ్చేకాలంలో లక్షలు విలువలు చేస్తుంది. ఏమి శనిపట్టి అమ్ముతున్నావయ్యా' అన్నారు.

కానీ అతడు మూర్ఖించి ఎకరం రూ॥ 500 లకు అమ్మివేశాడు. ఈనాడది లక్షరూపాలయ విలువ చేస్తుంది. మరొకప్పుడు యితడు తన మాగాణి యింకొకఱికిచ్చి వారి మాగాణి యితడు తీసుకోదలచాడు. స్వామి 'మాగాణి మానేస్తే నానాఅగచాట్లు పడతాడు. చెప్పినా వినడు. కర్మ బలీయంగా వున్నది, ఏమి చేస్తాము' అని సేవకులతో చెప్పారు. ఆయన మాట వినకుండా అలా చేయడం వలన 3 సంవత్సరాలు పంట పండక అతడు 20,000 రూ॥ అప్పుచేయవల్సివచ్చింది. ఎన్నో చింతలకు గురయ్యాడు. తర్వాత రూ॥ 10,000 లు యిచ్చి తన మాగాణి తాను తీసుకున్నప్పటినుండి అన్నివిధాలా బాగుపడ్డాడు. అతని తండ్రిపై ప్రేమతో అతన్నికూడా ఆదరించారు స్వామి.

ఒకసారి సుబ్బారెడ్డి తలుపూరులో స్వామి వద్దనున్న తండ్రికి బియ్యం యివ్వడానికి వెళ్లినపుడు అతనికి స్వామి 'ఈతనికి కోళ్ల పాపము ఆవరించింది. మూడురోజులు కోమటి యింట అన్నం తింటే పోతుంది' అని చీటి వ్రాయించిచ్చారు. తను వారానికి 4సార్లు కోడిమాంసం తింటానని స్వామితో తన తండ్రి చెప్పాడనుకొని తండ్రి పైనా, స్వామిపైనా కోపగించుకొన్నాడు. ఆ విషయము తెలిసి స్వామి 'అయ్యా! నెలరోజుల్లో ఆయనకే

తెలిసి మన దగ్గఱకు వస్తాడులే' అని అతడి తండ్రితో చెప్పారు. సరిగ్గా నెలరోజులకు సుబ్బారెడ్డికి కోడిమాంసం తింటే కడుపునొప్పి, విరేచనాలు వచ్చేవి. వైద్యులు శస్త్రచికిత్స చెయ్యాలన్నారు. అతడు పసికర్లురోగిలా తయారయ్యాడు. అతనిని స్వామికి చూపిస్తే ఆయన పకపక నవ్వి 'అయ్యా! పొద్దుగూకుతుంది. మూడు ముద్దలు మిరియాలపొడి అన్నం కలిపిన అన్నం పెట్టండి పోతుంది' అన్నారు. ఆ చికిత్స అమోఘంగా పనిచేసింది. అటుతర్వాత అతడికి కోడిమాంసం అంటేనే అసహ్యాము పుట్టింది.

ఒకప్పుడు యితడి తండ్రికి విరేచనాలై మరణావస్థలో ఆస్పత్రికి తీసుకుపోతున్నారు. అతడు స్వామివద్ద చీటీ వ్రాయించుకొస్తే తప్ప ఆస్పత్రికి పోనన్నాడు. సుబ్బారెడ్డికి స్వామివద్దకు వెళ్లక తప్పలేదు. ఆ మాట వింటూనే స్వామి పకపక నవ్వి 'ఆయనకేమయ్యా! ఆయన ఆసుపత్రికి పోడే? ఈయన పోయేతలికి అన్నం తింటుండ్లా'! అని చెప్పి చీటీ వ్రాయించి యిచ్చారు. సుబ్బారెడ్డి యిల్లు చేరేసరికి తండ్రి తప్పక చనిపోతాడు అనుకున్నాడు. కానీ స్వామి చెప్పినట్లే నిజంగానే జబ్బు తగ్గిపోయి అన్నం తింటున్నాడు. మఱొకప్పుడు వీళ్ల బఱ్ఱెలు తప్పిపోయి 10 రోజులు వెతికినా కనిపించలేదు. చివఱికి స్వామికి చెబితే, 'వాళ్లకు కాళ్లతిప్పట కర్మ వుండి తిరిగారు. 4వ మైలులో బఱ్ఱెలు కట్టేసి మేపుతున్నారు. రెండు రూపాయ లిస్తే తోలిపెడతారు' అన్నారు. అచంచలమైన విశ్వాసంతో వారి సేద్యగాడికి రెండు రూపాయలు యిచ్చి నాల్గవమైలుకు పంపారు. బఱ్ఱెలు అక్కడ వుండటమేగాక వాటిని వీరింటికి తోలడానికి రెండు రూపాయలే తీసుకున్నారు. సుమారు 14 సంవత్సరాలు సమయమంతా వారి సేవలో గడిపిన యితని తండ్రి సుబ్బారెడ్డిపై స్వామికి యెంతో ప్రీతి. సేవకు లందఱూ సంకటి తింటున్నా స్వామి అతనికి మాత్రము వరి అన్నం తెప్పించి పెట్టేవారు.

పెనుకుర్తిలో నీరులేక పైరులన్నీ యెండిపోతుంటే అందఱూ పైర్లు వృధాగాకుండా కోసి పశువులకు మేతగా వేస్తున్నారు. తానుగూడా అలాగే చేయమంటారేమోనని అడగడానికి కారి రామస్వామి అన్నంమూట తీసుకొని వచ్చాడు. స్వామి ఆ మూట తీసుకొని తమ అన్నం అతనికిచ్చారు. పొలం విషయము అడిగితే యిలా చెప్పారు. 'అలా చేయవద్దు. వేఱులో చెమ్మ వున్నది. మూడవరోజు వాన వస్తుంది. బురదలో కోయాలి. పైరు కోయవద్దు' అన్నారు. ఆయన చెప్పినట్లే మంచి రోహిణీకార్తెలో నడిచెఱువులో వర్షం కుఱిసింది. అప్పటికే అందఱూ పైర్లుకోసి పశువులకు వేసేశారు. గనుక నష్టపోయారు. ఇతని పొలానికిమాత్రం నీరు పాఱి దివ్యంగా పండింది. స్వామి యీ పైరు సంగతి చెప్పినప్పుడు రామస్వామి తన కుమార్తె వివాహము వద్దంటున్నదని విన్నవించుకున్నాడు. స్వామి ఆమెతో 'నీకు యిద్దఱు సంతానము. 40 సంవత్సరాలపైన భక్తిమార్గము యేర్పడుతుంది. ఈలోగా సంసారంలోకి పోవాలి, పిల్లవాడు పుట్టాక 6 నెలలకు నా దగ్గఱకు తీసుకురా'

అన్నారు. అంతా ఆయన చెప్పినట్లే జరిగింది. ఆమె ఆ బిడ్డను ఆయన వద్దకు తీసుకురాగానే ఆయన బిడ్డ వళ్లంతా నాలికతో నాకి, తమ ప్రసాదం తినిపించారు.

బి. మస్తాన్‌నాయుడు ఒకరోజు స్వామి పాదాలు గట్టిగాపట్టుకొని 'నాకు దారి చూపించండి స్వామి!' అని వేడుకున్నాడు. స్వామి, వేఱే ఆయన వస్తాడు. నీ సంగతంతా ఆయన చూచుకొంటాడులేయ్యా అన్నారు. అలానే అతడు వేఱొక సాధువుని ఆశ్రయించి సాధన చేసుకోసాగాడు. ఆత్మకూరు వెంకయ్యతో స్వామి ఒకప్పుడు ' నీ ఎద్దుకు బండి గండ మున్నది. అమ్మివేయండి' అన్నారు. కానీ తగిన బేరం రాక యెద్దులను అమ్మలేదు. ఒకనాటి రాత్రి ఆ యెద్దు బండి చక్రానికి కొమ్ములు రుద్దుకుంటే ఆకుల సందులో యిరుక్కుపోయి గుంజుకొని తెల్లవారేసరికి చనిపోయింది.

**త్రికాలజ్ఞాయ నమః**

## శ్రీఅవధూతాయ నమః

## అధ్యాయము - 9

# స్వా మి - సే వ కు లు

స్వామి పెన్నబద్వేలులో వున్నపుడు వక్కెమ్మ స్వామి బృందమంతటికి విస్తరాకు, కట్టెలూ సమర్పించి, ఏ చెట్టు క్రిందనో ధ్యానంలో కూర్చునేది. ఆమెకు భోజనము చేయాలనికూడా గుర్తుండేదికాదు. స్వామి 'వక్కెమ్మ అన్నం తినడము మర్చిపోయిందయ్యా, పిలిచి పెట్టండి' అనేవారు.

ఒకరోజు తులశవ్వ 'నేను స్నానము చేయలేదు. నీవు స్వామికి జావ పోయి' అని వక్కెమ్మను పంపింది. ఆమె స్వామికి యెన్నడూ ఆ సేవ చేయలేదు. అంతేగాక మాలకులానికి చెందిన తాను ఆ సేవకు తగనేమో నని శంకిస్తున్నది. స్వామి 'రా వక్కెమ్మ! భయమెందుకు? రేకులో జావ పోయి' అని పిలచారు. పవిత్రమైన నడవడి, భక్తిశ్రద్ధలే ప్రధానమని స్వామి నిర్ణయము. నిజానికి ఆమె తత్త్వము అలాంటిదే. ఒకసారి నెల్లూరు బస్టాండులో నిద్రిస్తుంటే ఒక దొంగ కుడిచెవికున్న కమ్మ విప్పుకుంటున్నాడు. ఆమెకు మెలకువచ్చినా అతను ఆ కమ్మ విప్పుకున్నాక రెండవ కమ్మకూడా విప్పుకొనేందుకు అవకాశ మిచ్చింది. తర్వాత వాటిగురించి అడిగినవారితో 'నాకంటే దరిద్రుడు వచ్చి కమ్మలు తీసుకొనిపోతున్నాడు కదాని తీసుకోనిచ్చాను' అన్నది.

ఒకప్పుడు పెన్న అవతల గట్టుకు స్వామి వచ్చారని తెలిసి, ఈమె దర్శనానికి బయలుదేరింది. ఏఱు లోతుగా పాఱుతున్నది. ఆమె స్వామి దర్శనము కలుగలేదని యేడుస్తూ కూర్చున్నది. చివఱకు సాహసించి యేఱు దాటి వెళ్లిపోయింది. కానీ యేటినీరు పొడుగునా ఆమె చీలమండలంవఱకే వున్నది. ఆ సంగతి విని అందఱూ ఆశ్చర్యపోయారు.

ఒకసారి స్వామి 'వక్కెమ్మ 99 వాకిళ్లు యెక్కాలి' అని చీటీ వ్రాయించారు. ఆమె యేడుస్తూ ఆయన పాదాలమీద పడి నన్ను అడవిలో ముష్టిచెట్టుగా నన్నా పుట్టించండిగాని మనిషి జన్మ వద్దు' అన్నది. ఆయన కరుణించి, 'ఆమె యిక వచ్చేది లేదని దైవునిపై ఆనపెట్టి చీటీ వ్రాసియివ్వవయ్యా!' అని చీటీ వ్రాయించారు.

ఆమెకు యింకేమి కావాలి? మఱొకసారి 'వక్కెమ్మకు తొమ్మిది కిరీటాలు వున్నాయి' అని వ్రాయించారు. అంటే ఆమెలో నవవిధ భక్తులు ఫలించాలని ఆశీర్వదించారు.

మల్లె చెంచమ్మ మొదటిసారిగా స్వామిని దర్శించి తనకు జన్మ లేకుండా చేయమని ప్రార్థించింది. 'అబ్బో! ఈమె యేడోచూపు మనిషి. ఈమెకు అన్నీ సరిపడతాయి' అన్నారు. స్వామి ఆమెను ఆశ్రమంలో వుండమనేవారు. ఇంటికి వెళ్లడానికి అనుమతించేవారుగాదు. కానీ యీమె స్వామికి చెప్పకుండానే వెళ్లేది. ఒకరోజు స్వామి యీమెకు స్వప్నంలో కనిపించి మంత్రోపదేశము చేశారు. మఱొకప్పుడు స్వప్నంలో స్వామి పెద్ద చంద్రమండలంలో కూర్చుని దర్శన మిచ్చి 'ఇదిగదమ్మా లోకం మార్పు' అని చంద్రుని చూపారు. స్వామి మహాసమాధికి రెండు సంవత్సరాలముందు యీమె మనస్సు మారి కట్టుబట్టలతో వచ్చి స్వామి సేవలో వుండిపోయింది.

ఒకరోజు స్వామి 'అనుకున్నట్లు నడుచుకుంటే నీకు, నాకు దూరం మూడంగుళాలేగదమ్మా!' అన్నారు. స్వామి సన్నిధి చేరాక ఆమెకు లౌకిక వ్యవహారాలు, బంధాలు గుర్తురాలేదు. ఏ సాధనలూ చేయాలనిపించక స్వామిని తలుచుకుంటూ వుండేది. మనస్సు తనకు పూర్తిగా స్వాధీనము కాలేదని బాధపడుతుంటే ఒకరోజు స్వామి స్వప్నంలో కనిపించి, 'మంచి పొగరబోతు గుఱ్ఱం మాట వినదు. దానిని నా కిస్తే సరిపోతుందిగదా!' అన్నారు. సాయిబాబాకూడా మనస్సును పొగరుబోతు గుఱ్ఱ మని చెప్పేవారు.

పాలకొండ సుబ్బారెడ్డి చిన్నప్పటి నుండి సద్గురువును ఆశ్రయించాలని తపించేవాడు. కానీ యెవఱిని సేవించాలో తెలియక నిత్యము భోజనంలో మొదటి ముద్ద సద్గురువుకు అని వదిలి, రాత్రి సద్గురువుకోసం ప్రార్థిస్తుండేవాడు. ఒకనాడు స్వామి యితనికి స్వప్న దర్శన మిచ్చి 'నేను పెన్నబద్వేలు కొండమీద వున్నాను. విడువక సేవించు' అన్నారు. అతను వారిని దర్శించి కొన్ని సంవత్సరాలు విడువక సేవించాడు.

రోశిరెడ్డి 1966లో కాలు జాఱిపడి కాలుకు గాయమై చీముపట్టి వాచింది. ఆశ్రమంలో అందఱూ మందు వేసుకోమని వత్తిడి చేస్తుంటే, అన్నం నీళ్లు లేకుండా భిక్షకోసం వూరంతా తిరిగిన రోజుల్లో నా కాలుకు చిన్న పుల్లయినా తగలలేదు. ఈరోజు అకారణంగా ఆశ్రమంలో పడ్డానంటే నాకర్మ కడిగేసేందుకు స్వామియే పడదోసి వుండాలి. ఆయన పోగొట్టదల్చుకుంటే యే మందూ లేకుండానే పోగొట్టగలరు. లేకుంటే మందువేసినా నయంకాదు అన్నాడు. ఆ గాయము చూసేవారికి బాధగా వున్న దని స్వామి విభూతి యైనా పూయించుకో మంటే 'మీరంత భరించలేకుండా వుంటే నన్ను ఆశ్రమంలోంచి బయటకు లాగిపడేయండి' అని అన్నాడుగాని మందు విభూతి పూయించుకోలేదు. అట్టి విశ్వాసానికి, ఓరిమికి మించిన మందే ముంది. వారంరోజుల్లోగా చీము, వాపు, నొప్పి మాయమయిపోయాయి.

స్వామివద్ద సెలవు తీసుకొని వేలూరు సుబ్రమణ్యం బస్సు దగ్గఱ నిలబడ్డాడు. ఇంతలో స్వామి నడిచివచ్చి 'అయ్యా! నీకు కనకము వంటి కాల మొస్తుంది. నీకు చీటీ వ్రాయించి వచ్చినా గుర్తించలేవు. నేను వచ్చి నీ కా స్థలము చూపించాలి' అని చెప్పారు. అదెక్కడున్నదని అడిగితే తలుపూరులో యెగువ వాళ్లింటికి పడమరగా వున్నది. నేను చెబితే ఆ యిల్లుగూడా నీదవుతుంది. నీవక్కడ కాపుర ముండు అన్నారు. స్వామితో కలసివెడితే తలుపూరులోని బంధవు లంతా తాను పిచ్చివెంకయ్యతో తిరుగుతున్నాడనుకుంటారేమో నని వెనకాడుతూనే పైకిమాత్రం ఒప్పుకున్నాడు. వెంటనే స్వామి 'అయ్యా! పిచ్చివెంకయ్యమీదనే చెప్పు, పఱ్వాలేదు' అని చెప్పి, అతనితో నెల్లూరుకొచ్చి తలుపూరు బస్సులో కూర్చున్నారు. కానీ అతని భావము మారలేదు. అతడు తన భార్యతోపాటు బస్సు దిగి, స్వామి, మీరు ముదిగేడుకు పొండి, నేను నెల్లూరులో మా బంధువు లింటికి పోవాలి అన్నాడు. ఆయన వ్రేళ్లు లెక్కించుకుంటూ అతి దీనంగా 'అయ్యా! నేను నీకోస మొస్తే నీవు దిగిపోతుండావే!' నీకు అన్నం చేసిపెట్టే ఆమెకు యెడమకాలుకు గడ్డవచ్చేట్టుంది. మద్రాసు ఆసుపత్రికి పోవల్సివస్తుంది. నీవు నెల్లూరు రంగనాయకుల దేవస్థానానికి వెళ్లి అక్కడ పావలా యిస్తే దేవుని ప్రసాదం పెడతారు. మూడుపూటలు ఆ అన్నం ఆమెకు పెట్టు. దేవుడు కొంత జబ్బు తగ్గిస్తాడు' అన్నారు. కానీ అతడు ఆయన మాటలు లెక్కచేసే స్థితిలో లేడు. ఒక్కపూట మాత్రమే స్వామి చెప్పినట్లు చేసి స్వగ్రామం వెళ్లిపోయాడు. రెండు నెలల తర్వాత అతని భార్యకు యెడమకాలిపై గడ్డ లేచింది. మద్రాసులో శస్త్రచికిత్స చేయించవల్సివచ్చింది. అందుకు ఆ రోజుల్లో రూ॥ 500 ఖర్చయ్యింది. నమ్మితే సొమ్ము, నమ్మకుంటే దుమ్ము. కొంతకాలానికి ఆమె మోకాలుకు మఱల నొప్పి వచ్చింది. ఆ విషయమై స్వామి, 'అయ్యా! వీరరాఘవస్వామి, గ్రామదేవత బంగారమ్మ కొంతే తగ్గిస్తారు. పూర్వము యీమె కరివేడులో ఒక మగవాడుగా వుండేది. ఒకరోజు ఆవు అతనింట్లో తింటుంటే రోకలిబండతో కొట్టాడు. అందుకని పూర్తిగా తగ్గలేదు అన్నారు. అదే నిజమైంది. మొదట ఆయన చెప్పినట్లు మూడుపూటలా రంగనాయకులస్వామి ప్రసాదము పెట్టించి వుంటే? కర్మ కంటే సద్గురువు ఆదేశము బలవత్తరమైనది. కానీ ఆయన రక్షణ పొందగలగా లంటే వారి ఆజ్ఞకు మన సొంత ఆలోచనలు అడ్డురాకుండా చూచుకోవాలి.

విశ్వాసము లేకున్నా ఆశకు అంతేముంది? సుబ్రమణ్యం తన చేలో నీరు యెక్కడ పడుతుందో చెప్పమన్నాడు. స్వామి దయతో అతని చేలోకి వెళ్లి నాలుగువైపులా తంబుర వాయించి, 'అయ్యా! ఈ చేలో నీరే లేదు. ప్రక్కన అరయెకరాలో 84 ఎకరాలకు సరిపడ్డ నీరున్నది. అది కొని బావి త్రవ్వి అర్ధభాగము యెవరికైనా యివ్వు. ఈ బావి త్రవ్వినవారెప్పుడూ నీడన వుండి జీవిస్తారు. ఈ పొలం అమ్మకుంటే బంగారము పండుతుంది' అన్నారు. ఆశయితే వున్నదిగాని, విశ్వాసమేది? అతడు ఆ పొలం అమ్మేసి యిప్పుడు చింతిస్తున్నాడు.

రోశిరెడ్డి వృద్ధాప్యంలో స్వామి సేవ చేస్తుంటే 'ఈ ముసలాడు పనీపాటా లేకుండా దండుగ తిండి తింటున్నాడు' అన్నారు. రోశిరెడ్డికి కష్టమేసి తాను విషము త్రాగి మరణించినా మేలనుకున్నాడు. ఆరాత్రి స్వామి మోకాలు వత్తించుకుంటూ 'ఎవఱో యేమో అన్నా రని పోవాలంటావా? భిక్ష తెచ్చుకుంటూ యిక్కడే వుండు' అన్నారు. ఆయనకు తెలియని దేముంది? మఱొకప్పుడు స్వామి 5 రోజులు అన్నం తినకుండా వుండేవారెవఱో చూపించి అన్నారు. ఎవఱో యెందుకు నేనే వుంటాను అని చెప్పి రోజంతా ద్రవాహారంతో వున్నాడు. కొన్నాళ్లు శని, సోమవారాలు వుపవశించి మిగిలినరోజులు ఒంటిపూట భోజనం చేసేవాడు. అన్నం పూర్తిగా మాని అటుకులు తింటూ ఆశ్రమానికి భిక్ష చేసేవాడు. ఒకరోజు స్వామి 'అయ్యా! నీ గ్రామం వెళ్లి నిమ్మచెట్లు నాటిరా' అన్నారు. రోశిరెడ్డి తన గ్రామం వెళ్లాడుగాని యింట్లోనివారు నీవు చెట్లు వేసిపోతే వాటిని చూడ్డం మావల్లగాదు అన్నారు. అయినా అతడు స్వామిపై విశ్వాసంతో సొమ్ము అప్పుతెచ్చి నిమ్మచెట్లు తెచ్చి స్వామి దగ్గఱకు వచ్చాడు. అతడు స్వామీ నాపై యిలాంటి భారము పెట్టావేమిటి? అని బాధపడుతుంటే తోటకు అమ్మణ్ణి కాపలాయున్నది. అది లక్షన్నర రూపాయల ఆస్తి, మీరు ఆ తోటలో కాపుర ముండి, ఆ ప్రదేశానికి సిరిమెళ్ల అని పేరుపెట్టుకోండి అన్నారు. ఇప్పుడు ఆ తోట 3 లక్షలకు అడుగుతున్నారు.

తప్పులు చేస్తున్న భక్తులతో సాయిబాబా 'నేను ఒకటిరెండుసార్లు హెచ్చరిస్తాను. వినకుంటే నీకర్మకు నిన్ను విడుస్తాను' అనేవారు. కాలిమీద బిడ్డ మలవిసర్జన చేస్తే బిడ్డను నరుకుతామా! కాలు నరుక్కుంటామా! సహించవల్సిందేగదా! అనేవారు. స్వామిగూడా తమ పవిత్రమైన సన్నిధిని దుర్వినియోగము చేసుకోకుండా కబుర్లు కలహాలతో కాలం వృధా చేసే సేవకులనుగూడా సూక్ష్మంగా హెచ్చరించేవారుగాని తాము చెప్పినట్లు నడుచుకోవాలని నిర్బంధించేవారుగాదు. వారి సేవకులు ఒకప్పుడు అలా కాలం వృధా చేస్తుంటే 'అందఱూ ముండలూ, రండలై వున్నారు గాని ఒక్క పైసా అయినా సంపాదిస్తున్నారా?' అని తమలో తామే పెద్దగా అనుకొంటుంటే వారు యెవరినైనా ఒకటిరెండుసార్లు మాత్రం తల్లికంటే అధికమైన ప్రేమతో మందలించేవారు. స్వామి యెన్నిసార్లు హెచ్చరించినా తమ దురలవాట్లు మానుకోలేని సేవకునిపై కోపించి 'ముండవైయున్నావు, పైసా నిలబెట్టుకుంటున్నావా? అంతా లోకానికి ధారపోస్తున్నావు. కత్తితో పొడుస్తాను. ఏమనుకుంటున్నారో' అని వుగ్రరూపము దాల్చారు. అతడు కొన్నాళ్లవఱకు సర్దుకున్నాడుగాని తర్వాత క్రమంగా తన పాత పద్ధతికి మళ్ళినా స్వామి యింక మందలించలేదు. అతడే ఆ సన్నిధిని విడిచివెళ్లిపోయాడు. ఒకసారి యిద్దఱి సేవకులకు తగువొచ్చి కలబడ్డారు. ఒకడు గొడ్డలి తీసుకుంటే రెండవవాడు దానిని లాగుకొని మెడపై కొరికాడు. మొదటివాడు గ్రామస్థులతో చెప్పుకుంటే వారు వచ్చి కొరికినవాడిని ఆశ్రమంనుండి తరిమివేయ మని, లేకుంటే ఆశ్రమంలో శాంతిభద్రతలు లోపిస్తా యనీ స్వామికి మనవి చేసుకున్నారు. అప్పుడు స్వామి 'ఒకరిని పొమ్మనేకంటే మనము

పోవడమే మంచిదికదయ్యా' అన్నారు. సేవకులపై స్వామికి యెంతో ప్రేమ. తాము యెంత అనారోగ్యంగాను, బలహీనంగాను వున్నా తన బృందంలోనివారంతా భోజనము చేశాకనే స్వామి గంజిత్రాగేవారు. ఎంతకాలమైనా కట్టెలు కొట్టేందుకు వెళ్లినవారు తిరిగివచ్చి భోజనము చేసేదాక ఆహారము తాకేవారుగాదు. ఎంతటి వర్షము, లేక గాలి వచ్చినా ఆయనమాత్రము గ్రామస్థుల యిండ్లలో తలదాచుకొనేవారుగారు. తన సేవకు లందఱిని యింట్లోకిపోయి తలదాచుకో మని తాముమాత్రము బయట చూరుక్రింద ఒదిగి కూర్చుండేవారు. శిరిడీలో సాయిబాబా యెప్పుడూ వేపచెట్టు క్రిందనే కూర్చున్నట్టు, వర్షానికి మసీదంతా తడసిపోతున్నా ఆయన అక్కడే కూర్చుని భక్తులనుమాత్రము వసతిగృహంలోగాని, చావడిలోగాని తలదాచుకోమని చెప్పేవారు. అందుకే కాబోలు స్వామికోసము కట్టెలు కొడుతున్నా, బొంతజెముడు మ్రానులు తీసుకువచ్చేటప్పుడు సేవకులకు యెన్నోసార్లు తేళ్ళూ, పాములు కనబడేవిగాని ఒక్కసారైనా యెవఱినీ కుట్టేవికావు. ఒకరోజు బొంతజెముడు చెట్టు నరుకుతున్న దశయ్య కంట్లో ఆ చెట్టు పాలుచిందాయి. వెంటనే స్వామి తమ చేత్తో అతని కళ్ళు నలిపి, 'నీకు క్రొత్త కళ్ళు వచ్చిండ్లాయ్యా!' అన్నారు. ఇప్పుడు దశరథరామయ్యగారి వయస్సు చాలా యెక్కువ. అయినా కళ్ళద్దాలు లేకుండా పుస్తకాలు చదువుతారు.

ఒక సేవకుడు 'స్వామి! బ్రాహ్మణులు యజ్ఞాలు చేస్తూ అగ్నిలో నెయ్యి, పాలువంటివి పోస్తారుగదా, మఱి మనము ఒట్టి కట్టిపుల్లలు వేస్తాముగదా?' అన్నాడు. ఆయన అయ్యా! ఒక బొంతకు(బొంతజెముడు మొక్కకు) 6 పీపాల పాలు వుండ్లాయ్యా అన్నారు.

స్వామికి తన సేవకులపై గల ప్రేమకు ఒక వుదాహరణ. దశయ్య పెనవర్తిలో మిద్దె యిల్లు కట్టుకోవడానికి స్వామికి చెప్పకుండానే శంఖుస్థాపన చేసి, గాళ్ళు త్రవ్వించి అడుగున గట్టు వేయించుకున్నాడు. ఒక మధ్యాహ్నం స్వామి ఒంటరిగా వచ్చి ఆ పునాదులలో  దూకి అన్నివైపులా తిరుగున్నారు. అది చూచి దశయ్య వచ్చి చేతులు కట్టుకొని చూస్తున్నాడు. స్వామివారు యెక్కలేక యెక్కలేక పైకి వచ్చి, ప్రక్కనున్న 3 యిటుకలు తెచ్చి, ఇంటికి ముందు నున్న పునాదిలో పెట్టి 'అంతే, అంతే సరిపోయింది' అంటూ మఱేమీ మాట్లాడకుండా వేగంగా వెళ్లిపోయారు. ఇల్లు త్వరగా పూర్తవడమేగాక అతడు లక్షాధికారికూడా అయ్యాడు. నమ్మినవారు కోరకున్నా సొమ్మే. అలానే ఒకరోజు యెవఱో భక్తులు ఒక మణుగు కలకండ స్వామికి సమర్పించారు. దాన్ని ఆయన ఒక దుప్పటిలో కట్టుకొని భుజాన వేసుకొని అడవిలో కట్టెలు కొట్టుకుంటున్న సేవకులకు యిచ్చి సమానంగా తీసుకోమని చెప్పి వెళ్లిపోయారు.

కొందఱు కష్టాలు, కోరికలూ తీర్చుకోడానికి, కొందఱు జ్ఞానంకోసము, మఱికొందఱు మోక్షంకోసము భగవంతుడిని ఆశ్రయించినట్లే మహాత్ములనుగూడా ఆశ్రయిస్తారు. ఎవఱి శ్రద్ధకు తగినది వారు పొందుతారు.

అలాగాక యెవఱి ఆధ్యాత్మిక వికాసానికి అవసరమైన అనుభవాలు వారికి ప్రసాదించి మహాత్ములు వారిని వుద్ధరిస్తారు. స్వామి సన్నిధిలో యీ దివ్యలీల యెలా జరిగిందో చూద్దాము.

పోలిరెడ్డి యెప్పుడూ స్వామిని సేవిస్తూవుండేవాడు. ఆయనకు ఆకుకూర అంటే యిష్టమని తలచి ఆయన విడిది చేసిన ప్రాంతంలో అది సేకరించి వండిపెడుతుండేవాడు. అంతకుమించి అతడు వారిని యేమీ కోరలేదు. ఒకరోజు స్వామి 'నేటికి 40 రోజులకు భగవంతుడు విచారానికి వస్తాడు. మనము ఆరోజు గంగైనా ముట్టకూడదు' అన్నారు. సరిగా ఆరోజు మైపాడులో వున్న స్వామి 'మనము ఆశ్రమము చేరేదాక గంగ ముట్టకూడదు. మనము వెంటనే అక్కడకు వెళ్ళాలి' అని చెప్పి వర్షముకూడా లెక్కచేయక బయలుదేరి మధ్యాహ్నానికి గొలగమూడి చేరారు. నాటి వుదయమే పోలిరెడ్డి ఆశ్రమంలో మరణించాడు. అచ్చటి భక్తులకు స్వామి యెక్కడున్నదీ తెలియక తికమకపడుతున్నారు. సర్వజ్ఞుడు అయిన స్వామి సరిగా సమయానికి ఆశ్రమం చేరి స్వయంగా దేహాన్ని నేటి స్వామి సమాధి మందిరము ప్రక్కనే సమాధి చేశారు. సాయిబాబా వద్ద సద్గతితప్ప మఱేమీ కోరని మేఘుని వలె అతడుకూడా సద్గతియే పొందాడు.

జ్యోతిష్యశాస్త్రము అభ్యసించిన రామానాయుడు యెక్కువ సమయము స్వామి సన్నిధిలో గడిపేవాడు. అతనికి ఆ విద్యలో చక్కని ప్రావీణ్యము యేర్పడి యెంతో చక్కగా ప్రశ్న చెప్పగలిగేవాడు. పోయిన వస్తువులు, పశువులు ఎప్పుడు, ఎక్కడ దొరికేది యెంతో సూక్ష్మంగా చెప్పగలిగేవాడు. ఒకసారి స్వామి వూరికి బయలుదేరుతుంటే అతడు 'స్వామి! నా ఒంట్లో బాగలేదు. నేనిక్కడే వుంటాను' అన్నాడు. స్వామి అంగీకరించి వెళ్లిపోయారు. రెండవరోజు అతడు మరణించాడు. ఆ వార్త విని స్వామి అతని దేహాన్ని ఆశ్రమంలో ఒక ప్రక్కన సమాధి చేయమని కబురుచేశారు. అతడు కోరినది శాస్త్ర ప్రావీణ్యమే అయినా స్వామి అతనికిగూడ సద్గతి నిచ్చారు.

కొందఱు స్వామి నుండి దివ్యదర్శనాలు కోరారుకాబోలు వారికి అవే ప్రసాదించారు స్వామి. ఒకసారి తలుపూరులో ఈశ్వరనాయుడిగారింట్లో అర్ధరాత్రి స్వామితోపాటు అక్కం వెంకట్రామిరెడ్డినికూడా భోజనానికి పిలిచారు. కానీ స్వామి అతనిని వూరికి పొమ్మని ఆదేశించారు. ఇంత అర్ధరాత్రి, వర్షంలో అతడు వూరికి యెలా వెళతాడు? అని చలమానాయుడు కోపగించుకున్నాడు. స్వామి 'అబ్బో! అతడు యిక్కడ వుండకూడదయ్యా' అన్నారు. వెంకట్రామిరెడ్డి వెంటనే బయలుదేరి తలుపూరు పొలిమేర చేరాడు. ఆతర్వాత అతనికి యేమి తెలియలేదు. ఇల్లు చేరాకగాని అతనికి స్పృహ రాలేదు. దారిలో లోతుగా ప్రవహిస్తున్న కల్లేరును యెలా దాటాడోకూడా తెలియలేదు.

ఒకనాటి అర్ధరాత్రి స్వామి ముదిగేడులో అతనితో నాకు తలుపూరు త్రోవ చూపించు అని చెప్పి బయలుదేరదీశారు. దారిలో ఒక ఱాళ్ళగుట్ట దగ్గఱ అతనిని కూర్చోమని చెప్పి స్వామి యెటో వెళ్లారు. అతడు దొంగచాటుగా స్వామిని అనుకరించాడు. స్వామి ఒక పెద్ద బండ మీద కాలుమీద కాలు వేసుకొని పడుకొని పాటలు పాడుతున్నారు. అది వినాలని అతడు చాటుగా సమీపించగానే అతడిని పసిగట్టి 'ఈ పెనుభూతాలు తిరిగేవేళ నీవిల్లా రావచ్చా?' అని మందలించి ఒక దిక్కుకేసి చూడమని చూపించారు. అక్కడ తనకు వ్రజవాసులయిన గోపగోపికల దివ్యదర్శనమయ్యింది. అది చూస్తున్నంతసేపు అతనికి దేవలోకంలో విహరిస్తున్న ఆనందము కల్గింది. అలాగే మఱొక రాత్రి వుఱుములు, మెఱుపులతో వర్షము పడుతుండగా స్వామి గుట్టచాటుగా తాటిఆకు నెత్తిమీద పెట్టుకొని యెక్కడికో బయలుదేరారు. యథాప్రకారం వెంకటరెడ్డి రహస్యంగా ఆయనను వెంబడించారు. స్వామి కల్లేరు ఒడ్డున తమ గుడ్డలు వుంచి నీటిపైన పిల్లవానిలో అటూయిటూ పరిగెడుతున్నారు. కొంతసేపయ్యాక గుడ్డలు ధరించి అతని దగ్గఱకు వచ్చి కఱ్ఱతో పొడుస్తూ 'రాక్షసఘడియలో నీవిలారావచ్చా?' అని మందలించి ఆ కఱ్ఱతోనే నెట్టుకుంటూ యింటికి తీసుకొని వచ్చి యేమీ యెరగనట్లు తమ ధునివద్ద కూర్చున్నారు. మఱొకసారి 8మందిని తీసుకొని స్వామి పెంచెలకోనకు చేరారు. తర్వాత అక్కడనుండి సుమారు 3 మైళ్ళలో వున్న మల్లెంకొండకు తీసుకువెళ్ళారు. అక్కడ మల్లీశ్వర లింగంతో స్వామి వింతైనభాషలో మాట్లాడి తర్వాత మైలుదూరంలో వున్న మామిళ్ళకోనకు తీసుకుపోయారు. అక్కడ వెంకటరెడ్డి ఒక్కడే స్వామితోగూడ దట్టమయిన మామిడితోపులతో నిండిన బిలంలోకి నడిచాడు. దారిలో ఒక యెలుగుబంటి పెద్దగా గర్జించి వారిపై పడింది. స్వామి దానిని ముమ్మారు నిమరగానే అది శాంతించి వెళ్లిపోయింది. అక్కడొక బాట, ఒక ఈశ్వరలింగము, రెండు స్త్రీ విగ్రహాలు వున్నాయి. వాటిపై వర్షపుధారలు, నీటిధారలు పడుతున్నాయి. స్వామి ఆ విగ్రహాలతో వింతైనభాషలో మాట్లాడుతున్నారు. ఇంతలో వెంకటరెడ్డి సమీపంలో వున్న ఒక లోతైన గుంటలోకి చూశాడు. అందులో వెండి, బంగారు నాణాలు రాశులుగా పడియున్నాయి. ఎంతో వింతైన చేపలుకూడా వున్నాయి. చివఱకు స్వామి తన సేవకులతో 'మీరు తెర్లచెర్లమీదుగా కల్లూరు చేరండి. నేను సాధువయ్యను కలుసుకొని వస్తాను' అని చెప్పి కొండలలోకి వెళ్లిపోయారు. కానీ సేవకులు దగ్గఱ దారిన కల్లూరు చేరేసరికి స్వామి అప్పటికే అక్కడ వేలిముద్రలు వేస్తున్నారు. వెంకటరెడ్డిని చూస్తూనే 'నీ పేరు మారిపోయింది. నీకు నిందలు వచ్చాయి. వెంటనే యింటికి ఫో' అన్నారు. అతడు యిల్లు చేరేసరికి అక్కడ వూరిజనమంతా మూగియున్నారు. అతనిని చూస్తూనే వారంతా ఆశ్చర్యచకితులయ్యారు. కారణము అతడిని యెవఱో హత్యచేసి చాపలో చుట్టి ఈతచెట్లలో దాచి వుంచారని పుకారు పుట్టింది. అతడిని వెదకడానికి కొందఱు బయలుదేరారు.

మఱొకనాటి రాత్రిగూడ వెంకటరెడ్డి స్వామిని రహస్యంగా అనుసరించాడు. అక్కడ ప్రగడరాజు గుంటవద్ద స్వామి ఆగి, వెనుతిరిగి అతనిని మందలించి ఒక దిక్కు చూపారు. అక్కడ చింతలమానంత లావుగా వున్న మహాసర్పాన్ని చూపి, 'పైవాళ్లు దానినలా చంపకుంటే అది నిన్నూ నన్నూ యేమి చేసేదో' అని చెప్పి పంపివేశారు. మఱుసటి వుదయము 7 గంటలకు స్వామి కట్టెలమోపు తీసుకొని ఆశ్రమానికి వచ్చారు.

ఒకసారి ముదిగేడులో వెంకటరెడ్డిని యిల్లు కట్టుకొమ్మని చెప్పారు స్వామి. అంతేగాక, వారే స్వయంగా శంఖుస్థాపన గూడ చేశారు. అతడు తనకు యిల్లు కట్టుకునే శక్తి లేదని చెప్పగానే; 'నీవు నేరుగా యీ దిక్కుగా పో, అన్నీ నెరవేరుతాయి' అన్నారు. అతడలానే పోతుంటే దానిలో అతనికి బేలుదారులు యిటుకలు చేసేవారు, తోలేవారు కొందఱు మిత్రులు కనిపించారు. అతడు అడగకుండానే అన్నివిధాల సహాయము చేశారు. అతని ప్రయత్నములేకనే యిల్లు కట్టాడు. స్వామి ఒకసారి ఆ యింటికి వచ్చి ధునికూడా వెలిగించారు.

కొవుకూటి బుజ్జయ్య కోర్టుకేసులు, తండ్రిగారి అనారోగ్యాలగురించి సతమతమౌతూ శాంతికోసము స్వామివద్దకు వచ్చాడు. అతడు పెదవి మెదపకముందే స్వామి 'అయ్యా! మనసులో యేమీ పెట్టుకోకుండా యింటికి చక్కాపో. అన్నీ నేనే చూసుకుంటాను' అన్నారు. త్వరలో అన్నీ చక్కబడ్డాయి. కొన్నాళ్ళకు అతని బావగారు ఒక నేరంలో చిక్కుకొని కోర్టుచుట్టూ తిరుగుతుంటే అతనిని రక్షించమని బుజ్జయ్య స్వామిని కోరాడు. ఆయన 'అయ్యా! కొండాయపాళెం దాకా బస్సులో పోయి, అక్కడినుండి నెల్లూరుకు నడిచిపోయి, 12 గంటలకు తిరిగివచ్చేయి' అని ఆదేశించారు. బుజ్జయ్య అక్షరాలా అలాగే చేసి గొలగమూడికి కాలినడకన బయలుదేరాడు. పరుగునవెళ్లినాకూడా 12 గంటలకు గొలగమూడి చేరే అవకాశమే లేదని, వెళ్లకపోతే స్వామి మాట తప్పినట్లవుతుందని అతడు భయపడుతున్నాడు. ఫత్తేఖాన్‌పేటలో ఒక మిత్రుడు కనిపించి తాను మానుకున్న ప్రభుత్వ క్యాంపును మఱలా వేసుకొని తన కార్‌లో బుజ్జయ్యను 12 గంటలలోపే గొలగమూడి చేర్చాడు. బుజ్జయ్య బావగారిపై నున్న కేసులన్నీ మంచులా కఱగిపోయాయి.

**ఆశ్రితవత్సలాయ నమః**

శ్రీఅవధూతాయ నమః

## అధ్యాయము - 10

# అ వ ధూ త బో ధ

ప్రకృతిలోని జీవకోటి అంతా వాటి ప్రారబ్ధాన్ని ఓరిమితో అనుభవిస్తూ తక్కిన ప్రాణికోటి అంతటికీ యేదో ఒకరీతిన హితము చేస్తూనే జీవిస్తాయి. వాటికి ధర్మము సహజంగాని యోచనాశక్తి గల మానవుడు స్వార్థంతో ధర్మాన్నే వుల్లంఘించి తన శాంతిని, దానికి ఆధారమైన సంఘశ్రేయస్సును తారుమారు చేసుకుంటాడు. అట్టి మానవులకు మఱలా శ్రేయస్కరమైన ధర్మము బోధించి ఆచరింపజేయించడానికి మహాత్ముల రూపంలో శ్రీదత్తప్రభువు అవతరిస్తుంటారు. మానవులు అట్టివారిని ఆశ్రయించి హృదయపరివర్తన చెందాలని వేదాలు, భగవద్గీత, భాగవతము వంటి గ్రంథాలు చెబుతాయి. భౌతికంగా వారి సాన్నిధ్యము లభించనపుడు వారి చరిత్ర పారాయణ, బోధల మననము ద్వారా అటువంటి శ్రేయస్సు పొందవచ్చు. స్వామి యెలా బోధించేవారో చూద్దాము.

స్వామి సన్నిధిలో యెక్కువకాలము గడిపే బుజ్జయ్య ఒకసారి పదిరోజులు రచ్చమీద కూర్చొని గ్రామస్థులతో కబుర్లు చెబుతున్నాడు. తర్వాతరోజు అతడు రాగానే స్వామి అతనిని చూపి 'ఏవూరయ్యా ఆయనది?' అన్నారు. గురువును సాధ్యమైనంత తరుచుగా దర్శిస్తుండాలని గదా శాస్త్రము చెప్పేది! అంతేగాదు, గురువును మరచి వుండకుండడంగూడ శిష్యుని ధర్మమే!

సాయిబాబాలాగా స్వామి గూడ వుపవాసాన్ని ప్రోత్సహించలేదు. మంగమ్మ తో ఒకరోజు స్వామి 'అందఱికి అన్నంపెట్టి నీవుకూడా తినిరా' అన్నారు. 'ఈరోజు శివరాత్రి వుపవాస మున్నాను' అన్నది మంగమ్మ. 'అబ్బే అన్నం చూస్తుండ్లా! తినేసిరా' అన్నారు స్వామి. మనస్సుకు ఆహారము గుర్తుండనంతవఱకు భగవద్ధ్యాసలో వుండగల్గితేనే వుపవాసము సార్థకము. అన్నం గుర్తుంటే తినడమే మేలు. కర్మేంద్రియాలను నిగ్రహించినా మనస్సు విషయాలమీదకు పరిగెత్తుతుంటే అది మిథ్యాచారమే అవుతుందని శ్రీకృష్ణుడు చెప్పాడు.

తమ అన్నగారయిన సాయిబాబాలాగా స్వామిగూడ భక్తులను దక్షిణ కోరి, తద్వారా తత్త్వము వుపదేశించేవారు. జనవరి 1980లో తులశవ్వను 9 దుప్పట్లు దక్షిణగా సమర్పించమన్నారు. స్వామి కోరినది 5 జ్ఞానేంద్రియాలు, 5 కర్మేంద్రియాలు, మనస్సు--- ఈ 9 ఆవరణములను(దుప్పట్లను) గురువుకు అర్పించి బ్రహ్మంతో ఐక్యమవమని ఆయన సూచించారు. మఱొకపుడు ఆమెను స్వామి 6 దుప్పట్లు గుండంలో వేయమన్నారు. అంటే అరిషడ్వర్గాలను జ్ఞానాగ్నిలో దహించమని వారి భావము. స్వామి ఒకరోజు 'నా తొమ్మిది దుప్పట్లు నాకియ్యండయ్యా!' అన్నారు. స్వామికి వున్నది ఆఱు దుప్పట్లే. నాగయ్య తన దుప్పటి, సాటివారి దుప్పటి రెండు కలిపి వారికి సమర్పించాడు. స్వామి స్వీకరించారు. పంచభూతాలు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనే తొమ్మిదింటిని సమర్పించమని వారి భావము. మఱొకసారి రోశిరెడ్డితో 'అయ్యా! అందఱికి పంట పండించాను. దొంగలుపడకుండా కాపలా కాచుకోండి' అన్నారు. ఆయన అందఱినీ అనుగ్రహిస్తూనే వున్నారు. భక్తులే తమ దుర్గుణాలనుండి దానిని కాపాడుకోవాలి. సాయిబాబా కూడా దుర్గుణాలను దొంగలతో పోల్చారు. ఒకసారి 'స్వామివారి సేవకు లందఱూ దొంగసాధువులే' నని ఒక రైతు విమర్శించాడు. ఒక భక్తుడు కోపంతో అతనిపై కలబడపోయాడు. స్వామి అతనిని ఆపి 'ఏందయ్యా, వాళ్లంటుంటే ఓర్చుకుంటేనేగదయ్యా నిజంగా మనము సాధువులము' అన్నారు. అలానే ఒక సేవకుడు కోనేటి స్నానానికి వెళుతూ సాటివారిపై యితఱులు చేసిన విమర్శలు విని స్వామి చెంతకు వచ్చాడు. స్వామి 'నీవు చెప్పుడు మాటలు వినివచ్చావు, నీవు పోసే జావ నాకొద్దు' అని అతనిని తరిమివేశారు. సాయికూడా సాటివారిపై అపవాదులు కల్పించినవారిని మలభక్షణము చేసే పందులతో పోల్చారు. అట్టివారికి శిరిడి సందర్శనముకూడా మేలు చేయజాలదని చెప్పారు! ఇది గుర్తించని భక్తులగురించి స్వామి యిలా అన్నారు. 'నిర్భాగ్యులు, ముండలు, రండలై వున్నారు. అందఱూ అప్పు, బాకీ చేస్తున్నారు. అర్ధణా సంపాదిస్తున్నారు'. మనము స్వల్పమని తలచే పొరపాట్లు చిన్నవేమీ కావు. సాటివారిని బుద్ధిలేనివాడా! అనినాకూడా నరకానికి పోవల్సిందేనని క్రీస్తు చెప్పాడు. తాజుద్దీన్‌బాబా యిలా అన్నారు ' కాబా, ఖురాను తగలబెడితే పెట్టేవు, మద్యపానము, విగ్రహారాధన చేసినా పఱ్వాలేదు, ఇతఱుల హృదయాలను గాయపఱచవద్దు, భగవంతుని నివాసమైన స్వర్గం మానవ హృదయంలో వున్నది'.

స్వామి మఱొకపుడు ఈ భావాలే మఱోలా గురవయ్యతో యిలా చెప్పారు. ' మాల, మాదిగ, జోగి, జంగము వాళ్లు చేరకుండా చూచుకో! సంపన్నత్వంతో సద్గురువుని సేవించు'. సాయిబాబాకూడా మనలోని దుర్గుణాలనే అసలయిన హీనజాతులుగా చెప్పేవారు. 'తప్పు చేస్తే లద్ది, దొండ పురుగులుగా పుడతారు. మాదిగ యిండ్లలో పుడతారు. మఱలా యెన్ని జన్మలకు కూడా నా దగ్గఱకు రాలేరు' అనేవారు స్వామి.

ఎవఱో యేమో అంటారని భయపడో లేక అన్నారని నొచ్చుకొనో సద్గురు సాంగత్యము వదులుకోవడము గురుభక్తులకు తగదు. చిరకాలము స్వామి సేవలో వున్న రోశిరెడ్డిని ఒకప్పుడు యెవఱో యేమో అన్నారని ఇంటికి వెళ్లిపోవాలనుకున్నాడు. అతనిని స్వామి పిలిపించి, 'పంటచేను వదిలి పరిగ ఏరుకుంటావా?' అన్నారు. సద్గురు సాన్నిధ్యము పంటచేను, లౌకికుల సాంగత్యములతో పాటు సాధన చేయచూడటము పరిగ యేరుకోవడము వంటిది. పరిగ యేరుకోవడమంటే యజమాని పంటంతా కోసుకున్నాక పొలంలో రాలిన గింజలను యేరుకోవడము. అలా లభించేది చాలాకొద్ది. రోశిరెడ్డిని యింటికి తీసుకెళ్లాలని బంధువులు ఆశ్రమానికి బయలుదేరారు. అతనికి చూపు సరిగా లేనందున ఒంటరిగా యెక్కడికీ పోలేడు. కానీ స్వామి నెల్లూరులో వుండగా ఒకరోజు అతనితో 'త్రోవపట్టుకుని నేరుగా ఫో' అన్నారు. అతనొక్కడే కాలి నడకన గొలగమూడి ఆశ్రమము చేరాడు. కానీ బంధవులు అతనిని కలవలేదు. సరియైన మార్గము, గురువనుగ్రహముతో లభించాక యెవరికైనా దారి తప్పకుంటే గమ్యము చేరుతారు.

కానీ యెక్కువమందికి శ్రద్ధ లోపించడంవలన సద్గురుసేవ లభించినా సార్థకము చేసుకోలేరు. ఒకనాడు స్వామి 'వెంటనే మజిలీ మార్చాలి పదండి' అన్నారు. సేవకులు ఇప్పుడు కాదు, సాయంకాలము భోజనము చేశాకే పోదాము అని చెప్పి తలోవైపూ వెళ్లారు. వాళ్లు స్వామి చెప్పినట్లు వినక తలొకదారిన పోతుంటే స్వామి మందలించారేమో అనుకున్నాడు బరిగల నాగయ్య. స్వామి వెంటనే 'పోతుంటే పోనిచ్చేదేగదయ్యా' అన్నారు. మహాత్ములు కర్తవ్యము సూచిస్తారేగాని నిర్బంధించరు. వారి సలహా వినకపోతే మన కర్మకు మనలను వదిలేస్తారు. మనము తప్పులు చేస్తూ, 'అన్నీ స్వామే చూసుకుంటారు' అనడము అవివేకము. సాయిబాబాగూడా 'నేను రెండుమూడుసార్లు హెచ్చరిస్తాను. వినకుంటే నీ కర్మకు నిన్ను విడుస్తాను' అన్నారు. మహాత్ములు సూచించినదానిని తు.చ.తప్పకుండా ఆచరించడము యెవఱికివారే నేర్చుకోవాలిగాని, నిర్బంధిస్తే మనోవికాసము కలుగకపోగా మఱింత తారుమారవుతుంది. అది తెలియక మహాత్ములు తమ భక్తులను మందలించలేదని మనము విమర్శించడము వైద్యుడికి రోగియే చికిత్సావిధానము చెప్పబోవడము వంటిది.

మహాత్ముల వద్ద యెవఱి శ్రద్ధాభక్తులకు తగినది వారు పొందుతారు. తేలు కుట్టినపుడు కొందఱికి స్వామి దగ్గఱ కొస్తేను, మఱికొందఱికి ప్రదక్షిణ చేస్తేను, మఱికొందఱికి వారిని స్మరిస్తేనే తగ్గిపోవడానికి కారణ మేమని ఒక భక్తుడు ప్రశ్నించాడు. ఆయన 'వాండ్లున్నదాన్నిబట్టికదయ్యా మనముండేది' అన్నారు. ఇలానే కొంతకాలము వారిని సన్నిహితంగా సేవించిన భక్తుడు అతి చనువువలన శ్రద్ధ తగ్గి పామరులతో కలిసి తిరుగనారంభించాడు. అంతవఱకు అతడు పెడితేనేగాని భోజనము చేయని స్వామి అటుతర్వాత అతడు పెడితే స్వీకరించక, 'ఆయన మనుషుల్లోకి పోయాడయ్యా' అని మఱొక సేవకుని కోరారు. ఆ రెండవ సేవకుడు

యెప్పుడైనా వారి సన్నిధి విడిచి దూరంగాపోతే, 'నువ్వుగూడా మనుషుల్లోకి పోతుండాయ్యా?' అని మెత్తగా మందలించేవారు. మనిషికి కామ క్రోధా లుంటాయి గాని పశుపక్ష్యాదుల కుండవు. కనుక స్వామి దృష్టిలో జీవులు మూడురకాలు : 1. మనుష్యులు, 2. పశుపక్ష్యాదులు, 3. ముముక్షువులు. సద్గురుసేవ నెరిగి దాని కంకితమైనవారు మాత్రమే ముముక్షువులు. వారుమాత్రమే స్వామి వలె జీవితపరమార్థము సాధించగలుగుతారు. ఒకసారి స్వామి యిలా అన్నారు. 'ఆఱు నాగళ్ళు గొఱ్ఱు కట్టి నేను, జయరామరాజు తోలుతున్నాము. అతని గొఱ్ఱె ఉదయగిరి కొండలకు తగిలి ఆగిపోయింది. నా గొఱ్ఱెమాత్రము సాగిపోయింది. ఉత్తర సముద్రం నీరు దక్షిణ సముద్రానికి పాఱాయి'. ఆఱునాగళ్ల సేద్యమంటే అచంచలమైన సద్గురుసేవలో అరిషడ్వర్గాలను అరికట్టే సాధన. సముద్రాలు ఏకమవుతాయంటే వున్నదంతా పరబ్రహ్మమేనన్న అనుభవము కల్గడము. జయరామరాజు కొంతకాలము తపస్సాధన చేసి తిరిగి లౌకిక జీవితంలో చిక్కుకున్నాడని అర్థము.

సామాన్యంగా లోకంలో మనిషికి, మనిషికీ మధ్య సంబంధము డబ్బే అయింది. సాయి చెప్పినట్లు దానిని సరిగా వినియోగించేవారికి అది బానిస. మిగిలినవారికి అది దుష్టుడైన యజమాని వంటిది. అర్థాన్ని ధర్మానికి వుపయోగించకుంటే ధర్మము బలైపోతుంది. సాయిబాబాలాగా స్వామిగూడా తమకు గడ్డం చేసిన మంగలికి రూ॥2 యిచ్చేవారు. ఎవఱికైనా సేవ శక్తివంచన లేకుండా చేయాలని, యితఱులు చేసిన సేవకు శక్తివంచన లేకుండా ప్రతిఫలమివ్వాలని ఆయన ఆచరణంతా బోధిస్తుంది. 1978వ సంవత్సరములో ఒకరోజు 'సిద్ధులయ్య కొండకు వెళ్ళాలి. బండి తీసుకురా' అన్నారు. బండి వచ్చింది. సామాన్లన్నీ అందులో వేశాక స్వామి 'ఇప్పుడు పోవడానికి లేదు. బండివాడికి రూ॥ 6 యిచ్చి పంపండి' అన్నారు. బండివాడి కంత డబ్బు యెందు కివ్వాలో యెవఱికి అర్థము కాలేదు. కానీ బండివాడు రోజూ గనిలోకి పోయి కూలీ చేసుకొనేవాడు. ఆరోజు బండి కట్టడంవలన అతనికి పనిలేకుండాపోయింది. కనుక ఆ కూలీ మనమే యివ్వాలని వారి భావము. ప్రతిఫలమివ్వవల్సినది చేసిన పనికే కాదు, దానికోసము పనివారు పడిన శ్రమ, వారు చేయవల్సివచ్చిన త్యాగానికీ గూడ. స్వామి చెల్లెలు మంగమ్మ ఆయన నెంతో ప్రేమగా చూచేది. ఆయన యెక్కడెక్కడో తిరిగి యింటికి వచ్చేసరికి వారికోసము అన్నముంచి యెదురుచూసేది. అందుకు ప్రతిగా స్వామి కుటుంబ ఆస్థిలో తమ వాటా ఆమెకే యిప్పించారు. కృతజ్ఞత అంటే అలా వుండాలి. వారి సేవకుడు బుజ్జన్నగారి చెల్లెలుకూడ అతని నెంతో ప్రేమగా చూచేది. ఒకప్పుడు ఆమె భర్త హత్యకేసులో యిరుక్కున్నాడు. స్వామి ఒకనాడు బుజ్జయ్యతో 'నేను నా చెల్లెలికి చేసినట్లే నీవు మీ చెల్లెలికి చేయాలి' అన్నారు. అంతేగాక చెల్లెళ్లపట్ల అన్న కుండవల్సిన ధర్మంకూడా అదేనని వారి భావము. అలాగాక ఒక భక్తురాలు ప్రజలకు వడ్లు అరువుగా యిచ్చి నాము అనే పేరుతో లాభము గడించేది. ఒకప్పుడు ఆమె యిల్లు కాలిపోయి చాలా ధాన్యము నష్టమైపోయింది. ఆమె

స్వామిని దర్శించి విలపిస్తుంటే 'అమ్మా! లాభమే పోయిందిగాని అసలు దక్కిందిగదా' అన్నారు. నిజానికి ఆ గ్రామస్థులు 8 పుట్ల గింజలను ఆ అగ్నిప్రమాదంనుండి కాపాడారు. ఆమె అక్రమలాభాలతో సేకరించుకున్న సామానులు, వడ్లుమాత్రము తగలబడిపోయాయి. అందుకే స్వామి ఒకప్పుడు నారాయణరెడ్డితో యిలా అన్నారు. 'వడ్డీ విషయంలో కూడా ధర్మము వుండాలయ్యా'.

సాధకులకు సాటివారిపై ప్రేమ, గౌరవము వుండాలి. రమణయ్య అనే సేవకుడు మస్తానయ్యను ఒరేయ్ అని పిలిచేవాడు. అది విని స్వామి 'అయ్యా! ఒరేయ్ అన్నది యెవఱు? అతడికి పాపము 300 లెక్కలు వ్రాసారయ్యా' అన్నారు. ఆ లెక్క లెలా పోతాయి స్వామి? అడిగాడు రమణయ్య. అనుభవిస్తే పోతుంది అన్నారు స్వామి.

మానవులు తరించడానికి భక్తిశ్రద్ధలతోపాటు యెంతో సహనము ఓరిమి అవసరము. దానినే సాయిబాబా 'నిష్ఠ, సబూరి' అన్నారు. అవి అలవరచుకున్నవాడే సద్గురుకృపకు పాత్రుడు కాగలడు. వీటితోపాటు ధర్మాచరణ అవసరము. అందుకే వెంకయ్యస్వామి అన్నారు, పనిచేయకుంటే వుద్యోగము నష్టము, పనిచేయకున్నా జీవనం రావచ్చుగాని, అది దక్కదు, ఎప్పుడూ కష్టము చేస్తూ నన్నావుండు, ధ్యానిస్తూ నన్నావుండు, లేకుంటే రోగంతో మూలుగుతూనన్నా వుండు'. ఈ మూడు దశలలోనే భగవంతుడు నిరంతరము గుర్తుంటాడు. కర్మశేషమూ తీరుతుంది. క్రొత్తగా కర్మ సంక్రమించదుకూడా. ఈ సూత్రము ఆయన ఆచరించి చూపారుకూడా. ఒకసారి స్వామి మోకాళ్ళు పట్టుకునిపోయి నడవలేకపోయారు. సేవకులు యెంతగా బ్రతిమాలినా ఆయన వైద్యము చేయించుకోలేదు. తాము అడుగకనే స్వామి తగిన చికిత్స తెల్పాలని, అది చేసి స్వామివారికి కాళ్ళు బాగుచెయ్యాలని తలచి కస్తూరి అంకయ్యగారు గొలగమూడి వచ్చారు. స్వామికి తెలియనిది యేమున్నది? ఆయన యిలా అన్నారు. 'ఈయన కెందుకయ్యా? ఆమయాన్నే కూర్చుంటే లెక్క తగ్గిపోతుందికదా?' మఱిలా అర్ధరాత్రి 2.30 గంటలకు అతడు అట్టి సంకల్పముతోనే స్వామి యెదుట కూర్చున్నాడు. స్వామి అతనిని చూచి 'అట్లా అడగకూడదయ్యా' అన్నారు. అంకయ్య చికిత్స విధానము తెలుపమని మఱల సైగ చేయగానే 'అలా అయితే మళ్ళీ రావాలయ్యా. తప్పు. అలా అడుగకూడదు' అన్నారు. అలానే ఒకసారి స్వామికి 15 రోజులు విరోచనాలై బాగా బలహీనంగా వుంటే ఒక భక్తుడు, మందు తీసుకోండి స్వామి అన్నారు. ఆయన, 'దేవుడిచ్చినది అనుభవించవద్దాయ్యా!' అన్నారు. 1990 సంవత్సరములో స్వామివారికి జబ్బు చేసి చేతులు, తల యెగురవేస్తుండేవారు. భక్తులు యింజక్షను చేయించాలని వైద్యుడిని తెచ్చారు. స్వామి ఇంజక్షను చేస్తే గుణము తగ్గుతుందాయ్యా అనడిగాడు. వాళ్ళు తగ్గుతుంది అనగానే, చేసుకోమను అని చెప్పి కదలకుండా చేయించుకున్నారు. మూడవరోజున ఆయన నవ్వుతూ 'సూదేశారు తగ్గిందాయ్యా' అన్నారు. తగ్గలేదు స్వామి,

మీరు తగ్గమని చెబితే తగ్గుతుంది అన్నాడు నాగయ్య. స్వామి నవ్వారేగాని ఆ మాట అనలేదు. నిజమైన ఓరిమి యెలా వుండాలో స్వామి చెప్పారు. ఒకసారి స్వామి కష్టమంటే యేమిటో నాకు తెలియదయ్యా అన్నారు. ఎంతటి కష్టమైనా ఆయనకు కష్టమనిపించేదిగాదు.

ఇలా ఓరిమి, ధర్మాచరణ, సద్గురుసేవ చేయకనే మంత్రోపదేశంతో ముక్తి పొందవచ్చని యెందఱో భ్రమిస్తారు. కానీ సాయిబాబా వలె వెంకయ్యస్వామికూడా వుపదేశము అక్కఱ్లేదని ఖండితంగా చెప్పారు. అలా కోరిక ఒక భక్తునితో స్వామి 'మంత్ర మెక్కడుంది, తంత్ర మెక్కడుందయ్యా. చూచుకుంటూ పోయేదేగదయ్యా' అన్నారు. మహాత్ము లందఱూ ఆచరించి చూపిన సద్గురుసేవ, ధర్మాచరణ, ఓరిమి ప్రేమ లనే సూత్రాలు గుర్తుంచుకొని సాగిపోవడమే మార్గమని వారు చెప్పారు. అందుకే మహాత్ము లెక్కువగా వాచా బోధించరు. 'స్వామి, ఎప్పుడూ మీరు మౌనంతో వుంటే మంచి-చెడ్డా తెలిసేదెలా?' అని రోశిరెడ్డి అడిగితే స్వామి '300 యిస్తే సాదయ్యా (సోది) వచ్చి చెబుతాడు' అన్నారు. అంటే వాచా యెంత చెప్పినా ప్రయోజన ముండదు. మహాత్ముల ఆచరణ నుండే తెలుసుకోవాలని వారి భావము. పూర్ణులైన సద్గురువు లెవఱూ మంత్రోపదేశము పొందలేదు, యితఱుల కియ్యలేదు. కొద్దిమందిమాత్రము కేవలము సంప్రదాయంకోసము అలా చేశారు.

భర్త చనిపోయి దిగులుతో మంచంపట్టిన వెంకమ్మగారికి వెంకయ్యస్వామి గారు ధైర్యము-ఓరిమి లిచ్చే తత్త్వాన్ని యిలా బోధించారు. 'అమ్మా! మామడిపండుకు పురుగుపడితే పనికిరాకుండా పోతుంది. ఆ పండు ధైర్యంగా వుంటే పురుగు దానిని యేమి చేయలేదు. పండు మధురంగా తయారై యెన్నో కాయల నిస్తుంది. ఎన్నోసార్లు యిలా చెట్లు అయ్యాక, ఇంకా యిలా యెన్నోసార్లు మనిషిగా జన్మించి బుద్ధి కలవాడవుతాడు. ఎన్నోసార్లు బుద్ధిమంతుడిగా జీవించిన తర్వాత భక్తుడు అవుతాడు. ఎన్నో జన్మలు భక్తుడుగా పుట్టాక, ఎన్నో జన్మలు ధర్మాతుడైన తర్వాత రాజుగా జన్మిస్తాడు. ఎన్నో జన్మలు దేవునికొఱకు పాటుపడి ఆయన సన్నిధిలో వుంటాడు. అపుడు దేవుడు కొద్దిగా కన్ను తెఱచి భక్తుని చూస్తారు. ఆయన బొటనవ్రేలు క్రింద వుండే అల్లెత్రాడు త్రొక్కగానే ప్రపంచమంతా బొమ్మలాటగా అతనికి కనబడుతుంది. అపుడు దేవుడు అతనిని తనలో చేర్చుకుంటాడు.

మోక్ష సూత్రాన్ని స్వామి అనేక సందర్భాలలో చిన్నచిన్న మాటలలో యిలా చెప్పారు. 'తరించేదెలా స్వామి' అని అడిగితే; ఆయన 'ఆశపోతే అంతా పోతుండ్లా?' అన్నారు. కోపమెట్లా పోతుంది స్వామి అంటే 'పొద్దు పొడిచేది, క్రుంగేది తెలియకుండా పోతే కోపం పోతుంది' అన్నారు. మఱొకసారి అడిగితే 'సూర్యచంద్రులకు అర్ఘ్యపెడితే పోతుంది' అన్నారు. అంటే వుదయం, సాయంత్రం అంతకంటే గూడ పగలు, రాత్రి హృదయపూర్వకంగా భగవంతుని ప్రార్థిస్తుంటే పోతుందని వారి భావము.

'మాలవాళ్లు మాదిగవాళ్లూ నీలో లేకుండా చూసుకో!' అని స్వామి చెప్పేవారు. ఆయన చెప్పినది మనలోని దుర్గుణాలను గురించేగాని నేటి సమాజము అనుకొనే వ్యవస్థగురించి కాదని గుర్తించాలి. ఇతఱ వర్ణస్థులను గూడా వారి గుణాలనుబట్టి స్వామి 'బ్రాహ్మణులు' అనేవారు. జన్మతః మాలవంశంలో జన్మించిన వక్కెమ్మను 'బ్రాహ్మణ ఆమె' అని, జన్మతః వైశ్యుడయిన పెసల సుబ్బరామయ్యను 'బ్రాహ్మణుడు' అనేవారు స్వామి. ఆయన దృష్టిలో సద్గురుభక్తి, బ్రహ్మజ్ఞానాలపై ప్రీతిగలవారే బ్రాహ్మణులు. అదెలా? ఒకరోజు గురవయ్యతో 'అంతటా దేవుని సమానంగా చూచుకుంటే దేవుడవవుతావు. బ్రాహ్మణులలో మాదిగవాళ్ళున్నారు. మాదిగవాళ్లల్లో బ్రాహ్మణులున్నారు. కోమటివారిలో కమ్మవారు, కమ్మవారిలో కోమటివారూ వున్నారు. గొల్లల్లో మాలవారు, మాలవారిలో గొల్లలు వున్నారు. లోకమంతా యీవిధంగా వుందయ్యా' అన్నారు. శిరిడిసాయిబాబాకూడా 'ప్రతివారిలోను ఒక అంత్యజుడుంటాడు, వాడిని వెళ్లగొట్టాలి' అనేవారు. మన ప్రాచీన ఋషులు కూడా గుణకర్మలనుబట్టే మానవులలో వర్ణబేధము యేర్పడుతుందని చెప్పారు. వజ్రసూచి ఉపనిషత్తు యిలానే చెబుతుంది. స్వధర్మముతప్పిన బ్రాహ్మణునికి - శూద్రత్వము, ఛండాలత్వము కల్గుతాయని ధర్మశాస్త్రములన్నీ చెబుతాయి. అందుకే బ్రహ్మజ్ఞానులవద్దనే ధర్మము తెలుసుకోవాలని ధర్మశాస్త్రము చెబుతుంది. అలా చేయక పోవడంవల్లనే మన దేశానికి వర్ణవ్యవస్థ ఒక శాపంగా పరిణమించింది.

దేవుడెలా కనబడుతాడు? అని అడిగితే 'అందఱినీ సమానదృష్టితో చూచుకుంటే కనబడుతాడు' అన్నారు స్వామి. మఱొకసారి అడిగితే 'వీరబ్రహ్మంగారి చరిత్ర చదివితే తెలుస్తుంది' అన్నారు. అంటే మహాత్ముల చరిత్రలను ముముక్షువులు తప్పక చదవాలని స్వామి ఆదేశము. దశయ్య పూలు కోస్తుంటే స్వామి అతనిని పిలిచి 'ఒక్క పూవేకదయ్యా' అన్నారు. మనస్సనే పూవు ఒక్కటే సద్గురువుకు సమర్పిస్తే చాలని భావము. అలానే సాయిబాబా ఒక భక్తుడిచ్చిన 4 రూపాయలు దక్షిణ తీసుకుని 'నీవు నాల్గు యిచ్చినా నాకు చేరినది మాత్రము ఒక్కటే' అన్నారు. వేలూరి సుబ్రమణ్యం యిలా చెబుతాడు - 'మా గ్రామంలో గ్రామదేవత బంగారమ్మ తిరునాళ్ళల్లో జంతుబలులు జరిగేవి. ఒకనాడు స్వామి 'బంగారమ్మ సముద్రస్నానానికి పోయి వచ్చింది. ఇకమీదట జంతుబలి మాని పాలు, పొంగళ్ళు పెట్టుకోవాలి' అని దండోరా వేయించమన్నారు. నేను అలాగే వేయించాను. అదిమొదలు నేటికీ పాలపొంగళ్ళే సమర్పిస్తున్నారు.

దొంగతనము విషయము ప్రస్తావనకు వచ్చినపుడు 'పావలాకు పది రూపాయలు పోతూండ్లాయ్యా' అన్నారు స్వామి. దొంగతనము వల్ల ఒకటికి 40 రెట్లు నష్టమైతే దైవానికి భక్తితో సమర్పించిన పావలాకు యెన్ని రెట్లు లాభమో! ఆయనే, 'లాభంలో భాగము తీసుకుంటే పాపంలోగూడా భాగము వస్తుందయ్యా' అన్నారు మఱొకసారి.

ఒక భక్తుడు 'మనిషి చనిపోయాక మఱలా మనిషిగా జన్మిస్తాడా లేక పశుపక్ష్యాదులుగా పుడతాడా?' అని అడిగాడు. స్వామి 'మనిషైపోతే మనిషిగానే పుడతాండ్లొయ్యా!' అన్నారు. ఈ మాటలకుగూడా ఆశగాక ఆశయ మని అర్థము చెప్పాలి. పుట్టినవాడల్లా మనిషిగాడు. మహాత్ముల నాశ్రయించి వివేకము పొంది ధర్మాన్ని ఆశ్రయించాలి. అపుడే మనిషి అవుతాడు. 'నీకు యితఱులు యేమి చేయాలనుకుంటావో నీవు యితఱులకు అదే చేయాలి' అన్న సూత్రాన్ని పాటించేవాడే మనిషి. పశుత్వము యేమాత్రము మిగిలివున్నా అతడింకా పూర్తిగా మనిషి అవనట్లే. అపుడుమాత్రమే పొడుగునా మానవజన్మలు, తర్వాత జన్మరాహిత్యమూ వస్తాయి. మఱొకరు అదే ప్రశ్న వేస్తే స్వామి 'దేనితో పీకులాడుతూపోతే దాంట్లోనే వస్తుండ్లొయ్యా!' అన్నారు. మనిషి యెలాంటి పనులు, భావనలూ యెప్పుడూ చేస్తుంటాడో అలాంటి స్థితిని పొందుతారని వారి భావము. మానవత్వాన్ని పెంచుకుంటేనే మనిషిగా అవుతాడు. పశుత్వాన్ని పెంచుకుంటే పశువే అవుతాడని వారి భావము.

ఒకడు 'ముక్తి రావాలంటే యేమి చేయాలి?' అని అడిగాడు. స్వామి 'అయ్యా! ఆయనను 3 లక్షలు కట్టమను' అన్నారు.

భక్తుడు : అంత పైకం లేదు స్వామి

స్వామి : ఆఱులక్షలు కట్టమనయ్యా

భక్తుడు : అసలు డబ్బు లేదు

స్వామి : 8 లక్షలయినా కట్టమనయ్యా అన్నారు.

3 లక్షలు కట్టమంటే ఈషణత్రయం వదలమని అర్థము. ఈషణ - అంటే మక్కువ అని అర్థము. దారేషణ(భార్యపై వ్యామోహం), పుత్రేషణ(బిడ్డలపై మక్కువ), ధనేషణ(ధనంపై మక్కువ)- ఇవే ఈషణ త్రయం అంటే తనకున్న సమయము, శక్తి, మక్కువ అంతా వీటికోసమే వినియోగించడం తగదని స్వామి భావము. ఆఱులక్షలు సమర్పించడమంటే అరిషడ్వర్గాన్ని - కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు జయించడమని అర్థము. 8 లక్షలు అంటే అష్టమదాలు. వీటితో ప్రతిఒక్కదానివలన కొన్ని లక్షలు పుణ్యము నశించి అన్ని లక్షల పాప మొస్తుంది.

భక్తుడు : స్వామి, నన్ను సాధన చేసుకుంటూ యెక్కడ వుండమంటారు?

స్వామి : ఒక్కదూలం యిల్లు వేసుకుని యెక్కడైనా వుండవచ్చు.

సద్గురువును సంపూర్ణంగా ఆశ్రయించడమే ఒక్క దూలం యిల్లు వేసుకొనడ మంటే. కానీ అలా చేసేదెవఱూ? కానీ ఆ ప్రకారం చేయడమే నిజంగా ముక్తికోసం అడగడ మంటే. ముముక్షుత్వ మంటే.

అందుకే స్వామి ఒకసారి 'కొండలుకొండలుగా డబ్బు లున్నా ఒక్కరుకూడా అడగరేమయ్యా? అన్నారు. సాయిబాబాకూడా 'నావద్ద జ్ఞాన మనే ధనపురాశులు అపారంగా వున్నా అడిగేవాడేలేడు', 'శిష్యుడు అనదగినవాడు నాకు ఒక్కడు కూడా కనిపించలేదు' అన్నారు. 'నేను నా గురువును సేవించినట్లు సేవించగలిగితే శిష్యు డని చెప్పుకోవాలి' అన్నారు. స్వామి యింకొకసారి 'దక్షిణపు కొండ తేలివచ్చింది. ఎవరైనా కొనేవారుంటే కొనమని చెప్పండయ్యా' అన్నారు. కొనడం అన్నా, పాడటం అన్నా సద్గురువును సేవించే విధానము యెరిగి సేవించడ మన్నమాట. అందుకు శ్రీగురుచరిత్ర మొదలయిన సద్గ్రంథాల పారాయణ, మననము చేసి ఆ సంస్కారాన్ని పెంచుకోవాలి. ఒక భక్తుడు తులశవ్వను, 'స్వామి మళ్ళా జన్మకు వస్తాడా?' అని అడిగాడు. తులశవ్వ, '80 సంవత్సరాలకు మళ్ళీ వచ్చి హెచ్చుతగ్గులు చూచుకొని పోతాడట' అని చెప్పింది.

ఒకరోజు దశయ్యతో స్వామి, 'అయ్యా! వనమ్మ వేఱే పోతుంది. అప్పుడు అన్నీ మనమే యివ్వాలయ్యా' అన్నారు. దశయ్య చెల్లెలు వనమ్మ వితంతువుగనుక స్వామి అలా యెందు కన్నారో యెవఱికీ తెలియలేదు. వారంరోజుల తర్వాత మనస్పర్థ లొచ్చి వనమ్మ అలిగి ఆ యింట్లోనే వేఱే వంట చేసుకొన్నది. పదార్థము లన్నీ దశయ్యగారివే. నాల్గవరోజు దశయ్య కొడుకు అన్నీ మరచిపోయి కలిసి వుండకపోతే తాను అన్నం ముట్టనని చెప్పాక ఆమె మళ్ళీ అందఱితో కలిసి నివసించింది. ఎవఱు, ఎవఱితో తగవుపడతారో ఎవఱు ఎక్కడ అన్నం తింటారో, ఏమి తింటారోగూడ ఋణానుబంధంవలన నిర్ణయించబడే వుంటుంది. అది తెలిసి సద్గురు సేవకుడు మాత్రమే నిందాస్తుతులపట్ల సమానుడై నోరు విప్పక కర్మబంధంనుండి విముక్తు డౌతాడు. ఒకరోజు యెవరో తననేమో అన్నారని రోశిరెడ్డి స్వామివారికి ఏకాంతంగా చెప్పుకున్నాడు. నోరు విప్పకూడదయ్యా అని స్వామి సెలవిచ్చారు.

ఒకసారి 'భగవద్గీత 65 చూపులకు యివతలివారివే గదయ్యా! అంతకు పైచూపువారికి అది చాలదు' అన్నారు స్వామి.

ఒకనాడు స్వామి భోజనము చేస్తుంటే విస్తట్లో కుక్క నోరు పెట్టింది. స్వామి దానినేమి అనకుండా యివతలికి వచ్చేశారు. కుక్క తృప్తిగా తిని వెళ్లిపోయింది. అందుకే ఆయన అన్నం పెడితే కుక్కలన్నీ కొట్లాడుకోకుండా సామరస్యంగా తినేవి.

*విశ్వగురవే నమః*

## శ్రీ అవధూతాయ నమః

## అధ్యాయము - 11

# అం తు ప ట్ట ని స్వా మి

బరిగెల నాగయ్య ఒకసారి 'స్వామి! వర్ష మెలా వస్తుంది?' అని అడిగితే 'పైవాళ్లనడిగితే చెబుతారయ్యా'అన్నారు స్వామి. 'మీకంటే పైవాళ్లు యెవఋ?' అన్నాడు నాగయ్య. స్వామి 'వాన కుఱిపించే 10 ఇంజన్లు మనవేగదయ్యా! వాటిలో ఒకదానిని పూర్తిగా పనిచేయించినా ప్రపంచము తలక్రిందులవుతుంది. ఒకదానిలో సగమేగదయ్యా పనిచేయించేది' అన్నారు. అతడు వాటిని చూడాలని ఆత్రుతపడుతుంటే స్వామి, 'కొంచెముసేపు పడుకొనివస్తే సరిపోతుంది' అని పదేపదే చెప్పారు. ఆయన చెప్పారని అతడు కళ్లు మూసుకుని పడుకోగానే దివ్యమయిన ఆ పది ఇంజన్ల దర్శనమూ అయ్యింది. అచ్చటి పనివారు అతనితో 'అయ్యా! నీకు జీతం 500 రూ॥, మాకు 50 రూ॥ వ్రాశారు. వీటి పనంతా నీకు తెలుసట. అందుకే నీకు అంత జీతం' అన్నారు. అతడు లేచి స్వామి దగ్గఱకు రాగానే ఆయన 'అవన్నీ మనవేగదయ్యా' అన్నారు.

శ్రీరామానాయుడిగారి తోట ఎన్నాళ్ళకు కాపుకు రాలేదని చెబితే స్వామి 'చెఱువు దగ్గఱ వాగునుండి క్రింద చిందకుండా నీరు తెచ్చి ప్రతి చెట్టు క్రిందా వుగ్గుగిన్నెడు పోయండి' అన్నారు. అలానే చల్లి మిగిలిన నీరు బావిలో పోశారు. ఆ తోటలోని చెట్లేగాక ఆ నీరు వుపయోగించుకున్న వారి చెట్లన్నీ ఒకేసారి కాయడము మొదలెట్టాయి.

కారి రామస్వామితో కలసి స్వామి ఒకసారి పెంచలకోన వెళ్లారు. స్వామి 'అయ్యా! మనము కొండచుట్టూ తిరగాలి' అన్నారు. వారిని సత్రము దగ్గఱనుండి మందిరము దగ్గఱకు తీసుకువచ్చేసరికి ఆయన 'అయ్యా! మనము కొండ యెక్కిరావాలి. అపుడు మన లెక్క సరిపోతుంది' అన్నారు. మరుసటి వుదయమే అందఱూ సిద్ధమైనప్పటికీ మధ్యాహ్నం 2 గంటలవఱకు స్వామి మౌనంగా వున్నారు. కదలలేదు. అపుడు సేవకులు అడిగితే 'అయ్యా! మీరు పోతే యెంతదూరం పోతారు? నేను పోయివచ్చాను. లెక్క సరిపోయింది' అన్నారు.

తర్వాత అందఱూ సోమశిలకు వెళ్లారు.

స్వామివద్ద 5 ధోవతులు కలిపి దారాలతో కట్టిన మోపు వంటిది ఒకటి వుండేది. దానిని గొలగమూడి ఆశ్రమంలో ఒక చెట్టు కొమ్మకు తగిలించి వుంచేవారు స్వామి. ఒకరోజు ఆయన నిద్రలేస్తూనే 'ఈరోజు యెవ్వఱూ నోరు విప్పకూడదయ్యా' అని పదేపదే అన్నారు. ఎందుకో యెవఱికీ తెలియలేదు. తరువాత ఆ ముందటిరాత్రి ఆ ధోవతుల మోపు యెవఱో దొంగిలించారని తెలిసింది. దొంగిలించినవారిని యెవఱూ తిట్టకుండా వుండేందుకు ఆయన అలా చెప్పారు. అంతకుముందు ఆశ్రమంలో రాగి అండా దొంగిలించారని చెబితే 'వాళ్లకు లేకనే కదయ్యా యెత్తుకుపోయారు. మనము వాళ్ళని యేమి అనగూడదే?' అన్నారు.

దశయ్య 10 సంవత్సరాలు ప్రయత్నించినా స్వామి యెక్కడ మలవిసర్జన చేస్తారో కనుక్కోలేకపోయాడు. ఒకప్పుడు బాగా గమనించాడు. స్వామివారికి విరేచనాలు అవుతున్నాయి. ఆశ్రమంలో స్వామి ఒకచోట 2 అడుగుల లోతు గుంట ఒకటి, దాని ప్రక్కన 3 అడుగుల గుంట ఒకటీ త్రవ్వించి వాటినిండా నీళ్లు పోయించేవారు. అపుడు స్వామి మలవిసర్జనమయ్యాక మొదట ఒక గుంటలోనూ, తర్వాత రెండు గుంటలలోనూ నీటితో శుభ్రము చేసుకునేవారట. ఆ గుంటలలోని నీరు యెండిపోతే మఱలా అవి పొర్లిపోయేదాకి పోయించేవారు. అలానే మఱొకప్పుడు దశయ్య 'స్వామి! మీరు 8 గుండాలు వేస్తే చూడాలని వున్నది' అన్నాడు. అయ్యా! మీరు తెస్తే నేను వేయనా?' అన్నారు స్వామి. వెంటనే అతడు 4 బండ్లు, మనుష్యులను తీసుకువెళ్లి మొత్తం 16 బండ్లు కట్టెలు కొట్టించి తెచ్చాడు. స్వామి 8 గుండాలు వేసి తెల్లవారేసరికి కట్టెలన్నీ ఖర్చు చేశారు. కొన్నాళ్ళవఱకూ ఆయన ఆ 8 గుండాలు నిర్వహించారు.

తలుపూరులో ఒకరోజు స్వామి, 'అయ్యా! పైవాళ్లంతా పెంచలకోనలో సమావేశము పెట్టుకున్నారు. పెంచలయ్య వాళ్లకు జవాబు చెప్పలేక మనల్ని రమ్మని మూడునాళ్లనుండి తిరుగుతున్నాడు. మనము ఈరోజు పోయి అందఱికీ సమాధానము చెప్పి, పెంచలయ్యకు యెలాంటి ఆటంకము లేకుండా చేసివద్దాము, బయలుదేరండి' అన్నారు. ఆయన అందఱినీ తీసుకుని పెంచలకోన చేరారు. ఆయన ఆ దేవాలయం ముందు కూర్చుని రాత్రంతా మన కంటికి కనిపించని యెవఱితోనే మాట్లాడుతున్నారు. ఆ మాటలు యెవఱికీ అర్థము కాలేదు. తర్వాత పెంచలయ్యకు పీకులాట తప్పింది. ఇక పోదాం పదండి' అన్నారు. ఆరోజు బుధవారం. ఆ రోజులలో శని, ఆదివారాలలో మాత్రమే పెంచలకోనకు బస్సు వచ్చేది. ఆ విషయము స్వామికి చెబితే 'బస్సు వస్తుందిలేయ్యా' అన్నారు. పావుగంటలో బస్సురానే వచ్చింది. ఆనాడు బస్సు యెందుకు వచ్చిందని డ్రైవర్‌ని అడిగితే 'గోనుపల్లెనుండి బయలుదేరాక దేవుణ్ణి చూడాలనిపించి బస్సు వెనక్కు తిప్పి తీసుకువచ్చాము. స్వామిని తీసుకువెళ్లడానికే భగవంతుడు అలా చేసి వుంటాడు' అన్నాడు. శిరిడిసాయియొక్క మఱొక రూపమైన

శ్రీఅక్కల్కోటస్వామి గూడ ఆలయాలలోని దేవతలను పరుషంగా మాట్లాడి, మందలించి, సకాలంలో వర్షాలు కుఱిపించడం వంటి లోకహితమైన పనులు చేయమని వారిని ఆదేశిస్తుండేవారు. అపుడు ప్రకృతిలో వైపరిత్యాలు తొలగిపోయాయి.

ఒకరోజు స్వామితో దొడ్లా రామిరెడ్డి ' స్వామి, మీ దయవలన కేసు గెలిచాను. గెలిస్తే మీకో గట్టి యిల్లు కట్టించాలనుకున్నాను. ఇల్లు యెలా కట్టించమంటారో చెప్పండి' అని ప్రార్థించాడు. నాకు యిల్లు వద్దుగాని, యిచట ఆంజనేయస్వామి గుడికి ప్రహరి కట్టించు' అన్నారు స్వామి. అతడు సరేనని వెళ్లాడుగాని ఆ విషయమే పట్టించుకోలేదు. స్వామి ఒకరోజు బుజ్జయ్యను, కాటంరెడ్డి సుబ్బారెడ్డిని పిలిచి 'అయ్యా! మీరు రాత్రి 12 గంటలకు కాలినడకన వెళ్లండి. ఆయన ఆంజనేయస్వామి గుడికి ప్రహరీ కట్టిస్తానన్నాడు. ఆ విషయము మాట్లాడిరండి' అని చెప్పారు. అలానే వారిద్దఱూ అర్ధరాత్రి ఆఱుమైళ్లు నడిచి వెళ్లి దొడ్లరామిరెడ్డిని నిద్రలేపి విషయము చెప్పారు. అతడు 'నాకింకా కొన్ని కోర్టు కేసులున్నాయి. అవిగూడా పూర్తయితే కట్టిస్తాను. మిమ్మల్ని స్వామి పంపారుగనుక 400రూ॥ యిస్తాను. మిగిలినది చందాలు దండి కట్టించండి' అన్నాడు. ఆ డబ్బు తీసుకుని తిరిగివచ్చి స్వామికి చెబితే 'ఆయనే వచ్చి కట్టిస్తాడులేయ్యా, మీరు పని మొదలుపెట్టండి' అన్నారు. వారు పని ప్రారంభించిన నాల్గవరోజున రామిరెడ్డి వచ్చి పని చూచి, మిగిలిన పైకం కూడా నేనే పంపుతాను. ఎక్కువమంది మనుష్యులను పెట్టి త్వరగా పని పూర్తిచేయించండి' అని చెప్పి వెళ్లాడు. ఇంతకూ అతడే వచ్చి అన్నీ కట్టించేటపుడు బుజ్జయ్యవాళ్లను కాలినడకన అర్ధరాత్రి పంపించినదెందుకో ఆయనకే తెలియాలి. ఇలానే శ్రీసాయిబాబా నివాసము ఒక శిధిలమైన మశీదు. దానిని మరమ్మత్తు చేయించాలని ఒక భక్తుడు ఱాళ్లు తోలించాడు. కానీ వాటితో శిరిడీలోని ఆలయాలను బాగు చేయించమని సాయి ఆదేశించారు.

ఒకరోజు రక్షకభటులు దొంగను వెతుకుతూ స్వామివారిని అనుమానించి కలువాయి రక్షకభట నిలయమునకు తీసుకువెళ్లి తాళం పెట్టారు. సాయంత్రానికి గ్రామస్థులకు తెలిసి, వాళ్లు సబ్-ఇన్స్పెక్టర్‌ను చీవాట్లుపెట్టి స్వామిగురించి చెప్పారు. అతడు స్వామిని క్షమాపణ కోరి వదిలిపెట్టాడు. స్వామి, 'ఇక్కడైనా బాగనేవున్నదిగదయ్యా! ఇక్కడింకా 6 గంటలు వుండాలనిచెప్పి అంతసేపూ అక్కడే వుండి వచ్చేశారు. మానావమానాలు, సుఖదుఃఖాలు కర్మఫలితమేగాని అర్హతకు సంబంధించినవిగావు, అదే స్వామి బోధ.

అనంతసాగరంలో చడ్డా వెంకటరెడ్డి తరుచుగా స్వామికి ఆతిథ్య మిచ్చేవాడు. ఒకరోజు అతడు స్వామి మీరు మహాత్ము లంటారే! నాకేదైనా నిదర్శనము చూపండి' అన్నాడు. స్వామి సరే కళ్లుమూసుకో అని అతడి తలపై చేతితో తాకి కళ్లు తెరవమన్నారు. చూస్తే కనుచూపుమేరవఱకు ప్రపంచమే లేదు. చెట్లూ, ఇండ్లూ యేమి లేవు. ఎంతదూరం చూసినా లెక్కలేనన్ని నీటిగుంటలు, ప్రతి గుంటలోను మెడ లోతులో స్వామిమాత్రమే

నిల్చొని వున్నారు. వారి తలమాత్రమే కనిపిస్తున్నది. ఆ దృశ్యము చూడలేక 'స్వామి! తమరు దైవస్వరూపులు. మీకు ఆది అంతమూ లేవు, ఈ దృశ్యము భరించలేను. మామూలు దృష్టి ప్రసాదించండి' అని విశ్వరూపము చూచిన అర్జునునిలా వెంకటరెడ్డి వణికిపోతూ అన్నాడు. స్వామి అతని తలపై త్రాకగానే మఱలా మామూలు ప్రపంచమే గోచరించింది.

ఒకసారి బద్వేలు తెప్పమీదుగా వెడుతూ రాజుపాలెం జయరామయ్యతో స్వామి 'ఆకాశంలో వెళుతున్నవారిని చూడయ్యా!'అన్నారు. కానీ అతడికి యెవఱూ కనిపించలేదు. స్వామి అతని కళ్లు త్రాకి మఱలా చూడమన్నారు. ఈసారి అతనికి చాలా పొడవైన మనుష్యులు ఆకాశంలో నడుస్తూ కనిపించారు. స్వామి తిరిగి అతని కళ్లు త్రాకగానే అతనికి ఆ దృశ్యము అంతరించి పరిసరాలు తెలిశాయి. సాయిబాబాను ఒక భక్తుడు వైకుంఠము, కైలాసము వంటి లోకాలు నిజంగా వుంటే తనకు చూపమని కోరినపుడు ఆయన లాగే అతనికి దివ్యదర్శన మిచ్చారు.

ఒకరోజు భక్తురాలు వక్కెమ్మ ఆశ్రమంలో స్వామివారికి యెదురుగా దూరంగా నేలమీద పడుకుని చూస్తున్నది. అకస్మాత్తుగా 20 అడుగుల దూఱంలో మొదట రామలక్ష్మణులు, తర్వాత అదే స్థానంలో శ్రీకృష్ణుడూ దర్శన మిచ్చారు. మఱొకప్పుడు ఆమె ఆంజనేయస్వామి గుడికి వెళ్లినపుడు అక్కడ దేవత లందఱూ సభ చేస్తునట్లు కనిపించింది. మఱోప్పుడు స్వామి ఆమెని పిలిచారు. ఆమె వెళ్లేసరికి స్వామి స్థానంలో కృష్ణుడు నాట్యము చేస్తూ వేణువు వూదుతూ కనిపించాడు. ఆమె ఆనందభాష్పాలు రాలుస్తూ కొంతసేపు దర్శించాక, ఆస్థానంలో మళ్ళీ స్వామియే కనిపించారు. మఱొకరోజు ఆలయంలో ఆంజనేయస్వామి ఆమెకు ప్రత్యక్షంగా దర్శన మిచ్చి, 'మాల వేసి పూజ చేసుకో' అని చెప్పాడు. రామానాయుడు, అతని తల్లీ ఒకరాత్రి మేలుకొనే వున్నారు. అతనికి స్వామి కిరీటము, భుజకీర్తులు ధరించి విష్ణువుగా దర్శనమిచ్చారు.

ఒకరోజు రోశిరెడ్డికి స్వామి చెక్కపలక యిచ్చి, దానిపై యేమున్నదో చూడమన్నారు. అతడికి యేమీ కనిపించలేదు. స్వామి 'బాగా చూడయ్యా' అన్నారు. ఈసారి చూస్తే యిష్టదైవమైన వేంకటేశ్వర్లు, లక్ష్మి, గణపతి విగ్రహాలు స్పష్టంగా కనిపించి మళ్ళీ అదృశ్యమయ్యాయి.

ఒకనాడు గొలగమూడి ఆశ్రమంలో గురువయ్య, స్వామికి దగ్గఱగా చింతచెట్టు దగ్గఱ పడుకున్నాడు. అందఱూ నిద్రపోతున్నారు. కొందఱు దిగంబరులైన ఋషులు వచ్చి స్వామి చుట్టూ వుండి మాట్లాడుతున్నట్లు, అతనికి స్వప్న దర్శనమయ్యింది. అతనికి మెలకువ వచ్చి గుండం సరిచేయపోతే స్వామి 'ఏవయ్యా! యిపుడు లేచావు?' అన్నారు. వెంటనే అతనికి మైకమొచ్చి గుండం దగ్గఱ పడిపోయి ఋషీశ్వరులు వెళ్లేంతవఱకు లేవలేదు.

ఒకసారి కొందఱు భక్తులు తులశవ్వను తమతోగూడ కాశీ రమ్మన్నారు. స్వామిని అడిగితే 'వాళ్లను పోనీ, మనము ఱేపు పోదాం' అని నాలుగురోజులు గడిపేశారు. ఆమె అలిగి అన్నము తినకుండా పడుకుని వుదయము 8 గంటలయినా లేవలేదు. రాత్రంతా తనను స్వామి సాక్షాత్తు యాత్ర చేయించినట్లు దర్శనమైనది. నెల తర్వాత యాత్రకు వెళ్లినవారు తిరిగి వచ్చినపుడు అక్కడ విశేషాలన్నీ ఆమె చక్కగా వివరించింది. అందఱూ ఆశ్చర్యపోయారు.

నెల్లూరులో ఒక ఇన్‌కంటాక్స్ ఆఫీసరుగారి కుక్కకు జబ్బు చేసింది. వారు దానిపై మమకారంతో యెన్ని చికిత్సలు చేయించినా తగ్గకపోయేసరికి కార్‌లో దానిని స్వామి దగ్గఱకు తీసుకువచ్చారు. స్వామి - కుక్క ఒకరినొకరు కొద్దిసేపు చూసుకున్నాక, అది ఆయన పాదాలవద్ద ప్రాణము వదిలింది. సాయి పాదాలవద్ద ఒక పెద్దపులి ప్రాణము విడిచినట్లే!

అలానే ఒకసారి కలువాయి మార్గంలో స్వామి సేవకులు వస్తుంటే చూచిగూడా డ్రైవర్ బస్సు ఆపలేదు. కొద్దిదూఱము వెళ్లి బస్సు అకారణంగా ఆగిపోయింది. స్వామి బృందము బస్సు యెక్కగానే బయలుదేరింది.

మానవుడు తత్త్వతః పరమాత్మ స్వరూపుడే అయినా అజ్ఞానంవలన శరీరమే తానని దానికి కారణమైనవారే తల్లిదండ్రులనీ భ్రమించి, రాగద్వేషాల వలన పుణ్యపాపాలు చేస్తూ ప్రతిఫలము అనుభవించడానికి జన్మచక్రంలో తిరుగుతూంటారు. అట్టివారిలో యే కొద్దిమందో మహాత్ముల సాంగత్యము పొంది వివేక వైరాగ్యములతో అజ్ఞానము పోగొట్టుకొని మహాత్ము లవుతారు. వారి దేహాలను వుపాధిగా చేసుకొని దత్తాత్రేయుడు భూమిపై సంచరిస్తూ జీవులను వుద్ధరిస్తారు. అట్టివారికి జీవుల పూర్వజన్మలు, కర్మఫలమూ తెలుస్తాయి.

స్వామి 1979లో ఇనకుర్తిలోని ప్రాథమిక పాఠశాలవద్ద విడిదిచేశారు. ఒక యానాది స్త్రీ చింకిబట్టలు కట్టుకొని, చేపలబుట్ట తీసుకొని అటుగా పోతున్నది. స్వామి ఆమెను పిలిపించి 'ఆమెకు 10 రూపాయలు యిచ్చి, అన్నం పెట్టి, ఒక చీర యివ్వండి. ఈమె ముందుజన్మలో మైసూరురాజు కోడలు. దానధర్మాలు చేయక యిలా అయ్యింది' అన్నారు.

మఱొకసారి కోడూరి వెంకమ్మతో 'పూర్వము నీవు జింటాలవారి కోడలై పుట్టి బంగారునగలు ధరించి పై చూపుతో వున్నావు. ఒకరోజున కాలు తగిలి జండా విరిగింది. అది 'నీవు మళ్ళీ పుట్టి విధవరాలు వవుతావు ఫో' అని శపించింది. ఆ శాపము లేకుంటే నీకు పెండ్లే లేదు. ఆ శాపంవలన పెండ్లి జరిగి బాల్యంలోనే భర్తపోయాడు. అయినా నిన్ను వదిలిపెట్టను' అన్నారు.

ఒకరోజు మల్లిక వెంకయ్యను చూచి స్వామి 'నా దగ్గఱకు వచ్చేయి' అన్నారు. 'మీ దగ్గఱకు వస్తే భిక్షకు పోవాలి, అది నావల్ల గాదు' అన్నాడు. స్వామి 'అబ్బే అదేమీ లేదు. రామేశ్వరంలో ఒకప్పుడు నేను మేనేజరుగాను, నీవు గుమాస్తాగాను వున్నాము. ఎన్నో జన్మలుగా మనము కలసి వస్తున్నాము. ఈ ప్రాంతంలో నీ బాకీ లన్నీ తీరాయి. నా దగ్గఱకు వచ్చేయ్' అన్నారు. తనకు స్వామి దయ్యాలు పోగొట్టే మంత్రము నేర్పిస్తే వస్తా నన్నాడు. వెంకయ్యస్వామి 'అలాగే చెబుతాను. నీవు మా ముఠాలో వుండి కట్టెలు కొడుతూండు. నీ వెనకాలే వీళ్ళందఱూ వస్తుంటారు' అని చీటీ వ్రాయించారు.

ఇనుకుర్తిలో ఒక వుపాధ్యాయుడి కుమారునికి బుద్ధీ, కాళ్లు, చేతులూ స్వాధీనంలో లేవు. స్వామికి చూపితే, 'ఏమి చేస్తాము? పూర్వజన్మలో పందెపుగుఱ్ఱాలు తోలేవాడు. వాటిని కొట్టిన పాపము అనుభవించాలి గదా!' అన్నారు.

స్వామి దగ్గఱకు వచ్చిన ఒక సన్యాసి మూర్ఛవచ్చి గిరగిరా తిరిగి క్రిందపడే పక్షి వలె పడిపోయేవాడు. స్వామి 'పూర్వము యితడు పక్షులను వేటాడేవాడు, అనుభవించవద్దా!' అన్నారు. నాగులవెల్లటూరులో రెండు బొటనవ్రేళ్లు స్పర్శ తెలియని పిల్లవాని గురించి, 'ఇతడు తమాషాకు వంగలకఱ్ఱతో పిట్టలను కొట్టేవాడు, అనుభవించక తప్పుతుందా?' అన్నారు.

ఒకరోజు ఆశ్రమానికి ఒక యానాది స్త్రీ, ఆమె ముగ్గరు కుమార్తెలూ వచ్చారు. వారికి స్వామి అన్నం పెట్టించారు. విస్తట్లోని అన్నం తల్లికంటే బిడ్డలు ముందు తినేశారు. ఆమెకు మఱలా అన్నం పెట్టించి స్వామి, 'వీళ్లేకాదయ్యా, ఈమెకు యింటిదగ్గఱ యింకా నల్గురు బిడ్డ లున్నారు. పూర్వము యీమె వెంటకగిరి రాజుగారి కోడలు. తన ఏడుగురు దాసీలకూ తిండిపెట్టకుండా యీమె హాయిగా భోజనము చేసింది. ఇపుడు ఆ దాసీలు యీమె బిడ్డలై పుట్టి ఆమెను తిననీయకుండా బాధిస్తున్నారు' అన్నారు.

శ్రీసాయిబాబా లాగే శ్రీవెంకయ్యస్వామికూడా భక్తులను దక్షిణ అడిగి తీసుకునేవారు.

దక్షిణ అంటే శ్రద్ధతోకూడిన సామర్థ్యము, మనలో పనిచేసే ప్రకృతిశక్తులు విశ్వమంతటా పనిచేసే ప్రకృతి ధర్మాలే. ఈ సృష్టి మొత్తాన్ని అలా నడిపించేది దైవశక్తే. ఆ సంగతి మరచి మనము అహంకరిస్తుంటాము. వివేకంతో విషయంగుర్తించి శ్రద్ధతో, 'భగవంతుడే సర్వానికీ యజమాని' అని గుర్తుంచుకోవాలి. దీనినే సాయిబాబా 'అల్లామాలిక్' అని చెప్పారు. ఈ సత్యము మనకు నిస్సంశయంగా సద్గురువు అనుభవమిచ్చినపుడే తెలుస్తుంది. సద్గురువుకు, దైవానికీ మనము సమర్పించే శ్రద్ధాభక్తులే దక్షిణ, ప్రదక్షిణలకు అర్థము.

ఒకరోజు హిందీపండిట్ మస్తాన్‌సాహెబ్ స్వామికి 2 రూపాయలు సమర్పించి నమస్కరించాడు. స్వామి, '26 రూపాయలు రావల్సి యున్నదని ఆయనకు చీటీ వ్రాసివ్వండి' అన్నారు. మూడునెలల తర్వాత అతనికి ప్రభుత్వము రూ॥ 26 అదనపు ఇంక్రిమెంట్ మంజూరు చేసింది.

స్వామి కొంతమందితో 'ఇంత డబ్బు పెడితేగాని మాట రాద'ని చెప్పేవారు. ధనాశాపరులు, లోభులు స్వామికి డబ్బు పిచ్చి అనుకునేవారు. ఒకప్పుడు దక్షిణదేశంనుండి వచ్చిన ఒక రైతు 2 రూపాయలు దక్షిణ పెట్టి ప్రశ్న అడిగాడు. స్వామి తడవకు ఒక్కమాట చెప్పి, మళ్ళీ దక్షిణ పెడితేనేగాని వాక్కు రాదని చెప్పి అతని వద్దనున్న పైకమంతా సమర్పించాకనే తమ ఆశీర్వచనంగా చీటీ వ్రాయించి యిచ్చారు. చివఱకు అతనివద్ద చార్జీలకు డబ్బు లేదని తెలిసి 116 రూపాయలు యిచ్చి పంపారు.

రామయ్యకు వసతిలేక పైరు ఆలస్యంగా పెట్టి, అది బాగా పండితే స్వామికి పట్టుకి తూముడు రాగులు సమర్పించుకుంటానని మొక్కుకున్నాడు. కానీ తాను మొక్కుకున్న దాంట్లో కొంతభాగంమాత్రమే స్వామికి సమర్పించుకున్నాడు. రెండు సంవత్సరాల తర్వాత ఒకసారి స్వామి అతడికి వినబడేటట్లు 'ఆ రాగులు అలానే పోయాయి' అని పదేపదే అన్నారు. అతడు పశ్చాత్తాపంతో ఆ రాగుల ఖరీదు వెంటనే సమర్పించాడు.

మద్దినేని కామాక్షమ్మ చాలాకాలము నడుమునొప్పితో బాధపడింది. స్వామి చెప్పిన పసర్లు వేసినా తగ్గలేదు. ఒకనాడు స్వామి 'ఎల్లుండి నీ బాధ తీసివేసినట్లుపోతుంది' అన్నారు. అటుతర్వాత ఆ బాధే కనిపించలేదు. ఒకరోజు స్వామి 'అమ్మా! వీరరాఘవస్వామి నీ తమ్ముడు. భజన చేసుకో. జబ్బులు రావు, చేపలు తినవద్దు' అన్నారు. వారబ్బాయికి వివాహమైన 10 సంవత్సరాలకుకూడా బిడ్డలు కలుగలేదు. స్వామి నడిగితే 'ముగ్గురు బిడ్డలు పుడతారు. కులంగాని కులంవారు వస్తుంటే ఆపుచేశాను, ఇపుడు వెంకటగిరి కోమట్లను వదులుతున్నాను' అని వ్రాయించి యిచ్చారు. తర్వాత బిడ్డలు పుట్టారుగాని తల్లివద్ద పాలు లేవని స్వామికి చెప్పుకున్నారు. రాత్రి కలలో స్వామి కనిపించి తమ కౌపీనం త్రాడుగా పేని తల్లికి తాకించమన్నారు. తెల్లవారేసరికి పాలుపడ్డాయి.

స్వామి ఒకప్పుడు వేలూరి రామానాయుడిని 15 రోజులు తీర్థయాత్రకు పొమ్మన్నారు. కొన్ని వస్తువులు చెప్పి, 'అవి కొని మొలత్రాడులో కట్టుకో. జబ్బులు నీవు పొమ్మంటే పోతాయి' అన్నారు. యాత్రలో అనేకచోట్ల అనేకమందికి అలా చేస్తే స్వామి చెప్పినట్లే జరిగింది. అతను తిరిగి ఆశ్రమము చేరిన కొద్దిసేపట్లో యెవఱో వచ్చి యెద్దుకు జబ్బు చేసిందని చెప్పారు. రామానాయుడు యెద్దులను సమీపించి జబ్బులను పొమ్మని ఆదేశించారు. కానీ ఆ యెద్దు చనిపోయింది. స్వామిని అడిగితే 'ఇక ఆ వస్తువులు, నీ తూటాలు పనిచేయవు' అన్నారు. అంతవఱకూ అమోఘంగా పనిచేసింది స్వామి ఆశీస్సులే!

స్వామి ఒకరోజు నారాయణయ్యకు తాము మంత్రించిన గుడ్డ యిచ్చి దానితో రోగుల బాధలు నివారించమన్నారు. మొదట అతను అలా చేయగానే వెంటనే తేలూ పాముకాట్లూ కూడా తగ్గిపోయాయి. ఆతర్వాత కొంత బాధ అనుభవించాకగాని తగ్గడము లేదు. అది విని స్వామి 'అయ్యా! లక్ష పాపాలకు ఒక్కసారి తేలు కుడుతుంది. కనుక ఆ బాధను వెంటనే తగ్గిస్తే పైవాళ్లు నీవు లేని సమయంలో మఱలా కుట్టిస్తారు. అపుడు పూర్తిగా అనుభవించవల్సి వస్తుంది. ఇపుడే కొద్దిగా అనుభవిస్తే సరిపోతుందిగదా!' అన్నారు.

ఆత్మజ్ఞానుల దృష్టిలో మనము, మన దృష్టికి మహాత్ములు పిచ్చివారుగా తోచడంలో ఆశ్చర్య మేమీ లేదు. వారిని గుర్తించి లౌకికమైన మేలుమాత్రమే పొందినవారికంటే చక్కగా సేవించగల్గిన వారెంతో ధన్యులు. కారణము వారి ఆదేశాలు కొన్ని మనకు అంతుపట్టనివిగా వుంటాయి.

ఒక్కొక్కసారి తమ సన్నిధిలో వున్న భక్తులలో ఒకరిని స్వామి యింటికి పొమ్మనేవారు. లేక ఒకచోట కూర్చున్నవారిని లేచి మఱొక చోటుకు పొమ్మనేవారు. తలుపూరులో ఒకసారి తమ సేవలకును నలుగురిని తూర్పు వైపు గట్టువఱకూ పొమ్మని ఆదేశించారు. ఇద్దఱు వెళ్లివస్తే వూరుకోలేదు. అప్పుడు నల్గురూ వెళ్లి తూర్పు త్రోవనే వస్తుంటే, 'ఉత్తరపు త్రోవనే రమ్మను' అని కబురుచేశారు. ఆయన ఒక్కొక్కపుడు తమలో తాము బ్రహ్మాండంగా నవ్వుకొనేవారు. ఒకసారి పెంచెలకోనలో యెవఱో రోగి వస్తే అతనికి గురవయ్యను గుడ్డతో మంత్రించమని చెప్పి తర్వాత స్వామి మంత్రించారు.

నెల్లూరులో జనసమ్మర్ధము యెక్కువ గనుక స్వామిని యెక్కడికైనా రిక్షాలో తీసుకుపోయేవారు. కానీ ఒకరోజు యెందుకోగాని ఆయన రిక్షా యెక్కకుండా డోలీలోనే యెక్కి మోయించుకున్నారు. ఆ ముందటిరాత్రి చెప్పకుండా సినిమాకు పోయినందుకు స్వామి తమను శిక్షించారని సేవకులు అనుకున్నారు. వారు స్వామి చెప్పినట్లుగాక మఱొకవిధంగా చేస్తే స్వామి మౌనంగా వుండి ప్రధాన సేవకులకి శాస్తి జరిగేలా చేసేవారు.

స్వామి పెన్నబద్వేలు ప్రాంతంలో వున్నపుడు ఒకామె తన మేకపిల్లను వెతుక్కుంటూ ఆయన వున్న ప్రదేశానికి వచ్చింది. స్వామి ఆమెకు గుండం మధ్యలో కూర్చొని కనిపించారు. స్వామి తప్పక చనిపోయారని ఆమె తలచింది. తెల్లవారి ఏటిదగ్గఱ స్వామి స్నానము చేసి పంచె ఆరబెట్టుకుంటుంటే చూచి ఆమె విస్తుబోయింది.

ఒకనాటి వుదయమే స్వామివారి చేతులూ, కాళ్లూ, కాలి విపరీతంగా బొబ్బలెక్కాయి. అయినా ఆయన ప్రశాంతగా వున్నారు. కారణ మడిగితే 'రాత్రి పైవాళ్లు వచ్చి ద్రావకం పోసిపోయారయ్యా' అన్నారు. ఎక్కువగా కాలిన కుడిభుజానికి వైద్యులు కట్టుకట్టబోతే కట్టించుకోలేదు. భక్తులు బలవంతంగా మందువేసి కట్టుకట్టారు. స్వామి అందఱిని యేమార్చి ఆ కట్లు కత్తితో కోసేశారు. కత్తి తీసుకుంటే వూరుకునేవారుగారు. రెండురాత్రులు

సేవకులు యెలాగో కాపలాకాశారు. మూడవరాత్రి సేవకులకు నిద్రతూగగానే స్వామి కట్టుకోసేసి పుండునుండి కూడా రెండు అంగుళాల కండకోసి ఒక ముంతమీద పడేశారు. గాయంనుండి రక్తము కారింది. తులశమ్మ, వెంకమ్మ ఆ కండను ఒక డబ్బాలో దాచారు. చిత్రంగా దానినుండి వింతైన పరిమళం ఆశ్రమ మంతా వ్యాపించింది. వెంకమ్మ తెలియక ఆ ముక్కను ఒకరికి చూపినప్పటినుండి ఆ పరిమళము అంతరించింది.

అవి స్వామి నడవలేని రోజులు. ఒకరోజు అక్కం వెంకటరామిరెడ్డి గారింట్లో వున్నారు. ఉదయము సుమారు 10 గంటలకు స్వామి తమ స్థానంలో లేరు. ఒక బండిజల్లలో ఒత్తిగిలి పడుకొని వున్నారు. ఆయనకు 12 అంగుళాల పొడుగున ప్రేగు వ్రేలాడుతున్నది. ఒక కాకి దాన్ని పొడుస్తుంటే రక్తము కాఱుతున్నది. దానిని తోలబోతే ఆయన 'అబ్బో! పాపము తీసుకుపోతుంటే తోలేస్తే యెలా' అన్నారు. ఆ దృశ్యము చూడలేక స్వామికి కనిపించకుండా చాటునుండి సేవకులు కాకిని తోలేశారు. కొంతసేపటికి ప్రేగు లోపలికిపోయింది. ఆయనను భక్తులు యెత్తుకురాబోతే ఆయన ఒప్పుకోలేదు. ఆయనే దేకుతూవచ్చి తమ స్థానంలో కూర్చున్నారు.

ఒకసారి స్వామిని బండిమీద తీసుకుపోతున్నారు. ఆయన ధ్యానస్థు లయ్యాక బండి కుదుపుల వలన వారి శరీరము ప్రక్కకు జరిగి, వారి మోకాలు బండి చక్రానికి రాసుకొని రక్తము కాఱుతున్నది. దానిని తుడవ ప్రయత్నిస్తుంటే ఆయన తుడవనివ్వలేదు.

జమిందారు వెంకటరామరాజు తాను తలపెట్టిన యజ్ఞానికి మాధవదాసు వలె నాల్క లేని గంట మ్రోగించగల మహాత్మునికోసం వెతుకుతూ స్వామిగురించి విని మనిషిని పంపాడు. స్వామి చీటీలో జమిందారు జన్మ వృత్తాంతము, జనన తేదీ వ్రాయించి పంపారు. అది చూచి ఆశ్చర్యపడి స్వామిని ఆహ్వానించడానికి భార్యతోసహా వచ్చాడు. సరిగా సమయానికి స్వామి బురదలో దిగి, తలంతా బురదపూసుకొని పిచ్చివారిలా వున్నారు. ఆ రాజదంపతులు బురదలోనే దిగి స్వామికి నమస్కరించి యజ్ఞానికి ఆహ్వానించారు. స్వామి వెళ్లి నాలుకలేని గంటను మ్రోగించారట.

**అద్భుతానంతచర్యాయ నమః**

## శ్రీ అవధూతాయ నమః

## అధ్యాయము - 12

# పా దు క ల పి లు పు

ఒకరోజు పెసల సుబ్బరామయ్య స్వామి సన్నిధికి వచ్చి కూర్చోగానే అతనిని బాధిస్తున్న ఆయాసము వెంటనే తగ్గిపోయింది. అతడు అమితోత్సాహంతో కనబడ్డవారికల్లా ఆ విషయము చెబుతున్నాడు. ఒకరోజు అతడు ఒక్కడే వచ్చి స్వామి చెంతన కూర్చోగానే స్వామి' ఎలా అంటే అలా మాట్లాడుతావేమి' అన్నారు. మఱొక భక్తునితో 'అయ్యా! నాగురించి కథలుకథలుగా చెప్పుకుంటున్నారే, అది తప్పుగదయ్యా?' అన్నారు. కొద్దికాలంలో స్వామి శరీరత్యాగము చెయ్యబోతున్నా రని తోచి, వారి దివ్యలీలలు త్వరగా లోకానికి తెలిపితే వారిని దర్శించుకొనే భాగ్యము అందఱికి కల్గుతుందనీ నాకు బలంగా తోచింది. అందుకని సోదరులు మాకాని వెంకట్రావు, పెసల సుబ్బరామయ్యగార్లను స్వామిగురించిన వివరాలు, భక్తుల అనుభవాలూ సాధ్యమయినంత వఱకు త్వరగా సేకరించమని కోరాను. వారిద్దఱూ ఆ పనిని వెంటనే వుపక్రమించారు. అయితే ఆ విషయము తెలిస్తే స్వామి తమ సహజమయిన నిరాడంబరమువలన అభ్యంతరము చెబుతారని, కనుక వారితో ఆ మాట చెప్పవద్దనీ కూడా కోరాను. వారు అలానే చేస్తున్నారు. కానీ స్వామికి తెలియనిది యేమున్నది? తరచూ ఆయనే 'వీళ్లు అపుడే మూట విప్పి బండ్లకు యెత్తుతున్నారు, వద్దని చెప్పమ్మా' అని తులశవ్వతో అనేవారు.

ఇక్కడ అసలీ గ్రంథరచన శ్రీ శిరిడిసాయిబాబా మఱియు శ్రీ వెంకయ్యస్వామి కలిపి యెలా ప్రేరేపించారో, జరిపించుకున్నారో పూర్వాపరాలతోసహా ప్రస్తావిస్తాను.

నేను ఫిబ్రవరి 8, 1963 న మొదటిసారిగా శిరిడీ దర్శించినపుడు కల్గిన అనుభవంవలన ఆత్మవికాసానికి మహాత్ముల దర్శనము యెంతో అవసర మన్న విశ్వాసము కల్గింది. సజీవులైన మహనీయులను దర్శించి వారి ఆశీస్సులు పొందాలనుకున్నాను. అట్టి భాగ్యము ప్రసాదించమని సకల సాధు స్వరూపు లయిన సాయినాథుని

ప్రార్థించాను. ఆయన అనుగ్రహంవలన యెందఱో మహనీయుల దర్శన ఆశీస్సులు లభించాయి. వీరిలో ఒకరు శ్రీ వెంకయ్యస్వామి.

నేను విద్యానగర్‌లో పనిచేస్తుండగా 1975లో శివరాత్రినాడు వుదయాన్నే పూజ చేసుకున్నాక వెంటనే వీరి దర్శనానికి వెళ్లాలనిపించింది. శ్రీవెంకయ్యస్వామి భక్తుడు, నా విద్యార్థి యైన చి. రామకృష్ణారెడ్డి, 'ఆయన గొలగమూడిలో వున్నారో లేదో తెలుసుకొని వెళ్లడము మంచిది' అన్నాడు. కానీ నేను వుదయము 8.30 గంటలకు సాయికి అగరువత్తి సమర్పించి, 'సాయీ! మీరు సకల సాధు స్వరూపులు. స్వామిరూపంలో గూడా తమ దర్శనానికి వెళుతున్నాను. వారి సన్నిధి ఆశీర్వచనము విశేషంగా లభించాలి' అని ప్రార్థించి బయలుదేరాను. మేము నెల్లూరు చేరి గొలగమూడి బస్సులో యెక్కగానే స్వామివారి తంబుర పట్టుకొని కూర్చొన్న ఒక సాధువును రామకృష్ణ గుర్తుపట్టి విచారించాడు. ఆ సాధువు 'శ్రీస్వామి నాల్గురోజుల క్రిందట నెల్లూరులోని దత్తాత్రేయ మఠానికి వచ్చారు. వారక్కడ పదిరోజులు వుంటామని చెప్పడంతో వారు నిర్వహించే అగ్నిహోత్రానికి భక్తులు కట్టెలుకూడా సిద్ధము చేశారు. కానీ వారీనాటి వుదయము 8.30 తక్షణమే గొలగమూడి బయలుదేరారు. వారి సేవకు లందఱూ తలొక వైపు వెళ్లడంవలన వారిని గుఱ్ఱపుబండిలో పంపవల్సివచ్చింది. ఈపాటికి వారు గొలగమూడి చేరి వుండాలి అన్నాడు. కొద్దిసేపట్లో వారి సన్నిధికి చేరాము.

అపుడు స్వామి గ్రామము వెలుపల ఒక ఆరుబయట ప్రదేశంలో ఒక్కరే కూర్చుని వున్నారు. ప్రక్కనే ధుని బాగా వెలుగుతున్నది. ఆయన నెమ్మదిగా అస్పష్టంగా తమలో తామే యేమేమో గొణుక్కుంటున్నారు. అప్పుడప్పుడు ధునిలోని కట్టెలను సవరిస్తున్నారు. తమ చేతులతో గుండు తడుముకుంటున్నారు. కొద్దిసేపు సాలోచనగా చూస్తూ కూర్చుంటున్నారు. వారి సన్నిధి యెంతో ప్రశాంతంగా వున్నది. మధ్యమధ్యలో మాకేసి చూస్తూ యేమేమో అంటున్నారు. ఇంతలో ఆప్రక్కగా కుటీరంనుండి యెవఱో సేవకు డొచ్చి, 'స్వామి! వాళ్లెవరో క్రొత్తవాళ్లు వచ్చారు. వాళ్ళ కేదైనా చెప్పరాదా?' అన్నాడు. స్వామి సమాధానంగా యేమో గొణిగారు. కానీ మా కర్థం కాలేదు. ఆయ నేమంటున్నారో చెప్ప మంటే ఆ సేవకుడు 'వాళ్లేమీ చెప్పించుకోడానికి రాలే. ఆయన కోరే దేమీ లేదు. చూద్దామని వచ్చారు. కూర్చోని' అని స్వామి అన్నారని చెప్పాడు. మేమిరువురమూ సుమారు 6 గంటలు స్వామి సన్నిధిలో ప్రశాంతంగా గడిపాము. ఆయన మేము సమర్పించుకున్న కొబ్బరికాయ ధునిలో వేయించారు. మేము తీసుకెళ్లిన బిస్కెట్లు పాలలో కలిపి కొంచెము తాను తిని, కొంచెము మా కిప్పించారు. తర్వాత స్వామి యేమో చెప్పాక వాళ్లు మమ్ములను ఆ కుటీరంలోనికి తీసుకొని వెళ్లి భోజనము పెట్టారు. స్వామి ప్రసాదంగూడా లభించిది. మా యిద్దఱినీ, విద్యానగర్ సత్సంగాన్ని యెంతో గొప్పగా ఆశీర్వదించారు. మా యిద్దఱికి యిచ్చిన ఆశీర్వచనము యెవఱికీ వెల్లడి చేయవద్దన్నారు.

అటుతర్వాత స్వామిని అప్పుడప్పుడు దర్శిస్తూవచ్చాను. మా సత్సంగసభ్యులుగూడా స్వామిని దర్శించుకొనేవారు. ఈ సంఘటన నాకు సాయిబాబా పైగల భక్తివిశ్వాసాలను మఱొక్కసారి బలపఱిచింది. పూర్ణదత్తావతారమైన 'శ్రీసాయిబాబా జీవిత చరిత్ర' వారి పూర్వావతారా లయిన శ్రీపాదశ్రీవల్లభులు, శ్రీనృసింహసరస్వతీ స్వాముల చరిత్ర యైన 'శ్రీగురుచరిత్ర' పారాయణ చేస్తుంటే మహాత్ముల దర్శన ఆశీస్సులు తప్పక లభిస్తాయి.

సెప్టెంబరు 30, 1980న స్వామి అకస్మాత్తుగా మాకాని వెంకట్రావుగారితో 'విద్యానగరు బయలు దేరుదామయ్యా' అన్నారట. అపుడు వెంకట్రావుగారు, గురవయ్య, డ్రైవరు మస్తానయ్య స్వామిని కార్‌లో యెక్కించుకొని విద్యానగరు చేరారు. ఆ వివరము మాకాని వెంకట్రావుగారు యిలా వ్రాశారు. 'క్రొత్తచోట యెక్కడయినా ఒక్కరోజులో వెళ్లిపోదామని గొడవచేసే స్వామి విద్యానగరు సాయి మందిరంలో యెన్నడూ యెరుగని ప్రశాంతతో 4 రోజు లున్నారు. తండోపతండాలుగా వచ్చి జనము స్వామిని దర్శనము చేసుకున్నారు. ఆ మందిరంలో 4సార్లు ఆరతి జరిగే సమయాలలో స్వామి యెంతో ప్రశాంతంగా కూర్చొని మెల్లగా చేతులతో తట్టేవారు. సాయితోపాటు తమకు శ్రీభరద్వాజగారు చేతులతో ఆరతి యిస్తే ప్రసన్నంగా స్వీకరించేవారు. శిరిడీనుండి సాయి భక్తుడు తెచ్చిన ప్రసాదాన్ని యివ్వగా సంతోషంగా తీసుకున్నారు. గురువారంనాడు శ్రీభరద్వాజగారు బాబాకు పూజ చేస్తూ, 'ఆసనం సమర్పయామి' అనగానే స్వామి లేచి కూర్చున్నారు. 'నైవేద్యం సమర్పయామి' అనగానే యెన్నడూ జనసమూహంలో ఆహారము తీసుకొనని స్వామి 'ఉడుకునీళ్లు' (అంటే హార్లిక్స్+బిస్కట్లు కలిపిన పొడి) యివ్వండయ్యా' అని అడిగి త్రాగారు. శుక్రవారము సాయంత్రము భరద్వాజగారు శ్రీస్వామి పాదాల సమీపంలో మందారపూలుంచి సత్సంగము చేస్తుండగా స్వామి మందారపూలకేసి నన్ను చూడమన్నారు. స్వామి యెప్పుడూ రంగుపూలు తాకనైనా తాకరని నాకు తెలుసుగనుక వాటిని తీసివేయబోతే 'అయ్యా! ఎక్కడకి తీసుకుపోయేది? ఇక్కడ పెట్టు' అని తమ పాదాలను చూపారు. నాటిరాత్రి 1.52 ని॥లకు స్వామి లేచి కూర్చొని యెంతో సంతోషంగా వుండటము చూచి మేము 'స్వామి! ఈ సాయిబాబా మందిరము బాగున్నదా? ఎన్ని సంవత్సరాలు యిక్కడ పూజలు జరుగుతాయి?' అని అడిగాము. దానికి వారు 'చాలా బాగుంది' అని నాల్గుసార్లు అని కాసేపు మౌనంగా వుండి, 'ఇక్కడ యెల్లకాలము పూజలు జరుగుతాయి. బాగా వుంటుంది' అన్నారు. మేమక్కడకి వచ్చిన రెండవరోజున గురవయ్య స్వామి! యిక వెళ్లిపోదామా? అని అడిగితే వారు 'దారి కనిపించడము లేదయ్యా. వెళితే పైవారు ఒప్పుకోరు. మన మిక్కడ 21 కోట్లు జమ కట్టాలి' అని చెప్పి వుండిపోయారు. శనివారం వుదయము స్వామికి స్నానము చేయించి మందిరంలో పడుకోబెట్టగానే వారు తుండుగుడ్డ నెత్తిపై సాయిబాబా వలె చుట్టుకొని కూర్చొని, 'సాయిబాబా, సాయిబాబా' అని పెద్దగా అంటున్నారు.

శ్రీసూర్యప్రకాశరావుగారు, 'స్వామి మీ కిక్కడ బాగున్నదా?' అని అడిగితే 'అయ్యా! సాలుగా వున్నది' అన్నారు స్వామి. ఆ మందిరంలో సాయిపటము వుంచే వేదికపై స్వామి ధుని వెలిగించి 4 రోజులు నిర్వహించారు. ఆ సాయిబాబా మందిరంలో స్వామి జమచేయవల్సిన 21 కోట్లు యేమిటో యెవఱికి తెలుసు? అంతటి మహనీయులు నిరంతరము చేసే జపసంఖ్యో లేక వారి తపోమహిమో యెవఱికి తెలుసు? శ్రీసాయిబాబా పట్ల వారికి గల ప్రేమ-గౌరవాలకు యింతకంటే నిదర్శనము యేమి కావాలి? ఆ మందిరంలో నిత్యమూ ఆరతి జరిగినప్పుడల్లా వారుగూడ, ఆ సమయంలో కళ్లుమూస్కుని తమ ధోరణిలో తాము వున్నాగూడ, ఆ సమయంలో మాత్రం కళ్లుతెరచి ఆరతికేసి నిశితంగా చూచేవారు. వచ్చిన భక్తులకు చేతితో సైగచేసి సాయిభజన చేయమని సూచించేవారు. ఐదవరోజున స్వామి తిరిగి గొలగమూడి వెళ్లిపోయారు. ఇంతటి అనుగ్రహము నాకు, విద్యానగర్‌లో సత్సంగసభ్యులకు కల్గడానికి కారణము ఒక వంక శ్రీసాయిబాబా పట్ల స్వామికి గల ప్రేమ, గౌరవాలు మఱియు మేమందరము చేసే 'శ్రీగురుచరిత్ర' 'శ్రీసాయిబాబా జీవిత చరిత్ర' పారాయణలే. నాకు తెలియకుండానే సాయిబాబాయొక్క దివ్యప్రేరణ ననుసరించి ఉపోద్ఘాతంలో వివరించిన ఉత్తమ సాధనా సూత్రాన్ని అనుసరించడము జరిగింది. ఆ సూత్రము ప్రకారమే నేను మొదట ఆశ్రయించిన సాయియొక్క అనుగ్రహమే శ్రీఅవధూత వెంకయ్యస్వామి దర్శన ఆశీస్సులు లభించడానికి కారణ మైనది. మఱికొంతమంది సత్సంగసభ్యులు అనుభవంగూడా యిలానే వున్నది.

ఒకరోజు స్వామి ఉదయము 9 గంటలకు యెక్కడికో బయలుదేరి గూడ ప్రయాణము ఆపుకున్నారు. కారణము యెవఱికీ తెలియలేదు. కొద్దిసేపట్లో మా సత్సంగసభ్యుడు శేషాద్రి వారి దర్శనానికి వచ్చాడు.అతడు గొలగమూడి బయలుదేరేముందు తనకు స్వామి దర్శన, ఆశీస్సులు లభింపజేయమని సాయిబాబాను ప్రార్థించాడట. అందుకే అలనాటి మహాత్ము లందఱూ ప్రపంచంలోని సద్గురుకూటమి అంతటికి శ్రీసాయిబాబా సామ్రాట్ అని చెప్పారు. ఆయనను వారంతా 'పెద్దన్నగారు' అని వ్యవహరించేవారు. శ్రీవెంకయ్యస్వామిగూడ మన దేశంలో సాయిబాబాగురించి యెక్కువగా తెలియనిరోజులలో తమ సేవకులతో 'అయ్యా! ఉత్తరాన మన అన్నగా రున్నారు. ఆయనకూడా యెప్పుడూ గుండం వేస్తారు' అని చెప్పేవారట.

మా అత్తగారు, మఱదలు సత్సంగసభ్యులు యెప్పుడూ 'గురుచరిత్ర', 'శ్రీసాయిబాబా జీవిత చరిత్ర' పారాయణ చేస్తుంటారు. వారు ఒకసారి మిట్టమధ్యాహ్నము 3 మైళ్లు నడిచి స్వామిని దర్శించారు. అప్పట్లో ఆయన మౌనంలోవుండి యెవఱినీ తాకనిచ్చేవారుగారు. కానీ కాగితాలపై భక్తులకు వ్రేలుముద్రలు వేసి యిస్తూ త్వరత్వరగా కాగితాలు తమ బొటనవ్రేలు క్రింద వుంచమని వారిని కోరారు. ఆ పనిలో వారి చేయి తగులుతున్నా స్వామి అభ్యంతరమేమి చెప్పలేదు. సాక్షాత్తు దత్తాత్రేయు డైన సాయిబాబా వల్లనే వారికి స్వామివారి

సన్నిధి స్పర్శ ఆశీస్సులు లభించాయి. 'సాయిబాబా జీవితచరిత్ర', 'గురుచరిత్ర' పారాయణ, సత్సంగమూ చేసే భక్తులకు స్వామి అనుగ్రహము తప్పక లభిస్తుంది. ఇలాంటి సత్సంగసభ్యుల అనుభవాలు కొన్నిక్కడ ప్రస్తావిస్తాను.

సూళ్లూరుపేటలో సత్సంగము, పారాయణ చేస్తూ వున్న చిరంజీవి అల్లుభాస్కరరెడ్డికి శ్రీస్వామిని దర్శించాలని సంకల్పము కలిగిందిగాని అవకాశ మింకా కలుగలేదు. వేఱొక పనిమీద 1977లో అతడు నెల్లూరు వీధివెంట వెడుతుండగా, ప్రక్కగా ఒక రిక్షాలో పోతున్న వ్యక్తి ఒక దుకాణంలోని టైలరుతో స్వామి దర్శనానికి వెడుతున్నా నని చెప్పాడు. వెంటనే భాస్కర్ తన నమస్కారాలు స్వామికి చెప్పమని ఆ వ్యక్తితో చెప్పాడు. తర్వాత ఆ చిత్రమైన సంఘటన శ్రీసాయి ప్రేరణయే నని తలచి మధ్యాహ్నము 12.30 గంటలకు గొలగమూడి చేరి స్వామిని దర్శించాడు. స్వామి అతనిని కొద్దిసేపు ఒక ప్రక్కన కూర్చుని మఱలా రమ్మన్నారు. అతడు అచ్చటి భక్తుల చెంతకు వెళ్లి కూర్చోగానే అతడు రావడానికి కొద్దిముందు స్వామి ఆ భక్తులతో 'ఇక్కడికి ఒక బ్రాహ్మణు డొస్తున్నాడు' అన్నారట. అతడు మఱలా స్వామిని దర్శించగానే ఆయన'నీ కొక భక్తుడు కలుస్తాడు. మీ యిద్దఱూ కలసి దేవాలయము పని చేస్తారు' అని చెప్పి; నీకేమి కావాలి? అని పదేపదే అడిగారు. అతడు, 'మీ అనుగ్రహము వుంటే చాలు' అన్నాడు. అపుడు స్వామి తమ సేవకునితో 'నే నితనిని, యితని గ్రామాన్ని కూడా యిదివఱకే అనుగ్రహించాను' అన్నారు. తర్వాత మఱలా అతనితో, 'నీకిదివఱకే గొప్పవారి కృప లభించింది. నీవు మఱల నమస్కరించడము యెందుకు?' అన్నారు స్వామి. గొప్పవారు అని చెప్పినది సాయిబాబాగురించేకదా! సాయిబాబా సమకాలికు లైన మహాత్ము లందఱూ గూడ ఆయనను మహాత్ము లందఱిలోకెల్లా తలమానిక మని కీర్తించారు. ఆయనను ప్రత్యక్ష్యంగా సేవించిన ఒక భక్తుడు వారి మహాసమాధి తర్వాత వేఱొక మహాత్ముని దర్శిస్తే ఆయనగూడ నీవాశ్రయించిన సాయిబాబా పరమగురువు. మేముగూడ ఆయన నాశ్రయిస్తాము అని చెప్పిన వివరము శ్రీసాయి లీలామృతములో చూడవచ్చు.

చిరంజీవి మన్నవ సత్యం యిలా వ్రాస్తున్నాడు. 'శ్రీభరద్వాజగారితో పరిచయము కల్గినమీదట ఆధ్యాత్మికత అంటే యేమిటో అర్థమై నా కుటుంబ పరిస్థితి వలన అశాంతిగా వున్న నా హృదయము శాంతిని పొందింది. సాయిబాబా ధ్యానము, ఆయన చరిత్ర పారాయణ చేస్తూవుండగా బాబా దయవలన అనేకమంది మహాత్ముల ఆశీర్వచనాలు పొందాను. నేను శ్రీవెంకయ్యస్వామివారి దర్శనానికి వెళ్లినపుడు ఆయన నాకు భక్తిమార్గంలో అభివృద్ధి వుందని ఆశీర్వదించారు. రెండవసారి సొదరుడు పి. దామోదరరెడ్డితో కలసి వారి దర్శనానికి వెళ్లాను. అప్పుడాయన మాచేత తమను కొంతదూరము మోయించుకున్నారు. సామాన్యంగా తమ నెవఱూ తాకటానికి అంగీకరించని ఆయన మాచేత స్నానంకూడా చేయించుకున్నారు. మా కోరిక లన్నీ కాగితముమీద వ్రాసుకోమని చెప్పి, వాటిపై తమ ఆశీర్వచనముద్ర వేసి యిచ్చారు.

స్వర్గీయుడు పి. దామోదరరెడ్డి అనసూయమాత అను అవధూతను దర్శించినపుడు కూడా అతనిని ప్రత్యేకంగా ఆమె ఆశీర్వదించారు.

చిరంజీవి సౌభాగ్యవతి కమల యిలా వ్రాసింది : నేను నా మిత్రులతో కలసి స్వామివారిని తలుపూరులో దర్శించి పండు, బిస్కట్లు నైవేద్య మిచ్చాను. శ్రీభరద్వాజ మాస్టరుగారి దగ్గఱనుండి వచ్చా మని చెప్పగానే స్వామి లేచి సర్దుకుని కూర్చొని తంబుర మీటుతూ చీటీ వ్రాయించి, ఆశీర్వదించి యిచ్చారు. వారి సన్నిధిలో రెండు గంటలు ధ్యానము చేసుకొని తిరిగొచ్చినదగ్గఱ్నుండి నా తత్త్వంలో విచిత్రమైన మార్పు వచ్చింది.

చిరంజీవి పెసల సుబ్బరామయ్య యిలా వ్రాస్తున్నాడు : 1977 సంవత్సరంలో పూజ్య మాస్టరుగారిని ప్రథమంగా విద్యానగర్‌లో దర్శించాను. అపుడు మహాత్ములు శ్రీరామభక్తులూ అయిన రంగన్నబాబుగారు గూడా విద్యానగర్ వచ్చియున్నారు. తర్వాత 15 రోజుల కొకసారి విద్యానగర్ వెళ్లి మాస్టరుగారిని చూచి వస్తుండేవాడినిగాని యేమి మాట్లాడేవాడినిగాదు, అడిగేవాడినీగాదు. ఎందుకు వెడుతున్నానో నాకే తెలియదు, వారితో స్నేహము చేయడంలో నాకు ఆనందము. ఆయన రెండు పనులు చేయమని ప్రతీసారి నన్ను హెచ్చరించేవారు. 1. నిత్యమూ బాబా చరిత్ర చదవడము, 2. స్వామివారిని దర్శించడము. నే నీ రెండు పనులు చేసేవాణ్ణిగాదు, చేయ నని చెప్పేవాణ్ణిగాదు. అలా మూడేండ్లు గడిచాయి. తర్వాత మా వూరిలో సత్సంగము మొదలుపెట్టాక అనేకమందికి సాయి యెన్నో అనుభవాలు ప్రసాదించారు. అక్కడ సాయి మందిరము నిర్మణంగూడా ప్రారంభించాము. ఆరోజుల్లో నేను తలుపూరులో ఆఱు మాసా లున్నాను. నేనున్న చోటునుండి ఆ ప్రక్కనున్న స్థలంలో కూర్చొని స్వామి కనిపిస్తుండేవారు, గాని ప్రత్యేకంగా వెళ్లి ఆయనను దర్శించలేదు. తర్వాత నేను కలిచేడులో వుండ నారంభించాక ఒకరోజు వార్ధాలోని గాంధీగారి ఆశ్రమంనుండి ఒక సన్యాసి నావద్ద కొచ్చి తనకు స్వామివారి దర్శనము చేయించ మని కోరాడు. ఆ రూపంలో సకల సాధు స్వరూప మైన దత్తస్వామి నాకు సద్గురు దర్శనము ప్రసాదించదలచారని యిప్పుడు అర్థమౌతోంది. నే నా సాధువును తీసుకువెళ్లేసరికి స్వామి చుట్టూ యెన్నడూ చేరనంత జనము చేరివున్నారు. ఇంతలో స్వామి ఆ సాధువును ప్రత్యేకంగా పిలిపించి ఆశీర్వదించారు. వారు వ్రాయించి యిచ్చిన ఆ చీటీలో ఆ సాధువు యే తేదీన సన్యసించినది, అతని సాధన యెప్పుడు సఫల మయ్యేది గూడా స్పష్టంగా వ్రాయించారుట. చివఱకు, 'నిన్ను ఆ కలిచేడు ఆయన తీసుకువచ్చాడు' అని చెప్పారట. నేను స్వామిని దర్శించుకున్నా వారి రూపంలో సాయి దృష్టి నన్ను గమనిస్తూనే వున్న దని అర్థమైంది. అయినప్పటికీ నాకప్పుడు స్వామిపై విశ్వాస మేర్పడలేదు గాని శ్రీభరద్వాజమాస్టరుగారు వారిగూర్చి చెప్పే మాటలనుబట్టి నా మిత్రులతో వారి గురించి నేనుగూడా ప్రశంసగా చెబుతుండేవాణ్ణి. అప్పుడప్పుడు దర్శించ నారంభించాను.

ఒకప్పుడు శేషగిరావుగారు చెప్పుడు మాటలు విని స్వామిని తక్కువ చేసి మాట్లాడేవారు. అది తగదనీ, స్వామిని పరీక్షించుకోమనీ చెప్పాను. స్వామివారిని యెవఋూ తాకడానికి వీలులేదుగనుక మన మడుగకనే ఆయన మనచేత నూనె పూయించుకోవాలని, ఎవరే మిచ్చినా చేయిచాపని స్వామి మనము తీసుకువెళ్లిన శనగలు, బెల్లము ఆయనే స్వయంగా చేయిచాచి పెట్టించుకుంటే వారు మహాత్ములని నమ్ముతాను' అన్నారు శేషగిరిరావుగారు. మేమిద్దఋమూ స్వామి సన్నిధి చేరి దూరంగా కూర్చొని సాయినామము స్మరిస్తున్నాము. కారణము సాయిచరిత్ర పారాయణ, సాయి నామస్మరణ చేస్తుంటే యెంతటి సిద్ధపురుషుడి నుండైనా మనము అనుగ్రహము పొందవచ్చని 'శ్రీసాయిలీలామృతం'లో చదివాము. వెంటనే స్వామి మావైపు చేయిచాచి, తినడాని కేమయినా పెట్టయ్యా అన్నారు. శనగలు, బెల్లము పొడిచేసి మేము తెచ్చినవి చేయిచాచి పెట్టించుకొని తిన్నారు.

కాళ్లకు కాస్త నూనె పూస్తాయ్యా? అని అడిగి మాచేత నూనె పూయించుకున్నారు. నాటితో నా మిత్రుడుగూడ స్వామి భక్తుడై అప్పుడప్పుడు స్వామి డోలీ మోసేవాడు. శ్రీస్వామికి, సాయికీ భేదము లేదని తెలిసి నేటికీ స్వామివారిని సాయిబాబా అష్టోత్తరంతోనే పూజిస్తూ వారి సమాధివద్దగూడా స్వామి నామాన్నే స్మరిస్తూంటాను.

నేను నిత్యమూ స్వామికి యిడ్లీలు తీసుకెళ్లేవాడిని. ఒకరోజు నేను వెళ్లేసరికి ఒక భక్తుడు సమర్పించిన యిడ్లీ తినేశారు. అయినప్పటికి శ్రీసాయిస్మరణతో నేను సమర్పించుకున్నదిగూడ స్వీకరించి తినేశారు. నేను ఒకసారి స్వామిని దర్శించి మా సత్సంగానికి రమ్మని ఆహ్వానించాను. ఆయన ఇప్పుడుకాదులే చూస్తాను అన్నారు.

1977 సంవత్సరంలో గురుపూర్ణిమనాటికి 'శ్రీసాయిబాబా జీవిత చరిత్ర' పదమూడు పారాయణలు పూర్తిచేశాను. తత్ఫలితంగా గురుపూర్ణిమకు ముందురోజు స్వామి వచ్చి మా యింట్లో ధుని వెలిగించి అందఱినీ ఆశీర్వదించారు. మా ఆతిథ్యంకూడా స్వీకరించారు. గురుపూర్ణిమనాడు పగ లంతా అఖండ నామభజన సోదరుడు శ్రీ టి.శేషగిరిరావు యింట్లో జరుగుతుండగా స్వామిగూడ కొంతసేపు భక్తులకు తమ సన్నిధి ప్రసాదించి భక్తుల నానందింపజేశారు. ఎప్పుడూ యెవఱింటికి వెళ్లని స్వామి సత్సంగం జరుగుతున్న ఆ సోదర భక్తుని యింటికి వచ్చి వారి ఆతిథ్యము స్వీకరించడము సాయి కృపకు నిదర్శనము. మహాత్ము లెలా వుంటారో ప్రత్యక్షంగా చూచి సేవించే భాగ్యము కలిగింది. ఇంతటి మహత్తర ఆనందము ప్రసాదించగల యీ సద్గ్రంథపఠన, సత్సంగాల విలువ యెంతటి దని చెప్పగలము? ఈవిధంగా స్వామి రూపంలో నాకు సాయినాథుడే లభించాడు.

జూన్ 20, 1974లో తలుపూరులోని నారాయణదాసు ఆశ్రమంలో స్వామివారు చాలా బలహీనంగా వున్నారు. ఆయన యెక్కువరోజులు జీవించరని దేవుళ్ల వెంకటయ్య మనసులో అనుకున్నాడు. వెంటనే స్వామి

'అయ్యా! నేను అపుడే పోనే! 8 సంవత్సరముల 2, నెలల, 4రోజులవఱకూ వుండద్దా?' అన్నారు. సరిగా అంతకాలానికే స్వామి సమాధి చెందారు.

ఆరోజులలో స్వామివారి కుటీరంలోని అన్ని పటాలకు పూజ చేసి తర్వాత స్వామివారికి ఆరతి యిచ్చి, తర్వాత అన్ని పటాలకూ ఆరతి యివ్వడము బుజ్జయ్య అలవాటు. ఒకప్పుడు స్వామి 'ముమ్మిడివరం బాలయోగి తన పని తాను చూచుకొని పోయేవాడేనయ్యా! మనము అందఱి పనీ చేస్తుండ్లా?' అన్నారు. మఱొకపుడు గురవయ్యతో 'అయ్యా! వీరబ్రహ్మంగారిలా నేను గుంట త్రవ్వించుకొని చాటున కూర్చోను. అందఱికి అన్ని యేర్పాట్లు చేసిపోతాను' అన్నారు. కానీ వారి నోటివెంట ఆ మాట యెందుకు వచ్చినట్లు? వారిలో వృద్ధాప్య చిహ్నాలు ప్రకట మవుతుంటే సేవకులకు కూడా యిలాంటి ఆలోచనలే రాసాగాయి.

ఒకరు స్వామి! మీరుపోతే మాకు దిక్కెవ్వఱు? అని అంటే 'అయ్యా! పోయేదెక్కడికి? సూర్యచంద్రులున్నంతవఱకూ వుండేదేకదయ్యా' అన్నారు స్వామి. ఇంకొకరు మీరు సమాధి అయితే మేము యిండ్లకు పోకుండా భిక్షతో జీవిస్తూ తమ సమాధి దగ్గఱే వుంటాము అన్నాడు. అప్పుడాయన 'అలా పనిలేదయ్యా. మీరు అడవిలో కూర్చున్నా అన్నము వచ్చేటట్లు వ్రాసుకోండి' అన్నారు. మఱొకప్పుడు సేవకులతో ఆయన 'ఇపుడు యెవఱు యే పని చేసుకుంటున్నారో యికముందుకూడా ఆ పనులే చేసుకోండి. ఆ పనులలో నేను వున్నాను' అన్నారు. అటుతర్వాత ఆశ్రమము యెలా కొనసాగుతుందని భక్తులు ఆలోచిస్తున్నారు కాబోలు స్వామి ఒకరోజు 'నేను చాటుకుపోయిన 3 సంవత్సరములకు రంగనాయకుల గరుడసేవ లాగా యిక్కడ కూడా జరుగుతుందయ్యా' అన్నారు. మఱొకప్పుడు ఒకరు 'స్వామి! మీరు సమాధి అయితే మే మెక్కడికి పోవాలి? అంటే ఆయన 'ఎక్కడకూ పోనవసరంలేదయ్యా. నా సమాధి దగ్గఱ కూర్చున్నా అంతా నేను వున్నట్లు జరుగుతుంది' అన్నారు.

మహాసమాధికి ఒక సంవత్సరానికి ముందే 'చెప్పులయ్యా, చెప్పులు' అని పదేపదే అడిగేవారు. అందుకు బదులు చెక్కపలకలు వగైరా యిస్తే 'ఇవిగావు, అసలు చెప్పులు కావాలయ్యా' అన్నారు. ఒకరోజు రోశిరెడ్డి కుమారుడు స్వామికి పావుకోళ్లు చేయించి తెస్తున్నాడు. ఆశ్రమంలో స్వామి, 'చెప్పులు, చెప్పులు' అని అరుస్తున్నారు. అతడు పాదుకలు తేగానే స్వామి వాటిని గట్టిగా కౌగలించుకొని చాలాసేపు యెవ్వఱికి యివ్వలేదు. గుండెలకేసి యెంతో ప్రేమగా అదుముకున్నారు. పవిత్రమైన ఆ పాదుకలే స్వామి నిర్యాణము చెందిన పూరిపాకలో నేడు ప్రతిష్ఠించబడినాయి. కానీ ఆయన భావ మేదో యెవఱికి తెలుసు? అది తెలిసేదాక స్వామి తత్త్వమేదో, ఆయనను సేవించవల్సిన పద్ధతేదో తెలిసే దెలా?

పాదుకలు శ్రీదత్తాత్రేయ సాంప్రదాయంలో మాత్రమే అత్యంత ప్రధాన మయినవి. మహారాష్ట్రదేశంలో యెక్కడ చూచినా దత్తపాదుకలకే ప్రాముఖ్య మున్నది. దత్తావతారమైన శ్రీనృసింహసరస్వతీస్వామి గుప్తంగా నివసించిన నర్సోబావాడిలో దత్తపాదుకలు వాటికై అవే ప్రకటమయినాయి. వారి ముఖ్య అవతారక్షేత్రమయిన గాణ్గాపురంలో వారు తమ పాదుకలను తమ ప్రతిరూపాలుగా మఠంలో ప్రతిష్ఠించారు. మఱల వారు అంతర్ధాన మయ్యేముందు శ్రీశైలం వద్ద నున్న అక్కమహాదేవి గుహలవద్దకూడ దత్తపాదుకలు ప్రతిష్ఠించారు. నాల్గవ దత్తావతార మైన శ్రీఅక్కల్కోటస్వామి అనుగ్రహపాత్రు లైన తమ శిష్యులకు తమ పాదుకలే ప్రసాదంగా యిచ్చేవారు. ఆ పాదుకలు సాక్షాత్తు శ్రీదత్తాత్రేయుని ప్రత్యక్షరూపాలు. పూర్ణదత్తావతార మైన శ్రీసాయిబాబా తమ పాదుకలకు నమస్కరిస్తున్న ఒక భక్తునితో 'ఈ పాదాలు ఆద్యంత రహితాలు, పరమపవిత్ర మయినవి, వీటిని ఆశ్రయిస్తే తప్పక గమ్యము చేరుతావు' అని చెప్పారు. అందుకే శిరిడీలో వారి మొదటి నివాస మైన వేపచెట్టు క్రింద, సుమారు 60 సంవత్సరములు వారి నివాస మయిన ద్వారకామాయి మశీదులోను, వారి చిత్రపటంతోపాటు వారి పాదుకలనుకూడా ప్రతిష్ఠించారు. దత్తక్షేత్రా లన్నింటిలో ప్రతిగురువారం దత్తపాదుకలనే పల్లకిలో పెట్టి వూరేగిస్తారు. శ్రీస్వామి ఆరోజులలో కేకలు వేసినది ఆ పాదుకలగురించే. వారిదికూడా గురుసాంప్రదాయమే. గనుక విశ్వగురు డయిన దత్తాత్రేయుని ప్రతిరూపా లైన పాదుకలు ఆయనకు అంత ప్రీతిపాత్రములు అయినాయి. అందుకే ఆయన వాటిని అంతసేపు కౌగలించుకొని తమ హృదయానికి హత్తుకుని చాలాసేపు యెవఱికి యివ్వలేదు. ఆయన అలా అడిగినది అంత ప్రీతితో హృదయానికి హత్తుకున్నదీ మఱొ వస్తువు యేమైనా వున్నదా? తమది దత్తసాంప్రదాయ మనీ, అదే వారి భక్తు లయిన మనకుకూడా తప్పక ఆశ్రయించవల్సినది అనీ ఆయన యీ రీతిన తెలిపారు. మన మాశ్రయించకుంటే వారేమి చేస్తారు? పోయేవారిని పోనిచ్చేదేగదయ్యా! అనేదేగదా వారి మూలసూత్రము. సాయిబాబాగురించి వారు తమ అన్నగారని ఆయన అంత ప్రేమతో యెందుకు చెప్పేవారో! అందుకే వారికి ఆ పాదుకల యందు అంత ప్రీతి.

మహాసమాధికి ముందురోజులలో స్వామి, 'ప్రొద్దుగుంకుతున్నదయ్యా!' అని పదేపదే అరిచేవారు. మనలను యిళ్లు చక్కబెట్టుకో మనే వారి హెచ్చరిక. ఒక వంక భౌతికమైన వారి దివ్యసన్నిధి అంతరించి పోతున్న దని, మఱొకవంక మన ఆయుష్యంగూడ క్షీణిస్తున్నదని వారు హెచ్చరించారు. ఒకసారి ఆయన తమ దుప్పట్లు, గుడ్డలూ అన్నీ లెక్కపెట్టి గురవయ్యకు యిచ్చి, 'ఇవన్నీ జాగ్రత్తగా దాచిపెట్టవయ్యా' అన్నారు. ఆశ్రమంలో 1980లో సమాధి మందిరము కట్టేందుకు యిటుకల లారీ వచ్చింది. ఆరోజు స్వామి అందఱినీ యిప్పటి సమాధి మందిరము ప్రాంతంలోనే పడుకోమన్నారు. 'అయ్యా! పెంచెలకొండంత మసీదు పడుతుందయ్యా!' అన్నారు. వారు పాదుకలగురించి సూచించిన భావ మేదో తెలిస్తేగాని యీ మాటలు

అర్థంకావు. మన సంప్రదాయంలోగాని, ఇస్లాం సంప్రదాయంలోగాని మహాత్ముని సమాధిని, మసీదు అని వ్యవహరించనే వ్యవహరించరు. మన దేశమంతా ప్రఖ్యాతయిన మసీదు అనబడే మందిరము శిరిడీలో మాత్రమే వున్నది. అది ముస్లింలకు మసీదేకాక, హిందువులకు పూర్ణదత్తావతారమయిన సద్గురువు శిరిడీసాయి నివాసంగూడా అందులోనే. సాయి యెదుట నిరతాగ్నిహోత్ర మున్నది. సాయి దత్తాత్రేయుడే! వారిదిగూడా గురుపాదుకా సంప్రదాయమే! వారు శ్రీవెంకయ్యస్వామికి పెద్దన్నగారు. సకల సాధు స్వరూపమయిన సాయినాథుని రూపాలలో స్వామికూడా ఒకరని, వారిద్దరికి ప్రత్యేకమయిన అనుబంధము వున్న దనీ యెందఱి భక్తుల అనుభవాలో తెలుపుతున్నాయి.

అందుకే స్వామి సమాధి మందిర నిర్మాణము, మహాసమాధి అయ్యాక యెవఱి ప్రేరణ లేకనే ఆశ్రమ నిర్వాహకులు స్వామి ప్రేరణవలన మాత్రమే ఆ మందిరంలో స్వామిపటంతోపాటు సాయిపటంకూడా ప్రతిష్ఠించుకున్నారు. అంటే అది తమ నివాసమేగాక శ్రీసాయిబాబా నివాసమయిన మసీదు కూడా యని స్వామి స్పష్టంగా చెప్పారు. ఈ మూడు లీలలూ తమ సమాధి ప్రాంగణంలో దత్తపాదుకలు, శ్రీశిరిడిసాయిబాబా మూర్తి ప్రతిష్ఠకూడా జరగాలని స్వామి అభీష్ట మనీ నిస్సంకోచంగా సూచిస్తాయి. సాయి సేవకుడ నైన నాచేతనే స్వామికూడా తమ చరిత్ర రచన చేయించుకోవడము, సాయి భక్తుడైన పెసల సుబ్బరామయ్యచేత దీనికి కావల్సిన విశేషాలు, లీలలు సేకరించేలా చేయడమూ, అతనిని తమ సన్నిధిలో నిలుపుకోవడంకూడ దీనినే సూచిస్తున్నది. సాయికీ, వీరికీగల యిట్టి ప్రత్యేకమయిన అనుబంధము వీరిద్దఱికీ గల పోలికలలోగూడ స్పష్టమవుతుంది. అంతేగాక సాయి వలె యీయనగూడ తమ మహాసమాధికి కొద్దికాలం ముందు, 'అన్ని జీవులలోనూ వెంకయ్య వున్నాడని వ్రాసుకో' అని చెప్పి చీటీ వ్రాయించారుకూడ. కాకుంటే వారు తమ అంత్యదశలో యి సత్యం వాచా ప్రకటించారు. వీరి అన్నగారయిన సాయిబాబా భౌతికంగా మన మధ్య జీవించియున్నంత కాలమూ, అటుతర్వాతగూడా ప్రత్యక్ష్యంగా అనుభవ మిచ్చారు. అన్ని జీవులలోనూ వున్న వస్తువు ఒక్కటిమాత్రమే కాగలదుగాని అనేక మవజాలదుకదా! కనుక సాయి, స్వామి వేఱు గాదు. ఆ రెండు రూపాలు శ్రీదత్తస్వామియొక్క రెండు పాదుకలే. ఆ రెండు పాదుకలనూ తమ భక్తు లందఱూ తమ హృదయానికి హత్తుకోవాలని, తమ హృదయంలో ప్రతిష్ఠించుకోవాలనీ తెల్పడానికే అలనాడు ఆ స్వామి ఆ పాదుకలను హృదయానికి హత్తుకున్నారు. అంతకాలము వాటికోసము కలలు గన్నారు. ఎలుగెత్తి పిలిచారు.

మహాసమాధికి రెండునెలల ముందు ఆయాసంతో చాలా బలహీనంగా వుండి, నేను వెళ్లిపోతున్నాను అని చీటీ వ్రాయించారు. స్వామి స్పృహ లేకుండా వుండేసరికి ఆయన శరీరం చాలిస్తున్నా రని అందఱూ తలచారుగూడ. కానీ కొన్ని గంటల తర్వాత ఆయన తిరిగి లేచి కూర్చుని పైవాళ్లు ఒప్పుకోలేదయ్యా. ఇంకా

కొంతకాలము వుండి రమ్మన్నారు అని చెప్పారు. ఈ విషయంలోకూడా ఆయన తమ అన్నగారి అడుగుజాడల్లో నడిచారు. ఆయనకూడా 1886లో ఒకరోజున 72 గంటలు తమ శరీరము త్యజించారు. అటుతర్వాత మఱలా లేచి తాము మహాసమాధి చెందడానికి భగవంతుడు అనుమతించలేదని చెప్పారు.

ఇక వారంరోజులలో స్వామి సమాధి చెందబోతా రనగా వారి ముఖంలో రోజురోజుకు కళ తగ్గుతూవచ్చింది. ఆగష్టు 20, 1982న ఒక దివ్యమయిన రథము వచ్చి స్వామిని యెక్కించుకొని వెళ్లినట్లు సేవకుడు గురవయ్యకు దర్శన మయ్యింది. స్వామి ఎప్పుడూ పడుకునే కుటీరంలో వారి వెనుక కొన్ని దేవతల పటాలతోపాటు సాయిబాబా పట ముండేది. నిర్మాణము పూర్తయిన సమాధి మందిరంలో స్వామి పట ముండేది. ఆరోజున సమాధి మందిరంలో వున్న స్వామి పటము వచ్చి కుటీరంలో నున్న సాయి పటము ప్రక్కన నిలుచున్నట్లు సేవకుడు గురవయ్యకు దర్శన మయ్యింది. సాయిబాబా లాగా స్వామికూడా చాటయిపోతున్నారు. ఇంక వారి పటానికే పూజ చేసుకోవాలి కాబోలు అనుకున్నాడు గురవయ్య. మూడరోజుల తర్వాత అదే నిజమయ్యింది.

అంతవఱకూ స్వామి నివసిస్తున్న పాకలోని అన్ని పటాలకు పూజ చేసి; స్వామివారికి - తర్వాత అచ్చటి పటాలకూ ఆరతివ్వడము బుజ్జయ్యగారికి అలవాటు. ఆగష్టు 24, 1982 మధ్యాహ్నము స్వామి ఒక ప్రక్కకు తిరిగి పడుకున్నారు. బుజ్జయ్య ఆరతి యిస్తుంటే చటుక్కున బుజ్జయ్య వైపుకు తిరిగి, కుడిచేత్తో ఆరతి అందుకొని తిరిగి పడుకున్నారు స్వామి. వారు శరీరంతో వుండగా వారికి భక్తు లిచ్చిన చివరి ఆరతి యిదే. కొద్దిసేపట్లో అంటే ఆగష్టు 24, 1982 న మహాసమాధి చెందారు. కానీ ఆయన మాటలు అర్థము చేసుకున్నది యెవఱు? ఆయన యోగనిష్ఠలో వున్నాడని తలచి భక్తులు మఱియు సేవకులు యెంతో ఓపికగా చూశారు. అలా 3 రోజులు గడిచాయి. శరీరము యెంతగానో వుబ్బిపోయింది. గురవయ్యకు ఆవేశము వచ్చి 'స్వామి తమ దేహాన్ని ఈరోజు సమాధి చేయమంటున్నారు' అని ఒక్కడే ఆ దేహాన్ని మోసుకుని పరుగున సమాధి మందిరానికి వచ్చాడు. స్వామి మహాత్ములు కదా; వారి శరీరము వుబ్బడము యేమిటి? అని కొందఱు అనుకున్నారు. దేహాన్ని సమాధిలో దించేసరికి గురవయ్య తెస్తుండగా స్వామి భుజానికి ముల్లు గీసుకున్న చోటునుండి రక్తము కారింది. అది చూచి అందఱూ ఆశ్చర్యపోయారు.

శ్రీవెంకయ్యస్వామి ఆగష్టు 24, 1982 సాయంత్రము 4 గంటలకు సమాధి చెందారు. ఆ వార్త జాబుల ద్వారా అందఱికి తెలిసి వారి దేహాన్ని ఐదవరోజున అనగా 28.08.1982న సమాధి చేస్తారని ముఖ్య మైన దినపత్రికలలో ప్రకటించారు. జనము తండోపతండాలుగా దర్శనానికి వస్తున్నారు. అపుడు ఆశ్రమానికి

ఆర్థికస్తోమత లేనందున ఆ గ్రామస్థులే రోజుకొకరు చొప్పున జనానికి సంతర్పణ చేయించారు. నిరంతరమూ 'హరేరామ హరేకృష్ణ' అనే నామసంకీర్తన చేస్తూవున్నారు.

మూడవరోజున సాయంకాలము గురవయ్య ఆవేశంతో స్వామి దేహాన్ని సమాధి మందిరానికి యెత్తుకొని పరుగున వచ్చాడు. భక్తు లతని మాటలు నమ్మక స్వామి దగ్గఱ చీట్లు వేస్తే వెంటనే సమాధి చేయించమని సందేశ మొచ్చింది. వెంటనే బస్తాలతో కర్పూరము, ఉప్పు తెప్పించారు. భక్తులు లెక్కలేనన్ని అత్తురు, పన్నీరుబుడ్లు, పూలమాలలు, పట్టువస్త్రములు సమర్పించారు. సమాధి మందిరంలో 46 అడుగుల పొడవూ, నాలుగు అడుగుల వెడల్పూ, 6 అడుగుల లోతూ గల గుంట త్రవ్వించారు. అందులో స్వామివారి పరుపూ, దిండూ పెట్టి దానిపై స్వామివారిని తూర్పుముఖంగా కూర్చోబెట్టారు. వారిపై పట్టువస్త్రము కప్పి, మిగిలినచోటంతా గంధపు పొడి, కర్పూరము, ఉప్పు, పూలమాలలూ మట్టితో నింపారు. ఆపైన నాపఱాళ్లతో గుంటను మూసివేశారు. దానిమీద స్వామి వాడుకొను దుప్పట్లు, మట్టిముంతా వుంచి వాటిపై యిటుకలతో అరుగు నిర్మించి, దానిపైన పాలఱాళ్లతో కప్పించారు.

ఆ గ్రామంవారు తమకై తామే 40వ రోజున మండలారాధన వఱకూ వచ్చేవారందఱికీ అన్నదానము చేస్తూనే వున్నారు. ఆ ఒక్కరోజునే 10,000 మంది పైనే భక్తులు వచ్చారు. స్వాములు, హరిదాసులు వారికైవారే వచ్చి అఖండనామ సంకీర్తన, భగవద్గీతా ప్రవచనములు చేశారు. నాటినుండి నిత్యమూ 9 గంటలకు భజన, మధ్యాహ్నము 12 గంటలకు, తిరిగి రాత్రి 7గంటలకు నిత్యాన్నదానము జరుగుతున్నాయి. వెనుక స్వామివారు వెలిగించిన ధునిని అలానే కొనసాగిస్తున్నారు. కారణము తామెల్లప్పుడూ దాని రూపంలో వుంటా మని స్వామి యెందఱికో దివ్యదర్శన మిచ్చారు. ఆ ధుని శిరిడీలోని ధుని వలె స్వామియొక్క గురువుగారి రూపంకూడాను. ఈ వివరాలన్నీ ప్రత్యక్షంగా అక్కడ చూచిన బరిగెల నాగయ్యగారు చెప్పారు.

సామాన్యంగా మహాత్ముల చరిత్రలు రెండువిధాలుగా వుంటాయి. కొందఱు భౌతికంగా జీవించి యున్నంతకాలము వారి దివ్యలీలలు యెంతగానో ప్రకట మౌతాయిగాని, వారు పరమపదించాక క్రమంగా గుప్తమవుతాయి. ఎన్నో ప్రఖ్యాత మహాత్ముల స్థానాలు అటుతర్వాత క్రమంగా నిర్మానుష్య మవడము చూడవచ్చు. మఱికొందరు మహాత్ములు భౌతికంగా జీవించినంతకాలము వారి దివ్యశక్తి అంతగా ప్రకటమవ్వక వారు పరమపదించాక మాత్రమే విజృంభిస్తాయి. శ్రీవెంకయ్యస్వామి చరిత్ర యీ రెండవకోవకు చెందినది. చాలాకాలము స్వామి దర్శనానికి బహుకొద్దిమందిమాత్రమే, అదికూడా సమస్యలు యేవైనా యెదురైనపుడు మాత్రమే వచ్చి వెళ్లేవారు. చివఱిదశలో క్రమంగా సంధ్యాకాలానికి పక్షులు చెట్లను ఆశ్రయించినట్లు స్వామి చెంతకు

యింకొద్దిమంది రాసాగారు. వీరికి కల్గిన అనుభవాలలోకూడా స్వామికి మఱియు సాయిబాబాకు గల ప్రత్యేక అనుబంధము వెల్లడి అవుతూనేవున్నది.

తాళ్ళూరి శ్రీనివాసులకు 1986 లో ఒకరాత్రి చిత్రమైన కల వచ్చింది. మహమ్మద్ రఫీగారి గానకచేరీలో, పరమపదించిన మన దేశ ప్రధానులు, అధ్యక్షులు, ప్రజానాయకుల మధ్యలో గాంధీజీకూడా కూర్చున్నారు. ఆయన ముఖంమాత్రం స్వామివారి ముఖంలాగా వున్నది. వారు స్వామే నని తలచి శ్రీనివాసులు నమస్కరించారు. ఆయన లేచి అతని దగ్గఱకు వచ్చి, 'ఇక్కడికి యెందుకు వచ్చావు? వెళ్లిపో' అన్నాడు. అతడు నేను వెంకయ్యస్వామి భక్తుడిని. గొలగమూడి పోయివస్తుంటాను అన్నాడు. ఆయన 'ఈ విషయము ఇంతకుముందు రెండుసార్లు చెప్పావుగదా? నాకు తెలుసు' అంటూ శిరిడీసాయిబాబావారి పాకెట్ సైజ్ ఫోటోలు 5 అతని చేతిలో వుంచి అక్కడినుండి పంపివేశారు. అతనికి వెంటనే మెలకువ వచ్చింది. దాని భావ మేమో వెంటనే అర్థంకాలేదు. కరెంట్‌షాక్ కొట్టి కేవలము స్వామిగార్ల కృపవలనమాత్రమే బ్రతికి బయటపడ్డాడు. కలలో ఫోటోలు యిచ్చినది స్వామి. ఆయ నిచ్చిన శిరిడిసాయి ఫోటోలు 5 పంచప్రాణాలు. వారి భక్తులు అన్నగారైన సాయిబాబానుకూడా ఆరాధించాలని వారి భావము.

పి. మాధవరావు కష్టాలలో మనశ్శాంతి లేక కనకదుర్గమ్మను పూజిస్తే ఆమె దర్శన మిచ్చింది. కానీ ఆయనకి శాంతి కలుగలేదు. ఆమె దయవలన వెంకయ్యస్వామివారి చరిత్ర దొరికింది. అది పారాయణ చేశాక శాంతి కలిగింది. తర్వాత స్వామివారి మూడవ ఆరాధనోత్సవం రోజున సమాధినుండి నడుంవఱకూ స్వామి దర్శన మిచ్చి, 'ఇక్కడేమి చూస్తావు? అందఱిలో నన్ను చూడు' అన్నారు. కొంతకాలానికి అతనికి గుండెజబ్బు వచ్చింది. మందులు పనిచేయలేదు. దానిని తగ్గించి తన సమయము ధ్యానంలో గడిచేలా చేయమని స్వామి సమాధివద్ద ప్రార్థించాడు. ఇల్లు చేరాక 15 రోజులు అతనికి రక్తవిరేచనాలయి గుండెనొప్పి తగ్గిపోయింది. ఒకసారి కలలో లక్ష్మినారాయణుని దర్శనంకూడా అయ్యింది. ఆగష్టు 1985లో ఒకరాత్రి సాయిబాబా కలలో కనిపించి, గదిలోపల శుభ్రంగా వున్నది, పైన బూజు వున్నది, శుభ్రము చేస్తే గదిలోకి వస్తాను' అన్నారు. అప్పటినుండి అతడు ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతంగా జీవిస్తున్నాడు.

వైద్యులు సుధాకర్‌కు విపరీతమైన రక్తపోటు వుండేది. ఆయన పక్షవాతం వంటి ప్రమాదకర మైన జబ్బు చేస్తుందని జీవితాంతము ఉప్పు, కారము తినకుండా మందు తీసుకుంటూ వుండాలని వైద్యులు చెప్పారు. అట్టి పరిస్థితులలోనే అతడు సాయిబాబా జీవితచరిత్ర, శ్రీగురుచరిత్ర, అవధూతలీల చదివి స్వామి సమాధిని దర్శించి అచ్చట నిద్రచేశాడు. నాటిరాత్రి అతనికి ఒక మిత్రుని యింట్లో ఒక సాధువుకు తీర్థ మిచ్చినట్లు

కల వచ్చింది. తెల్లవారుఝామున నిద్రలేచి వెడుతుంటే ఇతనికి, ఇతని భార్యకు ఆకాశంలో పడమర వైపున ఎఱ్ఱని కాంతిపుంజము దర్శన మిచ్చింది. నాటినుండి క్రమేణా అతనికి ఆరోగ్యము చేకూరింది.

జి.వి రమణమూర్తి శ్రీసాయిబాబా జీవితచరిత్ర పారాయణ చేసి యెన్నో దివ్యానుభవాలతోపాటు సాయిబాబాకు, స్వామికి భేదము లేదన్న అనుభవాలుకూడా పొందాడు. అతడికి ఒక సమస్యగూర్చి సందేశము అవధూతలీల తెరవగానే లభించడంతో ఆ గ్రంథము పారాయణ చేశాడు. తర్వాత అతనికి గల గ్రహబాధ తొలగించుకోడానికి జొన్నవాడ వెళ్లాడు. నాటిరాత్రి కామాక్షమ్మ, మల్లిఖార్జునుడు స్వప్నంలో మంత్రోపదేశము చేసి, అన్నీ చక్కబడతా యని చెప్పారు. మెలకువ రాగానే నీవు 3 రోజులు నా దగ్గఱ వుండాలయ్యా అని స్పష్టంగా వినిపించింది. అతడు గొలగమూడి దర్శించాడు. నాటిరాత్రి 10 గంటలకు అతని కాళ్లవద్ద శిరిడిసాయి, వెంకయ్యస్వామి చెరోవైపూ నిలబడి అతని వైపు చూస్తూ 'రా బయటకు' అన్నారు. అతనిలోనుండి ఆకుపచ్చని చీర ధరించి, రవికలేని ఒక వికటరూపిణి బయటకు వచ్చి, 'ఇతనిని విడిచి యెక్కడకు పోగలను? ఇంకెవరి నైనా చూపండి పోతాను' అన్నది. వెంటనే సాయిబాబా చేతిలోని సటకాను స్వామి తీసుకుని ఆమె మెడమీద పెట్టి నెట్టారు. ఆమె కరెంటు సోకినట్లుగా అరచిపోయింది. నాటితో అతడి గ్రహబాధ తొలగిపోయింది. తర్వాత అతడు తన టీకొట్టు అమ్మాలనుకుంటుంటే సాయి కలలో కనిపించి, అమ్మేస్తే యేమి తినాలనుకుంటున్నావు? అన్నారు. అతడు వినకుండా కొట్టు మూసి కష్టాలపాలయ్యాడు. అన్నానికి కూడా కష్టమైంది. తర్వాత అతని భార్య గర్భవతిగా వుండగా కలలో స్వామి నా దగ్గఱకు రా చల్లనవుతుంది అని చెప్పారు. అతడు అశ్రద్ధ చేస్తే ఆమె గర్భంలోనే పిండము చనిపోయి ఆమెకు ప్రాణాపాయస్థితి యేర్పడింది. అతడు బాబాను ప్రార్థిస్తే ఆయన కలలో ఆమె గుండెపై హస్త ముంచాక ఆమె గండము గడిచింది. ఒకరోజు కలలో ఊరి వెలుపల స్థలము చూపి బాబా దానిని కొనమన్నారు. అది వ్యాపారానికి అనువయిన స్థలము కాదని అతడు అనుకుంటుంటే కలలో స్వామి కనబడి, 'నీ కా స్థలము వద్దయ్యా, ఆయనకు చెప్పి మఱో స్థలము చూపిస్తాలే' అన్నారు. తర్వాత మఱొకరోజు ఇద్దఱూ స్వప్నంలో మఱొక స్థలము చూపి కొనమన్నారు. ఆ స్థలము గల ఆసామి మొదట యివ్వనని, తర్వాత 40 వేలు యిస్తే తర్వాత రిజిష్టరు చేస్తాననీ చెప్పి, డబ్బు తీసుకుని చాలాకాలము రిజిష్టరు చెయ్యలేదు. అందఱూ మోసపోయావన్నారు. కానీ అతడు యీ స్వాములను నమ్ముకొని నిశ్చింతగా వున్నాడు. ఒకనాటి వుదయము ఆ స్థలము అమ్మిన ఆసామి వచ్చి స్థలము రిజిష్టరు చేశాడు.

కంటేపల్లి సుబ్బమ్మ మార్చి 1986లో స్వామి సమాధి మందిరము దగ్గఱ నిద్ర చేస్తున్నది. రాత్రి 2 గంటల ప్రాంతంలో లఘుశంక కని వెళ్లింది. అక్కడ ఒక చెట్టు ప్రక్కన స్వామి నిలబడి కనబడ్డారు. ఆమెకు నోరు పెగలలేదు. కానీ చేతులు జోడించి నిలబడింది. ఇంతలో తూపిలి అనసూయమ్మ గూడ నిద్రలేచి

వచ్చింది. ఆమెతో సబ్బమ్మ నాకు కళ్లు సరిగా కనిపించవు. ఆయన స్వామియేనా అంటూ చూపించింది. అనసూయమ్మ స్వామియే సందేహము లేదు అంటూ నమస్కరించింది. ఇంతలో మఱొక నెల్లూరు వాస్తవ్యురాలు గూడ వచ్చి నిలబడిపోయి స్వామికి నమస్కరించింది. ఇంతలో శ్రీ స్వామి సాయిబాబా లాగ మారిపోయారు. ఒకే సమయంలో సుబ్బమ్మగారికి సాయినాథుడుగాను, మిగిలిన యిద్దఱికి స్వామిగాను 5 నిమిషాలపాటు దర్శన మయ్యింది. అటుతర్వాత ఆప్రక్కగా నున్న సమాధుల వైపు నడిచి స్వామి అదృశ్య మయ్యారు. అంతసేపూ ఆ ముగ్గురూ మంత్రముగ్ధులయి నిలబడిపోయారుగానీ యెవరినీ నిద్రలేపలేకపోయారు.

స్వామి మహాసమాధి చెందినపుడు తాళ్ళూరి శ్రీనివాసులు 25 రూపాయలకు ఆటోరిక్షా మాట్లాడుకొని మేళము వాయించడానికి గొలగమూడి చేరాడు. డ్రైవరు ఆశ్రమమువారితో అబద్ధము చెప్పి 5 రూపాయలు యెక్కువ తీసుకున్నాడు. తిరుగు ప్రయాణంలో అకారణంగా ఆటోరిక్షా ఆగిపోయి యెంతవఱకూ కదల్లేదు. ఆటోవాడు చెంపలేసుకున్న మరుక్షణమే అది కదిలింది.

**సాయి సహోదరాయ నమః**

శ్రీఅవధూతాయ నమః

**అధ్యాయము - 13**

# నా టి కీ - నే టి కీ - ఏ నా టి కీ

శ్రీదత్తాత్రేయుడు చతుర్యుగావతారము. అంటే మిగిలిన అవతారాలు ఒక్కొక్క యుగంలో వచ్చి వెళ్లిపోతారు. దత్తాత్రేయుడు భూమిపై మహనీయు లందఱి రూపాలలో నాల్గు యుగాలలోనూ వుంటాడు. అందుకే సాయిబాబా, నా సమాధినుండి కూడా భక్తుల నెప్పటిలాగే రక్షిస్తుంటాను అన్నారు. ఎందఱికో భౌతికంగా దర్శన మిచ్చారు. వారి సోదరులయిన స్వామి యీ విషయంలోగూడ ఆయన సోదరుడే. మహాసమాధి తర్వాతగూడ స్వామి తన మాటలు యెలా నిలుపుకుంటున్నారో చూద్దాము.

శ్రీ సి.వి సుబ్బయ్యగారిల్లు 1977లో తుఫానువల్ల ఒకసారి పడిపోయింది. 1978లో కట్టుకున్న యిల్లుకూడ 1978 తుఫానులో గాలికి వూగుతున్నది. ఆచీకటిరాత్రిలో అతడు స్వామిని ప్రార్థించి వారిపై భారముంచి పడుకున్నారు. వెంటనే ఒక కల వచ్చింది. కలలో స్వామి వర్షంలో బాగా తడిసి అతని యింట్లో నిలబడి తడి తుడుచుకుంటున్నారు. అతడు వెంటనే లేచి దీపము వెలిగించి చూస్తే యెవఱూ లేరు. అంత గాలిలోనూ యిల్లు చెక్కుచెదరలేదు. స్వామి శరీరంతో వున్నప్పుడు ఆయన పాదాలంటి నమస్కరించు కోలేదని అతడెంతో బాధపడేవాడు. ఒకనాటి రాత్రి కలలో స్వామి చరచరా నడిచి వెడుతుంటే అతడు యెదురుగా వెళ్లి వారి కాళ్లు గట్టిగా పట్టుకుని తృప్తితీరా నమస్కరించుకున్నాడు. అప్పటినుండి స్వామికి ప్రత్యక్ష్యంగా నమస్కరించిన తృప్తి అతని హృదయంలో నిలిచిపోయింది. ఒకసారి అతని పొలంలోని ఇంజను విప్పి రెండు భాగాలు దొంగలెత్తుకుపోయారు. అప్పుడు గొలగమూడి వెళ్లి, అలా దొంగతనాలు జరుగుతుంటే తాను వ్యవసాయము చేయలేనని అచ్చటి భక్తులతో చెప్పుకున్నాడు. పూజారి నాగయ్య స్వామి దారము యిచ్చి ఇంజనుకు కట్టమన్నాడు. అత డలానే కట్టి కొన్నిరోజులు పొలానికి పోలేదు. ఒకరోజు దొంగలు తన ఇంజను విప్పారని తెలిసి అతడు వెళ్లి చూస్తే దానిలోని భాగాలన్నీ అక్కడే భద్రంగా పడేసివున్నాయి.

గొట్టేటి శేషయ్య చేను బాగా పండింది. కానీ రాత్రిపూట అడవిపందులు దానిని ధ్వంసము చేస్తున్నాయి. కావలి పడుకుందా మంటే దోమల బాధ, చలి, సన్నని వానా బాధిస్తున్నాయి. అతడు స్వామి సమాధి దర్శించి తనకు పైరు నష్ట మొస్తే ప్రతీ సంవత్సరమూ సమర్పించే వడ్లుకూడ ఆశ్రమానికి యివ్వలేనని చెప్పుకున్నాడు. ఆరాత్రి కలలో కాకీ నిక్కరూ, పచ్చని టోపీ, బనీను ధరించిన ఒక యువకుడు అతని చేతిలో కఱ్ఱ లాక్కొని పందులను తరమడానికి పొలంలోకి వెళ్లాడు. నాటినుండి కావలికాయకపోయినా చేలో పందులు పడనేలేదు. తర్వాత అతడు వడ్లు ఆశ్రమానికి పంపేరోజు కల వచ్చింది. అతడు తూముడు వడ్లు సమాధివద్ద వేయగానే పూజారి బరిగెల నాగయ్య, 'ఈయన నాలుగుతూములు బాకీ యిస్తాడు. జమరాసుకో' అని బుజ్జయ్యతో చెబుతున్నాడు. చేను కావలి కాసినందుకు స్వామి మూడుతూముల వడ్లు యెక్కువ అడిగారన్నమాట. అతడు సమర్పించాడు.

మార్చి 1983లో రాఘవయ్యగారి దూడ తప్పిపోయి నెలరోజులయింది. అతను ఒకరాత్రి స్వామి సమాధికి చెప్పుకున్నాడు. నాటిరాత్రి కలలో స్వామి అతనిని వెంటబెట్టుకొని తూర్పు వైపున ఒక గ్రామంలో బందెలదొడ్డిలోకి తీసుకుపోయారు. అక్కడొక పేడదిబ్బమీద దూడ నిలబడియున్నది. తెల్లవారి అతను పెనవర్తిలోని గ్రామంలోని బందిలదొడ్డి దగ్గఱకు వెళ్లి చూస్తే అతని దూడ నిలబడియున్నది. అలానే లక్ష్మినర్సారెడ్డి రెండు ఎద్దులూ నెలరోజులుగా తప్పించుకొనిపోయాయి. అతని భార్య స్వామికి చెప్పుకున్న రాత్రి ఆయన కలలో కనిపించి, నీ ఎద్దులు తోలుకొచ్చేసరికి నా కాళ్లకు ముళ్ళు గ్రుచ్చుకొని నెత్తురు యెలా కారుతున్నదో చూడు' అని చూపారు. మెలకువ వచ్చి చూస్తే వాకిట్లో ఎద్దు లున్నాయి. వాటికిగూడ ముళ్లు గీచుకొని రక్తము కారుతున్నది.

పనబాక సుబ్బరామయ్య 1984లో నెల్లూరులో అప్పు చేసి దుక్కిపిండి బస్తాలు కొని రిక్షాలో తెస్తున్నాడు. ఇంతలో బస్సు కదిలిపోతుంటే దానిని ఆపడానికి రిక్షా దిగి పరుగెత్తాడు. బస్సు ఆగలేదు. తిరిగి చూసేసరికి రిక్షా కనిపించలేదు. అతడు స్వామిని తలచుకొని కంటతడిపెట్టుకున్నాడు. ఇంతలో ఒక వ్యక్తి అతనిని ఆపి 'ఇలా పరుగెత్తితే ఏకారు క్రిందైనా పడతావు. నీ బస్తా లెక్కడికి పోవు, స్థిమితంగా వుండు' అన్నారు. గంటలో రిక్షావా డొచ్చి బస్తాలు అప్పగించాడు. అలానే పోలు మస్తానయ్య 1983లో స్వామి ఆరాధన కని నెల్లూరులో కూరగాయలు కొని తెస్తూ రిక్షా నిలిపి, తాను మరచిపోయిన సంచీకోసము వెనుకకు వెళ్లివచ్చాడు. ఇంతలో రిక్షా కనిపించలేదు. గంటన్నర తర్వాత రిక్షావా డొచ్చి 'అయ్యా! నా బుద్ధి గడ్డితిన్నది. కొంతదూరము పోయేసరికి నాకు కళ్లు కనపడలేదు. చెంపలేసుకొని తిరిగి వచ్చాను. క్షమించండి। అన్నాడు.

తూపిలి అచ్చమ్మ తులశవ్వగారి ఆరాధనకు బయలుదేరే సమయానికి వారి బఱ్ఱెదూడకు పొట్ట వుబ్బి నాలుక చాచి తన్నుకుంటున్నది. దానికి స్వామి దారము కట్టి ఆమె ఆరాధనకు వెళ్లిపోయింది. అరగంటలో దూడ లేచి హాయిగా మేతమేసింది. అలానే నరసింహునాయుడుగారి ఎద్దులకు పొట్ట వుబ్బింది. వైద్యంవలన తగ్గలేదు. దానికి మూడురోజులు ఆశ్రమంలో విభూతి వాడినా తగ్గలేదని అతడు స్వామికి చెప్పుకున్నాడు. ఆ రాత్రి కలలో స్వామి ఒక సింహాసనంపై కూర్చొని, బాగవుతుంది ఫో అన్నారు. మెలకువొచ్చి చూచేసరికి ఎద్దు బిందెడు మూత్రము విడిచి చక్కగా మేసింది.

గోనుగుంట రామమ్మగారి బఱ్ఱె యీనలేక బాధపడుతున్నది. దాని కడుపులోని దూడ చనిపోయిందనీ, దాన్ని తీసేస్తే బఱ్ఱె బ్రతుకుతుందనీ చెప్పి వైద్యుడు దూడను లాగి ప్రక్కనవేశాడు. అది బ్రతికితే పాలు మరచాక దానిని ఆశ్రమానికి యిస్తానని మ్రొక్కుకుని దానిపై తడి తువ్వాలు కప్పింది. రెండు గంటలు గడిచేసరికి దూడ కళ్లు తెరిచింది. కానీ ఆమె ఆశ్రమానికి పాలు పంపలేదు. మూడునెలల తర్వాత ఆమెకు కలలో స్వామి కనిపించి, 'అమ్మా! 3 నెలలు గడిచినా నామాట మరచిపోయావే!' అన్నారు. తెల్లవారగానే ఆశ్రమానికి పాలు సమర్పించింది. తర్వాత బఱ్ఱెతోపాటు దూడనుకూడా అమ్మివేసి దాని ఖరీదు 50 రూ॥లు స్వామికి యివ్వాలనుకున్నది. కానీ యివ్వలేదు. 18 నెలల తర్వాత స్వామి కలలో కనిపించి 'నీవు నాకు 130 రూ॥లు బాకీ తేలావు. డిసెంబర్ 19 లోగా చెల్లిస్తా నని వ్రాయించి ఆశ్రమంలో వేలిముద్ర వేసిరా' అన్నారు. తెల్లవారి ఆమె ఆశ్రమం చేరి ఆ గడువులోగా చెల్లించలేకుంటే రెట్టింపు చెల్లిస్తా నని వ్రాసియిచ్చి అలానే చేసింది.

పూసల మీరయ్య భార్య స్వామివారి మొదటి ఆరాధనకు గొలగమూడి వచ్చి స్వామివారి నిత్యపూజకు ప్రతినెలా 10 రూ॥లు పంపుతానని తన భర్త పేరు వ్రాయించింది. ఆమె యింటికి వెళ్లి చెబితే అతడు, 'స్వామి నన్ను అడిగితే యిస్తాను' అన్నాడు. కొన్నాళ్లకు స్వామి అతనికి కలలో కనిపించి తమ జోలిలో యేమైనా వేయమని అడగారు. అతడు వెంటనే స్వామికి ఆ పైకము పంపి తర్వాత సమాధిని దర్శించాడు.

ఒకరోజు జయచంద్రారెడ్డికి వింతైన స్వప్నము వచ్చింది. నెల్లూరులో గాంధీబొమ్మ దగ్గఱ యెవఱో పెద్దాయన కనిపించి 'గొలగమూడిలో అవధూతగారిని దర్శించు. అక్కడ మిలటరీవారు దారి చెబుతారు' అన్నాడు. కలలోనే అతను బయలుదేరి దారిలో మిలటరీవారిని మార్గము అడిగి గొలగమూడి వెళ్తున్నాడు. దారిలో ఒక సన్నని మనిషి గోచి, కఱ్ఱ, ముంత, చేతిలో పాతగుడ్డలు, కొన్ని వస్తువులు పట్టుకొని కనిపించారు. ఆయనే స్వామి అనిపించి చంద్రారెడ్డి నమస్కరించాడు. తెల్లవారాక అతని స్నేహితులు, వెంకయ్యస్వామి మండలారాధనకు పోతున్నాము, రమ్మని పిలిచి తీసుకువెళ్లారు.

పెద్ది ఏడుకొండలు తను పనిచేసే కార్యాలయంలో తగువులాడినప్పటినుండి మానసికంగా బాగా దెబ్బతిన్నాడు. ఏది చూచినా విపరీతంగా భయపడేవాడు. వైద్యులు నరాలజబ్బని చెప్పి చికిత్స చేయించినా తగ్గలేదు. చివఱకు స్వామి సమాధికి ప్రదక్షిణలు చేస్తూ మూడురోజులు ప్రార్థించాడు. చివరిరోజు రాత్రి స్వామి కలలో కనిపించి అతడి మెదడును గట్టిగా నొక్కారు. అతడి తలకు కరెంటు పెట్టినట్లు అయ్యి పెద్ద మెఱుపులా మెఱిసింది. నాల్గవరోజు కలలో పూజారి నాగయ్య తన వేలునుండి కారుతున్న రక్తము చూసి 'ఎవరి రక్త మైన యిలానే వుంటుందిగదా! భయ మెందుకు?' అన్నాడు. తెల్లవారేసరికి భయ మనేది లేకుండా పోయింది. ఇప్పుడు ప్రశాంతంగా వుద్యోగము చేసుకుంటున్నాడు.

మే 1984లో అక్కిం వెంకటరామిరెడ్డి స్వామి సమాధిని దర్శించి తిరిగి యింటికి బయలుదేరాడు. స్వామి ప్రసాదంగా భోజనము చేసి బయలుదేరమని ఆశ్రమవాసులు యెంత చెప్పినా తినకుండా కాలినడకన బయలుదేరాడు. బస్సు ఛార్జీలకు డబ్బు లిస్తా మన్నా తీసుకోలేదు. అదేమి చిత్రమోగాని అతడు చిరుదోలు చెఱువులో దోవతప్పి తిరిగిన చోటే వుదయము 11 గంటల నుండి మధ్యాహ్నము 2 గంటల వఱకు తిరుగుతున్నాడు. కాళ్ళకు చెప్పులు లేవు. విపరీతమైన దాహము. ఇక శక్తి లేక ఒక బొంతజెముడు నీడన, 'ఆశ్రమంలో అన్నం తినకుండా బయలుదేరినందుకు నన్నిలా చంపేస్తున్నావా?' అని స్వామిని ప్రార్థించాడు. వెంటనే మేకలను కాచుకునే 12 సంవత్సరముల పిల్లవాడు అతడిని పలకరించాడు. అతడు దాహ మడిగితే ఆ చెట్ల అవత లున్న చెఱువు చూపించాడు. అవి త్రాగి అతడు యిల్లు చేరిన నాటిరాత్రి స్వప్నంలో స్వామి కనిపించి, 'చద్దన్నం తిని బస్సులో పొమ్మంటే వితండంగా పోయేవాళ్ళకు యింతేకదా జరిగేది?' అన్నారు. అందుకే సాయిబాబా అన్నం తినమని ఆహ్వాన మొస్తే అది దైవానుగ్రహంగా భావించి తినాలని చెప్పారు. ఇందుకే యీ లీలకు అర్థము తెలియా లంటే ఒక అడవిలో దైవానుగ్రహంవల్ల లభించిన సద్గురు విచ్చే అనుగ్రహమే ఆ భోజనము. అది పోగొట్టుకుంటే మండువేసవిలో సంసారతాపము అనుభవించక తప్పదు.

బట్టిరెడ్డి శ్రీనివాసరెడ్డికి వివాహమై 4 సంవత్సరాలైనా సంతానము కలుగలేదు. అతని భార్య 1986లో స్వామి సమాధిని దర్శించింది. రాత్రి కలలో స్వామి ఆమెకు కనిపించి సంతానము ప్రసాదించామని చెప్పి ఒక దారము యిచ్చారు. తెల్లవారి ఆమె లేచేసరికి ఆ దారము నిజంగానే ఆమె తాళిబొట్టుకు చుట్టుకొని వున్నది.

పార్లపల్లి వేంకటేశ్వర్లుకు 1984లో ఒకరోజు గుండెదడొచ్చి ప్రమాదించింది. రెండునెలల్లో 2000 రూ॥లు మందులకు ఖర్చయినాయి. అయినా చివరకు, అతడు చనిపోయా డని వైద్యులు చెప్పారు. అతనిని కార్‌లో యింటికి తీసుకువచ్చారు. అందఱూ యేడ్చి నిద్రపోయారు. అతని తల్లిదండ్రులకు స్వామి కలలో కనిపించి, 'నా భక్తుణ్ణి నేను రక్షించుకుంటాను' అన్నారు. తెల్లవారేసరికి అతడు కళ్లు తెరిచాడు. క్రమేణా రెండు నెలల్లో

అతని ఆరోగ్యము బాగుపడింది. ఆ సంవత్సరమే అతడు స్వామి ఆరాధనకు వెళ్లి, సమాధిని దర్శించాడు. స్వామి సశరీరంగా వున్నప్పుడు తనను తమ సేవలో వుంచుకోలే దని అతను బాధపడ్డాడు. నాటిరాత్రి అతనికి స్వామి అగ్నిగుండంలో కూర్చుని దర్శన మిచ్చారు. దాని రూపంలో తామెప్పుడూ వుంటా మని వారి భావము కాబోలు!

ముదిగేడుకు చెందిన యానాదిరెడ్డి జూన్ 1985లో జబ్బునపడ్డాడు. అతడికి ఆహారము విషంలా తోచేది. ఎన్ని మందులు తిన్నా తగ్గలేదు. రెండు నెలల్లో అతడు ఎముకల గూడయ్యాడు. ఆ స్థితిలో అతనికి యెక్కువగా విరేచనాలు అవుతున్నాయి. వైద్యులకు జబ్బే అంతుపట్టలేదు. అందఱూ ఆశలు వదులుకున్నారు. ఆగష్టు 22న అక్కం వెంకటరామిరెడ్డి, స్వామి సమాధి దర్శనంతో అతని ఆరోగ్యము బాగుపడగల దని చెప్పాడు. యానాదిరెడ్డి సరేనన్నాడు. ఆక్షణంనుండి అతనిలో పెద్ద మార్పు కలిగింది. తనకై తానే యింట్లోకి వెళ్లి అన్నము పెట్ట మనీ, బాగా ఆకలి అవుతున్న దని అడిగాడు. అది చావు బలమే నని తలచి అందఱూ దుఃఖించారు. కానీ అతడు చన్నీటి స్నానము చేసి మామూలుగా అన్నం తిని, గుడ్డలు వేసుకున్నాడు. తర్వాత మైలు నడిచివెళ్లి బస్సులో గొలగమూడి చేరి అన్నీ వేసుకుని భోజనము చేశాడు. అదిమొదలు ఆరోగ్యవంతుడై యిక మందులే వాడలేదు.

యామాల వనమ్మగారి పాపకు వేలుక్రింద, ఎడమచెవి క్రింద వాపు నొప్పి వచ్చింది. అది యెన్ని మందులకూ తగ్గక, క్రమంగా ఎడమ పిక్కమీద గడ్డగా తేలింది. అది పగిలి చీముతోపాటు ఎముక పలుకులుగూడ వచ్చేవి. దాని దుర్వాసన భరించలేనిదిగా వుండేది. పెద్ద ఆసుపత్రిలో కాలు తీసివేస్తేనేగాని పాప బ్రతక దని చెప్పారు. ఇంతలో ఒకరి సలహాపై పాపను స్వామి సమాధివద్దకు తీసుకువెళ్లి మొక్కుకున్నారు. స్వామివారి అఖండదీపంలోని నూనెలో విభూతి కలిపి పూయసాగాడు. ఒక వారంలో మూడుగాయాలు మానాయి. ఒక ఎముకముక్కమాత్రము కొంచెము బయటకు కనిపిస్తున్నది. ఒకరోజు రాత్రి వారి పాప కాలు విరిగి క్రిందపడినట్లు, ఒక ముసలాయన వచ్చి సూది-దారంతో ఆ కాలు అతికించి కుట్టినట్లు కల వచ్చింది. ఆతర్వాత ఆ ఎముక ముక్క బయటకు వచ్చేసింది. కేవలము స్వామి విభూతి, నూనెతో పాప కాలు బాగైపోయింది. ఇప్పుడు యే లోటూ లేకుండా చక్కగా నడుస్తున్నది.

కోటేశ్వరమ్మగారి తల్లికి 1986 లో కడుపులోకి యే ఆహారంపోయినా రక్తవిరేచనమై, విపరీతమైన బాధ కలిగేది. నెల్లూరు అమెరికన్ ఆసుపత్రిలో పరీక్ష చేసి ఆమె కడుపులో పెద్ద క్యాన్సర్ గడ్డ పెరిగిందని, త్వరలో అది పగిలి మరణిస్తుందనీ చెప్పి యింటికి పంపారు. వారి యింటి యజమానురాలు స్వామిని నమ్ముకుంటే ఆ జబ్బు తగ్గుతుందని చెప్పింది. కానీ డబ్బుకు లోపించి ఆమెకు చికిత్స చేయించలేదన్నమాట రాకుండా

ఆమెను మద్రాసులోని క్యాన్సర్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడకు బయలుదేరేముందు స్వామిని అమ్మకు క్యాన్సర్ లేదని వైద్యులు చెబితే మిమ్ము పూజిస్తాను అని ప్రార్థించాడు. రైల్లో సగందూరం వెళ్లేసరికి అంతవఱకూ యేమీ తినలేని ఆమె అన్నం పెట్టమని అడిగి భోజనము చేసింది. అదిమొదలు అన్నీ తినసాగింది. మద్రాసు స్టేషనులో దిగగానే తనకు జబ్బు లేదని యింటికి పోదా మనీ చెప్పింది. క్యాన్సర్ ఆసుపత్రిలో అన్ని పరీక్షలు చేసి ఆ వయస్సులో గూడ ఆమె కన్నీ చాలా బాగున్నా యని చెప్పారు.

భాగవతుల రఘురామయ్య భార్యకు గుండెనొప్పి, రక్తపోటు, వంటికినీరు వచ్చి యెంతో బాధపడుతుంటే మద్రాసుకు తీసుకుపోయారు. ఒకనాటి రాత్రి కలలో స్వామి తెల్లకాగితంపై వేలితో NPHRO SAL అని వ్రాసి చూపారు. వారి కుటుంబవైద్యునిచేత చీటీ వ్రాయించుకొని ఆ మందు తెచ్చేసరికి ఆమెకు జబ్బు పూర్తిగా తగ్గిపోయింది. తర్వాత ఆమెకు స్వామి కలలో 5 బత్తాయిలు ప్రసాదించారు. తర్వాత బత్తాయిరసంతోనే ఆమెకు బలము చేకూరింది. మఱొకప్పుడు స్వామి ఆమెకు L.M.E. అని వ్రాసి చూపారు. వారి అబ్బాయిని అది చదివించమన్నా రని వారు తలచారు. కొన్నాళ్లకు అతనికి సీటు వచ్చింది. కానీ ఆర్థికస్తోమతలేక సకాలంలో ఫీజు కట్టలేకపోయారు. చిత్రంగా అధికారులు ఆ సమయాన్ని పొడిగించారు. పిల్లవాని తాతగారు ఆ ఖర్చంతా భరించి అబ్బాయిని చదివిస్తున్నారు.

పెసల సుబ్బరామయ్య మిత్రు లొకరు స్వామిని సేవించేవారు. కానీ వారి అబ్బాయికి ఆయనపై భక్తి లేదు. అతడు పెద్దవాడై డబ్బు బాగా సంపాదించి త్రాగుడు మొదలగు వాటికి లోనయ్యాడు. మానుకోవాలని ప్రయత్నించినా అతనివల్ల కాలేదు. ఆగష్టు 1985లో నెల్లూరులో భోజనము చేశాక రాత్రి 9 గంటలకు గొలగమూడి వెళ్లి స్వామి ప్రసాదము తీసుకోవాలని అనుకున్నాడు. కానీ గొలగమూడి చేరాక అంతజనంలో భోజనశాలకు పోలేక నిద్రపోయాడు. కలలో స్వామి అతడి దగ్గఱ కూర్చుని అతని తొడమీత చఱిచారు. అతడు నిద్రలోనే తూగుతూ రాత్రి రెండుగంటలకు భోజనశాలకు వెళ్లాడు. అక్కడ అన్నాలు వడ్డించడము చాలించి పాత్రలు సర్దుతున్నారు. మిగిలిన వంటకాలు తీసుకుపోతూ, వారు అతని చేతిలో కొంచెము పెట్టారు. అది తిని తర్వాత క్రమంగా అతడు త్రాగుడు మొదలగునవి మానుకున్నాడు.

నల్లపురెడ్డి నారాయణరెడ్డి ఒకరోజు మనము స్వామి భక్తులమయివుండి ప్రతిక్షణము సాయినాథుని స్మరిస్తున్నామే! అని అనుకున్నాడు. నాటిరాత్రి స్వామి స్పష్టంగా శరీరంతో వున్నప్పటి గొంతుతో 'ఆయన నామము స్మరించినా నన్ను స్మరించినట్లేనయ్యా!' అని స్పష్టంగా పలికారు. ఈ లీల ద్వారా సాయినాథునికీ, తమకు భేదం లేదని వెంకయ్యస్వామి వారు దృఢపఱచినట్లేగదా!

కొర్రకూటి హరనాధనాయుడుకి నోటివెంట రక్తము పడేది. ఇంగ్లీషు మందులకు తగ్గినట్లు వుండి తర్వాత మళ్ళీ ప్రారంభమయ్యేది. ఒకనాడు యే మందు లేకుండా ఆ వ్యాధి తగ్గిపోతే స్వామి సమాధికి టెంకాయ కొడతానని మ్రొక్కుకున్నాడు. ఇక ఎన్నడూ అతనికి ఆ బాధ కనిపించలేదు.

చెరుకూరి కృష్ణయ్య 1983లో గుండెనొప్పి వచ్చి ఆసుపత్రిలో వున్నాడు. ఇంతలో ఆసుపత్రి వుద్యోగులు సమ్మె చేయడంవల్ల అతడింటికి వచ్చాడు. ఒకనాటి రాత్రి స్వామి సమాధిని దర్శించాలని అనిపించి రాత్రి 10 గంటలకు ఒంటరిగా కాలినడకన బయలుదేరి గొలగమూడి చేరాడు. స్వామి సమాధి దగ్గఱకు చేరగానే అతడు గుండెనొప్పితో పడిపోయాడు. నోటివెంట చొంగకూడా పడుతోంది. అప్పు డతనికి యెవఱో వీపును గట్టిగా తట్టి 'పోతుందిలే!' అన్నట్లు వినిపించింది. తెల్లవారేసరికి గుండెనొప్పి తగ్గిపోయింది.

ఉప్పల శేషమ్మకు 1981 నుండి కాళ్ళు వాచి నొప్పిపుట్టి నిద్రకూడా పట్టేదిగాదు. ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. ఆమె 1983లో స్వామి సమాధిని దర్శించగానే బాధ కొంత తగ్గింది, క్రమంగా 3 వారాలకు పూర్తిగా తగ్గిపోయింది. అప్పటినుండి వారానికి ఒకసారి దర్శనము చేసుకొనేది. ఒకసారి యింటి పనివలన గొలగమూడి వెళ్లలేక యింట్లోనే స్వామి పటాన్ని పూజించనారంభించింది. నొప్పులు మళ్లీ మొదలయ్యేసరికి ఇక్కడయినా తమరినే స్మరిస్తున్నానుగదా అని స్వామికి చెప్పుకున్నది. నాటిరాత్రి స్వామి కలలో కనిపించి 3 సంవత్సరములనుండి వున్నదేగదా? ఇక్కడే వుండి నాయనా అంటే సరిపోతుందా? అన్నారు. ఆమె తెల్లవారి లేచి సమాధి దర్శనానికి నడిచివెళ్లింది. అటుతర్వాత ఆమెకు బాధలే లేవు. అలానే యీమె కుమార్తెకు అధికంగా మైల అవుతుంటే ఆమె నిత్యమూ విభూతి సేవిస్తూ సమాధిని దర్శిస్తాను' అని మ్రొక్కుకున్నది. అనుకోగానే జబ్బు తగ్గిపోయింది.

తూపిలి వెంకయ్యకు ఒకనాటి రాత్రి గుండెనొప్పి తీవ్రంగా వచ్చి, నేను బ్రతకను అని అఱుస్తూ తన్నుకుంటున్నాడు. అతని భార్య స్వామి సేవకురాలు. ఆమె విభూతి గుండెలకు పూసిందికానీ నోటిలో వేయడము మర్చిపోయింది. ఆమెకు నిద్ర తూగగానే స్వామి పూజరి నాగయ్యకు కలలో కనిపించి, 'అలాగేనటమ్మా పూసేది?' అన్నాడు. వెంటనే లేచి విభూతి అతని నోట్లో వేయగానే నొప్పి తగ్గిపోయింది.

చెవుడుగుంట ఆరయ్యకు కాలూ, చేయి పడిపోయి మంచానపడ్డాడు. డబ్బులేక ఒక నెల వైద్యము చేయించలేదు. ఒకరోజు అతడు, తెల్లవారేసరికి నెమ్మదిస్తే దర్శనానికి వస్తా నని మ్రొక్కుకున్నాడు. తెల్లవారేసరికి తనకై తానే లేచి కూర్చున్నాడు. సమాధిని దర్శించాక కఱ్ఱ సహాయంతో నడవగలిగాడు. మూడవరోజు స్వామి కలలో కనిపించి, 'కఱ్ఱ లేకుండా నడు, చూడాలి' అన్నారు. నాటినుండి కఱ్ఱ లేకుండానే నడుస్తున్నాడు. ఎప్పుడూ స్వామి సన్నిధిలో వుండాలని యితడు కాపురము గొలగమూడికి మార్చాడు.

చెరుకూరి నాగమ్మకు యిదివఱకే పొట్టలో రెండు శస్త్రచికిత్సలు జరిగాయి. మఱల 1985లో యెప్పుడూ తలనొప్పి, అన్నము చూస్తేనే వాంతి వచ్చేది. ఆమె కడుపులో గడ్డ వున్న దని, శస్త్రచికిత్స చేయా లనీ వైద్యులు చెప్పారు. ఆమె భయపడి స్వామి సమాధిని దర్శించి రోజూ 108 ప్రదక్షిణాలు చేసి ఆశ్రమంలో పనులు చేస్తున్నది. వెంటనే ఆమెకు అన్నం సహించడము ప్రారంభించింది. ఐదవరోజు తులశవ్వ కలలో కనిపించి, ఆల్వారు గడ్డ తిన మని చెప్పింది. అది తినగానే ఆమె ఆరోగ్యము బాగుపడింది. ఒకరోజు పూజారి నాగయ్య కలలో కనిపించి, 'నీకు జబ్బు లేదు, ఎప్పటికి ఆరోగ్యంగా వుంటావు' అన్నాడు. కానీ యింటికి వెళ్ల మని స్వామి ఆదేశించలేదని ఆమె ఆశ్రమంలోనే వున్నది. రెండురోజుల తర్వాత స్వామి కలలో కనిపించి, 'నీకు జబ్బు లేదు, నీవీ ఆకు యెవఱి కిచ్చినా జబ్బులు పోతాయి' అని చెప్పి ఒక ఆకు యిప్పించారు. అదే ప్రసాద మని తలచి ఆమె యిల్లు చేరాగానే 500రూ॥ల జీతంపై వుద్యోగం వచ్చింది.

రక్తవిరేచనాలతో బాధపడుతున్న పట్నం ఖాదర్‌మస్తాన్‌గారికి ప్రేగుకాన్సర్ వచ్చిం దని మద్రాసు క్యాన్సర్ ఆసుపత్రివారు నిర్ణయించారు. వెంటనే శస్త్రచికిత్స చేసి ప్రేగు బయటకుపెడతామని, మలము డబ్బాలోకి వస్తూ వుంటుందని, 10 నెలలు ఆసుపత్రిలో వుంటే తగ్గవచ్చనీ వైద్యులు చెప్పారు. అతడు స్వామిని తలచుకుని యేడ్చాడు. నాటిరాత్రి మెలకువచ్చి చూసేసరికి మంచం వద్దనుండి నిజంగానే స్వామి వెళుతున్నారు. ఆశ్చర్యంతో అతనికి నోరు పెగల్లేదు. తెల్లవారేసరికి రక్తము పడటము ఆగిపోయింది. వారంరోజుల్లో పూర్తి ఆరోగ్యవంతుడయ్యాడు.

చెరమన వెంకయ్య రెండు నెలలు అన్నము తినలేక శల్యమయ్యాడు. దగ్గు, ఆయాసము, గళ్ళతోపాటు రక్తంకూడా పడేది. చికిత్స లేమి పనిచేయలేదు. ఒకరి సలహాపై స్వామి సమాధిని దర్శించిన మరురోజే కాస్త నెమ్మదించి నడవసాగాడు. ఐదవరోజు రాత్రి కలలో స్వామి అతని వూపిరితిత్తులలోని పెద్ద గడ్డను చేత్తో నలిపేస్తున్నారు. చీమూ, నెత్తురు కారుతున్నది. మెలకువ వచ్చేసరికి పెద్దగా దగ్గు వచ్చి యెంతో చీమూ, నెత్తురూ పడింది. అంతటితో చాలావఱకు అతని ఆరోగ్యము బాగుపడింది. 8వరోజు స్వామి మఱల ఆ గడ్డనుండి చెడ్డ పదార్థము ఆకులో పిండి చూపారు. నాల్గవరోజు వ్యాధి పూర్తిగా తగ్గిపోయింది.

భాగవతుల రఘురామయ్య 1985లో ఆర్థిక బాధలలో వున్నప్పుడు అతని భార్య రోగంతో మంచంలో వున్నది. ఆమె స్వామిని కన్నీటితో ప్రార్థించిన నాటి రాత్రి ఆయన కలలో కనిపించి, 'కర్మఫలము అనుభవించక తప్పుతుందామ్మా!' అని ఓదార్చారు. వారం తర్వాత ఆయన మఱల కనిపించి, 'నీకు సమయ మైపోయిందని పైవారు కోర్టులో తీర్పు చెప్పారు' అన్నారు. ఆమె నేనుపోతే నా పిలల్ల గతి యేమిటి? అని అంటే ఆయన చూస్తాంలే అమ్మా అన్నారు.

తర్వాత శనివారం రఘురామయ్య గొలగమూడి వెళ్లివచ్చేసరికి అతని భార్య గుండెనొప్పి, ఆయాసంతో ప్రమాదంగా వున్నది. పొరుగువారంతా ఆమెను ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆమెను ఆసుపత్రిలో దించేసరికి శ్వాస ఆగిపోయింది. ఆమెకు ఆక్సిజన్ పెట్టి పరీక్ష చేసి చూస్తే రక్తము నల్లగా మారిపోయింది. కానీ అరగంటలో మఱలా శ్వాస మొదలయ్యింది. ఆశ్చర్యంతో వైద్యులు వారి ప్రయత్నము చేశారు. త్వరలో ఆమె కోలుకొని యిప్పుడు బాగున్నది.

నట్టేటి లక్ష్మమ్మకు రోజూ కలలో యమకింకరులు కనిపించి భయపడింది. ఎప్పుడూ ప్రక్కన మనిషి వుండాలి. ఆమె స్వామి సమాధిని దర్శించి 20 రోజులపాటు రెండుపూటలా రోజూ 5 ప్రదక్షిణాలు చేసినా ఫలితము కనిపించలేదు. అపుడు పూటకు 108 ప్రదక్షిణాలు చేస్తూ సమయ మంతా స్వామి సర్మణతో గడపసాగింది. మూడవరోజు మధ్యాహ్నము ధుని దగ్గఱ ఒక పిల్లవాడు కనిపించి, ఆమె చేతిలో విభూతిపెట్టి మరుక్షణమే కనిపించిలేదు. అప్పటినుండి ఆమెకు భయము తగ్గిపోయింది. తర్వాత ఆమెకు యెప్పుడూ మైల అవుతూ, కాలూ డొక్కా నొప్పి పుడుతుంటే స్వామి కలలో కనిపించి 'మూడు నెలల సమయ మున్నది. నన్ను శ్రద్ధగా స్మరించు' అని చెప్పారు.

కన్నవరం రాజయ్యకు వారంరోజులు జ్వరంకాచి బాగా నీరసపడ్డాడు. స్వామిని ప్రార్థించి పడుకున్నాడు. కలలో స్వామి తంబుర మీటుతూ 'నీ విషయము నాకెపుడూ బాధేనయ్యా, ఈ తంబుర పట్టుకో' అని యిచ్చారు. అతనికి మెలకువ వచ్చేసరికి జ్వరం తగ్గిపోయింది.

గుండుబోయిన నర్సయ్యకు బిడ్డలు పుట్టిపోయారు. మూడవబిడ్డకు ఐదవరోజునుండి జ్వరము మొదలై యేమి త్రాగినా వాంతి చేసుకుంటున్నది. కళ్ళు మూసివేసి బాధపడుతున్నది. బిడ్డ దక్క దని అందఱూ యేడుస్తుంటే ఆ దారినపోతున్న గోనుగుంట రామమ్మ వచ్చి స్వామివారి విభూతి పూసి బిడ్డ నోట్లో కొంచెము వేసి, బిడ్డ బ్రతుకుతుం దని చెప్పి వెళ్లిపోయింది. గంటలో బిడ్డ బ్రతికి తెల్లవారేసరికి పాలు త్రాగింది. వారు ఆ బిడ్డకు స్వామివారి పేరు పెట్టుకున్నారు.

శ్రీరామయ్య ప్రతిరోజూ అనికేపల్లినుండి స్వామి ఆశ్రమానికి భిక్షాన్నము తెచ్చేవాడు. ఆగష్టు 20, 1983న అతడు తన తోటలోని పూరిపాకలో వున్నాడు. స్వామి తువ్వాలు తలమీద వేసుకొని దర్శన మిచ్చి, 'అక్క డంత పని జరుగుతుంటే యిక్కడ తంబుర మీటుతూ కూర్చున్నావా?' అన్నట్లు వెటకారంగా సైగచేశారు. తెల్లవారి అతడు గొలగమూడి చేరి అప్పుడు జరుగుతున్న ఆరాధనకు హాజరై రెండు నెలలు అక్కడే వున్నాడు.

గొలగమూడిలో ఒకరోజు తూపిలి పిచ్చమ్మగారి పాప యింకొక పాను ధునిలోకి తోసింది, ఆ పాప ముంజేతివఱకు నిప్పులో కూరుకుపోయింది. వెంటనే నాగయ్య బిడ్డను బయటకు లాగాడు. పాపకు చేతులు కందనైనా కందలేదు.

తూపిలి వెంకయ్య గుడ్డలమూట బస్సుమీద వేయడానికి నిచ్చెన యెక్కాడు. వెంటనే బస్సు కదలడంతో పైనుండి అతడు ఒక ప్రక్క, మూట ఒక ప్రక్క పడిపోయారు. అయినా అతనికి చిన్న దెబ్బయినా తగల్లేదు. అతడు మూట తీసుకొని బస్సు వెంట పరుగెత్తడము చూచి అందఱూ ఆశ్చర్యపోయారు. కారణము? మూడురోజుల ముందు అతని భార్యకు స్వామి సమాధిమందిర పూజారి కలలో కనిపించి, ఆమెకు బొట్టు పెడతా నని చెప్పి కుంకుమ చేతిలో వేశాడు.

భాగవతుల రఘురామయ్య రాత్రి 9 గంటలకు మోటారుసైకిల్‌మీద స్వామి సమాధి దర్శనానికి వస్తున్నాడు. ఒకచోట హఠాత్తుగా ఆగిపోయి యిక కదల్లేదు. అతడు స్వామిని స్మరించగానే యిద్దఱు రైతులు వచ్చి, పదిబారల దూరంలో దారికడ్డంగా త్రవ్విన 6 అడుగుల లోతు గుంట చూపారు. బండి ఆగిపోకుంటే యేమయ్యేదో! అతడు బండి వెనుకు త్రిప్పి స్టార్ట్ చెయ్యగానే వెంటనే బయలుదేరింది.

కొనిదన నాగేశ్వరారవు స్వామి కార్యక్రమంలో సేవగా వస్తువులు ఆశ్రమానికి తోలుతాడు. ఆగష్టు 23, 1985 అర్థరాత్రి నెల్లూరునుండి అరటి పిలకలు, పూలమాలలు మొదలగు సామానులు ట్రాక్టరులో తీసుకువస్తున్నాడు. కల్లూరుపల్లి వంతెన దాటగానే అతనికి నిద్రతూగింది. మెలకువవచ్చేసరికి అతని యెదుట 25 గజాల దూరంలో గొలమూడి వంతెనకు పెద్ద రంధ్రము పడివున్నది. అప్పటికి 3 కి॥మీ. దూరం నిద్దట్లోనే మలుపులు భద్రంగా తిరిగి ట్రాక్టర్ అక్కడదాకా రావడమే మొదటి వింత. తర్వాత సరిగా సమయానికి మెలకువ రావడం మఱొ వింత. ఆ వింతయే స్వామి దయ.

సిద్ధమ్మకు వివాహమై 8 సంవత్సరా లైనా సంతానము లేదు. వైద్యులు, భూతవైద్యులు, మ్రొక్కులు యేమీ వుపకరించలేదు. 1982 వ సంవత్సరంలో తీవ్రమైన జ్వరంతో వారంరోజులు ఆసుపత్రిలో వున్నా తగ్గకపోయేసరికి భయపడి యింటికి వచ్చి స్వామి దర్శనానికి వెళ్లాలనుకున్నది. పట్టుదలతో కోనేటిలో మునిగి, స్వామి సమాధికి ప్రదక్షిణం చేసి ఆంజనేయస్వామి మందిరంలో పడుకున్నది. తెల్లవారేసరికి జ్వరము తగ్గిపోయింది. అంతటితో స్వామి తనకు సంతానము యిచ్చేవఱకు విడవరా దని తలచింది. నిత్యమూ సమాధికి ప్రదక్షిణలు చేస్తూ యెవఱితో మాట్లాడకుండా స్వామినే తలచుకుంటూ చెట్ల క్రింద నివశించింది. ఒకరోజు ఆమెకు ఒక కల వచ్చింది. వారి పంది చేలోపడితే రైతులు కొడుతున్నారు. దానిని కొట్టవద్దని ఆమె

అడ్డంపోయింది. స్వామి వచ్చి, దీనివలననే నీ కీ కష్టాలు వచ్చాయి. దీన్ని బ్రతకనీయవద్దు అని పందిని తీసుకొని వెళ్లి సముద్రంలో పడవేశారు. ఇలా నెల గడిచినా ఫలితము కనిపించలేదని ఆమె దుఃఖిస్తుంటే ఒకనాడు కలలో బుజ్జయ్య కనిపించి ఆమెకు గాజులు తొడిగాడు. స్వామి కనబడి యేమీ చెప్పలేదని ఒకరోజంతా ఆమె అన్నము తినలేదు. రాత్రి కలలో స్వామి కనిపించి పిడికెడు వక్కలు ఆమె చెంగులో వేసి సంతానము యిచ్చాను, ఇక అన్నము తినమ్మా అని ప్రేమగా అన్నారు. ఆమె తన దీక్ష విరమించింది. స్వామి చెప్పినట్లే సంతానము కల్గింది. బిడ్డకు స్వామి పేరు పెట్టుకోవాలనుకుంటుంటే కలలో స్వామి కనిపించి 'మొదటిబిడ్డకు మీ కులదైవం పేరు, రెండవబిడ్డకు నా పేరు పెట్టుకో' అని చెప్పారు. ఈమెకు యే బాధ కల్గినా స్వామి సమాధి దగ్గఱ మొరపెట్టుకుంటే ఆ రాత్రే స్వామి దర్శన మిచ్చి వూరడిస్తారు.

మహాసమాధి అనంతరంకూడా స్వామి భక్తులకు తన బోధ వినిపిస్తూనే వున్నారు. నూతేటి శ్రీరాముల నాయుడు తన నిమ్మతోటలోని గుడిసెలో స్వామివారి పటాన్ని ఒకనాటి వుదయము పూజించి నివేదనకు యేమీ లేక ఒక నిమ్మకాయ కోసి అర్పించాడు. ఇంటినుండి వచ్చిన పేలపిండిలో కొంతభాగము నివేదించి నోట్లో వేసుకున్నాడు. అది నిమ్మకాయ వలె అతి పుల్లగా వున్నది. మనము దేవిని ప్రీతిగా తింటామో దానినే భగవంతునికి నివేదించా లని స్వామి భావము. ఇతడే ఒకరోజు గుడిసెలో ఆవు పంచితము చల్లుతుంటే స్వామి పటంమీద పడింది. ఆవు పంచితము పవిత్రంగదా అని అతడు తుడువలేదు. ఆనాటి రాత్రి ఆయనపై యేవో చుక్కలు పడ్డాయి. పైన చూస్తే బల్లి లేదు. వాసన చూస్తే ఆవు పంచితము. అది స్వామి చేసిన పనే నని, మన మేది అసహ్యించుకుంటామో అది స్వామిపై పడినా శ్రద్ధతో తుడవాలని అతడు తెలుసుకున్నాడు. స్వామికి, ఆయన పటానికి తేడా లేదని యీ రెండు లీలలుగూడా తెలుపుతున్నాయి.

ఒక భక్తురాలు తన కుమార్తె కాపురము చక్కబడ లేదని స్వామిని ప్రార్థించింది. నాటిరాత్రి కలలో ఆమె ఒక నదిలో దిగి మధ్యకుపోయింది. ఇంకా గట్టుచేరలే దని అనుకుంటూవుండగా ఆమెకు మెలకువొచ్చింది. అలానే ఆదినారాయణరెడ్డికి 1985లో ఒకదానివెంట ఒకటి వరుసగా కష్టా లొచ్చాయి. వాటికితోడు అతని భార్యకు మద్రాసులో శస్త్రచికిత్స అయ్యి యింటికి వచ్చిన కొద్దికాలానికే మళ్ళీ నడుము నొప్పి వస్తే మద్రాసు తీసుకెళ్లాడు. అతడు స్వామిని ప్రార్థిస్తే నాటిరాత్రి కలవచ్చింది. వాళ్ళ గ్రామస్థుడు ఒకడు వచ్చి, 'నీకోసము పెనవర్తి పోయాను. అక్కడ లేవు. ఇక్కడికి వచ్చాను. శిబి చక్రవర్తి వంటి నీకు విభూతి యిచ్చి మూడునెలల్లో నయము చేయాలనుకున్నాను. కానీ 7 నెలలు పట్టేటట్లు వున్నది. నావాడివవడంవల్ల నీ కర్మను దయతో క్షాళనము చేస్తాను. కానీ సమయము పడుతుంది. ఓర్పు వహించు' అన్నాడు. ప్రారబ్ధము బలీయమైనపుడు

విశ్వాసంతో కూడిన ఓర్పుతో సద్గురువును అంటిపెట్టుకొని వుండటమే సరి యైన మార్గ మని స్వామి యీ భక్తునికి నేర్పించాడు.

ఒకసారి స్వామి సేవకు లిద్దఱికి తగువు వచ్చింది. రోశిరెడ్డి వారిలో సమంజసమైన సేవకుని బలపఱచి, రెండవవానిని మందలించాడు. అతనితో ఆరోజు స్వామి 'నీకు యీ రోజు ఒక లోకము వచ్చిందయ్యా' అన్నారు. అధర్మాన్ని ఖండించి, ధర్మాన్ని బలపఱచడము మహాపుణ్య మనీ, మన విధి అనీ, అలా చేయక పోవడము మహాపాప మని స్వామి భావము.

భక్తు లెక్కడ ఆపదలో వున్నా, స్వామికి వెంటనే తెలిసిపోయేది. ఆయన వారిని కంటికిరెప్పలా కాపాడుతూవుండేవారు. చాలాకాలము స్వామిని సేవించిన బరిగెల నాగయ్య ఒకరోజు ప్రక్కటెముకల క్రింద నొప్పితో అల్లాడుతున్నాడు. వైద్యునివద్దకు రమ్మంటే స్వామియే నా వైద్యుడు. నాకు దిక్కు ఆయనే అని; చివరకు, 'స్వామి! నీవు భూలోకము వదిలి వైకుంఠానికి వెళ్ళావా? లేక నన్ను మరచావా?' అనుకున్నాడు. వెంటనే కలలో స్వామి కనబడి నేను యెక్కడకు పోయానయ్యా, నీ వెమ్మట్లే వుండ్లా అన్నారు.

చిరకాలము సేవించిన పంచాక్షరి మస్తానయ్యకు స్వామి కలలో కనిపించి, ఆపదలు తొలగిస్తుండేవారు. 1984వ సంవత్సరంలో ఒకనాటి రాత్రి స్వామి కలలో కనిపించి, 'అయ్యా, 5 శవాలు ఒకేసారి లేవవల్సివున్నది. సతాయించడానికి వీలులేని పరిస్థితి. మీరేమో మొరటు మనుషులు. చెబితే వినిపించుకోరు' అన్నారు. మఱునాడు నిద్రలేచి అతడు ఆందోళన పడుతుంటే ట్రాక్టరు తోలుకుని పెనవర్తి పొమ్మని వాళ్ల అన్న చెప్పాడు. అతడు తన కలగూర్చి యెంత చెప్పినా ఆయన వినిపించుకోలేదు. అతడు బయల్దేరక తప్పలేదు. దారిలో మలుపు దగ్గఱ ఒక లారీ వచ్చి ట్రాక్టర్‌ను గుద్దింది. రెప్పపాటులో ఆకాశంలో యెవఱో అరచేయి చాపినట్లు అతనికి కనిపించినది. మస్తానయ్య చిన్న గాయాలతో బయటపడ్డాడు. మిగిలిన నల్గురికి ప్రమాదమైన దెబ్బలు తగిలికూడ యెలాగొ బ్రతికిబయటపడ్డారు.

ఒకప్పుడు నారాయణరెడ్డి తన పొలంలో నాలుగుచోట్ల నీటికోసము పాయింట్లు వేయించినా నీరు పడలేదు. అపుడు డ్రైవరు మస్తానయ్య నీరు యెక్కడ పడుతుందో తెల్ప మని స్వామిని ప్రార్థించాడు. ఆరోజురాత్రి కలలో అతనికి ఆ పొలంలో ఒకచోట కొంగలు, జంతువులు నీరు త్రాగుచున్నట్లు కనిపించింది. మఱ్నాడు అత నక్కడ బోరింగ్ వేయించాడు. సమృద్ధిగా నీరుపడింది.

ఓం నిత్యసత్యాయ నమః